भारत सरकार
GOVERNMENT OF INDIA
राष्ट्रीय पुस्तकालय, कलकत्ता
NATIONAL LIBRARY, CALCUTTA

वर्ग संख्या
Class No. Te 973
पुस्तक संख्या
Book No. K 236a
रा० पु० ३८
N. L. 38.
MGIPC—S4—13 LNL/64—30-12-64—50,000.

విజ్ఞానచంద్రికా గ్రంథమాల 33.

# అమెరికా
# సంయుక్తరాష్ట్రములు.

# United States of America.

గ్రంథకర్త:

అయ్యదేవర కాళేశ్వరరావు.

మచిలీపట్టణము.

సుధర్మ ముద్రాక్షరశాలయందు ముద్రింపబడినది.

1924

పీరైటు రిజిష్టర్డు] [వెల రు. 1-8-0.

చందాదారులకు రు. 1-4-0.

SHELF LISTED
CALCUTTA

అన్ని కాలములలోను అన్ని దేశములలోను
మానవ స్వాతంత్ర్యమునకై
సర్వసమర్పణము గావించిన ధీరుల
పాదపద్మములకు
ఈ చిన్ని పుస్తకమును అంకితమిచ్చుచున్నాను.

—గ్రంథకర్త.

# తొలి పలుకు

సుప్రసిద్ధదేశమగు అమెరికా సంయుక్తరాష్ట్రముల చరిత్రమును ఆంధ్రమహాజనులకు అర్పించుకొనుచున్నాను. అమెరికా సంయుక్తరాష్ట్రముల స్థాపనము, ఆంగ్లేయ రాజ్యముపై తిరుగబడి స్వతంత్రమును సంపాదించుట, స్వతంత్రమును పొందినతరువాత రాజులు ప్రభువులు లేని సంపూర్ణ ప్రజాపాలనమును స్థాపించుకొనుట, స్వరాజ్యమునందు అమెరికాపౌరుల స్వతంత్రములు, స్వరాజ్యముయొక్క ఫలితముగ అత్యాశ్చర్యకరమగు సర్వతోముఖమైన అభివృద్ధి ఇవి యీచరిత్రమున ప్రధానాంశములు. వీరు పాతకాపురస్థులగు ఎర్ర ఇండియనుల నేమిచేసిరి? తమదేశములోని నల్లవారి నెటులచూచుచున్నారు? అను ప్రశ్నలుకూడ చర్చించబడినవి. అమెరికా వారి పాలనముక్రిందనున్న ఫిలిప్పైన్ ద్వీపములు ఎట్టిరాచకీయ హక్కులు పొందుచున్నవో ఆవిషయముకూడ వ్రాయబడినది.

ఈపుస్తకములోని తప్పులు మన్నించి గుణలేశమును గ్రహింతురని పాఠకమహాశయులను ప్రార్థించుచున్నాను.

—గ్రంథకర్త.

# పీఠిక

ఎంతో కష్టపడి గ్రంథకర్తలు గ్రంథములు వ్రాయుటయు, ఏమియు కష్టపడని కొందరు వీరి గ్రంథములకు పీఠికలు వ్రాయుటయు లోకములో ఆచారమైనది. ఇది కేవలము పడమట దేశపు ఆచారము. అక్కడ జనులు ఒకరి నొకరు తెలుపుకొనరు. మాటలు కలుపుకొనరు. మధ్యస్థులెవరో వీరిని కలుపవలెను. గ్రంథరచనలోనికి కూడ ఈ ఆచారమే కొంత వరకు ప్రాకినది. ఆ దేశపు ఆచారములన్నిటిని మనము అనుకరించుచున్నట్లే దీనిని కూడా అనుకరించుచున్నాము. అనుకరించుట తప్పు అని ఒప్పుకొనెదము. కాని తప్పు అని తెలిసిన దానినుండి తప్పించుకొనలేక పోవడము రెండవ తప్పు. ఇందులో పీఠిక వ్రాయవలసినదని కాళేశ్వరరావు గారు అడగడము ఆయనది తప్పు. అది తప్పు అని తెలిసికూడా నేను వ్రాయుటకు పూనుకొనుట నాది తప్పు. ఈ ఉపోద్ఘాతములో ఏమి వ్రాయవలెనో కూడా నిర్ణయించుట కష్టము. కాని గ్రంథకర్తను మన ఆంధ్ర దేశమునకు ఎరింగించుట ఇటువంటి ఉపోద్ఘాతములలో మొదటి కర్తవ్యము. ఆంధ్ర దేశములో కాళేశ్వరరావుగారిని ఎరుగని వారెవరును ఉండరు. కారాగృహముల కెళ్ళి దేశాభిమానులు గ్రంథములు వ్రాయుచుండగా వెళ్ళనివారు ఉపోద్ఘాతములైనా వ్రాసి తమ కర్తవ్యమును నెరవేర్చవలసియున్నది. అందుచేత జగమెరిగిన కాళేశ్వర రావుగారికి ఈ జంధ్యపు పోగు వేయవలసివచ్చినది

16 వ శతాబ్దమునందు ఆంగ్లేయులంత సోమరిపోతులు

ఎవరు లేరనియు స్పెయిను దేశస్థులకంటె వీరు ఎక్కువ పనికి
మొండివేయువారనియు మెటెరన్ అను చరిత్రకారుడు వ్రాసి
యున్నాడు. అటువంటివారు మత స్వాతంత్ర్యముకొరకు
అమెరికా దేశమున కేగి అక్కడవలసలను స్థాపించి ఆవలసల
యందుకూడ తల్లిదేశపుప్రజలును, ప్రభువులును పెట్టుబా
ధల కోర్వజాలక చివరకు బ్రిటీషు వస్తు బహిష్కార మాచ
రించి బ్రిటీషు పన్నుల నియ్యమని నిరాకరించి, ఇంగ్లండు
వారితో యుద్ధము చేసి, స్వరాజ్యమును స్థాపించుకొనినారు.
అమెరికనులన్న ఒక్కజాతివారు కారు. 16 భాషలు
మాట్లాడువారును అంతకంటె ఎక్కువజాతులవారును అమె
రికా సంయుక్త రాష్ట్రమందు నివసించుచున్నారు. వీరు 1773
లో స్వాతంత్ర్యము సంపాదించిరి. 18 వ శతాబ్దాంతమందు
ఫ్రాన్సువారుకూడా రాజును చంపివేసి అమెరికావారు స్వాతం
త్ర్యమును స్థాపించుకొనిన ఇరువది సంవత్సరములకు తమదేశ
మందు ప్రజాస్వామ్యమును నెలకొల్పుకొనగలిగినారు. కాని
18 వ శతాబ్దపుభావములున్నూ ఆదర్శములున్నూ "స్వేచ్ఛ,
సమానత్వము, సౌభ్రాతృత్వము" అను భావముల నాశ్ర
యించిమాత్రమే నిర్ణయింపబడియుండెను. ఇవన్నియు
వ్యక్తిసత్త్వములుగాని, వ్యక్తులను సమ్మేళనము చేయు ధర్మ
ములు కావు. సౌభ్రాతృత్వమున్న భావములోకూడ సమ్మే
ళనభావముకంటె సమానభావమే ఆకాలపు చరిత్రను నడిపిన
దైయుండెను. 19 వ శతాబ్దమునందు అయిరోపాలోని
భావములు మార్పుజెందినవి. బ్రిటీషువారితో యుద్ధము సల్ప
కయే కనడా దేశస్థులు 1861 సంవత్సరములో తమ జాతీ

యతను స్థాపించుకొనిరి. 1864లో కొన్ని యుద్ధములు జరిగిన పిమ్మట ఇటలీ దేశ వాస్తవ్యులు ఆస్ట్రియా దేశపు దాస్య మును తప్పించుకొని, స్వజాతీయతను నిర్మించుకొనిరి. ఫ్రెంచి వారు సయితము తమ ప్రజా స్వామ్యమును రెండుసార్లు నిరంకుశ ప్రభువుల బాహుబలముచే పోగొట్టుకొని, తిరిగి రెండు సార్లు స్థాపించుకొనిరి. గ్రీకు దేశపువాస్తవ్యులు శతాబ్దమధ్య మున తమ జాతీయవ్యక్తతను తిరిగి సంపాదించు కొనగలిగి అయోనియన్ దీవులను ఒకరాజ్యముగ నిర్మాణించు కొనిరి.

1861 వరకు అంతఃకలహములచే పీడింపబడుచున్న జర్మనీరాష్ట్రములు 1872 వ సంవత్సరములో ఫ్రెంచివారిని ఓడించి పరిపూర్ణ సౌష్టవమును ఆధునికజాతీయతయు గలిగిన రాష్ట్రముగ మారిపోయెను. ఈ అమెరికా వలనలే ఉత్తరపు ప్రాంతముల కొన్నియు దక్షిణమున మరికొన్నియు రెండు శాఖలుగ ఏర్పడి (Federlists) ఫెడరలిస్టు అను ఉత్తరప్రాంతము వారికిని (Confederates) కాన్ఫెడరేట్సు అను దక్షిణ ప్రాంతము వారికిని బానిసల నుంచుకొన వచ్చునా లేదా అను విషయమును గూర్చి 1860 మొదలు 1865 వరకు ఘోర యుద్ధము జరిగినపిమ్మట ఉభయులును కలసి అమెరికను రిపబ్లికు అను ప్రజాస్వామ్యమును స్థాపించిరి. ఇంక 20 వ శతాబ్దమునకు వచ్చినచో 19 వ శతాబ్దపు చరిత్రలోని సశేషము ఇచ్చట పూర్తిఅయినది. అయిరోపా మహాసంగ్రామానంతరము 6 శతాబ్దములక్రింద స్వాతంత్ర్యమును గోల్పోయిన పోలెండుకు జాతీయతావ్యక్తత ఒసంగబడినది. ఇట్లు యీ

దేశము, జర్మనీ, ఆస్ట్రియా, రష్యా, దేశములదాస్యమునుండి తప్పించుకొనినవి. ఇటులనే జెకొస్లావులును జూగోస్లావులును ప్రత్యేకరాష్ట్రములను స్థాపించుకొనినవి.

ఇంక మిగిలినవి అయిర్లాండు, ఈజిప్టు, ఇండియా దేశములు. అయిర్లాండు 7 శతాబ్దములనుండి తన స్వాతంత్ర్యముకొరకు పోరాడుచు కడపటకు రక్తపాతపూర్వకమగు ఘోర విప్లవముచే నొకవిధమగు స్వరాజ్యమును స్థాపించుకొనినది. ఇంక ఈజిప్టు ప్రాక్పాశ్చాత్య దేశముల మధ్యనుండి రక్తపాతమగుపద్ధతులకున్నూ దౌర్జన్య రాహిత్యమగు పద్ధతులకున్నూ మధ్యస్థమగుపద్ధతుల నవలంబించి తన స్వాతంత్ర్యము కొరకు పోరాడియున్నది. ఇండియా దేశము కేవలము ప్రారంభమునుండి అహింసా సత్యములను ధర్మముల ననుసరించియే స్వరాజ్యమును స్థాపింప యత్నించుచున్నది. కాని కడచిన నాలుగు సంవత్సరములనుండియు గావింపబడిన యత్నములయొక్క జయాపజయములను గూర్చి చర్చించుట కిది సమయము కాదు, స్థలమును కాదు. ఇట్లు ప్రతిదినమున ప్రపంచమునందలి భావములును ఆదర్శములును మారుచున్నవి. ఈనాటికి మన దేశమునందు ప్రబలియున్న అహింసాతత్త్వము నూతనముగ పుట్టినది కాదు. వెనుకటిశతాబ్దములందు ప్రబలియున్న భావములను బట్టి ఉత్పత్తియైన తత్త్వమే. కాలప్రవాహమునందు వర్తమానము, భూతము, భవిష్యత్తు అను మూడు వేరు వేరు శాఖలు ప్రవహించుట లేదు. ఇవన్నియు ఒకప్రవాహముయొక్క వివిధభాగములే కావున ఇప్పుడు ప్రబలుచున్న భావములను క్రమముగను ఇది

సంపూర్ణముగను అవగాహన చేసుకొనవలెనన్న పూర్వచరిత్రను మనము సంపూర్ణముగ చదువుకొనవలెను. అట్టిచరిత్రను తెలుగు గ్రంథములు మన ఆంధ్రమునందు విశేషముగ లేవు. శ్రీ కాళేశ్వరరావుగారు అమెరికా దేశచరిత్రమును వ్రాసి ఆంధ్రదేశమునందు ఇట్టి లోపమును కొంతవరకు తీర్చినారు. ఇందుకు వారికి మనము కృతజ్ఞులము.

భోగరాజు పట్టాభిసీతారామయ్య.

# విషయసూచిక


| అధ్యాయము | విషయము | పుట. |
|---|---|---|
| ఒకటి | ఉపోద్ఘాతము | ౧ |
| రెండు | అమెరికాను యూరపు జాతు లాక్రమించుట | ౪ |
| మూడు | పదమూడు వలసరాష్ట్రములు | ౧౯ |
| నాలుగు | ఎర్రయిండియనులు | ౩౮ |
| అయిదు | స్వాతంత్ర్యయుద్ధమునకు కారణములు | ౪౭ |
| ఆరు | ప్రపంచ పరిస్థితులు | ౬౭ |
| ఏడు | స్వాతంత్ర్యయుద్ధము - ప్రథమభాగము | ౯౭ |
| ఎనిమిది | స్వాతంత్ర్యయుద్ధము - రెండవభాగము | ౧౩౮ |
| తొమ్మిది | సంయుక్తరాష్ట్రముల ప్రభుత్వము | ౧౯౯ |
| పది | అమెరికా ప్రజల హక్కులు | ౨౨౨ |
| పదకొండు | నీగ్రో బానిసత్వము | ౨౩౭ |
| పండ్రెండు | అమెరికాలో నీగ్రోల ప్రస్తుతస్థితి | ౨౫౯ |
| పదమూడు | అభివృద్ధి-విదేశవ్యవహారములు | ౨౭౭ |

## అమెరికా

# సంయుక్తరాష్ట్రములు.

### మొదటి అధ్యాయము

### ఉపోద్ఘాతము

(1)

అమెరికాసంయుక్త రాష్ట్రములు

ప్రస్తుతము ప్రపంచమున నైశ్వర్యమునకును, ప్రకృతిశాస్త్రములకును, పరిశ్రమలకును, నవనాగరికతకును ప్రసిద్ధిచెంది, ప్రభుత్వములలో మిగుల పలుకుబడికలిగియున్న, అమెరికాసంయుక్తరాష్ట్రములు (United States of America) మూడు వందల సంవత్సరములకు పూర్వము లేవు. అపుడచట అరణ్యములెక్కువగనుండి కొద్ది నాగరికతగల తామ్రవర్ణపుజాతులు నివసించియుండిరి. గడచిన మూడువందల సంవత్సరములనుండియు యూరపుఖండవాసులగు తెల్లవారు అచటికి వలసవచ్చి, అదివరకచట కాపురముండిన యెఱ్ఱజాతులను చాలవరకు నాశనముజేసి దేశమునంతను ఆక్రమించుకొని సుప్రసిద్ధమగు నీ సంయుక్తరాష్ట్రముల నేర్పరచిరి. అచటికివచ్చిన తెల్లజాతులవారిలో ఇంగ్లాండునుండి వచ్చిన ఆంగ్లేయు లధికసంఖ్యాకులగుటచే నీవలసరాష్ట్రములు 1775 వ సంవత్సరము వరకును

ఇంగ్లాండుయొక్క పాలనముక్రింద నుండెను. అపుడు తూర్పు సముద్రతీరమున పదమూడు రాష్ట్రములు మాత్రముండెను. తక్కిన ప్రదేశమంతయు నప్పటికి ఎఱ్ఱజాతుల యధీనమందుండెను. 1775 వ సంత్సరమున ఆంగ్లేయప్రభుత్వమువారు వేసిన యధికపన్నుల నిచ్చుటకు నిరాకరించి యాపదమూడు రాష్ట్రములవారును ఆంగ్లేయప్రభుత్వముపై తిరుగుబాటుచేసిరి. ఆంగ్లేయ ప్రభుత్వమువారు యుద్ధమునకురాగ వలసరాష్ట్రములవారు వారినోడించి స్వాతంత్ర్యమును పొందిరి. అమెరికాసంయుక్తరాష్ట్రములకు రాజులేని సంయుక్తప్రజాస్వామ్యము నేర్పరచుకొనిరి. అప్పటినుండియు తెల్లవారు పడమటిసముద్రమువరకును గల యావత్తుదేశమును స్వాధీనమును పొంది 52 రాష్ట్రములుగ చేసికొనియున్నారు. వీరిని సాధారణముగ మనము అమెరికావారని చెప్పుదుము.

(2)

అమెరికా స్వతంత్ర యుద్ధము.

అమెరికాయొక్క స్వతంత్రముకొరకై జరిగిన ఈయుద్ధము చరిత్రలో చాల ప్రాముఖ్యమయినది. నవీనకాలమున మాతృదేశముమీద వలసరాజ్యము తిరుగబడి స్వతంత్రమును పొందుటకిదే ప్రథమ నిదర్శనము. ఈ మార్గమునే యనుసరించి పరాసుదేశముపైనను స్పైన్‌దేశముపైనను వాటిక్రింద నుండిన అమెరికాలోని వలసరాజ్యములు తిరుగబాటుచేసి స్వతంత్రప్రభుత్వముల నేర్పరచుకున్నవి.

మెక్సికోలోను, పెరూలోను, స్వతంత్రముగనుండిన గొప్ప ఎఱ్ఱయిండియను రాజ్యములు తెల్లజాతులచే నాశనము

చేయబడిన తరువాత, అమెరికాఖండమున, యూరపుఖండము లోని ప్రభుత్వములకు లోబడక, స్వతంత్రముగ స్థాపింపబడిన మొదటి ప్రభుత్వ మీయమెరికా సంయుక్తరాష్ట్రములే.

అమెరికాఖండమున ఇంగ్లాండు ముఖ్యమగు నీవలస రాజ్యములను పోగొట్టుకొనిన తరువాత, తూర్పుఖండములగు ఆసియా, ఆఫ్రికాలలో తనరాజ్యమును విస్తరింపజేయుటకు తీవ్రమగు కృషిని సలిపినది.

అమెరికావారు స్వతంత్రభావములను ఫ్రాన్సునుండి గ్రహించి ముందుగ కార్యరూపముగ పరిణమింపజేయుట వలనను, వీరు స్వాతంత్ర్యమునకై సలిపిన పోరాటములో పరాసువారు చాలగ తోడ్పడుటవలనను, పరాసుదేశములో కూడ ప్రజాస్వాతంత్ర విప్లవము శీఘ్రముగ జరుగుటకు విశేషముగు ప్రోద్బలము కలిగెను. పరాసువిప్లవము వలన దేశాభిమానము, ప్రజాస్వాతంత్ర్యము, మానవసమానత్వము, మొదలగు భావములు వ్యాపించి క్రమముగ యూరపుఖండముయొక్కయు మానవకోటి యొక్కయు రాజకీయసాంఘిక జీవితమంతయు గొప్పమార్పును చెందినది.

అమెరికా సంయుక్తరాష్ట్రముల రాజ్యాంగ విధానము వలన మానవచరిత్రలో గొప్ప సంయుక్త ప్రజాప్రభుత్వ మేర్పరచుకొనుటకు ప్రథమయనుభవము కలిగినది. దీని తరువాత దీని ననుకరించి యనేక దేశములలో సంయుక్తప్రభుత్వముల నేర్పరచుకొని యున్నారు.

# అమెరికా సంయుక్తరాష్ట్రములు.

## రెండవ అధ్యాయము.

## అమెరికాను యూరపుజాతు లాక్రమించుట.

(1)

యూరపియనులు అమెరికాను కనుగొనుట.

1453 వ సంవత్సరమున కాన్‌స్టాంటినోపిలు తురుష్కుల వశమయ్యెను. బాల్కనురాష్ట్రములన్నియు వీరిరాజ్యములో చేరెను. ఈజిప్టుదేశముకూడ వీరికిందికివచ్చెను. ఆఫ్రికాఖండముయొక్క యుత్తరభాగమును యూరపు ఖండము యొక్క తూర్పుభాగమును తురుష్కుల వశమందుండుటయు మహమ్మదీయులగు తురుష్కులకును క్రైస్తవులగు యూరపు జాతులవారికిని బద్ధద్వేషము కలిగియుండుటయు, యూరపు జాతులవారదివరకు ఆసియాఖండములోని హిందూదేశము, చైనా, జపానుదేశములతో చేయుచున్న వాణిజ్యమున కాటంకమును కలుగచేసెను. ఇదివరకు ఆసియాఖండపు వర్తకమున కిదే త్రోవగ నుండెను. ఇవుడు త్రోవలో తురుష్కసుల్తాను

వచ్చి చేరెను. సుల్తానుగారి యనుగ్రహమును పొందిన వెనీసు పట్టణము వర్తకపు సౌకర్యములను పొంది భాగ్యవంత మయ్యెను. వారి యనుగ్రహము పొందజాలని జినోవాపట్టణముయొక్క వర్తకము నశించి క్షీణించెను. సముద్రముల మీాద ఆసియాఖండమునకు వచ్చిచేరుటకు క్రొత్తత్రోవలు కనుగొనవలెనని యూరపుఖండపు జాతులు ప్రయత్నములను చేయసాగిరి. ఆసియాలోని తూర్పుదేశములతో వర్తకము చాల లాభకరముగ నుండెను. ముఖ్యముగ హిందూదేశముతోటి వర్తకముచేయుట మహాభాగ్యమని తలచిరి. అక్కాలమున ఐశ్వర్యమునకును నాగరికతకును వర్తకవ్యాపారములకును హిందూదేశము ప్రపంచములోకెల్ల మిగుల ప్రతిష్ఠనుకలిగి యుండెను. మేలైన దూది పట్టు ఉన్ని వస్త్రములును, రత్నములును, లోహపుసరకులును, రత్నకంబళ్ళు తివాసీలును, పరిమళద్రవ్యములును, మొదలగునవి హిందూదేశమునుండి యూరపునకు విరివిగ ఎగుమతియగుచుండెను. ఎట్లైన హిందూదేశమునకు త్రోవలు కనిపెట్టవలెనని వివిధజాతులవారును ప్రయత్నములు సలిపిరి. ఆఫ్రికాఖండమును చుట్టి హిందూదేశమునకు వచ్చుటకు ప్రథమమున పోర్చుగీసువారు ప్రయత్నించిరి. 1486 వ సంవత్సరమున డయ్యాజు అను పోర్చుగీసువాడు ఆఫ్రికా ఖండముయొక్క దక్షిణభాగమువరకును వెళ్ళి తిరిగివచ్చెను. జనోవా కాపురస్తుడగు క్రిష్టఫరు కొలంబసు అను నాతడు సూటిగ అట్లాంటికు మహాసముద్రములో పడమరగ ప్రయాణముచేసి హిందూదేశమును చేరవచ్చునని నిశ్చయించెను. అప్పటి కమెరికాఖండ మనునది గలదని

యూరపులో నెవరికిని తెలియదు. మార్కొపోలో యనునతని ప్రయాణములవలన ఆసియాఖండము మిగులగొప్పదని తెలియును. కొలంబసునకు భూమి గుండ్రముగ నున్నదని తెలియును. కావున తాను పడమరగా అట్లాంటిక్ మహాసముద్రములో పోయినచో ఆసియాఖండమును జేరితీరెదనని తలచెను. అనేకసార్లు అట్లాంటిక్ సముద్రములో కొంతవరకు ప్రయాణముచేసి తిరిగి వచ్చుచుండెను. ఒకసారి ఐస్‌లాండు ద్వీపమునుచేరి తిరిగివచ్చెను. ఇతనివద్ద దూరప్రయాణము చేయుటకు ద్రవ్యములేదు. పోర్చుగీసురాజగు రెండవ జానుతో నీతడు తానుచేయదలచిన కార్యమునుగూర్చి మనవిచేసి ద్రవ్యసహాయమును కోరెను. ఆయన నీతనిని లక్ష్యముచేయక తానే స్వయముగా నౌకలను బంపెను. కాని దానివలన ప్రయోజనము కలుగలేదు. అప్పుడు కొలంబసు స్పైన్ దేశపు రాజునాశ్రయించెను. ఆసమయమున స్పైన్ వారు మహామ్మదీయులతో పోరుసలుపుచుండిరి. స్పైన్ దేశీయులు తమదేశములో సారసన్ ముసల్మానుల యధీనమందున్న ప్రదేశమును తిరిగి స్వాధీనమును పొందుటకు యుద్ధముచేయుచుండిరి. కావున స్పైన్ వారివలన కొలంబసుకు సహాయమురాలేదు. అంత కొలంబసు తనతమ్ముని ఇంగ్లాండు దేశమును పాలించుచున్న హెన్రీరాజువద్దకు బంపెను. కాని అచటనుండియు సహాయము రాలేదు. 1492 వ సంవత్సరమున స్పైన్ వారు ముసల్మానుల నోడించి తమదేశమునుండి వెడలగొట్టిరి. అప్పుడు స్పైన్ రాజుయొక్కయు కొందరు స్పైన్ దేశీయులగు వర్తకుల యొక్కయు సహాయమువలన, కొలంబసు మూడు నౌక

లతో అట్లాంటికు సముద్రయానముచేసెను. అనౌకలలో నొక దానికి మాత్రమే పైకప్పుగలదు. తక్కిన రెంటికిని పైకప్పుకూడ లేదు. ఆయన తనతో కూడ ఎనుబది ఎనిమిది మంది మనుష్యులను తీసుకొని బయలువెడలెను. రెండు నెలల తొమ్మిది రోజులు నడిసముద్రములో నొకేవైపుగా ప్రయాణముచేసెను. ఈ లోపున ఆయనతోనున్న వారికి విసుకు పుట్టెను. కొంతకాలమునకు నిరాశ జనించెను. ఎప్పటికిని సముద్రము మీద నిటులనే ప్రయాణము చేయవలెనేమో యను భీతి కలిగెను. తుదకు పక్షులు కనపడెను. ఆశకొంతవరకు కలిగెను. 1492 వ సంవత్సరము అక్టోబరు 11 వ తేదీన రాత్రి పదిగంటల కొక దీపమును చూచిరి. మరునా డుదయమున భూమికనపడెను. ఆయుదయముననే స్పైన్ దేశపు పతాకములతో నూతన ప్రపంచములో కొలంబసు దిగెను. ఆదేశములో మోటజాతులు నివసించి యుండిరి. ఆదేశములో నపుడు హిందూదేశమును (ఇండియాను) పాలించుచున్నటుల తానువినిన రాజు పాలించుటలేదు. ఆదేశము తాను వినిన ఇండియా (హిందూదేశము) వలెలేదు. దానిలో ప్రవేశించి యంతయు పరికించిచూచెను. అవి ద్వీపములు. వాటికిపశ్చిమ ఇండియా ద్వీపములని నామకరణముచేసెను. కొంతబంగారమును, ప్రత్తిని, క్రొత్తరకపు జంతువులను, పక్షులను, ఇద్దరు ఎర్ర ఇండియనులను తీసుకొని ఆయన తిరిగి 1493 వ సంవత్సరమున యూరపుఖండమును చేరెను. మరల నా సంవత్సరముననే క్రైస్తవమత ప్రధానాచార్యుడగు పోపుయొక్క అనుజ్ఞనుపొంది పదునేడు పడవలతోడను పదిహేను వందల

మంది జనులతోడను నానూతన ద్వీపములను స్పైన్ రాజు పక్షమున స్వాధీనమును పొందుటకు క్రిస్టఫరు కొలంబసు వయ నమైపోయెను. వాటిని వశపరచుకొని స్పైన్ రాజుయొక్క ప్రతినిధిగ కొంతకాల మాయనపాలించెను. ఇది యమెరికా ఖండమునకు తెల్లజాతులవారువచ్చి చేరుటకు ప్రారంభము. స్పైన్ దేశమునుండిఅనేకు లీద్వీపములలోనేగాక వీటికి సమీపమునను న్న యమెరికాఖండమునకూడ వలసవచ్చి నివసించిరి. అమెరికాయొక్క నూతన భాగములను కనిపెట్టుచు నాక్రమించుకొనుచుండిరి.

హిందూదేశము చేరుట.

ఇంతలో పోర్చుగీసువాడగు వాస్గోడిగామా 1498 వ సంత్సరమున ఆఫ్రికాఖండమునుచుట్టి హిందూదేశమును చేరెను. 1519 వ సంవత్సరమున స్పైన్‌రాజు కొలువునందుండిన మెగల్లన్ అను వాడు అయిదు పడవలతోను రెండువందలమంది మనుష్యులతోను స్పైన్ దేశమునుండి బయలుదేరి దక్షిణ అమెరికాయొక్క దక్షిణభాగము చుట్టును సముద్రమునిూద తిరిగెను. అక్కడనుండి పెనామా జలసంధివరకును పోయెను. పశ్చిమముగా పయనముచేసి ఫిలిప్పైన్ ద్వీపములను కనుగొనెను. అచట దిగి యాద్వీపవాసులతో పోరాడి హతుడయ్యెను. అతనితో వెళ్ళినవారిలో చాలమంది కూడ చంపబడిరి. 1522 వ సంవత్సరమున నొకపడవయు ముప్పదియొక్కమంది మనుష్యులును స్పైన్ దేశమునకు తిరిగివచ్చిరి. ఇంతటినుండియు స్పైన్ వారును పోర్చుగీసువారును అమెరికాఖండములోని మధ్యభాగమును దక్షిణభాగమును క్రమక్రమముగా నంతయు

నాశ్రయించుకొనిరి. ఇంక నేబది సంవత్సరముల వరకును వరాసువారును, డచ్చి (హాలెండు) వారును, ఆంగ్లేయులును, అమెరికాకుగాని హిందూదేశమునకుగాని బయలుదేరలేదు.

వారి లాభములు.

పోర్చుగీసువారే ముందుగ హిందూదేశములోని స్పైన్ పోర్చుగీసు రాజులనాశ్రయించి కొన్ని సముద్రరేవులలో స్థలములను సంపాదించి యచటగిడ్డంగులను కట్టుకొని వ్యాపారము చేయుచుండిరి. స్పైన్ వారును పోర్చుగీసువారును త్వరితముగ మిగుల నైశ్వర్యవంతులయిరి. ఆసియా ఖండముతో వర్తకమువలన చాల లాభము వచ్చుచుండెను. అమెరికా శీతోష్ణస్థితి మిగుల యనుకూలముగ నున్నందున చాలమంది యచటికి వలస వెళ్ళి సౌఖ్యముగ నివసించుచుండిరి. అచట వీరు దేశమాక్రమించుట కెట్టి అడ్డును లేకుండెను అమెరికాలోని భూములు గనులు అడవులు వీరివశమయ్యెను. బంగారములోను మేలైన సరకులతోను నిండిన పడవలతో ఆసియానుండియు అమెరికానుండియు నీరెండుజాతుల వారును తమదేశములకు వచ్చుచుండిరి. వీరిలో వీరికి కలతలు కలుగకుండ వీరిగురువగు (పోపు) రోములోని క్రైస్తవ ప్రధానాచార్యుడు కాగితము మీద నొకగీతగీసి ప్రపంచములోని కేపువర్డిలంకలకు పశ్చిమ భాగమంతయు స్పైన్ వారికిని, తూర్పుభాగమంతయు పోర్చుగీసువారికిని ఇచ్చివేసెను. ఈ యుభయజాతుల యసాధారణ మైశ్వర్యాభివృద్ధిని చూచి యూరపు ఖండములోని తక్కిన జాతుల వారందరును మేల్కొనిరి.

(2)

మెక్సికో, పెరూ ఎర్రయిండియను రాజ్యముల నాశనము.

స్పెయిను వారు వెళ్ళునప్పటికి అమెరికాలోని పశ్చిమ యిండియా ద్వీపములలో తామ్రవర్ణముగల మోటవారు నివసించుచుండిరి. వారిని స్పెయిను వారు చంపిరి, దోచుకొనిరి, చంపగ మిగిలిన వారిని బానిసలుగ పట్టుకొనిరి, బానిసలుగ పట్టుకొనిన వారిని క్రైస్తవులుగ చేసిరి. క్రైస్తవులుగ చేయబడినను బానిసత్వమునుండి విముక్తి కాలేదు. నల్లవారు తమక్రింద బానిసలుగనుండుట సహజధర్మమని తెల్లవారు నమ్మిరి. అమెరికా ఖండములోనికి స్పెయిను వారు జొరబడిన కొలదియు కొంతవరకు నాగరికతనుచెందిన ఎర్రయిండియను లగుపడిరి. మెక్సికో, పెరూ దేశములలో మిగుల నాగరీకులగు ఎర్రయిండియనులు గొప్పరాజ్యములు స్థాపించుకొని నివసించుచుండిరి. వీరు ఆసియా ఖండముయొక్క గాని యూరపు ఖండముయొక్క గాని నాగరికతలకు సంబంధములేని స్వతంత్రమగు నాగరికతను నిర్మాణము గావించుకొనియుండిరి. ఈ జాతులనుకూడ స్పెయిను వారు ముట్టడించిరి. 'కోర్టెజి' యను స్పెయిను వాడు పదకొండు పడవలలో నాలుగువందలమంది స్పెయిను సైనికులను రెండువందలమంది ఎర్రయిండియను సైనికులను పదునాలుగు ఫిరంగులను వెంటగొని మెక్సికోదేశముపై దండయాత్ర సలిపెను. అదివరకే అచటికి వచ్చి ఎర్రయిండియనులచే ఖయిదుచేయబడి ఎర్రయిండియనుల భాషను బాగుగా నేర్చుకొనియున్న స్పెయినువాడొక డీతనిని కలిసెను. వాని వలన నాకాలమున మెక్సికోరాజునందు ఎర్రయిండియను ప్రజ

లలో కొంతమందికిష్టములేదని ఈతనికి తెలిసెను. మెక్సికో ప్రజలను తమ స్వదేశ రాజుయొక్క దుర్మార్గమునుండి రక్షించుటకు వచ్చినటుల స్పైన్‌వారు నటించసాగిరి. కొంద రెర్ర యిండియను ప్రజలు నమ్మి స్పైన్‌వారితో చేరిరి. స్పైన్‌వారు ఎర్రయిండియనులచే స్వదేశ రాజుపై తిరుగబాటులు చేయించిరి. 1519 వ సంవత్సరమున స్పైన్‌వారు మెక్సికోలోని పల్లపుభూములలో ప్రవేశించి తిరుగబాటు దారులకును రాజుకును మధ్యవర్తులుగ నున్నటుల నటించి రాజుతో రాయబారములు నలుపసాగిరి. రాజు స్పైన్‌వారితో స్నేహము నొందయత్నించుచుండెను. మరికొందరు ప్రజలకు తమరాజు విదేశీయులగు స్పెయిన్‌వారితో స్నేహముగనుండుటకిష్టములేక రాజుపై తిరుగబడి రాజును చంపివేసి స్పెయిన్‌వారిని ముట్టడించి కొందరిని హతులను గావించిరి. కోర్టేజి సముద్ర తీరమునకు పారిపోయెను. తరువాత క్రొత్తసేనలు స్పెయిన్ దేశమునుండివచ్చి కొంతకాలము పోరాటముసలిపి మెక్సికో దేశమునంతను ఆక్రమించుకొని స్వాధీనమును పొందిరి. స్పెయిన్‌వారు మెక్సికోదేశమున రాజ్యమును స్థాపించుకొనిరి. స్పెయిన్‌వారు కొంద రెర్రయిండియనులను చంపిరి. మిగిలిన వారిని బానిసలుగ చేసికొనిరి. వారిని రోమనుకాథలిక్కు క్రైస్తవమతమును స్వీకరింపజేసిరి. వారిస్వభాషను నిర్మూలనముచేసి వారికి స్పెయినుభాషనేర్పిరి. బానిసలకు స్వభాష స్వధర్మము లుండనేరవు. అనేకమంది గుంపులుగుంపులుగ స్పెయిన్‌దేశమునుండి వచ్చి మెక్సికోదేశమున నివసించిరి. అచట గనులను త్రవ్వించుకొనియు తోటలనువేసియు చాల

ధనముకు సంపాదించిరి. తమ క్రిందనున్న ఎర్రయిండియను బానిసలచేతను, ఆఫ్రికాఖండమునుండి పట్టుకొనివచ్చిన నల్ల నీగ్రోబానిసలచేతను, భూములలోను గనులలోను తోటల లోను పనిచేయించుకొనిరి. ఇటులనే 1530 వ సంవత్సరమున పైజరో అను నతనిక్రింద స్పైనువారు మరియొక దండయాత్ర నలిపి పెరూదేశము నాక్రమించిరి. అచటనుకూడ మెక్సికోలో వలెనే చంపగా మిగిలిన ఎర్రయిండియనులను బానిస లుగ చేసికొని గనులలోను తోటలలోను భూములలోను పనులు చేయించుకొనిరి. ఈ విధముగనే పోర్చుగీసువారు బ్రెజిలు దేశము నాక్రమించిరి. అచటి ఎర్రయిండియనులను కూడ నిటులనేచేసిరి. స్పైను, పోర్చుగలు ప్రభుత్వములక్రింద మెక్సికో, పెరూ, బ్రెజిలు దేశములు మూడును బానిసవ్యాపా రమునకును ధనాభివృద్ధికిని మిగుల ఖ్యాతినిపొందెను. అమె రికాఖండము యొక్క బంగారు వెండి గను లీరెండుజాతుల వారిని యూరపుఖండములోకెల్ల నైశ్వర్యవంతులను జేసెను. స్పైను, పోర్చుగీసు దేశమువారి యైశ్వర్యాభివృద్ధిని చూచి హాలెండువారును, ఫరాసువారును, ఆంగ్లేయులును ధనసంపా దనకై సముద్రములమీద బయలుదేరిరి. జర్మనీదేశమపుడు ఆస్ట్రియా చక్రవర్తియగు స్పైనురాజుయొక్క పాలనమునం దుండుటవలన స్పైనువారికి పోటీగ తక్కిన యూరపుజాతు లతోపాటు నూతనదేశముల యాక్రమణకొరకు జర్మనుదేశీ యులు బయలుదేరజాలక పోయిరి. తమదేశములోనే విదేశ ప్రభుత్వముక్రింద వర్తిడినొందుచున్న జర్మనులు తమ యజ మానులగు స్పైనువారితో పోటీగ ఖండాంతరములకు బయలు

దేరుట అసంభవమయ్యెను. కావున జర్మనీవారు ఆసియా లోగాని అమెరికాలోగాని తక్కినజాతులవలె రాజ్యసంపాదనము చేయలేదు.

(3)

ఆఫ్రికాను కనుగొనుట.

అమెరికాఖండముతో పాటు ఆఫ్రికాఖండముకూడ యూరపియను జాతులచే కనుగొనబడెను. ఆఫ్రికా ఖండములో ముఖ్యముగ భూమధ్యరేఖకు (Equator) దక్షిణముననున్న భాగములో నాగరకజాతులు లేరు. వైశాల్యమునందు మితిలేనిదై యూరపుజాతులు నివసించుటకు యోగ్యమై, ధనాభివృద్ధి కుపయుక్తమై, యున్న నీప్రదేశమును కనుగొనుట గొప్పయదృష్టమని తెల్లజాతులవారు భావించిరి. తమదేశములలో జనసంఖ్య విశేషముగ వృద్ధిచెంది చాలమందికి కడుపునిండ తిండిదొరకని స్థితిలో నుండగ, ఇచ్చట గనులనుత్రవ్వి తోటలనువేసి భూములను సేద్యముచేయించుకొని త్వరితముగ ధనవంతులగుటకు మంచి యవకాశమొదవెనని తలచిరి.

యూరపియను జాతులమధ్య పోరాటములు.

క్రొత్తప్రదేశములు కనుగొనబడినవి. అవి యోగ్యమయినవి, లాభకరమైనవి. కాని వాటిని నీతెల్లజాతులమధ్య పంచిపెట్టువారెవరు? అప్పటికి "మెసపొటేమియాను ఆంగ్లేయులకును" "సిరియాను పరాసువారికిని" "థ్రేసును గ్రీసువారికిని" పంచిపెట్టు నానాజాతులసమ్మేళనము పుట్టలేదు. కావున ధనార్జనముకొరకును రాజ్యసంపాదనముకొరకును యూరపుఖండములోని వివిధజాతులవారు పోటీగ బయలుదేరిరి. వీరిమధ్య

ఘోరయుద్ధములు జరిగెను. సముద్రములమీదను భూమిమీదను వీరిమధ్య ననేకదోపిళ్లుహత్యలుజరిగెను. వీరిమధ్యధర్మ నిర్ణయము చేయుటకు పశుబలముతప్ప వేరుసాధనము లేదయ్యె. బలవంతులు లాభమును పొందుటయు బలహీనులు క్షీణించుటయు జరిగినది.

**యూరపియను జాతుల రాజ్య సంపాదనము.**

రోములో కూర్చుండి ప్రపంచము నంతను స్పైన్ వారికిని పోర్చుగీసు వారికిని నొకకాగితముమీద గీతగీయుటతో పంచియిచ్చినప్రధాన క్రైస్తవ మతాచార్యుని పంపిణీని తక్కిన జాతులవారు గౌరవించలేదు. ఆంగ్లేయులును, డచ్చివారును, స్వీడనువారును, తాము ప్రొటెస్టంటులమని చెప్పి పోపు నధిక్కరించిరి. రోమను కాథలిక్కు మతాచార్యుని (పోపు) శిష్యుడగు పరాసురాజుకూడ తనగురువుచేసిన పంపకమును తిరస్కరించి పోరాడి చేతనయినంత సంపాదించుకొనుటకతని మనస్సాక్షి బాధపెట్టలేదు. ఎర్రయిండియనుల దేశములలో నిష్కారణముగను వారియనుమతి లేకుండగను ప్రవేశించి యాక్రమించుకొనుటకును వారిని నాశనముచేయుటకును బానిసలుగ చేయుటకును తెల్లజాతులవారి మనస్సాక్షి అసలే బాధపెట్టలేదు. కాని అమెరికాలో అందరును సమానముగ సంపాదించలేదు. స్పైన్, పోర్చుగీసు దేశములవారిదివరకే మధ్య అమెరికాను దక్షిణ అమెరికాను కొన్ని పశ్చిమ యిండియా ద్వీపములను సంపాదించుట సూచియుంటిమి. డేనులు (డెన్మార్కువారు) కొన్ని పశ్చిమయిండియా ద్వీపములను మాత్రము సంపాదించిరి. స్వీడను వారికేమియు

లభ్యము కాలేదు. హాలెండువారును (డచ్చివారు) బహు కొద్దిగనే సంపాదించిరి. హాలెండువా రాక్రమించిన "న్యూ ఆంస్టర్డం" 1674 వ సంవత్సరమున ఆంగ్లేయులవశమయ్యెను. దాని 'కాంగ్లేయులు 'న్యూయార్కు' ని పేరిడిరి. గ్వయనాయును హాలెండువారాంగ్లేయుల కిచ్చిరి. పశ్చిమ యిండియా ద్వీపములలో డేనులు సంపాదించిన వాటినికూడ నాంగ్లేయుల కిచ్చిరి.

(4)

కనడా దేశము.

ఆంగ్లేయులు ప్రథమజేమ్సు, మొదటిచార్లెసు, రెండవ చార్లెసు, రాజులయొక్క నిరంకుశత్వముక్రిందను మత నిర్బంధములక్రిందను బాధలనొందుటకూడ తటస్థించినందున తెలివిగల వారును ధైర్యశాలులునగు వారనేకు లాంగ్లేయదేశమునుండి బయలుదేరి యుత్తర అమెరికాకువచ్చి వలసనేర్పరచుకొనిరి. పరాసులుకూడవచ్చి యుత్తర ఆమెరికాలో నివాస మేర్పరచుకొనిరి. కాని ఆంగ్లేయులు వచ్చినంతమంది రాలేదు. ముఖ్యముగ నుత్తరదేశమగు కనడాదేశములోని మంచిభాగములను పరాసు (ఫ్రెంచి) వారాక్రమించిరి. కాని కాపురముండుటకు తగిన మనుష్యులను పరాసు దేశమునుండి బంపలేదు. పట్టణములను విశేషముగ నిర్మించలేదు. కోటలను తగినన్ని కట్టలేదు. ఆదేశములోని ఎర్రయిండియనులను తమక్రిందికి చేర్చుకొని యాదేశమంతయు తమదే యని మాత్రము చెప్పిరి. పరాసు దేశమునుండి యోగ్యులగు మతబోధకులును ప్రయాణికులును వచ్చిరిగాని తగినంతమంది పౌరులు రాలేదు. కనడాలో పరాసువారు లక్షమంది

మాత్రమే కాపురముండగ కనడాకు దక్షిణమువనున్న వలస ప్రాంతములలో నాంగ్లేయులు పదిలక్షలమంది కాపురముండిరి. ఈ ఆంగ్లేయ వలసరాష్ట్రముల వారును ఇంగ్లాండునుండి వచ్చిన ఆంగ్లేయ సైనికులును కనడా దేశము నాక్రమించుటకై ఫ్రెంచివారిపై అప్పుడపుడు యుద్ధములు సలిపిరి. 1754 వ సంవత్సరములో జరిగిన యుద్ధము వలన స్థితిగతులు మారలేదు. కాని 1757 మొదలు 1763 వరకు యూరపులోను హిందూదేశములోను అమెరికాలోను ఆంగ్లేయులకును ఫ్రెంచి వారికిని జరిగిన ఏడుసంవత్సరముల యుద్ధములో ఆంగ్లేయులే గొప్పజయములను పొందిరి. ప్రపంచరాజ్యమును ఫ్రెంచివారి నుండి ఆంగ్లేయులు లాగికొనిరి. 1763 వ సంవత్సరమున జరిగిన పారిసుసంధివలన హిందూదేశ సామ్రాజ్యమును కనడా దేశమును ఫ్రెంచివారు ఆంగ్లేయులకు వదలివేసిరి. కనడా దేశమాంగ్లేయుల వశమయ్యెను. అదివరకు కనడా దేశమునకు వలసవచ్చియున్న ఫరాసువారును తరువాత కనడాకు కాపురమునకు వచ్చిన ఆంగ్లేయులును కలిసి కనేడియను జాతివారయిరి. ఇటులనే హిందూ దేశమునకు మొదటి కాపురస్థులగు హిందువులును తరువాత కాపురమునకు వచ్చిన మహమ్మదీయులును పారసీకులునుకలిసి హైందవులయిరి. కనడా దేశమును తమ మాతృభూమిగ అచట కాపురమున్న ఆంగ్లేయులును ఫరాసువారును ప్రేమించుచున్నారు. ఫరాసువారు తక్కువ సంఖ్యాకులగుటచే విశేష సంఖ్యాకుల భాషయగు ఆంగ్లేయభాషనుకూడ నేర్చుకొనిరి. హిందూ దేశములోకూడ విశేష సంఖ్యాకుల భాషయగు

హిందూస్థానీభాషను తక్కిన వారు నేర్చుకొనవలసియున్నారు. కనడా యొక్క రాజ్యాంగభాష ఆంగ్లేయభాష అయినది. కనడా దేశములో కొంతకాలము వరకు ప్రొటెస్టంటులగు ఆంగ్లేయులకును రోమను కాథలిక్కులగు ఫరాసువారికిని కలతలు కలుగుచుండెను. ఆంగ్లేయ రాజ్యముమీద తిరుగబాటుకలిగెను. కాని బ్రిటిషు రాజ్యాంగవేత్తలు కనడాదేశమునకు స్వరాజ్యమిచ్చినచో నీకలతలు నివారణయగునని తలచి బ్రిటిషు సామ్రాజ్యాంతర్నిహితమగు స్వరాజ్యమునిచ్చిరి. అప్పటినుండియు ఆంగ్లేయ ఫరాసు కలతలు నశించినవి. ఉభయజాతులును ఐకమత్యముకలిగి తమ మాతృదేశాభివృద్ధికై బాగుగ పని చేయుచున్నారు. దేశాభిమానము జాతీయభావము సంపూర్ణముగ కలిగినవి. స్వరాజ్యము రాగానే తమ ప్రక్కదేశమగు అమెరికా సంయుక్త రాష్ట్రములతో బాటు తమ దేశమునుకూడ నభివృద్ధిచేయు బాధ్యత అందరిమీదను ఏడుటవలన అదివరకుగల సాంఘిక స్పర్ధలును అసూయలును మతవైషమ్యములను వదలివైచి యుభయజాతులవారును జవాబుదారితో తమ దేశముయొక్క గౌరవముకొరకు కృషి సలుపుచున్నారు. ఇపుడు కనడా దేశము ప్రపంచములోని తక్కిన యన్ని స్వతంత్రదేశములతో పాటు అభివృద్ధిని గౌరవమును కలిగియున్నది.

కనడాదేశమును ఫ్రెంచివారు పోగొట్టుకొనిన తరువాత ఫ్రెంచిగైన్నాయనుకొన్ని ద్వీపములును తప్ప అమెరికా ఖండమునందు ఫ్రెంచివారికి పేరువడసిన ప్రదేశము లేవియులేవు. ఆంగ్లేయులకు కనడాదేశమేగాక, యుత్తరఅమెరికాలో న్యూ

ఫౌండ్లాండుద్వీపమును పశ్చిమయిండియాద్వీపములలోని కొన్ని పెద్దద్వీపములును, దక్షిణఅమెరికాలో బ్రిటిషుగైనాయును కొన్ని యితరద్వీపములును కూడగలవు.

కనడాదేశమునకు దక్షిణమునన్న ప్రదేశమును ముఖ్యముగ నాంగ్లేయులాక్రమించి చాలకాల మాంగ్లేయదేశపు పాలనముక్రింద నుండిరి. తరువాత నాంగ్లేయదేశముతో కలహించి అమెరికాసంయుక్తరాష్ట్రములను పేరున స్వతంత్రమును పొందిరి. వీరిచరిత్రమే మనమిపుడు చదువుచున్నాము. ఈ ఆంగ్లేయవలసరాష్ట్రములు స్వతంత్రముకొరకు యుద్ధము చేసిన నాటికి పదమూడు రాష్ట్రములుమాత్రమే యుండెను. వాటినిగూర్చి సంగ్రహముగ రాబోవు అధ్యాయమునందు వివరించెదము.

# అమెరికా
# సంయుక్తరాష్ట్రములు.

## మూడవ అధ్యాయము.

## పదమూడు వలస రాష్ట్రములు.

(1)

స్పెయిన్ వారి వలస ప్రయత్నములు.

ప్రథమమున 1512 వ సంవత్సరమున స్పెయిన్ దేశవాసియగు పాన్సీ డిలియను నతడు ఉత్తర అమెరికాలోని ఫ్లారిడాతీరమును చేరెను. దానిని స్పెయిన్ రాజుపేర స్వాధీనమును పొందెను. అక్కడ కొందరు స్పెయిన్ దేశీయులను కాపురమునకు తీసుకొనిరాగ వారినందరిని అచటి ఎఱ్ఱయిండియనులు చంపిరి. 1520 వ సంవత్సరమున ఇద్దరు స్పెయిన్ దేశీయులు తరువాత కారొలీనాయేర్పడిన ప్రాంతమునకువచ్చి కొందఱెఱ్ఱయిండియనులను పట్టుకొని బానిసలుగ తీసుకొనిపోయిరి. 1539 వ సంవత్సరమున ఫర్డినండు సోటోయను మరియొక స్పెయిన్ దేశీయుడు అమెరికాకు వచ్చి మిస్సిసిపీనది ప్రాంతమున సంచారము చేసెను. కొందరు స్పెయిన్ వారచట కాపురముం

డుటకు యత్నించిరి, గాని ఎఱ్ఱయిండియనుల అభ్యంతరముల వలన వీలుకలుగలేదు. మిస్సిసిపీనది ప్రాంతమున సోటో చూచినపు డెఱ్ఱయిండియనులు సాధువులుగను వ్యవసాయకులుగను నుండిరి. గాని స్పైన్‌దేశీయులు వారిని బానిసలుగ పట్టుకొనుటయు, స్వల్ప యనుమానముపైన వారి చేతులు ఖండించుటయు, తమకు త్రోవచూపువాడు లోపముచేసినపుడు వానిని వేటకుక్కలు చంపితినుటకు వప్పగించుటయు, స్వల్పకారణములకు వారి గ్రామములు తగులబెట్టుటయు, కొకప్పుడు మనుష్యులనుకూడ మంటలలో పడవేయుటయు, మొదలగు క్రూరకృత్యములు చేసియున్న కారణముచేత, ఎఱ్ఱయిండియనులు తరువాత వెళ్ళిన తెల్లవారిని మిగుల యనుమానముతోడను విరోధ భావముతోడను చూచుట తటస్థించెను. ఇంతటితో స్పైన్‌దేశీయు లీప్రాంతములలోనికి వలస వచ్చుట మానుకొనిరి.

పరాసువారు. 1562,64 వ సంవత్సరములలో ఫ్రాన్సు దేశములో మతవిషయిక నిర్బంధములచే బాధనొందిన హ్యూజినాట్లను ప్రొటెస్టెంటు మతస్థులగు పరాసువారువచ్చి కారొలీనాప్రాంతముల నివాసముల నేర్పరచుకొనిరి. పరాసుదేశపు రాజగు పదవచార్లెనుపేరున నా ప్రాంతమునకు 'కారొలీనా' యను నామమిడిరి. రోమన్ కాథలిక్కులగు స్పైన్‌వారికి వీరియందు గల విరోధముచే స్పైన్‌దేశపు సైనికులిచటకువచ్చి వీరినందరిని పట్టుకొని పరాసువారనిగాక ప్రొటెస్టంటులని" యురిదీసిరి. ఇంతటితో నీవలస రాజ్యమంతరించెను. ఈఘోరకృత్యము పరాసు దేశము

నకు తెలిసి పరాసుసేనానియగు గర్నను మూడునౌకలమీఁద కొంతసేనతో బయలుదేరి అమెరికాకువచ్చి స్పైన్ దేశీయులు కాపుర మున్నచోటుల ప్రవేశించి స్పెయినువారి నందరిని ఖైదీలుగావట్టుకొని స్పైన్ దేశీయులని గాక "ద్రోహులు బందిపోటు దొంగలు హంతకులున"ని యురిదీసెను. స్పైన్ దేశీయులు 1565 వ సంవత్సరమున అమెరికా సంయుక్తరాష్ట్రములలో నేర్పరచుకొనిన 'సెంటు ఆగస్టయిను' అను ప్రాతనివాసము మాత్రమే మిగిలెను.

(2)

వర్జీనియా.

అమెరికాసంయుక్తరాష్ట్రములలో ప్రథమమున వలన స్థాపింపబడినది వర్జీనియా రాష్ట్రములో నే. పరాసుహ్యూజినాట్లు కారొలీనాలో వలస నేర్పఱచుకొనుటకు చేసిన ప్రయత్నము లాంగ్లేయుల నిచటకు వచ్చుటకు పురికొల్పెను. ఆంగ్లేయుడగు సర్ వాల్టరు రాలీ 1585 వ సంవత్సరమున నాంగ్లేయ రాజునుండి దానశాసనమును పొంది యుత్తర కారొలీనా ప్రాంతమున నొక యాంగ్లేయులవలస నేర్పఱచెను. కొలదికాలములో నీ యాంగ్లేయు లకారణముగ నొక యెఱ్ఱయిండియనుప్రభువును నతని యనుచరులను వధించిరి. ఇంతటితో నెఱ్ఱయిండియను లాంగ్లేయులపై మత్సరమును బూని పెక్కువిధముల పీడింపజొచ్చినందున మరుసటిసంవత్సర మాంగ్లేయులు లేచిపోయిరి. తిరిగి 1587 సంవత్సరమునమరికొందఱాంగ్లేయు లాప్రాంతమునకే వచ్చి నివసించిరి. కాని వారిని ఎఱ్ఱయిండియనులు నాశనముచేసిరి. 1606 వ సంవత్సరమున అమెరికాఖండమున వలసలను స్థాపించుటకుగాను

ఆంగ్లేయ దేశమునందు రెండుసంఘము లేర్పడెను. వాటిలో లండనుసంఘమనునది వర్జీనియాను స్థాపించెను. 1606 వ సంవత్సరమున నిచటికి నూటఅయిదుగురు ఆంగ్లేయులు మాత్రము వచ్చి నివసించిరి. వారిలో నలుగురు వడ్రంగులును పన్నెండుమంది కార్మికులును నుండిరి. ఏసుక్రీస్తుప్రభువు తల్లియగు వర్జిన్ మేరీ పేరున వర్జీనియా యని నీప్రదేశమునకు నామకరణమిడిరి. క్రమముగా నాంగ్లేయ దేశమునుండి చాలమంది వచ్చి చేరుచుండిరి. ఇచట పొగాకు విశేషముగా పండించబడెను. ఇందువలన వీరు చాల ధనికులైరి. 1619 సంవత్సరమున నాంగ్లేయరాజుయొక్క అనుజ్ఞను పొంది యీరాష్ట్రపాలనమునకుగాను ప్రజాప్రతినిధి సభను స్థాపించుకొనిరి. 1622 వ సంవత్సరమున షుమారు నాలుగు వేల ఆంగ్లేయులిచట కాపురముండిరి. ఇరువదియొక్క సంవత్సరములలో జనసంఖ్య రెండురెట్లధికమయ్యెను. 1620 సంవత్సరముననే యొక హాలండు యుద్ధనౌక ఈ రాష్ట్రతీరమునకు వచ్చి ఈ రాష్ట్రవాసులకు ఆఫ్రికానుండి తెబడిన నల్ల నీగ్రోబానిసల నమ్మినది. తదాది ఇచటకు నీగ్రోబానిసలు తేబడుట ప్రారంభమయ్యెను. ఎర్రయిండియనులకును ఈ తెల్లప్రజలకును అప్పుడప్పుడు కలతలు గలిగి ఎర్రయిండియనులు వీరిమీదపడి హత్యలు జరుపుటయు, వీరు వారినిచంపి వారిదేశము నాక్రమించుటయు జరుగుచుండెను. క్రొత్తగా కాపురస్తులను తెచ్చియుంచుటకు ప్రతిభూకామందునకును ఏబది యెకరముల స్థలమీయబడెను. ఇందులో ఆంగ్లేయ దేశమునుండి క్రొత్తవారు వచ్చి నివసించుచుండిరి. మరియు నాంగ్లేయదేశములో గొప్ప నేరములు

చేసినవారినికూడ నిచటకే కాపురమునకు బంపుచుండిరి. పట్టణములును పరిశ్రమలును వృద్ధినొందలేదు. కాని తోటలు విశేషముగా పెరిగినవి.

(3)

మేరీలాండు.

ఆంగ్లదేశపు రాజగు మొదటి చార్లెసు వద్దనుండి దాన పట్టాను పొంది 1634 వ సంవత్సరమున నిచట బాల్టిమోరు ప్రభువుయొక్క కుమారుడొక యాంగ్లేయుల వలన నేర్పరచెను. రోమనుకాథలిక్కు మత స్థుల కాంగ్లేయ దేశములో మిగుల బాధలు కలుగుచున్నందున చాలమంది రోమను కాథలిక్కులగు ఆంగ్లేయులిచటకు వలసవచ్చిరి. వీరిని ప్రథమమున ఎర్రయిండియనులు స్నేహముగ నాదరించిరి. ఎర్రయిండియను స్త్రీలు, ఆంగ్లస్త్రీలకు మొక్కజొన్నలతో రొట్టెచేసికొనుటను నేర్పిరి. ఆరునెలలో నీరాష్ట్రము విశేషముగా పెరిగెను. కొలదికాలములోనే ఎర్రయిండియనులకును వీరికిని కలతలు కలిగెను. వీరి ముఖ్య పంటదినుసుకూడ పొగాకే.

(4)

ఉత్తర, దక్షిణ, కారొలీనా రాష్ట్రములు.

కారొలీనా రాష్ట్రమును ప్రథమమున పరాసువారు స్థాపించిరి. తరువాత నిది విభజింపబడి ఉత్తరదక్షిణ కారొలీనాలను రెండురాష్ట్రములుగ చేయబడెను. పరాసువారు స్పైన్‌వారిచే చాలవరకు చంపబడిన తరువాత 1663వ సంవత్సరమున నాంగ్లేయులిచట వలస నేర్పరచుకొనిరి. తన బానిసలమీద ప్రతితెల్ల యజమానికిని సంపూర్ణమగు నధికారముండవలెననియు యజమాని బానిస నేమిచేసినను రాష్ట్రీయ

ప్రభుత్వమువారు జోక్యము పుచ్చుకొనగూడదనియు నొకశాసనమును గూడ వీరు ప్రత్యేకముగ చేసికొనిరి. వర్జీనియా రాష్ట్రమునుండియు నిచటికి తెల్లవారువచ్చి నివాసమేర్పరచుకొనిరి. 1685 సంవత్సరమున కొందరు ఫరాసువారును 1711 వ సంవత్సరమున కొందరు జర్మనువారును నీపురమునకు వచ్చి చేరిరి. ఎఱ్ఱయిండియనుల భూములను తెల్లవా రాక్రమించుటవలన ఎఱ్ఱయిండియనులతో యుద్ధములు జరిగెను. ఎఱ్ఱయిండియనులు లోడిపోయి చావగ మిగిలినవారు మరియొక ప్రాంతమునకు పారిపోయిరి.

(5)

**జార్జియా** ఇది యాఖరున స్థాపించబడిన రాష్ట్రము. 1732 సంవత్సరమున బగిలుదోర్పను నాంగ్లేయుడు రెండవ జార్జిరాజునుండి దానపట్టాను పొంది నూటయిరువది మంది యాంగ్లేయులను వలసకు తెచ్చెను దీనికి శవన్నా ముఖ్య పట్టణముగ నిర్మించిరి. ఈరాష్ట్రమునకు బానిసలను తేననియు కల్లు సారాయి మొదలగు మత్తు పదార్థముల నిచటికి రానివ్వ ననియు బగిలుదోర్పు ఒడంబడిక చేసెను. జర్మనీనుండి కొందఱు మొరేలియను క్రైస్తవమత శాఖకు చెందిన జర్మనులును స్కాట్లండు నుండి స్కాచివారును కూడ తరువాత వలసవచ్చిరి. 1743 సంవత్సరమున బగిలిదోర్పు అమెరికాను వదిలిపోయెను. ఆయన వెళ్ళగనే నీరాష్ట్రమున కల్లు సారాయిదుకాణము లేర్పడెను. బానిసత్వము విరివిగాసాగెను. ఇచటతోటలలో పనిచేయుటకై ఆఫ్రికా బానిసలను విశేషముగ తెచ్చిరి. ఈ సందర్భమున నొక ప్రశ్న పుట్టవచ్చును. ఆంగ్లేయరాజు ఎఱ్ఱ

యిండియముల క్రిందనున్న అమెరికాలోని ప్రదేశములను ఆంగ్లేయులకు దానపట్టా నిచ్చుచుండిరి. ఇందుకు ప్రత్యుత్తర మేమనగా ఎర్రయిండియనులకు వారి దేశములో ఎట్టిహక్కులున్నవనిగాని తెల్లజాతులవారు అంగీకరించలేదు. మఱియొక తెల్లజాతివారిచే నాక్రమింపబడని ప్రదేశములనన్నిటిని ఆక్రమించుకొనుటకును దాన మిచ్చుటకును తెల్లజాతులవారికి హక్కుగలదని తెల్లవారుతలచిరి.

(6)

1609 వ సంవత్సరమున డచ్చి (హాలండు) తూర్పు ఇండియా కంపినీవారు హడ్సను అను నతనిని అమెరికాకు బంపగ నాయన డెలవేరు సముద్రమును హడ్సనునదీప్రాంతమును గుర్తించి వచ్చెను. (న్యూయార్కు.) ఇప్పుడు న్యూయార్కు పట్టణమున్న ప్రదేశమునకు వచ్చినప్పుడు హడ్సన్ అచటి ఎర్రయిండియనులలోని ముఖ్యులకు త్రాగుటకు సారాయము నిచ్చెను. వారిదివరకు సారాయము త్రాగుటనెఱుగరు. మొదట యొక్కడు మాత్రమే అనుమానముతో త్రాగెను. త్రాగినవాడు కొంతసేపు సోలి పిచ్చిమాటలాడి సొమ్మసిలి తిరిగి మంచిస్థితికివచ్చుటను జూచి ఎర్రయిండియనుల కాశ్చర్యము గలిగెను. చాలమంది త్రాగి జూచిరి. తెల్లవారిచేత విచిత్రమగుశక్తిగలదని తలంచిరి. "మనహాట్టను" అనగా "త్రాగుడుస్థలము" అని యాస్థలమునకు ఎర్రయిండియనులు పేరుపెట్టిరి. హాలండువారు ఎర్రయిండియనులతో స్నేహముగ నుండిరి. అప్పుడు హాలండు నుండి నౌకలువచ్చి ఎర్రయిండియనులవద్ద పశువుల ఊకలు

కొనుచుండిరి. వర్తకులు వేసవికాలములోనుండుటకు కొన్ని చిన్న యిండ్లను నిర్మించిరి. తరువాత నివి చలికాలము వరకు నుంచబడెను. ఆపైన ఒకచిన్న కోటనుకట్టిరి. తరువాత అల్బనీయను ప్రదేశమున 1615 వ సంవత్సరమున హాలండువారు కొంతమంది కాపురమునకు వచ్చిరి. క్రమక్రమముగ హాలండునుండికొ్రత్తవారు వచ్చిచేరిరి. 1623 వరకు డెలవేరుసముద్రమునుండి కాడుకేపువరకును సముద్రతీరముననున్న ప్రదేశమంతయు నాక్రమించి న్యూనెదర్లాండ్సను పేరుపెట్టిరి. ఇపుడు న్యూయార్కు పట్టణమున్న ప్రదేశమున న్యూఅంస్టర్డం పట్టణము వృద్ధియగు చుండెను. మనహాట్టనులంకను హాలండువారు 1625 వ సంవత్సరమున ఎర్రయిండియనుల నుండి ఇరువది అయిదు డాలరులకు కొనిరి. ఏబదిమంది తెల్ల వారిని వలస దెచ్చుట కొడంబడిన ప్రతి (హాలండు) డచ్చి భూకామందునకును పదునారు మైళ్ళపొడవుగల ప్రదేశమునిచ్చిరి. ప్రథమమున ప్రక్కనున్న వర్జీనియా మొదలగు నాంగ్లేయ వలస రాష్ట్రములతో స్నేహముగనేయుండిరి. కొంత కాలమునకు ఎర్రయిండియనులతో పోరాటములు ప్రారంభమయ్యెను. తరువాత నాంగ్లేయులతోను, స్వీడను వారితోను కలతలు గలిగెను. కానిరాజీపడిరి. హాలండువారికిని ఆంగ్లేయులకును యూరపుఖండమున యుద్ధములు జరిగి 1674 సంవత్సరమున జరిగిన సంధి వలన నీన్యూనెదర్లాండ్సు రాష్ట్రమాంగ్లేయ పాలనము క్రింద చేర్పబడెను. అప్పటినుండియు దీనికి న్యూయార్కు రాష్ట్రమనియు ముఖ్యపట్టణమగు న్యూఅంస్టర్డం పట్టణమునకు న్యూయార్కుపట్టణమనియు పేరుపెట్టిరి. దీనిలో

నాంగ్లేయులును డచ్చివారును (హాలండువారు) కొంతమంది స్వీడనువారును నివసించుచున్నారు.

(7)

న్యూజర్సీ.

1664 సంవత్సరమున నాంగ్లేయులు (న్యూయార్కు) న్యూనెదర్లాండ్సు పై దండెత్తి కొంతభాగము నాక్రమించిరి. దీనికి న్యూజర్సీయని పేరిడిరి. దీనిలోను నాంగ్లేయులును డచ్చివారును గాపురమున్నారు.

(8)

పెనిసిల్వేనియా డెలవేరు రాష్ట్రములు.

ప్రథమమున నిచట డచ్చివారును స్వీడనువారును స్థావర మేర్పరచుకొనిరి. 1682 సంవత్సరమున క్వేకరు మతస్థుల నాయకుడు విలియం పెన్ననునాయన రెండవచార్లెసు రాజునుండి ఈప్రదేశమును దానపట్టాను పొందెను. తానును కొంతమంది క్వేకరు క్రైస్తవశాఖకు చెందిన యాంగ్లేయులును వెళ్ళి యచట నివాసము నేర్పరచుకొనిరి. 'సోదరప్రేమ' యను పేరుగల ఫిలడల్ఫియా పట్టణమును స్థాపించిరి. ఈపట్టణ మతిత్వరితముగా వృద్ధిచెందెను. విలియం పెన్ను చాలయోగ్యుడు. ఇక్కడ మతసహనమును సోదరభావమును సంపూర్ణముగా స్థాపించెను. ఈయన యెర్రయిండియనులతో నొడంబడికలుచేసి ఎప్పటికిని వాటికి వ్యతిరేకముగా ప్రవర్తించలేదు. ఎర్రయిండియనులతో యుద్ధములు లేకుండ కాలముగడపెను. 1684వ సంవత్సరమున ఆంగ్లేయదేశమున కేగిన తరువాత నీయనచేసిన యేర్పాటులు నిలువలేదు. జర్మనీనుండి చాలమంది మంచివ్యవసాయకులు వచ్చి పెనిసిల్వేనియా రాష్ట్రమున వలసచేరిరి.

న్యూఇంగ్లాండు, మెసషూసెట్సు కనెక్టికటు, న్యూహాంప్షైర, రోడు ఐలెండు రాష్ట్రములు.

ఈ రాష్ట్రములు అమెరికా జాతికి ముఖ్యమగు యునికి పట్టులు. ఆంగ్లేయ దేశములో ప్రభుత్వముచే స్థాపించబడిన ప్రొటెస్టంటు క్రైస్తవ మత శాఖకు చెందని వారిని ఆంగ్లేయ రాజులు క్రూరముగ హింసించుచుండిరి. 1602 వ సంవత్సరమున కొందరాంగ్లేయు లాబాధలుపడ లేక నింగ్లాండు నుండి పారిపోయి హాలెండు దేశములో శరణుజొచ్చిరి. గాని హాలెండు దేశపు శీతోష్ణస్థితులు ఆచారములు వారికి సరిపడలేదు. అందువలన అమెరికాలో వలసల నభివృద్ధిచేయుట కింగ్లాండులో నేర్పరచబడిన లండను సంఘమునకు తమ కమెరికా ఖండమున కొంతనివాస యోగ్యమగు స్థల మిప్పించమని దరఖాస్తు పెట్టుకొనిరి. "మేమందరమును మత ప్రేమాపాశములచే బంధించబడిన వారము. ఒకరిమేలు మరియొకరు చూడవలసినవారము. ఎంతదూరమైనను మతస్వేచ్ఛకొరకై పోవుటకు సిద్ధముగ నున్నాము." అని దరఖాస్తులో వ్రాసికొనిరి. లండను సంఘ మీధీరబృందమునకొక దానపట్టానిచ్చెను. కాని పావము కొంతకాలమువరకు ప్రయాణముచేయుటకు ద్రవ్యము పుట్టలేదు. కట్టుబట్టలతో నింగ్లాండు నుండి హాలెండుకు మనస్సాక్షిచెప్పిన చొప్పున వర్తించుటకై లేచిపోయియుండిరి. తుదకు లండను సంఘమునుండియే వారునిర్ణయించిన కఠిన షరతులకెల్ల సమ్మతించి కొంతసొమ్మును సంపాదించిరి. రెండు పడవలను తెచ్చుకొనిరి. కాని ప్రయాణమయ్యే వేళకొక పడవ యజమాని మోసముచేసెను. 1620 వ సంవత్సరము

సెప్టెంబరు 6 వ తేదీన "మేఫ్లవర"ను నౌక పడవలో నూట యిద్దరాంగ్లేయులు అమెరికాకు ప్రయాణము చేసిరి. వారు హాడ్సనునది ప్రాంతమున నివసించ నుద్దేశించిరి. కాని అరువది యేడురోజులు ప్రయాణముచేసి కేపుకాడు వద్దదిగిరి. నౌకలో నుండగానే నీదిగువవిధమున నేర్పాటుచేసికొనిరి. "భగవంతుని సమ్ముఖమున మనకు తెలియచేయునదేమనగా, ఈదిగువవనమూదుచేసిన పేర్లుగల జేమ్సురాజుయొక్క ప్రజలమైన మనము, భగవంతుని ఘనపర్చుటకును క్రైస్తవమతము నభివృద్ధి చేయుటకును మనరాజుయొక్కయు దేశముయొక్కయు గౌరవము నిమిత్తమును పరమేశ్వరుని యనుగ్రహమువలన వర్జీనియాలోని యుత్తర ప్రాంతములలో మొదటి వలసనేర్పరచుట కుద్దేశించి యున్నాము. కాన మనఅందరియెదుటను భగవంతుని సమ్ముఖమునను మనక్షేమమునిమిత్తమును మన యుద్దేశ్యములను నెరవేర్చుకొను నిమిత్తమును మనమొక పాలనాసంఘముగ నేర్పడినారము. మనవలస యొక్క లాభమునిమిత్తము న్యాయమైనట్టియు యుక్తమైనట్టియు చట్టములను మనము చేసికొనెదము. వాటికి మనము విధేయులమై ప్రవర్తింతము. దీని కొప్పుకొని 1620వ సంవత్సరము నవంబరు 11 వతేదిన మనమందరము సంతకములు చేయుడమైనది" స్వేచ్ఛగలమానవులు స్వేచ్ఛగా తాముచేసికొనెడి శాసనములకు బద్ధులై నడచుకొనుటయే యుత్తమమగురాజనీతి. దీనిని ఈఅమెరికను వలస ప్రజ లనుకరించిరి. వారాచుట్టుపట్ల ప్రదేశములను చూచి డిసెంబరు 11 తేదీన న్యూఇంగ్లాండును స్థాపించిరి. ఆశీతాకాలము దుర్భరమగుటచే చాలమంది మరణించిరి.

1621 సంవత్సరము మార్చి నెలాఖరుకు అనువదిమందిమాత్రము మిగిలియుండిరి. మరుసటివత్సరము క్రొత్తగా ముప్పది యిమగురు వచ్చిచేరిరి. కాని వారివద్ద బొత్తుగా నాహార పదార్థములు లేకుండెను. ఆరునెలలవరకందరు నొంటిపూటనే భోజనముచేసిరి. 1623 సంవత్సరమున భగవదనుగ్రహము వలన పంట బాగుగాపండినది. ఇంకటినుండియు భోజనము నకు కొదువలేదు. కాని రాజుయొక్క దానశాసనము వారికి లభింపలేదు. వారికి యితరసరుకులు మిక్కిలి కష్టముమీదను ప్రియముగను సమకూరెను. హారాంగ్లేయదేశమున కొగు మతిచేయువానిని ఆంగ్లేయప్రభుత్వము వారు జప్తుచేసిరి. కావున ఈరాష్ట్రము విశేషకాలమువరకు వృద్ధిచెందలేదు. పదిసంవత్సరములతర్వాత వీరిసంఖ్య మూడువందలు మాత్రముండెను. కాని వచ్చినవారు ధీరత్వముతో నీప్రదేశమును వీడకయుండిరి. వీరికి ప్రథమమునుండియు ఎర్రియిండియనులతో పోరాటములు కలుగుచుండెను. వీరిలో నొకజట్టు చుట్టుప్రదేశముల వెదకి చూచుచున్నసమయమున ఎచటనుండియో బాణములు తగిలెను. తరువాత 1624 సంవత్సరము మార్చి 15వ తేదీని నొక ఎర్రయిండియను అడవిలోనుండివచ్చి వీరిలో కొందరితో కలసి "మీకు స్వాగతము" అని యింగ్లీషుభాషలో చెప్పెను. ఆంగ్లేయులు వానితో స్నేహముచేసిరి. అదివరకు హంటు అను పేరుగల తెల్లవాడొకడు ఎర్రయిండియనులతో సఖ్యము చేసినట్లు కొన్నిరోజులు నటించి తరువాత నొకరోజున కొంద రెర్రయిండియనులను తన పడవలోని కెక్కించుకొని తటాలున వారిని బానిసలుగ తీసికొని సముద్రముమీద వెళ్ళిపోయినాడని

వాడుచెప్పెను. ఆరాత్రి వాడాంగ్లేయుల వద్దనుండెను. మరు వాడుదయమున కొన్ని బహుమానములను పొంది వాడేగెను. తరువాత కొద్దిరోజులకు మరి అయిదుగురెర్రయిండియను లతో కూడ వాడువచ్చెను. మార్చి 22 తేదీన వారాంగ్లేయు లను తమ ప్రభువగు మెస్ససోయిటు వద్దకు తీసికొనిపోయి స్నేహమును కుదిర్చిరి. మెస్ససోయిటుకు మరియొకజాతి ఎర్ర యిండియనులు విరోధులుగ నుండిరి. వారినుండి తనకు సహా యము చేయవలసినదని ఆంగ్లేయులను కోరెను. ఆంగ్లేయులు సమ్మతించిరి. ఈసంగతి రెండవజాతి ప్రభువుకు తెలసి ఆంగ్లేయు లతో యుద్ధము చేయుటకు వచ్చుచున్నానని గుర్తుగ బాణముల కట్టనుపంపెను. ఆంగ్లేయులలోని ముఖ్యుడు తోలుసంచిలో కొంత మందుగుండు పెట్టిపంపెను. దీనికిభయపడి యీరెం డవ ఎర్రయిండియనుజాతివారి రాజుయుద్ధము చాలించుకొనెను. ఇంతలో మరికొందరాంగ్లేయు లచటికి వలసవచ్చిరి. వారివద్ద భోజనసామాగ్రి అయిపోయినందున భోజనముకై ఎర్రయిండి యనులతో స్నేహముచేసి కొన్నిరోజులకు వారినిదోచుకొనిరి. దానితో ఎర్రయిండియను లీతెల్లవారిని నాశనము చేయుటకై కుట్రపన్నిరి. కాని ఆంగ్లేయుల మిత్రుడగు ఎర్రయిండియను ప్రభువు మెస్ససోయిటు కుట్రసంగతి ఆంగ్లేయులకు తెలిపెను. కుట్రదార్ల ముఖ్యులొకయింటిలో నుండగ నాంగ్లేయులు వారిని ముట్టడించి హత్యగావించిరి. ఆప్రదేశమున నున్న ఎర్రయిండియనులందరును పారిపోయిరి. తరువాత కొందరు లోబడి ఆంగ్లేయులతో సంధిచేసికొనిరి.

ఆంగ్లేయులు పంటలు పండించి ధాన్యమును ఎర్రి

యిండియనుల కమ్ముచువచ్చిరి. మంచి మంచి మృగముల చర్మము లెఱ్ఱయిండియనులు తెచ్చి యిచ్చుచుండిరి. వీటి నాంగ్లేయు లింగ్లాండునకు రవానా చేయుచుండిరి. ఇందు వలన యెఱ్ఱయిండియనులు వ్యవసాయముమాని, వేటాడి తోళ్ళ నాంగ్లేయులకిచ్చి వీరినుండి ధాన్యమును తీసుకొనిపోవు చుండిరి. ఎఱ్ఱయిండియనుల స్థితి క్షీణించెను. ప్రథమమున న్యూ ఇంగ్లాండును స్థాపించిన ఆంగ్లేయులను "పిల్గ్రింఫాదర్సు" (యాత్రికులని) పిలుచుచుండిరి.

మెసచుసెట్సు.

1628 సంవత్సరమున మెసచుసెట్సు వలస కొందఱాంగ్లేయులచే స్థాపింపబడెను. సేలము పట్టణము ప్రథమమున ముఖ్యస్థానముగనుండెను. తరువాత బాస్టన్ పట్టణము వృద్ధియయ్యెను. 1635 సంవత్సరమున మూడువేలమంది క్రొత్తవారువచ్చి చేరిరి.

కనెక్టికటు.

మెసచుసెట్సు ప్రాంతమునుండి కొందఱుపోయి కనెక్టికటు ప్రాంతమున వలస స్థాపించుకొనిరి. ఆప్రాంతము "పికెడ"ను ఎఱ్ఱయిండియనుజాతివారిది. వారాంగ్లేయులయందు ద్వేషభావను జూపిరి. ఒక ఎఱ్ఱయిండియను ప్రభువు నాంగ్లేయులెత్తుకొని వచ్చి చంపిరి. ఇద్దఱాంగ్లేయులను ఎఱ్ఱయిండియనులు చంపిరి. మెసచుసెట్సు ప్రాంతములనుండి ఆంగ్లేయులువచ్చి ఎఱ్ఱయిండియనుల గ్రామముల తగులబెట్టి సస్యములను పాడుచేసి వెళ్ళిరి. కనెక్టికటు వలసవారుకూడ పికెడుజాతి వారిమీద యుద్ధమునకు బయలు వెడలిరి. పికెడుజాతికి విరోధులగు మొహాగనులను ఎఱ్ఱయిండియను జాతివారి సహాయము నాంగ్లేయులు

సంపాదించిరి. నర్రిగనుసెటు జాతివారినికూడ తమలో చేరవలెనని ఆంగ్లేయులు కోరిరిగాని వారు చేరలేదు. ఆంగ్లేయులును మొహాగను జాతివారును అర్ధరాత్రివేళ పికెడుజాతి వారి ముఖ్యగ్రామము మీాద నాకస్మికముగ పడి అన్నియిండ్లను తగులబెట్టిరి. తగులపడుచున్న యిండ్లలోనుండి తప్పించుకొని బయటకు వచ్చుచున్న పురుషులను స్త్రీలను శిశువులను వధించి ఒక గంటసేపటిలో నారువందలమందిని చంపిరి. ఆసమయమున సిద్ధతాంగేయులు మాత్రము మరణించిరి. మరునాడు మూడు వందలమంది పికెడుజాతివారు యుద్ధమునకు రాగ వారి నాంగ్లేయులోడించి చాలమంది హతులను జేసిరి. మిగిలినవారు పారిపోయిరి. ఆజాతిలోని తక్కినవారి నందరిని ఆంగ్లేయులును వారి మిత్రులగు న్యరయిండియనులును ఒక ప్రదేశమునుండి మరియొక ప్రదేశమునకు వెంటనంటి తరుముచు దొరికినవారినెల్ల నరికివేసిరి. వారిలో రెండు వందలమంది శరణాగతులుకాగా వారు బానిసలుగ చేయబడిరి. మిగిలిన పికెడుజాతియంతయు నిర్మూలమయ్యెను. నర్రిగనుసెటుజాతి వారీయుద్ధములో తమతో జేరలేదని వారిరాజగు మైంటోనోమో తమమీాదకుట్రలు పన్నుచున్నాడని ఆంగ్లేయులు నేరారోపణచేసిరి. ఆయన తానేమి చేయలేదనియు తన విరోధియగు మొహాగనుల జానురాజు అబద్ధములు చెప్పినాడనియు నాయన చెప్పెను. ఆంగ్లేయులు మైంటానోమోను విచారణకు తెచ్చి నేరస్థుడని తీర్మానించి మరణశిక్ష విధించిరి. చంపుటకు మొహాగనుల రాజునకు వప్పగింతచేసిరి. మొహాగనులరాజుయొక్క తమ్ముడు మైంటోనోమో తలమీాద నులితో

కొట్టిచంపెను. ఈమైంటోనోమో ఇదివరకాంగ్లేయులకు పరమమిత్రుడుగ నుండెను.

న్యూహాంపుషైరు

1622 సంవత్సరమున కొందరాంగ్లేయులు ప్లిమత్తు సంఘమునుండి దానపట్టాను పొంది యమెరికాకువచ్చి న్యూహాంపుషైరు వలసను స్థాపించిరి.

రోడు అయిలండు.

మెసచుసెట్సు రాష్ట్రములో రోగరువిలియమ్సు అను మతబోధకుడు మనస్సాక్షి ప్రేరేపించిన ప్రకారము ఈశ్వరుని ప్రతివారు నారాధింపవచ్చునని బోధించెను. ఇందుకారాష్ట్రములోని ప్యూరిటను క్రైస్తవులీతనిని బహిష్కరించిరి. రోగరువిలియమ్సు పారిపోయి పదునాలుగు వారములు తిండి విశ్రాంతి యెఱుగక తిరిగెను. ఆంగ్లేయులెవరు నితనికి తావునివ్వలేదు. నర్రగనుసెట్టులను ఎఱ్ఱయిండియనుల జాతివారిప్రభువగు మైంటోనోమో ఈతని నాదరించి యాతిథ్యమిచ్చి విశేష విస్తీర్ణముగల భూమిని దానముచేసెను. ఇందులో నితను నివసించెను. కొలది కాలములో ననేకమంది యాంగ్లేయులిచటకు వచ్చి కాపురముండిరి. దీనికే రోడు అయిలండని పేరు. ఈమైంటోనోమో ప్రభువునే కనెక్టికటు రాష్ట్రపు ఆంగ్లేయులు మరణశిక్ష విధించి చంపించియుండుట మనము చూచియున్నాము. రోడుఅయిలండులో సంపూర్ణ ప్రజాస్వామ్యమును పూర్తియగు మతస్వేచ్ఛయు నెలకొల్పబడెను.

మెసచుసెట్సు వలసనుండి జాన్ఎలియటను ఆంగ్లేయుడు

ఫిలిపురాజాయొక్క యుద్ధము.

ఎర్ర యిండియనులలో క్రైస్తవమతము వ్యాపింపజేయ యత్నించెను. బైబిలును ఎర్ర యిండియనుల భాషలోనికి మార్చెను. ఒక యెర్రయిండియను బి. ఏ. పరీక్షయం దారితేరెను. ఎర్రయిండియనులు నివసించు కొన్నిగ్రామములు క్రైస్తవమతములో చేరెను. కాని మరికొన్ని జాతులకు క్రైస్తవమత వ్యాపన మిష్టముగ లేదు. అదివరకింగ్లీషువారికి స్నేహితులుగనున్న వామ్పనోగు లను ఎర్రయిండియను జాతివారు ఆంగ్లేయులచే సముద్రతీరము వరకును తరుమబడిరి. వారిరాజు మెస్ససాయిటు మరణించెను. అతని కుమారులలో నొకనిని ఆంగ్లేయులు పట్టుకొని చెరసాలలో నుంచినందున అచట దుఃఖము చేత నతడు మరణించెను. మరియొక కుమారుడు ఫిలిప్పు అను పేరుగలవాడు రాజయ్యెను. ఒక ఎర్రయిండియను ఆంగ్లేయుల రహస్యపుగోలుప్రన చేరి తన జాతివారి గుట్టు తెలుపుచుండినందున నాతనిని తనజాతివారు చంపిరి. అతనిని చంపినవారిని ఆంగ్లేయులు పట్టకొని యురిదీసిరి. ఇందుకు ప్రతీకారముగ ఎర్రయిండియను యువకు లాంగ్లేయులపై దండెత్తి ఎనిమిది తొమ్మిదిమంది ఆంగ్లేయులను హత్యగావించిరి. ఫిలిప్పురాజునకిదియు యసమ్మతమే. కాని ఆంగ్లేయులు ఫిలిప్పురాజు యొక్క రాజ్యమును ముట్టడివేసిరి. ఆంగ్లేయులను జయించుటయసంభవమని అతనికిదోచెను. వారము దినములలో వల ఇండియనుల ప్రదేశమునంతను ఆంగ్లేయు లాక్రమించుకొనిరి. చావగమిగిలిన యిండియనులు పారిపోయిరి. ఫిలిప్పురాజు పారిపోయి యితరయిండియను జాతుల శరణుజొచ్చెను.

CRAJ0000601"TEL

ఒకచోటనుంచి మరియొకచోటునకు బోయి యిండియను జాతులనందరను ఆంగ్లేయులపై యుద్ధమునకు లేవదీసెను. మైన్ మొదలు కనెక్టికటువరకున్న జాతు లందరును ఆంగ్లేయులపైకి లేచిరి. మొహాగను జాతివారు మాత్రము వీరితో చేరలేదు. ఒక సంవత్సరమువరకు యుద్ధము భయంకరముగ జరిగెను. ఆంగ్లేయులయొక్క పన్నెండు పదమూడు పట్టణములు నాశనము చేయబడెను. ఆరువందల గృహములు తగులపెట్టబడెను. ఆంగ్లేయులలో నిరువదవవంతు చంపబడిరి. కాని తుదకు ఎర్రయిండియను లోడిపోయిరి. నర్రగనుసెటి జాతివారు నాశనము చేయబడిరి. కొన్ని జాతులవారు తమ ప్రదేశములను ఆంగ్లేయులకు వదలి పారిపోయిరి. ఫిలిపుయొక్క భార్యాపిల్లలు ఆంగ్లేయులకు చిక్కిరి ఫిలిపును వెంబడించి కాల్చి చంపిరి. అతనిశిరమును ఖండించి ఆంగ్లేయ వలసరాజ్యమంతలోను త్రిప్పి ప్రదర్శించిరి. అతనికుమారుని బానిసగ విక్రయించిరి. ప్రప్రథమమున ఆంగ్లేయ యాత్రికులతో స్నేహము చేసిన మెసనోయిటు రాజవంశ మీ విధమున 1676 వ సంవత్సరములో సంతరించెను.

(10)

ప్రజాప్రతినిధి సభలు

ఈపదమూడు వలసరాష్ట్రములును ఆంగ్లేయ రాజునకు లోబడియుండెను. ఆంగ్లేయరాజుల యనుమతితో ప్రజాప్రతినిధి సభలను స్థాపించుకొనెను. ఆంగ్లేయరాజులు గవర్నరులను నియమించిరి. వీటి కుత్తరముననున్న కనడాదేశము ఫ్రెంచిరాజులకు లోబడియుండెను. యూరపుఖండమున తరుచుగా ఆంగ్లేయులకును

ఫ్రెంచివారికిని యుద్ధములు జరుగుచుండెను. అప్పుడు కెనడా దేశ వాసులగు పరాసువారికిని ఈపదమూడు వలసరాష్ట్రములలోని యాంగ్లేయులకును యుద్ధములు జరుగుచుండెను. యూరపులో సంధి జరిగినపుడెల్ల వీరి యుభయుల మధ్యను, సంధి జరుగుచుండెను. అమెరికాలో జరిగిన యుద్ధములలో సాధారణముగ పరాసువారు తమ చుట్టునున్న ఎర్రయిండియనుల సహాయమును పొందుచుండిరి. 1756 మొదలు 1763 వరకు జరిగిన ఏడుసంవత్సరముల యుద్ధములో ఆంగ్లేయులు జయమొందుటయు కనడాదేశము ఆంగ్లేయరాజులకు స్వాధీనమగుటయు పైన చూచియున్నాము.

# అమెరికా

# సంయుక్తరాష్ట్రములు.

## నాలుగవ అధ్యాయము

## ఎఱ్ఱయిండియనులు.

(1)

ఎఱ్ఱయిండియనుల స్థితి.

యూరపుజాతు లమెరికాసంయుక్తరాష్ట్రములకు వచ్చుసరికి అచట ఎఱ్ఱ (తామ్రవర్ణపు) ఇండియనులు కాపురముండిరి. వీరుబొత్తుగ ననాగరికులుగారు. వీరు పల్లెలను పట్టణములను స్థాపించుకొని స్థిరనివాసము గలిగియుండిరి. ఇపుడిల్లినాయిసు రాష్ట్రమేర్పడిన ప్రదేశమున పూర్వ మొక గ్రామమునందే ఏడెనిమిదివేలమంది ఎఱ్ఱయిండియనులు కాపురముండిరని యొక పరాసు మతబోధకుడు వ్రాసియున్నాడు. వీరు వేటాడి జీవించువారును స్థావరములేక తిరుగుచునుండు వారును గాక గ్రామములను. దున్నుకొని జీవించుచుండిరనియు బఠాణీలు మొక్కజొన్న వీరి ముఖ్యమగు నాహారపదార్థము లనియు ఛాంప్లైను వ్రాసియున్నాడు వీరి ఇండ్లచుట్టును చిన్నచిన్నతోటలను వేసుకొనుచుండిరి. ఇపుడమెరికా దేశమున ప్రధానపంట

దినుసులుగనున్న మొక్కజొన్న, పొగాకు, ఈరెండును ఇది వరకే ఎర్రయిండియనులు పండించుచున్నవే. లోహములు వాడుట తెలియక పోయినను వారు పడవలను గృహములను కట్టుకొనుచుండిరి. రాతిగొడ్డలులను కొడవళ్ళను ఉలులను ఉపయోగించిరి. చలికాలమునకై ఫలములను మొక్కజొన్నలను, ఎండబెట్టిన దున్నపోతు మాంసమును పొగచూరబెట్టిన చేపలను కూడబెట్టి దాచుకొనుచుండిరి. చాపలను, బుట్టలను, జాలరులను, చెప్పులను, జనుమునుండి దారమును, ఊసిన తోళ్ళను, మట్టితో పాత్రలను, తయారుచేయుచుండిరి. వారి భాషను వ్రాయనేర్చియుండిరి. దూరప్రయాణమునుచేయుచు ప్రయాణికుల కాతిథ్య మిచ్చుచుండిరి. వీరనేకజాతులుగ విభజించబడి పెద్దపెద్ద రాజ్యములనేర్పరచుకొని యుండిరి. కొన్ని జాతులవారు ప్రజాస్వామ్యములను మరికొన్ని జాతులవారు నిరంకుశ ప్రభుత్వములను కలిగియుండిరి. దాదాపుగ అమెరికాఖండమంతయు నీజాతుల వశమందుండెను. నాటుచేజ హ్యూరన్ పేర్లుగల జాతులవారు తమప్రభువులు సూర్యవంశసంభూతులని నమ్ముచుండిరి. ప్రభువుల అధికారమును సంకుచిత పరచుటకు ప్రజలసభకూడ నుండెను. ఈ ప్రజలసభలో యుక్తవయస్సువచ్చిన అందరుప్రజలును మాటలాడ సర్హులు. స్త్రీలు గృహకృత్యములను చేయుటయేగాక భూములను దున్నుట, పైర్లను ప్రోగుచేయుట మొదలగు వ్యవసాయపు పనులను గూడ చేయుచుండిరి. పురుషులు గృహములను, కోటలను, పడవలను, యుద్ధపరికరములను నిర్మించుచుండిరి. ప్రతిజీవజంతువులోని ప్రాణమును శాశ్వతముగ నుండునని

వారినమ్మకము. కొందరు దున్నపోతు, ఎలుగుగొడ్డు మొదలగు జంతువులను పూజించుచుండిరి. కొందరు సృష్టిలోని శక్తుల నారాధించుచుండిరి.

సృష్టినంతను చేసిన దొక్క యీశ్వరుడే యను నమ్మకముకూడ వారిలో చాలమందికుండెను. వారారాధించు దేవతలకు మనుష్యులను బలియిచ్చుచుండిరి. ఒకమనుష్యుని నెవరైన హత్యకావించినయెడల, హంతకుల చంపి పగసాధించు విధి యాతని వారసులకుండెను. స్నేహము చేసినయెడల మిక్కిలివిశ్వాసపాత్రులుగను, విరోధము సంభవించినచో మిగుల కౄరముగ పగతీర్చుకొనువారుగను నుండిరి. సాధ్యమగు నంతవరకు శత్రువుతో నిలచి యుద్ధముచేయుటయును, తప్పించుకొని అకస్మాత్తుగ శత్రువుమీద పడి చంపి యాతనిశిరస్సును ఖండించి తీసికొనిపోవుటయును, వారి యలవాటు. శత్రువుల స్త్రీలను పిల్లలను పట్టుకొని బానిసలుగ చేయుటయు అట్లు చేయుటకు వీలుగానిచో చంపివేయుటయు వారి యాచారము. మరణమునందు నిర్లక్ష్యమును ఆత్మయొక్క శాశ్వతతత్త్వమునందు నిశ్చయమైన నమ్మకమును, మితమైన జీవితమును విశ్వాసపాత్రమగు ప్రవర్తనయు వారి లక్షణములు. మరణించిన తరువాత వారు పొందెడు స్వర్గములో అందమైన యడవులు ఫలవంతమగు వృక్షములు, మంచి వేటాడు స్థలములు, ఎల్లప్పుడును స్ఫటికజలములతో ప్రవహించునదులు నుండుననియు అక్కడ తమ్ము నాశనముచేయుచున్న తెల్లజాతులవారుండరనియు వారి నమ్మకము" అని జోకినుమిల్లరను గ్రంథకర్త వ్రాసియున్నాడు. చాలజాతులవారికి ఒక్కతప్పమరియేయితర

జంతువును మచ్చికచేసి పెంచుట తెలియకుండెను. కాని యూరపుజాతులు అమెరికాలోనికి గుఱ్ఱములను తెచ్చినతరువాత ఎఱ్ఱయిండియను జాతులందరును గుఱ్ఱములను పెంచుట కలవాటుపడి మంచి గుఱ్ఱపుసవారులైరి. జార్జియారాష్ట్రమునుండి తెల్లవారిచే తరిమివేయబడిన క్రీకులు, చెరోకీలను ఎఱ్ఱయిండియనుజాతులు తక్కినవారికంటెకూడ నాగరికులుగ నుండిరి. వ్యవసాయము వర్తకము చేసికొనుచుండిరి. పశువులను కలిగియుండిరి, స్వభాషలో వ్రాసుకొనుచుండిరి. దీని వలన చాలమంది తెల్లవారు చెప్పునట్లు నిజముగా ఎఱ్ఱయిండియనులు నాగరికతను నేర్పుటకుకూడ వీలులేని మోటవారు కారనియు యూరపియనులు వారినట్టి దుస్థితికి తెచ్చిరనియు స్పష్టపడుచున్నది. ఎట్టిబాధలనైన సహించుటలో ఎఱ్ఱయిండియనులు ఆరితేరియుండిరి. తెల్లజాతులవారితో పోరాటములు సల్పవలసి వచ్చినపుడు నిస్సహాయశక్తినే ప్రదర్శించిరి, జయముపొందుదుమను ఆశనశించి, తనమీదికివచ్చు శత్రువుల సంఖ్యనుగాని బలమునుగాని లక్ష్యముచేయక, ఎఱ్ఱయిండియనులు తాము నాశనమగువరకును అత్యంత పరాక్రమముతో నూరుమంది శత్రువులతో నొకడుచొప్పుననైనను యుద్ధముచేసి, తెల్లవారిచేతులలో మడయుచుండిరి. హిస్పానియోలా వ్రిదేశములలో నివసించిన ఎఱ్ఱయిండియనులు మిగుల సాధువులు. వీరినందరిని నిర్దయతో పేరువురుగైన లేకుండ స్పైనువారు నాశనముచేసి యున్నారు. మెక్సికోలోని ఎఱ్ఱయిండియనులు స్వల్పపోరాటములతో స్పైనువారికి లోబడిరి. ఉత్తరమున నున్న ఎఱ్ఱయిండియను లింగ్లీషు

వారికిని ఒలాందావారికిని ఫరాసువారికిని తేలికగ లోబడలేదు. తాము స్వతంత్రముగ నుండుటకు తుదివరకును ప్రయత్నించి జవాను పట్టుదలతోడను పరాక్రమముతోడను పోరాడిరి. తెల్లవారిలో సామాన్యపురుషులు వారి నెదిరించజాలకపోయిరి. యుద్ధభటులును వారి నోడించలేకపోయిరి. మంచియుద్ధపు టేర్పాట్లను చేసి తుదకు ఎర్రయిండియనుల నందరిని గుంపులు గుంపులుగను ఒకరొకరుగను నీతెల్లజాతులవారు నాశనము చేసిరి.

(2)

యూరపియనులతో సంబంధములు.

ఎర్రయిండియనులకును తెల్లవారికిని ఏర్పడిన సంబంధములను గూర్చి జె. యం. లమలో యను గ్రంథకర్త యిటులవ్రాసియున్నాడు "ఎర్ర ఇండియనులకును తెల్లజాతులకును గల సంబంధములు సాధారణముగ నొకేమాదిరిగ నుండుచువచ్చెను. ముందు క్రొత్తగవచ్చిన తెల్లవారు ఎర్రయిండియనులతో స్నేహముచేసిరి. ఇండియనులును తెల్లవారి నాదరించి యాతిథ్యమిచ్చిరి. అదివరకే తెల్లవారు వచ్చి ఎర్రయిండియనులను కాసనస్వాస్యనకై యెత్తుకొనిపోయియున్న ప్రదేశములలో మాత్రమెర్రయిండియనులు తెల్లవారి కాతిథ్యమివ్వక మిగుల యనుమానముతో చూచిరి. స్నేహము కుదిరినచోట తెల్లవారికిని యెర్రవారికిని యొడంబడికలు, షరతులు జరిగెను. ఒకరి యుద్దేశము రెండవ వారికి సాధారణముగా తెలియదు. తెల్లవారొక విధమునను ఎర్రయిండియను లొకవిధమునను అర్థము చేసిరి. కొద్దికాలము

లోనే ఒడంబడికలు, షరతులు, చెడిపోయి కలతలు ప్రారంభమయ్యెను. దాదాపుగా యెల్లప్పుడును ముందు తెల్లవారే కయ్యమునకు కాలుత్రవ్విరి. ఉభయజాతులవారు నొకరినొకరు నరికికొనిరి. ఉభయులమధ్య యుద్ధముజరిగెను. త్వరితముగనే తెల్లవారికి జయము కలిగెను. చావగమిగిలిన యెర్రయిండియనులు క్రొత్త యొడంబడికలు చేసికొనిరి. వీటియందు యెర్రయిండియనులకు సంపూర్ణముగు ద్వేషమేయుండెను. వీటి యర్థమును యెర్రయిండియనులకు కొంచముగనే తెలిసెను. ఎర్రయిండియనుల దేశమునంతను తెల్లవారాక్రమించి సముద్రతీరము వరకును యచటనొక్కివేసి కొద్ది ప్రదేశమును మాత్రమే ఎర్రయిండియనులు కాపురముండుటకు వదలిరి. ముందిక్కడ యెర్రయిండియనులు విధిలేక ప్రవేశించి కొద్దికాలములోనే తెల్లవారిపై తిరుగుబాటుచేసిరి. ఈతిరుగుబాటులో తెల్లవారిచే యెర్రయిండియనులు చాలవరకు నశించుటయు చావగ మిగిలినవారు బానిసలగుటయు తటస్థించెను. కాని కొన్నిచోట్ల వివిధజాతుల తెల్లవారు సమీపములో కాపురముండి ఒకరితో నొకరు కలహించుకొనుచున్నపుడు మాత్రము తెల్లవారు ఎర్రయిండియనుల గౌరవముగ చూచి వారి సహాయమపేక్షించిరి. ఉభయకక్షిలవారును వారిసహాయము కోరగ కొందరొకవైపునను కొందరు మరియొక వైపునను చేరుటతటస్థించెను. తెల్లవారు సమశత్రువులుగ తెల్లవారిమీదను వారితోచేరెడు యెర్రవారిమీదను తమతోచేరిన ఎర్రవారి నుపయోగించిరి. ఈయుద్ధములలో నీయెర్రవారు చాలమంది మరణించి వీరిజాతులుబల

హీనమయ్యెను. తుదకెవరో యొక తెల్లజాతివారికి జయము కలిగి యీజయముపొందిన తెల్లవారు తరువాత యథాప్రకారము తమ చుట్టునున్న ఎర్రయిండియనులను నాశనముచేసి వారి దేశము నాక్రమించిరి.”

కాని ఎర్రజాతుల విషయమున స్పైన్ వారు, ఫ్రెంచివారు మొదలగు లాటిన్ తెల్లజాతులవారికిని ఇంగ్లాండు జర్మనీ మొదలగు ట్యూటానిక్ తెల్లజాతులవారికిని కొంత భేదము కలదు. స్పైన్ వారు మొదలగు లాటిన్ వారు సామాన్యముగ ఎర్రవారిని లోబర్చుకొని బానిసలుగ చేయుచువచ్చిరి. ఇంగ్లాండు, జర్మనీ మొదలగు ట్యూటానిక్ జాతులవారు ఎర్రయిండియనులను నాగరికతకు శత్రువులనియు నాగరికత నేర్పుటకువీలులేని మోటవారనియు వీలయినంతవరకు దొరికినవారినెల్ల చంపుచు వచ్చిరి. మొదట స్పైన్ వారుకూడ పశ్చిమ యిండియా లంకలలోని కాపురస్తులను నరకివేసి నాశనము చేసియున్నప్పటికిని తరువాత నాపద్ధతిని మానివేసి వారిని బానిసలుగ చేయుచు వచ్చిరి. కావున యిప్పటికిని మధ్య దక్షిణ అమెరికాలలోని స్పైన్ వారి యాధీనమునున్న దేశము లన్నిటిలోను చాలమంది ఎర్రయిండియనులున్నారని పందొమ్మిదవ శతాబ్దమున బానిసత్వపుశృంఖలములు తెగిపోయి వీరలెల్ల వారితో కలసి పోవుచున్నారు. ఇట్లు కలవనిచోట్ల కూడ అమెరికాలోను మెక్సికోలోను నీయెర్రజాతులు నవనాగరికత నవలంబించి స్వతంత్రులగు పౌరులుగనున్నారు. ఉత్తర అమెరికాలోని కెనడాదేశపు కొన్ని ప్రాంతములలో వరానులు యెర్రయిండియనులతో కలిసిపోవుటవలన మిశ్రమ

జాతులేర్పడి యున్నారు. ఇట్లు స్పైను వారును పరాసు వారును సాధ్యమయినంతవరకు ఎఱ్ఱజాతులను చంపక వాని నలుగచేసి విడిచిన కారణము వారవలంబించిన రోమను కాథలిక్కుమతమే. ఎక్కడనైనను ప్రొటెస్టెంటు మతగురువులుఎఱ్ఱ ఇండియనును బాగుచేయ ప్రయత్నించినను అక్కడి తెల్ల ప్రభుత్వములవారు ఇండియనులపై యుద్ధము ప్రకటించుటయు వెంటనే ప్రభుత్వమువారి కోరికపైనీమతగురువులు ఎఱ్ఱయిండి యనులతో జోక్యము వదలుకొనుటయు తటస్థించెను. రోమను కాథలిక్కుమతగురువులట్లుగాక ఎఱ్ఱ ఇండియనుల నందరిని క్రైస్తవులుగ చేయుచ వచ్చిరి. స్పైను వలసరాజ్యముల లోను పరాసుల వలస రాజ్యములలోను ఎఱ్ఱయిండియనుల నందరను ఏదోవిధముగ క్రైస్తవులుగచేసిరి. వీరినిక్రైస్త వులుగచేయుటకు తెల్ల మతగురువులచే యవలంబింపబడిన పద్ధతులు యోగ్యమయినవి గాకపోవచ్చును. క్రైస్తవులయిన ఎఱ్ఱ యిండియనుల ప్రవర్తన క్రైస్తవధర్మములకు తగినటుల లేకపోయి యుండవచ్చును. కాని వారందరును క్రైస్తవ మతమును స్వీకరించి యభివృద్ధిని గాంచిరి. ఆంగ్లేయ వలస రాష్ట్రమగు న్యూ యింగ్లాండులో సెబాస్టియను రాసిలను అను పరాసు రోమనుకాథలిక్కు మతగురువు అబినాకిను అను నొక ఎఱ్ఱయిండియనుల గ్రామమున నివాస మేర్పరచుకొని అచటి ఎఱ్ఱయిండియనులను క్రైస్తవులుగ జేసి వారికొక ప్రార్థనాలయమును స్థాపించి ప్రజానురంజకుడై చుట్టుపట్టుల నున్న ఎఱ్ఱయిండియనులలో క్రైస్తవమతమును వ్యాపింప చేయుచుండెను. 1725 వ సంవత్సరమున న్యూ యింగ్లాండు

రాష్ట్రపు ఆంగ్లేయ ప్రభుత్వమువారు ప్రతి యెర్రయిండియను పుర్రెకును నూరు షిల్లింగులుచొప్పున బహుమాన మిచ్చెద మని ప్రకటింపగ నారాష్ట్రములోని ఆంగ్లేయుల జట్టొకటి బయలుదేరివచ్చి యాగ్రామముమీద పడి దోచుకొని తగుల బెట్టి క్రైస్తవ దేవాలయమును మంటలకాహుతిచేసి ఎర్ర యిండియనులను చంపి పుర్రెలుతీసుకొని పోవుటయే గాక యామతగురువును శరీరములో ననేక పోటులు పొడిచియు తల పగులగొట్టియు క్రూరముగ హత్యగావించి నోటిలోను కండ్లలోను మట్టిగొట్టి పోయిరి.

సంయుక్తరాష్ట్రములలో 1763 వ సంవత్సరమువరకు ఎర్రయిండియనులు మిస్సిసిపీనదీ ముఖప్రాంతమునను సెంటు లారెన్సు కిరుప్రక్కలను టెనెస్సీలోయలోను, ఎరీ, హ్యూరన్, సరస్సులప్రక్కలను ఇంకను మిగిలియున్నారు. తక్కినవారు నాశనమయినారు. 1763 కు తరువాత నీప్రాంతములన్నియు తెల్లజాతులచే నాక్రమింపబడి ఎర్రయిండియనుల దృశ్యులై పోయిరి.

# అమెరికా

# సంయుక్త రాష్ట్రములు.

## అయిదవ అధ్యాయము.

## స్వతంత్ర యుద్ధమునకు కారణములు.

ఓడవర్తకమును గూర్చిన శాసనములు

ఉత్తర అమెరికా వలస రాష్ట్రముల వారాంగ్లేయ దేశమునందు భక్తిగలిగి యాంగ్లేయ దేశగౌరవమును సంరక్షించుటకును తమ ప్రదేశములను విస్తరింప చేసికొనుటకును యుద్ధములు చేయుటకెప్పుడును సంసిద్ధులుగ నుండిరి. కాని తమహక్కులకు భంగముకలుగ చేసినపు డాంగ్లేయ రాజును ఆయిన ప్రతినిధుల ధిక్కరించుటకును నొకప్పుడు తిరుగబాటులు చేయుటకును వెనుదీయకుండిరి. స్వాతంత్ర్య యుద్ధమునకు పూర్వము చాలకాలమునుండియు నింగ్లాండునకును వలసరాష్ట్రములకును కొన్ని కలతలు కలుగుచునే యుండెను. ఇంగ్లాండు ప్రభుత్వమువారు పదునేడవ శతాబ్దపు మధ్యభాగము నుండియు (నావిగేషన్ ఆక్ట్సు) ఓడవర్తకమును గూర్చి చేసిన శాసనముల వలన నీ వలస రాష్ట్రముల వారికి మిక్కిలి యసంతృప్తి కలిగినది. ఇంగ్లాండు ప్రభుత్వమువారు వలస

రాష్ట్రము లింగ్లాండునకు ఎగుమతిచేయుసరుకుల నింగ్లీషు యోడలలోనే పంపవలెనని ప్రథమమున 1652 సంవత్సరమున చట్టముచేసిరి. తరువాత వలసరాజ్యముల వారు ఏదేశముతో వర్తకము చేసినను ఎగుమతి దిగుమతియగు సరకులన్నియు నింగ్లీషు వారిచే నడుపబడు నింగ్లీషు యోడలలోనే రాకపోకలు చేయవలెనని 1664 సంవత్సరమున మరియొక శాసనమును చేసిరి. ఇంగ్లాండు దేశముద్వారా తప్ప సరాసరి యూరపు ఖండములోని ఏదేశమునుండియు సరుకులను కొనకూడదనియు నాంగ్లేయులు తప్ప విదేశీయు లెవరును నీ వలసరాష్ట్రములలో వర్తకులుగ నుండకూడదనియు 1662 వ సంవత్సరమున నింకొకచట్టముగావించిరి.

ఎగుమతి దిగుమతి పన్నులు.

ఆంగ్లేయ ప్రభుత్వమువా రింతటితో నూరుకొనక వలసరాష్ట్రములలో నొకదానినుండి మరియొకదానికి ఎగుమతియగు పంటదినుసులమీదకూడ పన్నులువిధించి వలసరాష్ట్రములలో ఫలించు ముఖ్యపంట దినుసుల నింగ్లాండునకుతప్ప మరి యేదేశమునకును నెగుమతి చేయకూడదని నిషేధించిరి. ఈచట్టములవలన వలసరాష్ట్రముల కన్నిటికిని అపారమగు నష్టముకలిగెను. ఇష్టమువచ్చిన దేశములలో చౌకగాకొని ప్రియముగా అమ్ముకొను వర్తకస్వేచ్ఛ నశించినది. వలసరాష్ట్రములు కొన్ని ఈచట్టములను తిరస్కరించి ప్రవర్తించసాగెను. మెసచూసెట్సు రాష్ట్రమువారీ చట్టములను పదిసంవత్సరములవరకు శాసనములలో పెట్టుటకు నిరాకరించిరి. ఈరాష్ట్రపు ప్రతినిధిసభవారు తమ రాష్ట్రమునకు నష్టకరమగునట్టియు తాముచేయు

న్యాయమగు చట్టములకు వ్యతిరేకమయినట్టియు ఎట్టిశాసనము లైనను ఇంగ్లాండు రాజుగాని ఆంగ్లేయ (పార్లమెంటు) ప్రజా ప్రతినిధిసభవారుగాని చేసినయెడల దానిని తిరస్కరించెదమని ప్రకటనము గావించిరి. కాని 1688 సంవత్సరము వఱకీవలస రాజ్యములన్నిటిలోను కలసి రెండు లక్షలకన్న ఎక్కువప్రజలు లేరు. బలహీనమగు స్థితిలోనుండి బలవంతమగు నింగ్లాండుతో పోరాడలేకుండెను. కావుననెంత యసంతృప్తిని యాగ్రహమును వెలిబుచ్చినను ఆంగ్లేయప్రభుత్వమువారి యుత్తరవులకు లోబడక తప్పినదికాదు. 1679 సంవత్సరమున "వలస రాష్ట్రములోని ఘనత వహించిన రాజగారి ప్రజలహక్కులకును స్వాతంత్ర్యములకును నీవర్తక చట్టములు భంగకరముగ నున్నవనియు ఆంగ్లేయ పార్లమెంటు (ప్రతినిధిసభ)లో నీవలస రాష్ట్రపు ప్రతినిధులు లేరు గావున వారుచేయు శాసనములు అమెరికావారిని బద్ధులను చేయజాలవనియు మెసచుసెట్సు వలసప్రభుత్వమువారు ప్రకటించుచు, తాము ఇంగ్లీషువారుచేసిన చట్టములను చేసి వాటిని అమలులో బెట్టిరి. ఆంగ్లేయప్రభుత్వమువారీ యధికార ధిక్కారమునకు సహించక యుత్తర వలసరాష్ట్రములన్నిటి యొక్కయు హక్కుల దానశాసనములను రద్దుపరచి న్యూయింగ్లాండు సామ్రాజ్యములో చేరిన మెసచుసెట్సు, కనెక్టికటు, న్యూహాంపుషైరు, రోడుద్వీపముల రాష్ట్రములమీద సర్ ఎడ్మండు ఆండ్రాసను నాయనను నిరంకుశముగ పాలించుటకు గవర్నరుగ నియమించి పంపిరి. న్యూయార్కు రాష్ట్రముకూడ నీయన క్రిందనే చేర్చబడెను. ఈరాష్ట్రములలోని ప్రజాప్రతినిధి

సంఘములు తీసివేయబడెను. మూడుసంవత్సరముల కాలము మరియీనిరంకుశ ప్రభుత్వమున కీరాష్ట్రములన్నియు లోబడెను. న్యూయింగ్లాండురాష్ట్రములు కలపించి యొక ప్రతినిధిసభను నొక గవర్నరును (రాష్ట్రపాలకుని) ఎన్నుకొనిరి. కాని వీరెన్నుకొనిన రాష్ట్రపాలకుని ఆంగ్లేయప్రభుత్వమువారు రాజద్రోహ నేరముక్రింద పట్టుకొని విచారించి యురితీసి ప్రజాప్రభుత్వమును విచ్ఛేదముచేసిరి. ఈయనను ప్రజాస్వాతంత్ర్యముకొరకు ప్రాణములర్పించిన ధీరునిగ ప్రజలుగౌరవించి ఆయన వస్త్రపుముక్కలను జ్ఞాపకమునకై దాచుకొనిరి. ఈకలతలలో వలసరాష్ట్రములు లోబడినను దీనిలోను రాబోవు స్వాతంత్ర్యయుద్ధములోను నిమిడియున్న సిద్ధాంతము లొకటే మాతృదేశము వలసరాష్ట్రముల ప్రభుత్వముతోను వారి వ్యక్తపు స్వేచ్ఛతోను జోక్యము కలుగజేసుకొనవచ్చునా కూడదాయను విషయమే ముఖ్యమైనదిగ నున్నది.

1688 సంవత్సరమున నాంగ్లేయదేశములో విప్లవము జరిగి రెండవ జేమ్సురాజును దేశభ్రష్టునిచేసి విలియంరాజును మేరీరాణిని పాలకులను చేసికొనిరి. ఈసమయమున నీవలస రాష్ట్రములు తిరుగబాటుచేసి తమ రాష్ట్రపాలకుడగు సర్ ఎడ్మండు ఆండ్రాసనును వెడలగొట్టి ప్రజాప్రతినిధి సభలను స్థాపించుకొని విలియంరాజునకును మేరీరాణికిని తమ రాజభక్తిని ప్రకటించినవి. ఆంగ్లేయదేశములోని ప్రభుత్వ తొందరల వలన వారు చూచిచూడనట్లూరకొనిరి. మరియొకగవర్నరును పంపిరి. మెసచుసెట్సు రాష్ట్రమువారు హక్కుల దానశాసనమును తిరిగియిమ్మని కోరినపుడు ఆంగ్లేయప్రభుత్వమువారు

పంపెడి గవర్నరువలననే ప్రధానోద్యోగులు నియమింపబడ వలెనను నిబంధనను చేసి మరియిచ్చిరి.

1713 సంవత్సరమున జరిగిన ఉట్రెక్టు సంధివలన ఇంగ్లాండుతోనే గాక స్పెయిన్ దేశముతోను వారి వలసరాష్ట్రములతోను కూడ వర్తకము చేసుకొనవచ్చునని యొడంబడిక జరిగెను. దీనివలన కొంత స్వేచ్ఛ కలిగెను. దీనిచాటున నీయమెరికా వలసరాష్ట్రములు యూరపుఖండములోని ఇతర దేశములతో కూడ వర్తకము చేసుకొనసాగిరి. కొంతకాలము ఆంగ్లేయప్రభుత్వమువారు సహించి యూరకొనిరి. ఆ కాలమున ఆంగ్లేయ రాజ్యమునకు ప్రధానమంత్రిగనున్న సర్ రాబర్టు వాల్పోలున కీటులయిన నీవలసరాష్ట్రములవారి వర్తకము వృద్ధియగుటయే యిష్టముగనుండెను.

(2)

పరిశ్రమల అభివృద్ధి కాటంకము

కాని కొద్దికాలములోనే తిరిగి కలతలు ప్రారంభమయ్యెను. వలసరాష్ట్రములలోని పరిశ్రమల యభివృద్ధి యాంగ్లేయ ప్రభుత్వము వారికి భంగము కలిగించెను. ఈ వలసరాష్ట్రములు ఇంగ్లాండుమీద నాధారపడక స్వతంత్రముగ నుండుట తమకిష్టములేదని ఆంగ్లేయ పార్లమెంటు (ప్రజాప్రతినిధి సభ) వారు తీర్మానించి వలసరాష్ట్రములలోని పరిశ్రమలను నిరుత్సాహపరచుటకు నిశ్చయించిరి. 1732 వ సంవత్సరమున నొక వలసరాష్ట్రమునుండి మరియొక వలసరాష్ట్రమునకు టోపీలు ఎగుమతి కాకూడదని నిషేధించిరి. ఇనుపపని పరిశ్రమ లేమియు వలసరాష్ట్రములలో చేయకూడదని యుత్తరువు

చేసిరి. వెనుకటి యోడవర్తకపు శాసనములన్నియు తిరిగి అమలులో బెట్టిరి. ఆసియా ఖండమునుండియు ఆఫ్రికా ఖండమునుండియు బియ్యము, పంచదార మాత్రము తెప్పించుకొనవచ్చుననియు తక్కిన ఏవిధమయిన వర్తకమును ఆంగ్లేయ దేశముతో తప్ప మరియే దేశముతోను చేయకూడదనియు శాసించిరి. ఈ రాష్ట్రములలోనికి దిగుమతియగు సారాయముల మీదను పంచదారమీదను సుంకముుు విధించిరి. వీరి కలపవర్తకమునకు పెక్కు ఆటంకములను కలుగజేసిరి దీనివలన నీవలసరాష్ట్రముల ప్రజలలో మితిలేని యసంతృప్తి కలిగెను. మాతృదేశమువారు తమ వర్తకాభివృద్ధి కభ్యంతరము కలుగచేయుచున్నారనియు, తమ యిష్టమునకు వ్యతిరేకముగ తమమీద పన్నులువిధించుచున్నారనియు, నక్రమమగుచట్టములను తమమీద చేయుచున్నారనియు, వలసరాష్ట్రములవారు మాతృదేశముమీద నేరారోపణ చేయుచుండిరి. వలసరాష్ట్రముల ప్రజలు పొగరుబోతులుగను కృతఘ్నులుగను తుంటరులుగ నున్నారనియు, మాతృదేశముయొక్క సంరక్షణ క్రింద వృద్ధిచెంది యిప్పుడు తమసంరక్షకుని కూలద్రోయుటకు సిద్ధముగనున్నారనియు నాంగ్లేయ ప్రభుత్వమువారు చెప్పుచుండిరి. ఉభయులమధ్య మనస్పర్థలు హెచ్చుచుండెను.

బలవంతమగు సైనికకొలువు

కలతకు మరియొక కారణము కలిగెను. ఆంగ్లేయ యుద్ధనౌకలు వలసరాష్ట్ర తీరములకు వచ్చినపుడు ఆంగ్లేయ నౌకాసేనాధిపతులు మనుష్యు లవసరమయినచో వలసప్రజలను బలవంతముగా తీసుకొనిపోయి తమ కొలువులో చేర్చుకొనుచుండిరి.

ట్టియధికార మింగ్లీషు ప్రభుత్వమువారు వారికిచ్చిరి. వలస రాష్ట్రములవారు దీనికాగ్రహించుచు వీలయినపు డాంగ్లేయ నౌకాసేనాధిపతుల నెదిరించి తమ మనుష్యులను విడిపించు కొని తెచ్చుకొనుచుండిరి.

గవర్నరుల జీతములు.

ఆంగ్లేయ ప్రభుత్వమువారిచే పంపబడిన గవర్నరు లీవలసరాష్ట్ర ప్రజలమీద నాధారపడి యుండుటకై ప్రతిసంవత్సరమును వారి జీతములను వలస ప్రజాప్రతినిధిసభలు తీర్మానించుచుండిరి. ఇట్లుగాక వారికి నిర్ణయమైన జీతములను ప్రతినిధిసభల తీర్మానమునకు సంబంధములేకుండ చేయవలెనని యాంగ్లేయప్రభుత్వమువారు తలచిరి. వలసరాష్ట్రములలోనికి దిగుమతి యయ్యెడి సరకులమీద ఆంగ్లేయప్రభుత్వము పన్నులు విధించినను ఇక్కడ సుంకమును వసూలుచేయు యుద్యోగస్థులు వలసవారలైనందున సుంకమును వసూలు చేయకుండగనే నూటికి తొంబదిపాళ్ళు దొంగతనముగా విడిచిపెట్టుచున్నారనియు దీనికేమైన ప్రతీకారము చేయవలెననియు కూడ నాంగ్లేయ ప్రభుత్వము యోచించుచుండెను

వీటికి ప్రతీకారముగ 1763 వ సంవత్సరమున నాంగ్లేయప్రభుత్వమువారు "అమెరికాలోని రాజుగారి ప్రజలయొక్క సంరక్షణకొరకొక (రెవిన్యూ) పన్నును వారిమీద వేయుట న్యాయమును అవసరమును నై యున్నద"ని తీర్మానించి సారాయములు మొదలగు వివిధసరకుల యమ్మకముమీదను ఎగుమతి దిగుమతులమీదను పన్నులను విధించిరి. ఈపన్నులలో నుండి తాము నియమించెడి (గవర్నరులు) రాష్ట్ర

పాలకులు, న్యాయాధిపతులు మొదలగు నుద్యోగులను తామునిర్ణయించిన జీతముల నివ్వవలెననియు నీయుద్యోగస్థు లాంగ్లేయప్రభుత్వమువారి యిష్టమున్నంత కాలము మాత్రమే యుద్యోగములో నుందురనియు శాసించిరి. మరియు సీమనుండి ఖర్చుచేసి ఇరువది పటాలములను నిలుపుట కు నేర్పాటుచేసిరి.

వలసరాష్ట్రప్రజలీ పన్నులకును నీయేర్పాటులకును తమ యసమ్మతిని ఖండితముగ దెలిపిరి. కాని

ప్రాతినిధ్యములేనిది పన్నులు వేయ వీలు లేదు.

చేయునది కనపడక కొంతకాలము లోబడిరి. అప్పటివరకు వారుకోరినది యాంగ్లేయప్రజా ప్రతినిధి (పార్లమెంటు) సభలో తమకుకూడ ప్రాతినిధ్య మివ్వవలసినదని మాత్రమే. తమ ప్రతినిధులులేనిది ఆంగ్లేయ పార్లమెంటువారు చేసెడి చట్టములును వేసెడిపన్నులును తమను బద్ధులనుగా చేయనేరవని వారివాదము. "ప్రాతినిధ్యము లేనిది పన్నులు వేయ నర్హతలేదని వారిసిద్ధాంతము. ఇంకను ఇంగ్లాండునుండి స్వతంత్రమును పొందుదమను భావము వారిలో కలుగలేదు. బాస్టన్‌పట్టణములోని సుప్రసిద్ధ న్యాయవాదియగు జేమ్సు ఓటిసు "ఆంగ్లేయదేశములోని పార్లమెంటునకు వలస రాష్ట్రములు ప్రతినిధుల నెన్నుకొని పంపనిది వీరిమీద పన్నులు వేయుటకు నాంగ్లపార్లమెంటునకెట్టి యర్హతయు నుండనేరదని యొక కరపత్రమును ప్రచురించెను. బాస్టన్‌పట్టణములోని బహిరంగసభలో "బ్రిటిషు పౌరసత్వపు హక్కులను మేము కోరుచున్నాము. వారిచ్చిన హక్కుల దానశాసనములను బట్టికాదు ఈ దానశాసనములు పట్టికాగితములకంటె

యెక్కువ విలువలేనిది గాని మేము ఆంగ్లేయులతో సమాన ముగా పుట్టినందున మేము సమానహక్కులనే కోరుచున్నా ము.” అని సామ్యూయల్ ఆడమ్సను నాయన చెప్పెను.

ప్రజాభివృద్ధి

వలసరాష్ట్ర ప్రజలు బహు త్వరితముగా సంఖ్యయందు అభివృద్ధిచెందిరి. యూరోపుఖండములోని వివిధ దేశముల ప్రభుత్వములవారా కాలమున తాము వలంబించిన క్రైస్తవమతశాఖకులప్ప నితరశాఖల నవలంబిం చిన ప్రజలను పెక్కువిధముల హింసించుచుండిరి. ఈ విధ ముగా బాధలనొందుచుండిన వారు యీ అమెరికా వలస రాష్ట్రములలో ఆశ్రయమునకు వచ్చుచుండిరి. ఈ రాష్ట్ర ములలో సంపూర్ణమగు మతస్వేచ్ఛ కలిగియుండెను. రోమను కాథలిక్కులు, ప్రొటెస్టెంటులు, ప్యూరిటనులు, ఎపిస్కోపన లలు, క్వేకరులు, ప్రెస్బిటేరియనులు, బాప్టిస్టులు, లూథరులును మొరేవియనులు మొదలగు క్రైస్తవ మతములోని వివిధ శాఖల వారును వివిధ తెల్లజాతులకు చెందినవారును సంపూ ర్ణమగు మత సహనముతోడను తమయిచ్ఛవచ్చిన రీతిని యీ శ్వరు నారాధించు మతస్వేచ్ఛతోడను భ్రాతృభావముతో తమ రాష్ట్రముల యభివృద్ధికై కృషిసల్పుచు ఐకమత్యము గలిగి నివసించుచుండిరి. మరియు నీక్రొత్త దేశములలో ద్రవ్య మును సంపాదించి మంచిస్థితిని పొందుటకును చాలామంది వచ్చుచుండిరి. మొత్తముమీద యింగ్లాండునుండి వలస వచ్చినవారే చాలా యెక్కువగ నుండిరి. కావుననే యీ రాష్ట్రము లింగ్లాండునకు లోబడియుండినవి. 1760వ సంవత్సరము వరకీరాష్ట్రముల జన సంఖ్య ఇరువది లక్షలవరకు పెరిగెను.

స్వాతంత్ర్య యుద్ధమునాటికి ముప్పదియైదు లక్షలు. ఈ రాష్ట్రముల వారు వ్యవసాయమువలనను వర్తకములవలనను చాలధనము నార్జించుచుండిరి. కొద్ది కాలములో మిక్కిలి ధనవంతులైరి. జార్జియా రాష్ట్రముయొక్క వరిపొలములను కారొలీనా రాష్ట్రముల నీలిమందు భూములను వర్జీనియాయొక్క పొగాకు తోటలను దున్నుటకు అయిదు లక్షల నల్ల (నీగ్రో) బానిసలను నియమించిరి. పాఠశాలలను స్థాపించుకొని చక్కగా పిల్లలకు విద్య చెప్పించుకొనుటలో న్యూ ఇంగ్లాండు రాష్ట్రముల వారు మార్గదర్శకులైరి. తక్కిన వారు వారిననుసరించిరి. విద్య, ధనము, సౌఖ్య వృద్ధి అయిన కొలదియు నీరాష్ట్రముల ప్రజలలో స్వాతంత్ర్యమునందు స్పృహదల హెచ్చెను.

(3)

స్టాంపు పన్నులు.

1764 వ సంవత్సరము [illegible] నెలలో ఇంగ్లాండు ప్రధానమంత్రి గ్రెన్విలు అమెరికా వలసరాష్ట్రములలో కూడ స్టాంపు పన్నులు వసూలు చేసెదమని తెలియపరచెను. ఈపన్నులను విధించవలదని ఆరు రాష్ట్రముల ప్రజాప్రతినిధి సభలనుండి అర్జీలను పంపుటయే గాక వారి తరఫున కొందరు ప్రతినిధుల నింగ్లాండునకు రాయబారముకూడ నంపిరి. అట్లు వెళ్ళిన రాయబారులలో సుప్రసిద్ధుడగు బెంజమిన్ ఫ్రాంక్లిను ముఖ్యుడు కాని వీరి రాయబారములకును అర్జీలకును పెడచెవిని బెట్టి 1765 సంవత్సరము మార్చి 22 వ తేదీన నాంగ్లేయ ప్రభుత్వము వారొక స్టాంపు చట్టమును చేసిరి. దీనిలో నరువదిరెండు శెక్షనులు గలవు.

నలుబదినాలుగు పన్నులను విధించిరి. ఆరణావుకు మించని కరపత్రముమీదను పత్రికమీదను అనుపెన్ని పన్ను మొదలు న్యాయవాదుల పట్టాలమీద వది సవరనులవరకును వివిధము లగు స్టాంపుపన్నులను విధించినది.

దీనితో నీవలసరాష్ట్ర ప్రజలలో గొప్పకలవరము పుట్టినది. "స్వాతంత్ర్యసూర్యుడ స్తమించెను" నిపాట్రిక్లీను చెప్పెను. "విధేయతతోను మాటలాడ కుండగను

వలస రాష్ట్రముల అసమ్మతి.

ఆంగ్లేయ ప్రభుత్వమువారి యాజ్ఞలను శిరసావహించుట మా కర్తవ్యము"ని ఓటిను నడివెను. కాని యావనులు లోబడుట కొప్పుకొన లేదు. నిరాశను చెందలేదు. వర్జీనియా రాష్ట్ర ప్రతినిధి సభలో యువకుడగు పాట్రికుహెన్రియను సభ్యుడు వలస రాష్ట్రముల వారిమీద పన్నులు వేయుట కాంగ్లేయ పార్లమెంటువారి కెట్టి హక్కు... చేసిన [illegible] తీర్మానముల నామోదింపజేసెను. ఆయన యుపన్యాసములోని యొకవాక్యము సాధారణముగ స్మరింపబడుచుండును. "సీజరునకు బ్రూటస్ గలడు. మొదటి చార్లెసు రాజునకు క్రామ్‌వెల్ గలడు. మరియు మూడవ జార్జిరాజు .." అని ఆయన చెప్పుచుండగ రాజద్రోహము రాజద్రోహమని నలువైపులను ధ్వనులు చెలరేగెను. అందుమీద "మరియు మూడవజార్జి రాజు వారి యుదాహరణములను చూచి నేర్చుకొనునుగాక" అని ఆయన యుపన్యాసమును ముగించెను. సీజరును బ్రూటసు, మొదటిచార్లెసు రాజును క్రాంవెలును హత్యగావించిరి. అందువలననే రాజద్రోహమను కేకలు వేయబడినవి. వర్జీనియా ప్రతినిధి

సభలో చేయబడిన తీర్మానములవంటి తీర్మానములనే న్యూయార్కు, మెసచూసెట్సు, మొదలగు రాష్ట్రములచే కూడ చేయబడినవి.

స్టాంపు చట్ట బహిష్కరణ

స్టాంపుచట్టము నవంబరు నెలలో అమలులోనికి తేబడనున్నది. కావున మెసచూసెట్సు ప్రతినిధిసభవారు అక్టోబరులో న్యూయార్కు పట్టణమున నొక (కాంగ్రెసను) దేశీయ మహాసభ జరుగునట్లు ఏర్పాటులు చేసిరి. కొంతకాల మాలోచించి మెసచూసెట్సువారి యాహ్వానమును దక్షిణ కారొలీనా రాష్ట్ర ప్రతినిధిసభవారంగీకరించిరి. క్రమకాలములో తక్కిన రాష్ట్రములును దేశీయ మహాసభకు వచ్చుటకు సమ్మతించెను. ఈ లోపున ప్రజలలో నాందోళనము వ్యాపించెను. ఆగష్టు నెలలోనే బొస్టను పట్టణ ప్రజలు ఆంగ్లేయమంత్రి బూటుప్రభువు యొక్కయు బొస్టనులోని స్టాంపులనమ్ముట కేర్పడిన ఆలివరు యొక్కయు బొమ్మలనుచేసి పగలంతయు వ్రేలాడదీసి రాత్రి వేళ కాగడాల వెలుతురుతో ఆబొమ్మలను శవములవలె మోసుకొని "స్వాతంత్ర్యము ఆస్తి కావలెను. స్టాంపులు కూడదు" అని కేకలువేయుచు వీధులవెంట నూరేగించి జనుల గుంపులు సంతోషముతో కోలాహలము చేయుచుండగ తగులబెట్టిరి. అప్పుడు కట్టబడుచున్న స్టాంపుల కచ్చేరిమీదపడి కూలద్రోసి నేలమట్టముగాచేసి సామానులను తగులబెట్టిరి. ఆలివరు యొక్క ఇంటి కిటికీలను బ్రద్దలుకొట్టిరి. ఆలివరు కొద్ది దినములలో తన ఉద్యోగమునకు రాజీనామా నిచ్చెదనని ప్రకటించెను. కొలది దినములలోనే పలుచోట్ల అల్లరులు జరిపి

(గవర్నరు) రాష్ట్రపాలకుడగు హచిన్‌సన్ యొక్క గృహమును దోచుకొనిరి. అల్లరిచేసిన కొందరిని ఆంగ్లేయ యుద్యోగస్థులు పట్టుకొనిరి. ప్రజలు వచ్చి బలవంతముగ విడిపించుకొని పోయిరి. ఇందు కెవరిని శిక్షింపలేక పోయిరి. న్యూహాంప్‌షైరు, న్యూజర్సి, న్యూయార్కు, పట్టణములలోని స్టాంపు మేస్టర్లు (స్టాంపుల యొక్క ఉద్యోగీయులు) తమంతటతామే తమ పదవులను త్యజించిరి. మేరీలాండు, పెన్సిల్వేనియా, రోడు అయిలండు, కనెక్టికటులలోని స్టాంపుల యుద్యోగస్థులు ప్రజల భయమువలన రాజీనామాలనిచ్చిరి. ఈ గవర్నరులను స్టాంపుల యుద్యోగి రాజీనామా నివ్వనందున అయిదు వందల మంది రయితులు కర్రలతో వెళ్ళిముట్టడించిరి. అతను లొంగి రాజీనామానిచ్చెను.

వట్టి అల్లరులతోనే నిరాందోళనము ముగియలేదు.

[illegible]మహాసభ

బాస్టనులోని యొక పత్రిక "ఉత్తర అమెరికాలో స్వేచ్ఛ మరణించినదనియు స్వాతంత్ర్యమను నొకకుమారుని వదలిపెట్టి పోయినదనియు, ఇది యౌవనవయస్సు వచ్చిన ప్రతివారియొక్క ఆశయమనియు" వ్రాసెను. స్వాతంత్ర్యమనగ నింగ్లాండుతో సంబంధములేనిని స్వాతంత్ర్యము. న్యూయార్కులోని మరియొక పత్రిక "చేరుము, లేనిచో మరణించుము" అని వ్రాసెను. అక్టోబరు 7 వ తేదీన న్యూయార్కు పట్టణమున నిదివరకేర్పాటు జరిగిన ప్రకారము పలువ రాష్ట్రముల దేశీయ మహాసభ (కాంగ్రెసు) సమావేశమయ్యెను. మెసచుసెట్సు రోడుఅయిలండు కనెక్టికటు న్యూయార్కు, న్యూజర్సి, పెన్సిల్వేనియా, డెలవేరు, మేరిలాండు,

సౌతుకారొలీనా అను తొమ్మిది రాష్ట్రముల నుండియు ప్రతిని ధులు వచ్చిరి. ఆంగ్లేయ రాజునకొక అర్జీని ఆంగ్లేయ పార్లమెంటునకొక మహజరును తయారుచేసి పంపిరి. వాటిలో తమకు ఆంగ్లేయ ప్రభుత్వము వారిచ్చిన దానశాసనముల సంగతి యుదాహరించలేదు. తమహక్కులను వాటిమీద నాధారపరచ దలచలేదు. సహజమైన మానవహక్కుల మీద నాధారపడదలచుకొనిరి. ఆంగ్లేయ పార్లమెంటులో తమకు ప్రాతినిధ్యము కావలెనని కోరలేదు. పదునైదు వందల మైళ్ళదూరమున నుండి అధికసంఖ్యాకులగు నాంగ్లేయ ప్రతినిధులచే నిండిన పార్లమెంటులో తమకు కొంత ప్రాతినిధ్యమున్నను ప్రయోజనములేదని యెంచిరి తామాంగ్లేయ ప్రభుత్వమునకు లోబడియే యున్నామని యొప్పుకొనిరి. కాని తమ యిష్టము లేనిది తమమీద పన్నులు వేయుట కాంగ్లేయ ప్రభుత్వమునకు హక్కు లేదని ఘంటాపథముగ ప్రకటన. ప్రదేశ ప్రజల మీద నయినను వారి యనుమతిలేనిది వారిమీద పన్నులు వేయుటకెవ్వరికిని హక్కు లేదను సామాన్య సిద్ధాంతమునే నాధారపరచుకొనిరి.

స్టాంపుల చట్టము రద్దుపడుట.

అక్టోబరు 31 వ తేదీన కోల్డను మొదలగు నాంగ్లేయ రాష్ట్రపాలకు లెల్లరు మరుసటి దినమునుండియు స్టాంపుచట్టము నమలులో పెట్టుదుమని ప్రమాణములు గావించిరి. కాని నవంబరు మొదటి తేదీన వలసరాష్ట్రము లన్నిటిలో నొక స్టాంపుల నమ్ము యుద్యోగియైన లేడు. ఒకస్టాంపయినను కంటికగుపడలేదు. ఆదినము ననేక పట్టణములలో ప్రజల యూరేగింపులు జరిగి

స్టాంపుల చట్టమును నూరేగించి తగులబెట్టుటనుగాని భూమిలో పాతిపెట్టుటనుగాని జరిపిరి. కొన్నిచోట్ల ప్రజలు స్వాతంత్ర్య విగ్రహము నొకదానిని తయారుచేసి అది మరణించినట్లు శవముగ పరుండబెట్టి యూరేగించి దానిని సమాధిలో పాతిపెట్టి "స్వాతంత్ర్యము పునర్జీవమును పొందిన" దని కేకలువేయుచు సమాధిలోనుంచి బయటకు తీయుచు వచ్చిరి. స్టాంపుల నమ్మువారియొక్కగాని కొనువారియొక్కగాని గతి ఏమగునో జాగ్రత్తగా నాలోచించుకొమ్మని బోస్టనులోని బజారులలో కరపత్రములను పంచిపెట్టిరి. డిశంబరు 17 వ తేదిన ఆలివరును తీసుకొనివెళ్ళి యొకవృక్షము క్రింద రాజీనామామీద సంతకముచేయించి యావృక్షమునకు స్వాతంత్ర్యవృక్షమని పేరు పెట్టిరి. అమెరికాలో నెప్పటికిని స్టాంపుచట్టము నమలులో పెట్టుటకు తోడ్పడనని ఆయనచే నొక గౌరవ దండనాధికారి (ఆనరరీ మేజస్ట్రీటు) ఎదుట ప్రమాణమును గైకొనిరి. న్యాయస్థానములో మాత్రము ప్రజ లల్లరులను చేసిరి. రోడుఐలండులో తప్ప మిగిలిన ప్రదేశములన్నిటిలోను స్టాంపులు లేనిది చర్యలన్నియు నశాస్త్రీయ మగునేమో నను భీతితో న్యాయస్థానము లన్నియు మూసివేయబడెను. స్టాంపు కాగితములు లేకుండ సముద్రముమీద పయనముచేయుట కోడల యజమానులు భయపడిరి. కాని కొలది దినములలో ఈభయముల నన్నిటిని నిర్లక్ష్యముచేసి స్టాంపులు లేకుండగనే యథాప్రకారముగా న్యాయస్థానము లమలుజరిపెను. నౌకలు సముద్రములమీద ప్రయాణములు చేసెను. స్టాంపులచట్టమును తీసివేయు వరకును ఆంగ్లేయ దేశమునుండి వచ్చు వస్త్రములు

మొదలగు సరకులను తాము బహిష్కరించెదమని వలసరాజ్యముల ప్రజలు శపథములను గావించిరి. ఈవిషయమున అమెరికను స్త్రీలు మిగుల పట్టుదలతో పనిచేసిరి. వారు ఆంగ్లేయవస్త్రములు ధరించుటను మానివేసిరి. స్టాంపుల చట్టము చేయబడిన నాటికిని దీని నమలులో బెట్ట నిశ్చయించినకాలమునకును మధ్య నాంగ్లేయ మంత్రివర్గములో మార్పులు కలిగెను. గ్రెన్విలుమంత్రియు నాయన సహచరులును మంత్రి పదవులను వదలుకొనిరి. రాకింగుహాం ప్రధానమంత్రి యయ్యెను. ఈయనకు అమెరికా వలసప్రజలయందిష్టమేగాని అప్పుడు రాజ్యముచేయుచున్న మూడవ జార్జి రాజు మంత్రులమీద బాగుగ నధికారము చలాయించుచుండెను. ఈరాజద్రోహులగు అమెరికనులను బాగుగ శిక్షించవలెనని ఆయన పట్టుదల గలిగియుండెను. అయినను అమెరికాలోని వ్యాపారములు విషమస్థితికి వచ్చుచున్నందున విశేష యనుభవజ్ఞుడగు విలియంపిట్టుయొక్క సలహాను తీసుకొనుటకు నిశ్చయించిరి. విలియంపిట్టు చాలప్రఖ్యాతినహించిన రాజనీతికోవిదుడు. ఆయన కొంతకాలము నుండియు ననారోగ్యముచేత పార్లమెంటుకు వచ్చుట లేదు. అమెరికావిషయమున నాలోచించుటకై నిర్ణయమైన దినమున నాయన పార్లమెంటు సభకువచ్చెను. అట్లాంటికు మహాసముద్రమున కావలియొడ్డుననున్న నీతిపరులైనట్టియు ధైర్యశాలులయినట్టియు మూడుకోట్ల పౌరుల స్వతంత్రమును భంగపరచుచున్న సందర్భములో తాను తన యభిప్రాయములను ఖండితముగ తెలుపుటకే వచ్చితిననియు, అమెరికా ఇంగ్లాండుయొక్క పుత్రికగాని దాసీ పుత్రులుగారనియు,

ప్రాతినిధ్యపు హక్కులకు వారర్హులనియు వారి యనుమతి లేనిది పన్నులు వేయుట అక్రమమనియు ఆయన చెప్పెను. ఇందు మీాద పార్లమెంటు సభలో కొంగిచర్చ జరిగెను. ఆచర్చలో పార్లమెంటు సభ్యులలో నైకమత్యములేక భేదాభిప్రాయములుండుటవలన అమెరికావారి రాజద్రోహమునకు మంచి ప్రోత్సాహము కలుగనున్నదని గ్రెన్విలుచెప్పెను. అందుమీాద విలియంపిట్టు "అమెరికావలస ప్రజలు మూర్ఖపు పట్టుదలలో నున్నారని ఆయన ఆక్షేపించి యున్నాడు. అంతే కాదు. అమెరికా దాదాపుగా బహిరంగముగు తిరుగుబాటును చేయుచున్నది. అమెరికావారు మనను ఎదిరించినందునకు నేను సంతసించుచున్నాను. వెంటనే స్టాంపుల చట్టమును తీసివేయుడు. కాని మనదేశమునకు వలస రాజ్యముల మీాదగల ప్రభుత్వాధికారమును మిక్కిలి బలముగు మాటల చే స్థిరపరచి వారి వర్తకమును, వారి పరిశ్రమలును, మన యధికారమునకు పూర్తిగ లోబడునట్లు చేయుడు వారి యనుమతిలేకుండ వారివద్దనుండి బలాత్కారముగ సొమ్మును మాత్రము వసూలుచేయవలదు" అని జవాబుచెప్పెను. విలియంపిట్టుయొక్క సలహా అంగీకరించబడినది. వెంటనే "అది అమలులో నుండుటవలన అనేక ఇబ్బందులకాకరముగు ననియు ఈ రాష్ట్రముల వర్తకమునకు నష్టము కలుగ వచ్చు ననియు" నని స్టాంపుల చట్టమును ఆంగ్లేయ పార్లమెంటువారు రద్దుపరచిరి. కాని అమెరికాలోని రాజుగారిరాజ్యములు రాజు గారిమీాదను గ్రేటు బ్రిటను యొక్క పార్లమెంటుమీాదను నొక్కవకగ సాధారణముగాకై యుండు యధికార ప్రకటనా

శాసనమును ఆ కాలముననే చేసిరి. ఈశాసనమున అమెరికాలోని వలస రాజ్యముల ప్రజలు గ్రేటుబ్రిటను యొక్క రాజునకును పార్లమెంటువారికిని లోబడియున్నారనియు వారు మీద ప్రతి వాక్కునకును ఆధారపడియున్నారనియు, ప్రతి విషయములోను పార్లమెంటుయొక్క సలహాతో రాజుచేయు చట్టములను ఉత్తరువులును అన్నియు అమెరికా వలస ప్రజలను పూర్తిగా బద్ధులను చేయుననియు, ఇటు బద్ధులను చేయ నేరని వలస రాష్ట్రములలో నెవరైనను చేసుకొను తీర్మానములును అశాస్త్రీయములై చెల్లనేరవనియు ప్రకటించబడెను.

అమెరికా వలస ప్రజలీయధికార ప్రకటనా శాసనమును ప్రథమములో బాగుగ గమనించలేదు. స్టాంపుల చట్టము తీసివేయబడినందుకు మిగుల సంతసించిరి దేవాలయములలో జయసూచకముగ గంటలు మోగించబడెను. బాస్టనులో మే 19 వ తేదీన అన్ని వ్యాపారములకును శెలవిచ్చిరి. ఇంగ్లాండు నుంచి వచ్చెడి వస్త్రములను ధరించుట మానివేసిన అమెరికను స్త్రీలు జూన్ 4 వ తేదీన రాజుయొక్క జన్మదినమయినందున నూతన ఆంగ్లేయ వస్త్రములను కొని ధరించి పాత వస్త్రములను బీదల కిచ్చిరి.

(4)

ఈ అనుకూల పరిస్థితులు విశేషకాలము నిలువలేదు. ఆంగ్లేయప్రభుత్వము వారీవలస రాష్ట్రములనుండి పన్నులను

తిరిగి పన్ను వేయుట. తీసుకొను నుద్దేశ్యమునుగాని వీరి వర్తకము తో జోక్యము కలుగ చేసుకొనుటను గాని మానలేదు. ఈవలస రాష్ట్రములలో పండిన దినుసులను జమైకా ద్వీపమునకుగాని డొమినికా ద్వీపమునకుగాని ఎగుమతి చేయకూడదనియు, నట్లు ఎగుమతి చేసినచో సరుకులను పడవలను జప్తుచేయబడుననియు నాంగ్లేయ ప్రభుత్వమువారు 1766 వ సంవత్సరములోనే యొక చట్టమునుచేసిరి. యింగ్లాండునుండి వలసరాష్ట్రములకు దిగుమతియగు గాజుసామాను తేయాకు, కాగితములు, మొదలగు కొన్ని సరుకులమీద పన్నులు వసూలు చేసి యాసొమ్ముతో నిక్కడి న్యాయాధిపతులు మొదలగు నుద్యోగస్థులకు జీత మివ్వవలసినదని యా సంవత్సరమే మరియొక శాసనము గావించిరి.

అసంతృప్తికి మరియొక కారణముగలదు. తమమీదికెవరైన వచ్చినప్పుడు సంరక్షించుకొనుటకేమి ఆంగ్లేయ రాజ్యపు శత్రువులై యుద్ధములు చేయుటకేమి వలస రాష్ట్రముల ప్రజలు తమనుండియే సైనికులను తయారుచేసిపంపుచువచ్చిరి. ఎప్పుడైనను ఆంగ్లేయసైన్యము లిచటికివచ్చినను వారి బసల నేర్పాటుచేయుటకు రాష్ట్రముల ప్రభుత్వములే చట్టములుచేసి తగిన ఏర్పాటులుగావించెను. 1756 సంవత్సరమున ఆంగ్ల సేనాధిపతి తన సైనికులకు ద్రవ్యము పుచ్చుకొనకుండ తగిన బసల నేర్పాటుచేయుట వలస రాష్ట్రముల విధియని చెప్పెను. 1765 సంవత్సరము మొదలు ప్రతిసంవత్సరమును రాజుగారి సైనికులకు కొన్ని సామగ్రిలను నివసించుటకు బసలను వలస రాష్ట్రములవారిచ్చి తీరవలెనని ఆంగ్లప్రభుత్వము వారు

చట్టములను చేయుచువచ్చిరి. ఇట్టి నిర్బంధమున కీరాష్ట్రము లసమ్మతిని చూపెను. ఆంగ్లేయ సైనికులతో తమకు పని లేదనిరి. ఆంగ్లపార్లమెంటువారు తమమీద నిట్టిచట్టములు చేయుటకు వీలులేదనిరి. మెసచుసెట్సు, న్యూయార్కు రాష్ట్రములు రెండును ఆంగ్లేయ సైనికులకు సామాగ్రుల నిచ్చుటకు నిరాకరించినవి. ఇందుమీద ఆంగ్లేయప్రభుత్వము వారు న్యూయార్కు రాష్ట్రపుపాలనా హక్కులనన్నిటిని రద్దుపరచిరి. ఆంగ్లసైనికులకు అవసరమైన సామానులను సమకూర్చువరకును నీరాష్ట్రములోని గవర్నరు, కార్యనిర్వాహక సభ, ప్రజాప్రతినిధిసభ కెట్టి చట్టములను ఉత్తరువులను తీర్మానములను చేయకూడదని యాజ్ఞాపించిరి.

ఇందుమీద అమెరికా రాష్ట్రములలో నింగ్లాండుపై నాగ్రహము తీవ్రమయ్యెను. 1766 సంవత్సరపు చివర భాగమున ఆంగ్లేయ పార్లమెంటునకు వలస రాష్ట్రములమీద నెట్టి చట్టములను చేయుటకును హక్కులేదని స్పష్టముగా మెసచుసెట్సు ప్రజాప్రతినిధి సభవారు తీర్మానించిరి.

1766 సంవత్సరము జులై నెలలో రాకింగుహాం మంత్రి మానుకొని విల్లియంపిట్టు ఆంగ్లేయ రాజ్యమునకు ప్రధాన మంత్రియయ్యెను. కొద్దికాలములో శరీర రుగ్మతవలన నీయన రాజీనామా నివ్వగ నార్తుప్రభువు ప్రధానమంత్రి అయ్యెను. 1767 డిశంబరు నెలలో హిల్సుబరో ప్రభువు వలసరాజ్యముల మంత్రిఅయ్యెను. మంత్రివర్గములో నెట్టిమార్పులు జరిగినను ఎవరుమంత్రులైనను ఆంగ్లప్రభుత్వమువారు వలస రాజ్యముమీద సంపూర్ణముగ తమ యధికారమును చలాయించ

వలెననియు వలస రాజ్యములను నిర్బంధించి లోబరచుకొన వలెననియు మాత్రమే నిశ్చయించిరి. అమెరికావారు తమకు పాదాక్రాంతులగు వరకును నట్టి కనికరమును వారియెడ జూపవలెనని ప్రధానమంత్రి నార్తుప్రభువు పార్లమెంటు సభలో చెప్పెను.

అప్పుడు ఫరాసు దేశపు విదేశవ్యవహార మంత్రియగు ఛాయిసులు అమెరికావారివద్ద కొకరాయబారిని పంపెను. ఇంగ్లాండులో అమెరికాతరఫున పని చేయుటకు వెళ్ళిన బెంజమిన్ ఫ్రాంక్లినునకు ధనసహాయము చేయుచుండెను. అమెరికా వారికి సహాయము చేయుటకు వాగ్దత్తము చేసెను.

1767 సంవత్సరము నవంబరు 20 వ తేదీనుండియు నీసూపన పన్ను వసూలుచేయుదురు కావున అక్టోబరు 28 వ తేదీన బాస్టను ప్రజలు సమావేశమై

**ఆంగ్లేయ వస్తు బహిష్కారము.**

ఆంగ్లేయ దేశములో తయారయ్యె సరుకులను తెప్పించగూడదనియు ఉపయోగించ గూడదనియు తీర్మానించిరి. సభకువచ్చిన వేనకువేల జనులు లేచి యాంగ్లేయ సరుకులను బహిష్కరించెదమని శపథములుచేసిరి. ప్రమాణపత్రిక నొకదానిని వ్రాసి దానిమీద ప్రజల సంతకములు తీసుకొనబడెను. అందరి సంతకములు తీసుకొనుటకు కొకయుపసంఘము నేర్పాటుచేసిరి. ఈ ఆంగ్లేయ వస్తుబహిష్కార తీర్మానమును ఇతర రాష్ట్రములకన్నిటికిని వారుకూడ అవలంబించుటకై పంపిరి. ప్రతి రాష్ట్రమును ఇంగ్లీషు సరుకులబహిష్కారమును అవలంబించసాగెను. ఈలోపుగా తమమీద పన్నులను విధించుట అక్రమమని వివిధ రాష్ట్రములు

వారును ఆంగ్లేయరాజునకును పార్లమెంటునకును అర్జీలనుపంపిరి. బోస్టనులోని వర్తకులు ఇంగ్లీషు సరుకులను తెప్పించమని యొడంబడిక చేసుకొనిరి. తక్కిన వర్తకుల నందరిని నయముననో భయముననో తమ యొడంబడికలో చేరునట్లు చేయుటకై యొక పలుకుబడిగల యుపసంఘమును నియమించిరి. స్వాతంత్ర్యదేవతకు పుత్రికలగు అమెరికనస్త్రీలు తేయాకు త్రాగుటను మానుకొనిరి. తేయాకు నింగ్లాండునుండి తెప్పించుకొనవలసి యుండినందున దానిని బహిష్కరించి తేయాకు నీరు త్రాగుటయే మానుకొనిరి. స్త్రీలును పురుషులును నిట్టి యేకీభావముతోడను పట్టుదలతోడను పని చేసిన జాతి స్వాతంత్ర్యమున కర్హము గాదా? అమెరికావారు ఫరాసుదేశముతో వర్తక యొడంబడికలు చేసుకొని ఆంగ్లేయసరుకులకు మారుగ తాము స్వంతముగ వెంటనే తయారు చేసుకొనలేని వాటిని ఫరాసుదేశమునుండి తెప్పించుటకు నిశ్చయించుకొనిరి. ఇందుకు ఫరాసుమంత్రి ఛాయిసులు మిగుల తోడ్పడెను.

స్పెయిన్ దేశమునకు లోబడియుండిన లూసియానా వలసరాష్ట్రములోని ఫరాసుప్రజలు స్పెయిను ప్రభుత్వముపై తిరుగబడి ప్రజాస్వామ్యమును స్థాపించుటకు యత్నించిరి. కొంతకాలమువరకది స్పెయిన్ వారి పశుబలము వలన నణచివేయబడినప్పటికిని ఆయుద్యమముకూడ నీఆంగ్లేయ వలసరాష్ట్రములకు మార్గదర్శకమయ్యెను.

తాము చెప్పినప్రకారము నడచుకొనలేదని బాస్టనులోని గవర్నరు బెర్నార్డు ప్రజాప్రతినిధిసభను విచ్ఛిన్నముచేసెను. తిరిగి మఱియొకసభను సమావేశపరచుటకు నిరాకరించెను.

తానే ఆంగ్లేయ ప్రభుత్వమువారి యుత్తరువుల ననుసరించి రాష్ట్రపాలనను జరిపెదననెను. వెంటనే ప్రజలు ఎన్నికలు జరిపి నూతన ప్రజాప్రతినిధిసభను సమావేశ పరచుకొనిరి. ఆరాష్ట్రములోని ప్రతిభాగమునుండియు ప్రతినిధులు వచ్చిరి. గవర్నరే సమావేశమును విడిపోవలసినదని యాజ్ఞాపించినను ప్రజాప్రతినిధి సమావేశము విచ్ఛిన్నమగుటకు నిరాకరించి రాష్ట్రప్రభుత్వమును గూర్చిన యావత్తుచట్టములను తీర్మానములు చేయసాగెను. ప్రభుత్వ న్యాయవాదియగు డిగ్రేసును తామిట్లుచేయుటవలన రాజద్రోహముక్రిందకు వచ్చెదమా యని సంప్రతించగా స్పష్టముగా రాకపోయినను రాజద్రోహనేరమునకొరకు వెంట్రుకవాసి సమీపములో నున్నారని చెప్పెను.

*ఆంగ్లేయ సైన్యము ముట్టడించెను.*

ఇంతలో వలసరాష్ట్రములలో స్థిరముగ నాంగ్లేయ సైన్యముల నుంచెదరను సమాచారము తెలిసెను. 1768 సంవత్సరం సెప్టెంబరు 28 వ తేదీన ఆంగ్లప్రభుత్వమువారి ఏడుయుద్ధనౌకలు బాస్టన్ రేవులోనికి వచ్చెను. వానిలో నేడువందల మంది ఆంగ్లేయసైనికులుండిరి. అక్టోబరు 11వ తేదీన నీసైనికులు పడవలలోనుండి దిగి పట్టణములోనికిరాగా అందరును బసలిచ్చుటకు నిరాకరించిరి. బలవంతముగ కొన్నిగృహములను స్వాధీనపరచుకొని వానిలో సైనికులు ప్రవేశించిరి. ఇంకను సైన్యములు రాసాగెను. ఒక సంవత్సరములోపల షుమారు నాలుగువేలమంది యాంగ్లేయసైనికులు బాస్టను పట్టణమున నుండిరి. 1769 సంవత్సరమున రాష్ట్రీయ ప్రతి

నిధిసభ బాస్టనులో తిరిగి సమావేశమయ్యెను. సైనికులు సభా మందిరమును చుట్టుకొనిరి. అందువలన ప్రతినిధిసభవారు సభచాలించి లేచిపోయిరి. ముందు అమెరికను స్వాతంత్ర్యోద్యమమున కంతకును నాయకుడు గావలసియున్న జార్జివాషింగ్టనుయొక్క భావములిప్పటి కెటులున్నవో 1769 సంవత్సరం ఏప్రిలు ౫వ తేదీన నాయన తనస్నేహితుడగు జార్జిమేసనుకు వ్రాసిన లేఖవలన తెలియగలవు. "గ్రేటు బ్రిటనులోని మన యజమానులు అమెరికా స్వాతంత్రము సంపూర్ణముగ నాశనమగుటకన్న మరి దేనితోను తృప్తిచెందనపుడు గత్యంతరము లేక స్వాతంత్ర్యమువంటి కష్టమైన భాగ్యము కొరకు కత్తిదూయుట కెవరును సంకోచించరు." అని ఆయన వ్రాసెను.

**స్వదేశీ వ్రతము**

న్యూఇంగ్లాండు రాష్ట్రమువలెనే వర్జీనియా కారొలీనాలు, డెలవేరు మేరిలాండు న్యూయార్కు రాష్ట్రములవారును తీవ్రమగు తీర్మానములను చేసిరి. వర్జీనియా ప్రతినిధిసభలో జార్జివాషింగ్టనే ఆంగ్లేయ సరకుల బహిష్కార తీర్మానమును చేయించెను. ప్రతిరాష్ట్రములోని ప్రజలును ఆంగ్లేయవస్తువులను బహిష్కరించుటకు తీర్మానించిరి. వర్తకులు వాటిని తెప్పించకుండ ఒడంబడికలు చేసుకొనిరి. మెసచుసెట్సు రాష్ట్రములోని హార్వర్డు కళాశాలయొక్క పట్టపరీక్షలో తేరిన విద్యార్థులు తమపట్టములను పుచ్చుకొనుటకు సమావేశమైనప్పుడు న్యూఇంగ్లాండు రాష్ట్రములలో తయారైన నల్లగుడ్డతోనే కుట్టిన దుస్తులను ధరించి వెళ్ళిరి. ప్రతిరాష్ట్రములోను స్వదేశ పత్రిక

ములు వృద్ధియయ్యెను. స్వదేశ సరుకులు త్వరితముగా తయారు చేయుచుండిరి. ఆంగ్లేయ సరుకులతో పాటు నాజూకుగా లేక పోయినను అంతకన్న కొంచెము ధరలధికమైనను తమస్వదేశ వస్తువులనే ప్రజలుపయోగించుచు వచ్చిరి. స్త్రీలు బహు దీక్షతో కృషిసల్పిరి. అన్ని రాష్ట్రములకును ఆంగ్లేయదేశము నుండి దిగుమతియగుసరుకులు బహువిశేషముగ తగ్గిపోయెను. ఆంగ్లేయ సైనికులకును వలస ప్రజలకును ద్వేషములు పెరిగెను. 1770 సంవత్సరం మార్చి 5వ తేదీన న్యూయార్కు పట్టణములో నొక అల్లరిజరిగెను. సైనికులు ప్రజలపై తుపాకులు కాల్చిరి. ముగ్గురు హతులైరి. పెక్కుమందికి గాయములుతగిలెను. మరణించిన వారిని ప్రజలూరేగించి సమాధిచేసిరి. సైనికులు తమనివాసములకు వెళ్ళిరి.

తక్కిన పన్నులు రద్దయ్యెను

తుదకు ఆంగ్లేయ ప్రభుత్వము చాలవరకు లోబడి రాజీకవచ్చెను. తేయాకుమీద తప్ప తక్కిన యన్ని సరుకుల మీదను పన్నులను తీసివేసెను. పన్నులువసూలుచేయుట మానుకొనిరి. కాని తేయాకుమీద పన్నుతీసివేయలేదు. కావున సరుకుల బహిష్కారమును తీసివేసి యొక్క ఆంగ్లదేశము నుండి వచ్చుతేయాకును మాత్రము బహిష్కరించుట కమెరికను ప్రజలు తీర్మానించిరి. దానిని మాత్రము తెప్పించమను నొడంబడికలు వర్తకులమలులో నుంచిరి. ఇంకను రెండు సంవత్సరముల వరకును చెప్పదగిన కల్లోలములులేక అంతయు శాంతముగానే గడచెను.

(5)

ఆంగ్లనౌకను తగలబెట్టుట

1772 సంవత్సరమున తిరిగి కలతలు ప్రారంభమయ్యెను. ఉత్తర కారోలీనా రాష్ట్రములోని ప్రజాస్వామిక వాదుల నణచివేయుట కాంగ్లేయ అధికారులు ప్రయత్నించినందున వారు టెనెస్సీనది ప్రాంతములకు లేచిపోయి ఆంగ్లేయ సంబంధములేని యొక స్వతంత్రమగు చిన్న ప్రజాస్వామ్యమును స్థాపించుకొనిరి. అమెరికా రాష్ట్రముల ప్రజలు పరాసుతత్వ శాస్త్రజ్ఞలగు వాల్టైరు రూసో మొదలగువారు స్వతంత్రమును గూర్చియు, ప్రజాస్వామికమును గూర్చియు, మానవసమానత్వమును గూర్చియు, వ్రాసియున్న గ్రంథములను చదువుచుండినందున స్వాతంత్ర్యభావములు పూర్తిగ నాటుకొనుచుండెను. యుద్ధనౌకలనుగాని యుద్ధ సామాగ్రులనుగాని సైనికుల యాహారపదార్థములుగాని బుద్ధిపూర్వకముగ తగులబెట్టిన వారికి మరణదండన విధించబడునని యొక శాసనము నాంగ్లేయ ప్రభుత్వము చేసియుండెను. రోడు అయిలండు రాష్ట్రములోనికి దొంగతనముగ విదేశములనుండి తేయాకును తెప్పించుకొనుచున్నందున నట్టి దొంగతనము నాపుటకై ప్రావిడన్సను రేవులో నొక యాంగ్లేయ నౌకయుంచబడెను. దానిని అర్థరాత్రివేళ పట్టుకొని ప్రజలు తగులబెట్టిరి. (1762 సంవత్సరం జూన్ 9 తేది). ఈ నేరము నెవరు చేసినదియు తెలిపినవారికి అయిదువందల నవరసుల నిచ్చెదమని ఆంగ్లేయ ప్రభుత్వము వారు ప్రకటించినప్పటికిని ఎవరును సమాచారము తెలుపలేదు. ఏమియు సాక్ష్యములేక ఆంగ్లప్రభుత్వమువారూరకొనిరి.

ఆంగ్లేయ తేయాకును బహిష్కరించుట.

అన్నిరాష్ట్రములలోని వివిధపట్టణములమధ్య ఐకమత్య భావమును ఏకాభిప్రాయమును కలుగచేయుటకై ప్రతిపట్టణములోను నొక యుపసంఘమును ప్రజలేర్పాటుచేసిరి. ముందు బాస్టను పట్టణము దారిదీసెను. ఇతర రాష్ట్రములలోని పట్టణములును తోడ్పడెను. హాలెండునుండివచ్చు తేయాకు తప్ప మరి యే తేయాకును ప్రజలు వాడుటలేదు. ఆంగ్లేయ ప్రభుత్వమువారికిక్కట్టిపన్ను వసూలగుటలేదు. వలసరాష్ట్రముల ప్రజలు కావలెనని కోరకుండగనే తేయాకుతో నిండిన పడవలు ఆంగ్లదేశమునుండి బయలుదేరి వలసరాష్ట్రపు రేవులలో దిగెను. తేయాకుమీద పన్ను తగ్గించిరి. అయినను ఆంగ్లేయుపడవలలో వచ్చిన తేయాకు తమ దేశములోనికి దిగగూడదనియు దిగినను అమ్మగూడదనియు అమెరికను ప్రజలు దీక్షవహించిరి. ఈ రాష్ట్రములలో స్వాతంత్ర్యపుత్రుల సంఘములను (Sons of Liberty) స్థాపించిరి. ఫిలడల్ఫియా, న్యూయార్కు రేవులలో నుండి పడవలు వెనుకకు వెళ్ళిపోయెను. చార్లెసుటనులో పడవలలోనుండి తేయాకునుదింపి కొట్లలో అమ్మకమునకై తెచ్చిరిగాని ఎవరును కొనసందున కుళ్ళిపోయెను. బాస్టన్ రేవులోనికి పడవలువచ్చి తేయాకును దింపక కొన్నిరోజులు నిలువ యుంచిరి. తేయాకునువొడ్డునకుదింపకుండ నాటంకపరచుటకై ప్రజలు కాపలా కాచియుండిరి. 1773 సంవత్సరం డిశంబరు 16వ తేదీన బాస్టనులో ఏడువేలమంది ప్రజలు వచ్చిన గొప్పబహిరంగసభ జరిగెను. చుట్టుపట్టుల నిరువదిమైళ్ళ దూరమునుండియు ప్రజలువచ్చిరి. సామ్యుయలు ఆడమ్సు, జోసయాక్విన్సీ

మొదలగువారు తీవ్రమగు నుపన్యాసముల నిచ్చిరి. సాయంత్రము సభ ముగియగానే ప్రజలు గుంపులుగుంపులుగ సముద్రతీరమునకు పోయిరి. ఈప్రజలుచూచి కోలాహలము చేయుచుండగ ఎర్రయిండియను వేషములను ధరించిన బదిమంది అమెరికనులు తేయాకుపడవలలోనికి బోయి వాటిలోనున్న 342 పెట్టెల తేయాకును సముద్రములోనికి పడద్రోసి వచ్చిరి. ఒక నెలతరువాత నొక ఆంగ్లేయ యుద్యోగస్తునికి మొగమునిండ నల్లకారుబూసి తలమీద యీకలుధరింపజేసి బాస్టనువీధులలో గుండ ప్రజలూరేగించిరి. బాస్టన్‌లోని పత్రికలు అమెరికారాష్ట్రములన్నియు కలిసి యొక మానవ హక్కుల ప్రకటనము గావింపవలెననియు లేనిచో ప్రజాస్వామ్యమును స్థాపింపవలెననియు వ్రాయుచుండెను.

ఆంగ్లేయ పార్లమెంటు వారి యాగ్రహము.

ఈసంగతులు తెలిసి బ్రిటిషుపార్లమెంటులో చాల నాగ్రహము గలిగెను. ఇంగ్లాండులో నమెరికాతరఫున ప్రతినిధిగ పనిచేయుచున్న బెన్జమిను ఫ్రాంక్లిను ఖయిదుచేయుదురను వాడుకలు పుట్టెను. గవర్నరును మార్చవలసినదని మెసషుసెట్సు ప్రతినిధిసభపక్షమున నాయన ప్రీవీకౌన్సిలులో దాఖలుచేసిన అర్జీని విచారించకుండగనే త్రోసివైచిరి. బాస్టనురేవులోనికి నెట్టిసరుకులు పడవలును రాగూడదని నిషేధించుచు నొక చట్టమునుచేసిరి. దీనివలన బాస్టనుల యొక్క వర్తకమునంతను నాశనముచేయ నిశ్చయించిరి. మెసషుసెట్సు రాష్ట్రమున నాంగ్లేయ సైనికులుగాని అధికారులుగాని శాంతిని స్థాపించునపుడును తమ విధులను నెరవేర్చు

సపుడును చేయుగట్టిచర్యలకును రాష్ట్రీయప్రతినిధి సభవారు వారిని శిక్షించుటకు వీలులేదనియు వారివిచారణ ఆంగ్లేయ ప్రభుత్వమువారు నిర్ణయించిన నేస్థలములోనైనను జరుగ వచ్చుననియు మరియొక చట్టమునుచేసిరి. ఇందువలన నీరాష్ట్రములో ప్రజలను హత్యగావించెడి సైనికుల విచారణ ఇంగ్లాండులో జరుపవచ్చును. మెసచుసెట్సు రాష్ట్రములోని ప్రజాప్రతినిధి సభవారుగాక ఆంగ్లేయ గవర్నరే కార్యనిర్వాహక సభ్యులను, షెరీఫులు, న్యాయాధిపతులు మొదలగు నుద్యోగస్థులను నియమించవచ్చుననియు, గవర్నరుయొక్క అనుమతి లేనిది ప్రజలు బహిరంగసభలు చేయకూడదనియు, మూడవ చట్టమునుచేసిరి. ఉత్తరఅమెరికా వలసరాష్ట్రములలో సైనికులను ఉంచుటనగూర్చి నాలుగవ చట్టమును చేసిరి.

ఉత్తర అమెరికాలోని క్విబెకురాష్ట్రములో ఓహాయో, మిషిగాను, ఇండియానా, ఇల్లినాయును, విసుకాన్సిను రాష్ట్రములనుచేర్చి అయిదవచట్టమును చేసిరి. పార్లమెంటులో బర్కు మొదలగు కొందరుసభ్యులీ చట్టములను ఖండించిరిగాని విశేష సంఖ్యాకులగు సభ్యులచే నివి యామోదించబడెను. ఈచట్టములుచేయక ముందుపార్లమెంటులో కొంతచర్చజరిగెను. అందులో "అమెరికారాష్ట్రములు బ్రిటిషుప్రభుత్వమునకు లోబడి యుండవలెనా లేక స్వతంత్రిమును పొందవలెనా యనునదియే యిపుడాలోచించవలసిన సమస్య" అని వెడరుబరన్ అను సభ్యుడు చెప్పెను. ఆంగ్లదేశములో కూడ కొద్దిమంది ప్రముఖులు అమెరికావారు స్వతంత్రులుగ నుండవలెననియే వాంఛించిరికాని ఆంగ్లప్రజలలో చాలమందికి అమెరికా స్వతంత్ర

ము పొందుట యనునది చాలకంటకముగ నుండెను.

అమెరికాలోని హాహాకారము

తాను చెప్పినమార్గము నవలంబించిన మొదల అమెరికాలో శీఘ్రముగ శాంతిసమ్మదులు కలుగునని ప్రధానమంత్రి నార్తుప్రభువు చెప్పెను. పార్లమెంటువా రాయనచెప్పిన మార్గమునే యవలంబించి ఆయిదు చట్టములను చేసిరి. కాని ప్రధానమంత్రి చెప్పిన ఫలితము కలుగలేదు. అమెరికాలో శాంతికలుగుటకు మారుగ ఆందోళనము హెచ్చెను. బాస్టను రేవులోనికి పడవలు రాగూడదని చట్టము చేసిరనువార్త తెలియగనే వర్జీనియారాష్ట్రప్రతినిధి సభవారు దానిని తీవ్రముగా ఖండించిరి. మరియు నారాష్ట్రములోని ప్రతిచోటను జూన్ 1 వ తేదీన ప్రజ లుపవాసవ్రతమును సలిపి అమెరికావారి సహజ హక్కులు నశించకుండ కాపాడవలెననియు ఆమెరికాప్రజల కాహక్కులకు కలుగు ఆటంకములను న్యాయమైన అన్ని పద్ధతులచేతను తొలగించ కృషిసలుపుటకు తమకందరకునొకే బుద్ధినికలుగ చేయవలెననియు పరమేశ్వరుని ప్రార్థించవలసినదని తీర్మానించిరి. గవర్నరు వెంటనే నాప్రతినిధిసభను విచ్ఛిన్నము చేసెను. ఆసభ్యులు మరియొక చోట సమావేశమై యొక రాష్ట్రమునకు కలిగినయాపద అన్ని రాష్ట్రములకును కలిగినట్లేననియు అమెరికా రాష్ట్రముల దేశీయ మహాజన సభ (కాంగ్రెసు) ను వెంటనే కూర్చుటావశ్యకమనియు తీర్మానించిరి. మెసచుసెట్సువారును నిదేవిధముగ నుద్దేశించి దేశీయమహాజనసభ సెప్టెంబరు నెలలో ఫిలడల్ఫియాలో జరుగవలెనని సూచించిరి. ఈ లోపున రాష్ట్రములన్నిటిలోను

ప్రజలసభలు జరిగెను. ఫైరుఫాక్సులో జరిగినసభకు జార్జివాషింగ్టను అధ్యక్షత వహించెను. ఆసభలో ఇంగ్లాండునకును వలస రాష్ట్రములకును గల భేదాభిప్రాయ విషయములన్నిటిమీదను ఇరువది నాలుగు తీర్మానములను గావించిరి.

(6)

**దేశీయ మహాసభా సమావేశము**

1774 వత్సరము 5 వ సెప్టెంబరు తేదీన ఫిలడల్ఫియాపట్టణములోని కార్పెంటరు పురమందిరములో (కాంగ్రెసు) అమెరికా దేశీయ మహా జనసభ కూడెను. దైవప్రార్థనతో సభప్రారంభ మయ్యెను. జార్జియా తప్ప మిగిలిన రాష్ట్రములన్నిటినుండియు ప్రతినిధులువచ్చిరి. ఎందరుప్రతినిధులు వచ్చినను రాష్ట్రమున కొక సమ్మతి చొప్పుననే తీసుకొనబడెను.

"అమెరికాయ తయు నొకటిగ చేయబడినది. నేను వర్జీనియనను గాను. అమెరికను నయియున్నాను" అని పాట్రికు హెన్రీ చెప్పెను. వచ్చిన ప్రతినిధులలో సామ్యూయలు ఆడంసు, జార్జివాషింగ్టనులుకూడ నుండిరి. అమెరికాప్రజల హక్కుల నిర్ణయము చేయబడెను. ప్రతిరాష్ట్రప్రజలును తమ రాష్ట్రపాలన కవసరమగు చట్టముల నన్నిటిని చేసికొనుటకు హక్కు కలిగియుండవలెను. అమెరికా వారితర దేశములతో చేయువ్యాపారమును నడిపించుట కాంగ్లేయ పార్లమెంటువారి కధికార ముండవచ్చును. కాని అమెరికాప్రజలనుండి పన్నులు వసూలుచేయుట కధికార ముండగూడదు. జ్యూరివిచారణా హక్కును బహిరంగసభలు చేసుకొనుహక్కును ఉండవలెను. కార్యనిర్వాహకసభలను గవర్నరులు నియమించగూడదు.

పరరాష్ట్రములోను శాంతిసమయములో ఆరాష్ట్ర ప్రతినిధిసభ యొక్క అనుమతిలేనిది ఆంగ్లేయసైనికుల నుంచగూడదు" అని ప్రకటించిరి. పంచదారచట్టము స్టాంపులచట్టము సైన్యములు నుంచుచట్టము తేయాకుచట్టము బాస్టనురేవుచట్టము అమెరికాలో చేయబడిననేరములకు ఆంగ్లదేశములో విచారణ చేయు చట్టము మెసచుసెట్సు క్విబెకు న్యూయార్కురాష్ట్రములను గూర్చి చేసిన చట్టములు మొదలగునవన్నియు వలసప్రజల హక్కులకు భంగకరముగ చేయబడినవని తీర్మానించిరి. ఆంగ్లేయదేశమునుండి వచ్చు సరుకులను కొనగూడదనియు తీర్మానించిరి. గ్రేటుబ్రిటనులోని ప్రజలు తమ హక్కులనుగూర్చి యాందోళనము చేయవలెననియు అమెరికా ప్రజలందరికిని నీ తీర్మానములను వ్యాపింప చేయవలెననియు తమ రాజునకొక రాజభక్తితో గూడిన మనవిని పంపవలెననియు, నిశ్చయించిరి. పార్లమెంటువారి చట్టముల నన్నిటిని మెసచుసెట్సురాష్ట్రమువారు తిరస్కరించుటకు మోదమును చూపిరి. మెసచుసెట్సు ప్రజల కిబ్బందులు కలిగినయెడల అమెరికా వారందరును వారికి తోడ్పడవలెనని తీర్మానించిరి. వలసరాష్ట్రముల సంఘములో చేరవలసినదని కనడాప్రజల నాహ్వానించిరి. ఏబదియొక్క దినములు సమావేశమై పై తీర్మానములన్నియును చేసి అమెరికా దేశీయ మహాజనసభ ముగిసెను. తిరిగి దేశీయ మహాజనసభ 1775 సంవత్సరము మే 10 వ తేదీన సమావేశమగుటకు నిర్ణయమయ్యెను. ఇంగ్లాండుచేయు చట్టములను ధిక్కరించి ప్రవర్తించుట స్వాతంత్రమును కోరుట యేయని యూరవుకుం

శములో చాలమంది తలచుచున్నప్పటికిని అమెరికా ప్రజలింకను తాము స్వతంత్రమునకై యత్నించుచున్నామని తలంచలేదు. ఇంకను తాము ఆంగ్లేయ ప్రభుత్వమునుండి చీలిపోవలెనని కోరుటలేదని 1774 సంవత్సరం అక్టోబరు నెలలోనే జార్జి వాషింగ్టను ఒక స్నేహితునికి వ్రాసెను. "ప్రతి స్వేచ్ఛాయుతమగు రాష్ట్రము యొక్కయు సౌఖ్యమునకత్యావశ్యకమగునట్టియు, ఆస్తి, స్వాతంత్ర్యము, ప్రాణములను సంరక్షణ చేయునట్టియు, విలువగల హక్కుల నష్టమునకు మాత్రమే వలసరాష్ట్రము సహించనేరదనియు, ఆంగ్లేయమంత్రివర్గము వారు మూర్ఖపుపట్టుదలను బూనినచో ఉత్తర అమెరికాలో యిదివరకెన్నడును చూడనివిధమున రక్తప్రవాహములు జరుగుననియు నాయన వ్రాసెను.

మెసచుసెట్సు ప్రజాప్రతినిధి సభ ధైర్యము.

ఇకాలమున మెసచుసెట్సు రాష్ట్రము ధైర్యముతో ముందు నడచుచున్నది. అక్టోబరు ౫వ తేదీన ప్రజాప్రతినిధి సభ కూడవలసియున్నది. పరిపాలనహక్కుల శాసనము ప్రకారము కార్యనిర్వాహక వర్గమును ప్రజాప్రతినిధి సభవారే ఎన్నుకొనవలెనుగాని ఈమధ్య బ్రిటిషు పార్లమెంటువారి హక్కును దీసివేసి గవర్నరే కార్యనిర్వాహక వర్గమును నియమించవలెనని శాసించిరి. దీని ననుసరించి గవర్నరు కార్యనిర్వాహక సభ్యులను నియమించెను, కాని మూడవవంతు సభ్యులు తమ పదవుల నుగ్రహించుట కంగీకరించలేదు. మిగిలినవారు ప్రజలకు భయపడి రాజీనామాల నిచ్చిరి. గవర్నరు నియమించిన న్యాయాధిపతు లుద్యోగము చేయలేదు.

గవర్నరు ప్రతినిధిసభ యెన్నికలు జరుగగూడదని నిషేధించెను. కాని ప్రజలెన్నికలను మానలేదు. సభ్యులందరును నెన్నుకొనబడిరి. ప్రతినిధి సభ్యులు సమావేశమైరి. గవర్నరు సమావేశము నుపక్రమించలేదు. ప్రతినిధి సభ్యులేకలసి రాష్ట్రీయమహాసభ యని పేరిడినది. రాష్ట్రీయ వ్యవహారములను చర్చించ సాగిరి. గవర్నరగు జనరలు గేజు మెసచుసెట్సు రాష్ట్రమునకు పాలకుడేగాక ఉత్తర అమెరికాలోని యాంగ్లేయ సైన్యముల కన్నిటికిని సర్వసేనాధిపతియు గూడ నై యుండెను. ఈయన వెంటనే పన్నెండువేల సైన్యము నాయత్తపరచెను. సైనికుల కాహారపదార్థములను యుద్ధసామాగ్రులను సమకూర్చెను. ఇందుకు వ్యతిరేకముగ ప్రజాప్రతినిధులు తమ రాష్ట్రములోను తోటి రాష్ట్రములలోను నిరువదివేలమంది జాతీయ సైనికులను తయారుచేసిరి. కనడావారి సహాయమును గూడ కోరిరి. "రాష్ట్రీయ మహాసభవారి యుత్తరువులను ప్రజలు శిరసావహించుచున్నారనియు మెసచుసెట్సు రాష్ట్రములో న్యాయస్థానములుగాని శాస్త్రీయమైన శాసనసభగాని లేవనియు అల్లకల్లోలముగ నున్నదనియు అనేకభాగములలో ప్రజలాయుధపాణులై ప్రభుత్వము మీద కలహించుటకు సిద్ధముగా నున్నారనియు" నీగవర్నరాంగ్ల ప్రభుత్వము వారికి వ్రాసుకొనెను.

విలియంపిట్టు. నవంబరు 30 వ తేదిన ఆంగ్లేయ పార్లమెంటు సమావేశమయ్యెను. అమెరికా వలసప్రజలు తన కవిధేయతను చూపుచున్నారనియు ఆంగ్లేయ ప్రభుత్వ ధిక్కారమును తాను సహించననియు రాజు తన

యుపన్యాసములో చెప్పెను. ప్రభువుల సభవారు మెసచూసె
ట్సు రాష్ట్ర ప్రజలు చూపుచున్న చట్టధిక్కారమునకును తిరుగ
బాటునకును తమ యాగ్రహమును అసహ్యమును వెలిబుచ్చు
చు వీరిని తగువిధముగ శిక్షించ నిశ్చయించినందునకు రాజునకు
కృతజ్ఞతను తెలిపిరి. ప్రజాప్రతినిధి సభవారు నిటులనే తీర్మా
నించిరి. కాని విలియం పిట్టు మాత్ర మీదినమున పార్లమెంటు
సభకు వచ్చి అమెరికా ప్రజలతో నెట్టులయిన సంధి గావింప
వలెననియు బాస్టనునుండి పటాలములను తీసివేయవలెననియు
వాదించెను. " అమెరికావారు చేసిన అక్రమ చర్యలను
హర్షించమని నేను కోరుటలేదు. వారికి న్యాయము కలుగ
చేయవలెనని మాత్రమే నేను కోరుచున్నాను. మీచర్యలను
ఎదిరించుట వారి కవసరమును న్యాయమునునై యున్నది.
నిరంకుశత్వమును ప్రత్యేకవ్యక్తు లవలంభించినను లేక సంఘ
ము లవలంబించినను నిరంకుశ చర్యలకు బ్రిటిషువారు లెవరు
ను లోబడి యూరుకొననేరరు. పార్లమెంటు సర్వాధికారి
యని మీరుచేయు వృథాప్రకటనములును, వారుమీకు పాదా
క్రాంతులై తీరవలెనను పిచ్చి సిద్ధాంతములును, మీతోడి
పౌరులగు అమెరికనుల నమ్మకములను మార్చుటగాని వారిని
మీకు దాసులను చేయుటగాని నొనరించజాలవు. స్వాతం
త్ర్యముకొరకు నిలువబడియున్న ప్రజల మీద అధర్మయుద్ధము చేసి
వారి రక్తమును చిందించువారికి ఈశ్వర శాపము తగులును.
బాస్టనుప్రజలను విచారించకుండగనే మీరు వారికి శిక్ష విధించి
నారు. దోషులను నిర్దోషులను కలిపి తారతమ్యము లేక
శిక్షించినారు. వారి రేవులో నెట్టి వర్తకమును జరుగకు

చేసి ముప్పదివేల ప్రజలను కరువులోను దైత్యుకవృత్తిలోను కూలద్రోసినారు. హేతువాదనలోను, దూరదృష్టిలోను, న్యాయబుద్ధిలోను, ముఖ్యముగ నిట్టి విషమదశలో, ఏజాతికిని ఏసంఘమునకును ఫిలడల్ఫియాలో జరిగిన అమెరికనుల సమావేశము తీసిపోనేరదని నేను స్పష్టముగ తెలియ చేయుచున్నాను. అట్టివారిమీద దాసిసత్వమును విధించుటకును, బలవంతులగుజాతిమీద నిరంకుశత్వమును స్థాపించుటకును మీరు చేయు ప్రయత్నములన్నియు విఫలములగుట నిశ్చయము. చిట్టచివరకు మనమే లోబడవలసి వచ్చును. మనము వెనుకకు మరలితీరవలసి వచ్చినప్పుడుగాక బుద్ధిపూర్వకముగ వెనుకకు మరలగల స్థితిలో నున్నపుడే వెనుకకు మరలుట యుక్తము ” అని ఆయన గంభీరోపన్యాసము చేసెను. కాని పార్లమెంటు సభ్యులు హితబోధలను లక్ష్యము చేయలేదు. బాస్టను పట్టణమునుండి యాంగ్లేయ సైన్యములను తీసివేయవలెననియు అమెరికనులతో రాజీపడవలెననియు నాయన యుపపాదించిన తీర్మానము లోడిపోయెను. అమెరికా వర్తకులనుగూర్చి పార్లమెంటువారవలంబించిన పద్ధతులలో మార్పుకలుగుట యావశ్యకమని లండనువర్తకులు పెట్టిన అర్జీలను నొక యుపసంఘమునకు త్రోసివేసిరి.

వలసరాష్ట్రములలో ఐక్యత.

ప్రధానమంత్రి నార్తుప్రభువు వలసరాష్ట్రములను చీలదీయవలెనని ప్రయత్నించెను. ఏరాష్ట్రమయినను ఆంగ్లేయయుద్యోగస్తులకు నిర్ణయమైనజీతములిచ్చుటకును సైనికుల ఖర్చులు భరించుటకును తనప్రతినిధిసభలోనే తీర్మానించుకొన్న యెడల

ఆంగ్లేయ పార్లమెంటువారారాష్ట్రముపైని పన్ను విధించుట మానెదరని తెలియజేసెను. కాని ఈ రాష్ట్రము మాయనకు లోబడలేదు. అన్ని రాష్ట్రములు కలసి ఐకమత్యముగనుండెను. అందరునుకలసి సామాన్య హక్కులకై పోరుసలుప కృతనిశ్చయులై యుండిరి. అమెరికను ప్రజలలో కొందరు విదేశీయులగు నాంగ్లప్రభుత్వముతో చేరనిది ఆంగ్లప్రభుత్వమేమి చేయగలదు? విదేశప్రభుత్వముల బలము వారి సైన్యములలోను నావికాదళములోను లేదు. స్వదేశస్థులలో కొందరు చీలిపోయి వారితో చేరుటలోనున్నది. కావున పదునైదువందల మైళ్లదూరమున నున్న బలవంతమగు నాంగ్లేయరాజ్యము అప్పటికి స్వల్పస్థితిలోనున్న అమెరికను జాతిని లోబరుచుకొనజాలకపోయెను. బొస్టనువర్తకమును నాశనము చేసినను బొస్టనులోబడనందున, న్యూఇంగ్లాండు, న్యూజర్సీ, పెన్సిల్వేనియా, మేరీలాండు, వర్జీనియా, దక్షిణకారొలీనా, రాష్ట్రముల లోని ఏరేవులోనికి పడవలు రాకూడదని ఆంగ్ల ప్రభుత్వమువారు శాసనమును చేసిరి. కొద్దినెలలలో ఈశాసనమును అమెరికా వలసరాష్ట్రములన్నిటికిని వ్యాపింపజేసిరి. అమెరికా ప్రజలవిదేశ కమును రేవువర్తకమును నాశనముచేసి వీరిని లోబరచుకొనవలెనని ఆంగ్లేయప్రభుత్వమువారు నిశ్చయించిరి. ఈచట్టములు పార్లమెంటులో వచ్చినపుడు "మానవస్వభావమును తృణీకరించి మనము మిక్కిలి ఉల్లాసముతోడను నిర్లక్ష్యముతోడను లక్షలకొలదిమానవుల కాహారము లేకుండ చేయుయత్నించుచున్నారము" అని బర్కు చెప్పెను గాని ప్రయోజనము లేదయ్యె.

(7)

యుద్ధప్రయత్నములు

అమెరికాలో తొందరగా పనులు జరుగుచున్నవి. మెసచుసెట్సు రాష్ట్రమువారు యుద్ధప్రయత్నములను చేయసాగిరి. ఆహార సామాగ్రిలను యుద్ధపరికరములను సమకూర్చసాగిరి. రాబోవు యుద్ధములో గాయములు తగిలినవారి చికిత్సకుగాను పరికరములను గూడ తయారు చేసిరి. ఏబదివేల సవరనుల ఋణమును ప్రజలనుండి వసూలుచేసిరి. 1775 సంవత్సరం ఫిబ్రవరి 27 వ తేదీననే మొదటికలహము జరిగెడిది. కాని ఆకస్మికముగా తప్పిపోయెను. సేలము ప్రదేశములో యుద్ధసామాగ్రి లొక యింటియం దుంచబడెను. ఆంగ్లేయ సేనాధిపతి జనరలు గేజు వాటిని స్వాధీనపర్చుకొమ్మని వెస్లిసేనానినుండి నలుబది మంది సైనికులను బంపెను. కాని వారురాకముందే ప్రజలీ సామాగ్రిల నచటనుంచి తీసి మరియొకచోట దాచిరి. ఈ దాచిన స్థలమునకు వెళ్ళవలెనని వెస్లిసేనాని యత్నించెను. కాని మార్గముననున్న వంతెనలను ప్రజలెత్తివేసిరి. సైనికులలోకూడ పడవలమీఁద నదిని దాట ప్రయత్నించిరి. అవతలయొడ్డున ప్రజలు గొడ్డళ్ళతో వేచియుండి వొడ్డుకొచ్చెడి పడవలను ముక్కలు ముక్కలుగ నరికివేయుచుండిరి. అప్పుడొక రాజీనామాకుదిరి ఆసేనలకు ప్రజలు నదిని దాటనిచ్చిరి. సేనలు యుద్ధ సామాగ్రులను స్వాధీనపర్చు కొనకుండ వెళ్ళిపోయిరి.

1775 సంవత్సరం మార్చి 26 వ తేదీన వర్జీనియాలో నొక సమావేశము జరిగి యారాష్ట్రమును సంరక్షించుకొను

టకు వలయు పనులనెల్ల చేయుటకు తీర్మానించిరి. ఇందుకొర కొక యుపసంఘము నేర్పాటు చేసిరి. దీనిలో జార్జి వాషింగ్టన్ నొక సభ్యుడుగ నియమింపబడెను. తన జీవితమును అదృష్టమును అమెరికా స్వాతంత్ర్యమునకై ధారవోసెదననియు తానిదివరకే రిఛ్మాండు స్వాతంత్ర్యపటాలముయొక్క సైన్యాధిపత్యమును వహించితిననియు అవసరమైనచో నింకను నెక్కువ సైన్యములను నడుపుటకుసిద్ధముగనున్నాననియు నీయనమార్చి 25 వ తేదీన తన సోదరునకొక యుత్తరమును వ్రాసెను. పోరాటమునకంతయు సిద్ధమైనది. నిప్పుపుల్లగీసి వెలిగించుటయే మంటమండుటకు తడవుగనున్నది.

# అమెరికా సంయుక్తరాష్ట్రములు.

## ఆరవ అధ్యాయము.

## ప్రపంచ పరిస్థితులు.

(1)

అమెరికా.

యుద్ధారంభమున చుట్టునున్న ప్రపంచ స్థితిగతు లెటు లున్నవో తెలిసికొనుట యావశ్యకము. గ్వయనా దేశముతప్ప మిగిలిన దక్షిణఅమెరికా ఖండమంతయు స్పైన్, పోర్చుగలు, జాతులచే నాక్రమించ బడియుండినది. గ్వయనా దేశములో కొంతభాగము ఒలాందా (డచ్చి)వారిక్రిందను కొంతభాగము ఫరాసువారిక్రింద నుండెను. ఉత్తరఅమెరికా ఖండములో నుత్తరముననున్న కనడాదేశము లో నెక్కువభాగము ఫరాసువారి క్రిందను కొద్దిగ ఆంగ్లేయుల క్రిందను ప్రథమములో నుండినప్పటికిని 1757 మొదలు 1763 వరకు జరిగిన ఏడు సంవత్సరముల యుద్ధములో ఫరాసువా రోడిపోయినందున, 1763 వ సంవత్సరమున జరిగిన పారిసు సంధివలన, కనడాదేశ మంతయు ఫ్రాన్సు వదలివేసి ఆంగ్లేయ ప్రభుత్వమునకు వశపరచెను. ఇంతటినుంచియు కనడాదేశ మాంగ్లేయ సామ్రాజ్యములో ముఖ్యమైన వలసరాజ్యమై

వృద్ధిచెందినది. కనడాదేశమునకు దక్షిణముననున్న దీసంయుక్త రాష్ట్రములు. అప్పటికి దేశములోని తూర్పు సముద్రతీరమునను కొద్దిగ మధ్యభాగమునకు మాత్రము ప్రదేశము నాక్రమించి పదమూడు రాష్ట్రములు ప్రధానముగ నాంగ్లేయులచే నింటి ఆంగ్లప్రభుత్వమునకు లోబడియుండెను. అవియే ఇంగ్లాండు దేశముతో యుద్ధము చేయుటకు సంసిద్ధమగుచుండెను. వీని జనసంఖ్య స్వతంత్ర యుద్ధమునాటికి షుమారు ముప్పదియైదు లక్షలుండును. కనడాలోను సంయుక్త రాష్ట్రములలోను తెల్లవారు నివసించిన ప్రదేశమునగాక మిగిలిన ప్రదేశములో ఎఱ్ఱయిండియను జాతులవారు స్వతంత్రమైన ప్రభుత్వములనుగలిగి నివసించుచుండిరి. ఈ యెఱ్ఱ యిండియనులను నాశనముచేసి పూర్తిగ నీ రెండు దేశములను తెల్లవారు ఆక్రమించుకొను కాలము ముందు రానున్నది. ఈపని కాలక్రమేణ జరిగెను. ఇంకొక డెబ్బదివత్సరముల కాలములో సంయుక్త రాష్ట్రములలోని అమెరికనులు ఎఱ్ఱయిండియనులను నాశనముచేసి క్రమక్రమముగ సంయుక్తరాష్ట్రముల దేశమునంతను తూర్పున అట్లాంటికు మహాసముద్రము మొదలు పడమట పసిఫికు మహాసముద్రమువరకును స్వాధీనమును పొంది యింకను ముప్పది తొమ్మిది రాష్ట్రములను స్థాపించిరి. ఇవన్నియు గలసి నేడు సుప్రసిద్ధములగు అమెరికా సంయుక్తరాష్ట్రములుగ విలసిల్లుచున్నవి.

సంయుక్త రాష్ట్రములకు దక్షిణముననున్న మెక్సికో దేశము స్పైన్ వారిక్రింద నుండెను. వీటికి తూర్పుననున్న పశ్చిమయిండియా ద్వీపములు వివిధ యూరోపియన్ జాతుల

క్రింద నుండెను. అప్పటికి సాన్ డొమింగో ద్వీపమును, న్యూ ఫౌండులాండుకు సమీపమున ఒకటిరెండు చిన్న ద్వీపములును, ఫ్రాన్సునకు లోబడియుండెను.

(2)

ఫ్రాన్సు. ఫ్రాన్సు దేశమునపుడు పదునారవ లూయి రాజు పాలించుచుండెను. ఈయనకు పూర్వము రాజు పదిహేనవ లూయి ఈయన పితామహుడు. పదునేనవ లూయి స్త్రీలోలుడును వివిధ దుర్గుణసమన్వితుడును నై యుండెను. ఆయన యుంపుడుకత్తెలు రాచకార్యములలో పెత్తనము వహించి తమ యిష్టమువచ్చినట్లు మంత్రులను సేనానాయకులను నియమించుచు తీసివేయుచు క్రొత్త వారిని నియమించుచు చంచలబుద్ధితో సంచరించినందున 1757 మొదలు జరిగిన 7 సంవత్సరముల యుద్ధములో ఫ్రాన్సు అమెరికాఖండములోను యూరపులోను హిందూదేశములోను నోడిపోయి రాజ్యములో చాలభాగమును పోగొట్టుకొనెను. అదివరకు యూరపుజాతులలో నెల్ల నగ్రస్థానము వహించియున్న ఫ్రాన్సు ఉత్తమస్థితిని కోల్పోయెను. హిందూదేశపు సామ్రాజ్యమును ఉత్తరఅమెరికాలోని కనడావలన రాజ్యమును ఆంగ్లేయులకు వదలివేయవలసివచ్చెను. ఈయేడు సంవత్సరముల యుద్ధమువలన ప్రపంచముయొక్క రాజ్యమును వర్తకమును ఆంగ్లేయులకు సంక్రమించెను. మరియు పదిహేనవ లూయీ రాజు మరణించువరకుపరాను ప్రభుత్వముయొక్కయు ప్రజలయొక్కయు ఆర్థికస్థితి మిగుల దుర్బలముగనుండెను. పదునారవ లూయీ మిగులయోగ్యుడు. కానిరెండు

తరములనుంచి వచ్చినకీడులను సంస్కరించతగిన సామర్థ్యము కలవాడుకాడు. ఇంకను ఫరాసు దేశమే వాఙ్మయములోను భావ ప్రపంచములోను యూరపుఖండమునకు శిరోమణియైయుండెను. యూరపులోని వివిధ ప్రభుత్వముల వారి యంతర్జాతీయ వ్యవహారము లన్నియు ఫరాసు భాషలోనే జరుగుచుండెను. యూరపులోని అన్ని దేశ ప్రజలకును ఫరాసుభాష సామాన్యముగా తెలిసియుండెను. ప్రష్యారాజు ఫ్రెడరిక్ దిగ్రేటు ఫరాసుభాషలోనే కవిత్వమును వ్రాయుచుండెను. ఆంగ్లేయ రాజగు రెండవ జార్జికి వాటుపడిన భాష ఫరాసుభాషయే. సుప్రసిద్ధచరిత్రకారుడగు గిబ్బను ఫరాసుభాషలోనే చరిత్రలు వ్రాయనారంభించెను. వాల్టేరు ప్రతిదేశపు రాజతోడను ఫరాసు భాషలోనే యుత్తర ప్రత్యుత్తరములు జరిపెను. ఇటలీదేశము లోని సుప్రసిద్ధ నాటకకర్తలు ఫరాసుభాషలోనే వ్రాసిరి. ఫరాసుభాషలో నున్న వాఙ్మయము శాస్త్రసముదాయము అప్పటికి మరి యేభాషలోను లేకుండెను. ఫరాసు వాఙ్మయమునందా కాలమున మిక్కిలి పేరువడసిన గ్రంథకర్తలిరువురు వాల్టేరు, రూసో వీరు వ్రాసిన గ్రంథములను వీరుబోధించిన సిద్ధాంతములను మానవచరిత్రములో నూతనశకమును ప్రారంభింపచేసినవి. వీరనేక గ్రంథములను రచించిరి. జీవిత పరమార్థమును గూర్చియు వివిద మనుష్యులమధ్యను వివిధ మానవసంఘములమధ్యను నుండవలసిన సంబంధములను గూర్చియు మానవులకుగల యభిప్రాయములలో సంపూర్ణముగు మార్పును కలుగచేసిరి. వాల్టేరుపండితుడు కవిత్వము, నాటకములు, నవలలు, ప్రహసనములు, వ్యాసములు, చరి

త్రలు, తత్వశాస్త్రము, రాజకీయశాస్త్రము, ప్రకృతిశాస్త్రములు,
మొదలగు నన్నివిషయములను గూర్చియు, నసంఖ్యాకము
లగు గ్రంథములు వ్రాసెను. ఏబదిసంవత్సరముల కాలము
ఎడతెగకుండ గ్రంథములు వ్రాయుటచే యూరపు ఖండమునం
దంతటను ప్రభువులచేతను ప్రజలచేతనుగౌరవాశ్చర్యములతో
నీయన గ్రంథములు చదువబడుచుండెను. ఈయన వ్రాసిన
గ్రంథములు ఎనుబదితొమ్మిది సంపుటములయ్యెను. పరిపాలన
లోను, శాసనములలోను, రాజ్యాంగవిధానములోను, గల
లోపములను మిగుల కఠినముగ విమర్శించెను. సాంఘిక
దోషములను అసమానత్వమును తీవ్రముగ ఖండించెను. నీతి
యుపన్యాసమును వర్ధిల్లవలెననియు, మానవులకు సమానత్వ
మును స్వాతంత్ర్యమును కావలెననియు ప్రతిగ్రంథమునందును
వ్రాసెను. ప్రభుత్వముచేసెడి అక్రమములను నిర్భయముగ
చూపినందుకును, రాజకీయాభిప్రాయములను వెల్లడించినందు
నకును శిక్షించుట మిగుల దుర్మార్గము అనాగరికపద్ధతియని
వాల్టేరు వ్రాసెను. మతస్వేచ్ఛలేకుండ చేయుట గొప్ప పాప
కృత్యమనియు నాయన వ్రాసెను. మానవజన్మము మిగుల
ఘనమయినదనియు, కాయకష్టము మిగుల గౌరవమయినదనియు
చూపెను. వాక్స్వాతంత్ర్యము, పత్రికాస్వాతంత్ర్యము, మత
స్వేచ్ఛ — ఈమూడును సంపూర్ణముగ నుండవలెనని
కోరెను. ప్రభుత్వములును, మతగురువులును ప్రజలస్వేచ్ఛను
నీతిని వృద్ధిచేయుటకై పుట్టినవారుగాని, ప్రజల స్వాతంత్ర్యము
నణచుటకును, ప్రజలను నిర్బంధించి భయపెట్టి మనస్సులలోని
యభిప్రాయములకు వ్యతిరేకముగ మాటలాడు కపటవేషధారు

లను గావించుటకు పుట్టినహేతుకారని ఆయన విమర్శించెను. పదిసంవత్సరములు ఆయన ఫ్రాన్సుదేశమున గొప్పజ్ఞాన జ్యోతియై ప్రకాశించెను. మానవులు పోగొట్టుకొనిన స్వాతంత్ర్యమును తిరుగ సంపాదించుటకు సతతము కృషిసలిపెను. తనదేశములో రెండుతరములవారి అభిప్రాయములను భావములను ఉద్రేకములను పూర్తిగామార్చివేసెను. అమెరికా స్వతంత్ర యుద్ధమునాటి కీయనకు ఎనుబదిమూడు సంవత్సరముల వయస్సుగలదు. 1778 వ సంవత్సరమున నీయన పారిసును దర్శించుటకు వచ్చినపుడు ప్రజలీయనకు చూపిన గౌరవమునకు మేరలేదు. అమెరికా స్వతంత్రపక్షపు నాయకులలో నొకరగు బెంజమిను ఫ్రాంక్లిను తన మనుమని వాల్టేరుయొక్క యాశీర్వచనమునకు గొనిపోయెను. ఆపిల్ల వాని శిరమున తన హస్తముంచి "భగవంతుని యనుగ్రహమును, స్వాతంత్ర్యమును పొందుదువుగాక!" యని యాజగద్విఖ్యాతపురుషు డాశీర్వదించెను.

ప్రజలలో విప్లవ భావములను నిజముగా కలుగచేసినది రూసో. ఈయన గ్రంధములు మిగుల తీవ్రభావములుగలిగి, యుద్రేకపూరితములై ప్రజాసమూహముల హృదయములను పూర్తిగ నాకర్షించెను. ఈయన జాడ్యగ్రస్తుడు, కడుబీదవాడు, అతి స్వతంత్రుడు. ఈయనను రాజులును ప్రభువులును అపాయకరమైన వానినిగ నెంచిరి. ప్రజలు విశేషముగ ప్రేమించిరి. మానవులను నాగరికత యనునది నైజధర్మములనుండి దూరముగ చేసి మాలిన్యమును కలుగచేసినదనియు, నాగరికతయను విషవృక్షమును నరికివైచి మానవులు స్వచ్ఛమగు సహజ

స్వభావమును తిరిగిపొంది, సృష్టికర్తయొక్క యుద్దేశ్యములను నెరవేర్చవలెననియు నాయన ముఖ్యసిద్ధాంతము. "సృష్టిలో అందరు సమానులు. ఎక్కువ తక్కువలు లేవు. స్వభావముగ నీతిగలవారు. శారీరదార్ఢ్యముగలవారు. స్వేచ్ఛగలవారు, నాగరికత యనునది అసమానత్వమును అవినీతిని దెచ్చినది. శరీరదార్ఢ్యమునుకూడ పాడుచేసినది. కొద్దిమంది స్వార్థపరులు నాగరికతపేరున విశేషమందిని దాసులుగచేసికొనినారు. కావున నాగరికతను నిర్మూలనముచేసి మనుష్యులలో స్వభావజన్యమగునీతి, స్వతంత్రము, సమానత్వములను తిరిగి స్థాపించవలెను. విద్యగలవారికన్న విద్యలేనివారును నాగరికులకన్న అనాగరీకులును, భాగ్యవంతులకన్న బీదవారును ఎక్కువ నీతిమంతులు" అని ఆయన వ్రాసెను. ఆయన రచించిన గ్రంథములలో ముఖ్యమయినవి "న్యూహెలాయిసా" "ఎమిలీ" "సోషలుకంట్రాక్టు" అను మూడుగ్రంథములును. వీటిని అతిఆతృతతో ప్రజలు చదివిరి. ఆయన వ్రాసినమాటలు ఒకగొప్ప ప్రవక్తయొక్క సందేశములని ప్రజలునమ్మిరి. "గ్రామములను విడువవద్దు, బస్తీలలోచేరవద్దు, బస్తీలలో చెడిపోవుటకు అనేకమార్గములుగలవు. పల్లెటూళ్ళు స్వచ్ఛమయినవి. నీతిమంతమయినవి" అని ఆయన వ్రాసెను. "దైవాంశసంభూతులమని చెప్పి రాజులు ప్రజలను మోసముచేసి నిరంకుశముగ పాలించుచుదాసులుగచేసుకొనియున్నారు. పుట్టుకవల్లనే శ్రేష్ఠులమని ప్రభువులు ప్రజలను లోబరచుకొని దాస్యములో ముంచియున్నారు. ఈశ్వరుని ప్రతినిధులమని పలికి మతగురువులు ప్రజలను తమ పాదాక్రాంతులుగ చేసి

కాని వారిని మౌఢ్యములో ముంచి మతస్వేచ్ఛను పూర్తిగా తీసివేసినారు. ఈసిద్ధాంతములు కేవలము స్వార్థపరులచే కల్పింపబడినవి” అని విమర్శించెను. “దేశము ప్రజలది. ప్రజలు మొదట ప్రభుత్వములు లేక ఎవరియిష్టమువచ్చిన విధమున వారు ప్రవర్తింపుచు సంపూర్ణస్వేచ్ఛను కలిగియుండిరి. కాని కలహములు కలుగుచుండెను. శాంతికలిగి యుండుటకై ప్రజలందరును కలిసి ప్రభుత్వముల నేర్పరచుకొనిరి. రాజులు గాని మరి ఏప్రభుత్వములుగాని ప్రజలేర్పరచుకొనగ వచ్చిన వారు. ప్రజలలాభమునకై ఏర్పడినవారు. ప్రజలకునౌకరులు. తమ్ముతాము పాలించుకొను హక్కు ప్రజలది. ప్రజల చిత్తమే చట్టము. ఏ ప్రభుత్వమునను ఎప్పుడు ప్రజల కిష్టము లేకపోయినను ఆ ప్రభుత్వమును కూలద్రోసి తమయిచ్చవచ్చిన ప్రభుత్వమును ప్రజలుస్థాపించుకొనవచ్చును.” అనునది ఆయనరాజకీయ తత్వము. “ఏ ప్రభుత్వమునకును ప్రజలయిష్టమునకు వ్యతిరేకముగ ప్రవర్తించుటకు హక్కు లేదు. ప్రజల స్వాతంత్ర్యమును పాడుచేయుటకు అర్హత లేదు. స్వాతంత్ర్యము ప్రజల సహజధర్మము. ప్రజలస్వతంత్రతను కాపాడుకొనుటకును ప్రజలచిత్తమునకు లోబడినడచుకొనుటకును ప్రథమమున ఒడంబడికెలు జరిగి ప్రజలు ప్రభుత్వములనేర్పరుచుకొన్నారు. కాలక్రమమున రాజులును ప్రభువులును ఇతర ప్రభుత్వములును మొదటి యొడంబడికెలకు భిన్నముగ ప్రజలస్వతంత్రతను హరించిప్రజలను దాసులనుచేసికొని నిరంకుశత్వమును స్థాపించియున్నారు. ప్రజలుతమహక్కులను గూర్చి మరచిపోయి బాధలకులోనయినారు. తిరిగి స్వతంత్రతను

సంపాదించుకొనుట ప్రజలవిధియైయున్నది. దేశములోని ప్రజలందరును ఒకేజాతి, ఎక్కువ తక్కువలు లేవు. అందరికిని దేశాభిమానమును తిరిగి బోధించవలెను......" అని ఆయన వ్రాసెను. వాల్టేరు, రూసో, పండితులేగాక పెక్కుమంది గ్రంథకర్తలు ఫరాసుభాషలో గ్రంథములు వ్రాసిరి. ఆకాలమున ఫ్రాన్సుదేశములోని అందరు గ్రంథకర్తలును ప్రజ లనుభవించు సమస్తకష్టములకును స్వతంత్రతను పొందుట కన్న వేరుతరుణోపాయము లేదని వ్రాసిరి.

ఈగ్రంథ వ్యాపకమువలన ఫరాసుదేశములో నూతనాదర్శములు, నూతనకోరికలు, నూతనభావములు, పూర్తిగా కలిగెను. త్వరలో గొప్పవిప్లవము కలిగి ప్రపంచము మారనున్నదని ఫ్రాన్సులో చాలమంది తలచుచుండిరి. "మాతరువాత ప్రపంచ మాఖరగును. ప్రళయమురానున్నదని" పదిహేనవ లూయిరాజుచెప్పుచుండెను. "విప్లవకాలమును సమీపించుచున్నాము. యూరోపుఖండములోని గొప్పరాజ్యములు విశేషకాలము నిలుచుటయసంభవము" అని 1760 సంవత్సరములో రూసో పండితుడు వ్రాసెను. "మేము విప్లవమునకు విత్తులు వెదజల్లుచున్నాము. విప్లవమురాకతప్పదు." అని 1762 సంవత్సరమున వాల్టేరుపండితుడు వ్రాసెను. "విప్లవము ఇదివరకే ప్రారంభమయినదనియు రాచకీయ విప్లవ మింకను రాకుండినను భావవిప్లవమిదివరకే పూర్తియైనదనియు" యుండిపెకవిల్లీ యను గ్రంథకర్త వ్రాసెను. అమెరికాలో ప్రజాస్వాతంత్ర్యోద్యమమును చూచి పదునారవ లూయి రాజుయొక్క మంత్రి మాలిషెర్బీ 1614 సంవత్సరమునుండియు

సమావేశపరచబడని స్టేట్సు జనరలు (దేశప్రతినిధిసభ) ను వెంటనే పారీసులో సమావేశపరచమని 1775 సంవత్సరము లో ఫరాసు రాజునకు సలహానిచ్చెను. ఫరాసు దేశములో కూడ ప్రజలు తిరుగబాటులు చేయకముందే ప్రజలహక్కులను స్థాపించుటమంచిది యని ఈయన యుద్దేశించెను.

(3)

అమెరికాలో స్వతంత్ర భావములు

అమెరికా ప్రజలుకూడ వాల్టేరు, రూసో, పండితుల గ్రంధపఠనము గావించుచు భావోద్రేకమును పొందుచుండిరి. "అమెరికావారియందు ఫరాసు వారికి ప్రథమమునుండియు సానుభూతియు మిత్రభావమును నుండెను. అమెరికాలో విస్తారమగు ప్రదేశములు గలవు. ఎవరికిని లోపములేదు. సమానత్వము బాగుగనున్నది. ఇంకను విషయలోలతలో చిక్కు లేదు. స్వాతంత్ర్యముతో కూడ యోగ్యత, నమ్రత గలదు. పరిపక్వమయిన రాజకీయ ప్రతిష్టాపనలను స్థాపించుకొనుటకును ప్రజాసౌఖ్యమునకై పాటు బడుటకును అచట మంచియవకాశముగలదు" అని 1750 సంవత్సరమున ఫరాసుప్రధాన మంత్రి తుర్గో చెప్పెను. "వారిచుట్టును అడవులు సృష్టిసౌందర్యము మరిమెచటను లేవు. రూసోపండితుడు వ్రాసినవిధమున సృష్టి యొక్క శాసనముల ననుసరించి స్వభావమగు స్వతంత్రములుగల సంఘమును నిర్మించుకొనుట కమెరికా వారికవకాశముగలదు"ని మరియొక ఫ్రెంచి గ్రంథకర్త వ్రాసియున్నాడు. రూసోపండితుని విప్లవ సిద్ధాంతములను ప్రథమమున నవలంబించి లోకమునకు మార్గదర్శకు లగుట కమెరికావారే యుం

దరికన్న అర్హులని పరాసు దేశములోని బుద్ధిమంతులు తలచుచుండిరి. మరియు తమకు శత్రువగు యింగ్లాండుతో నమెరికనులు పోరాడుచున్నందున పరాసు రాచకీయవేత్తల కమెరికనులయందు సానుభూతి మరింత హెచ్చినది. ఇంగ్లాండునందు ద్వేషమును అమెరికనులయందు ప్రేమగౌరవములను ప్రతిపరాసుపౌరుని హృదయమునందును ప్రజ్వరిల్లెను. స్పైన్ దేశపురాజగు మూడవచార్లెసు ఆకాలమున ఫ్రాన్సురాజుతో స్నేహమును ఇంగ్లాండునందసూయను కలిగియుండెను. కావున అమెరికా స్వతంత్ర యుద్ధమున పరాసు, స్పైన్, దేశముల ప్రభుత్వములవా రమెరికను పక్షము నవలంభించుటకు సిద్ధముగ నుండిరి. తక్కిన యూరోపు ప్రభుత్వము లన్నియు తటస్థముగ నుండెను.

# అమెరికా సంయుక్తరాష్ట్రములు.

ఏడవ అధ్యాయము.

## స్వతంత్రయుద్ధము — ప్రథమభాగము.

(1)

యుద్ధప్రారంభము. ఆంగ్లేయ సామ్రాజ్యముపై అమెరికావారు స్వతంత్రముకొఱకు చేసినయుద్ధము రెండుభాగములుగ విభజించవచ్చును. 1775 మొదలు 1778 వరకు అమెరికారాష్ట్రము లితరుల సహాయము లేకనే ఆంగ్లేయులతో పోరుసలిపిరి. ఇది ప్రథమభాగము. 1778 మొదలు 1783 వరకు జరిగిన యుద్ధములో ఫరాసువారును, స్పెయినువారును, అమెరికనులకు తోడ్పడిరి. ఇది రెండవభాగము. బోస్టనుపట్టణమునకు పదునైదుమైళ్ళదూరమున నున్న కంకార్డుగ్రామమున నొక ఆయుధాగారము గలదని ఆంగ్లేయసేనాధిపతి జనరలు గాజునకు తెలిసి దానిని నిర్మూలింపచేయుటకును ప్రజానాయకులగు హాంకాకు సామ్యుయేలు ఆడమ్సులను పట్టుకొనుటకు లెఫ్టినెంటుకల్నలుస్మిత్తును ఎనిమిదివందల సైనికులతో 1775 సంవత్సరము ఏప్రియల్

నెల 18 వ తేదీన రాత్రి పదకొండుగంటలకు బంపెను. ఈసం
గతి ప్రజలకు ముందుగనే తెలిసి ఎదిరించుటకు సిద్ధపడిరి. కల్న
లుస్మిత్తు ముందుపంపిన పటాలమును బాస్టనుకు 10 మయిళ్ళ
దూరముననున్న లెక్సింగ్టను వద్ద ప్రజలసైన్యమడ్డగించెను. ఉభ
యులునొకరిపై నొకరుతుపాకీలనుగాల్చిరి. ఇంతలో స్మిత్తుయొ
క్క తక్కిన సైన్యములు వచ్చి చేరినందున ఆంగ్లేయ సైన్యము
లుదయము ఏడుగంటలకు కంకార్డుగ్రామము చేరెనుగాని ఆయు
ధములలో కొద్దిభాగము మాత్రమే వారికిదొరకెను. ఇంతలో
అమెరికను ప్రజాసైన్యములు వచ్చెను. అప్పుడు జరిగిన యుద్ధ
ములో ఆంగ్లేయుల పక్షమున 65 మంది సైనికులు చనిపోయిరి.
180 మందికి గాయములు తగిలెను. ఇరువది ఎనిమిదిమంది
అమెరికనులచే ఖైదు చేయబడిరి. అమెరికనులలో యేబది
తొమ్మిదిమందిమరణించిరి.ముప్పదితొమ్మిదిమందికిగాయములు
తగిలెను. ఐదుగురు మాత్రము ఆంగ్లేయులచే జిక్కిరి.
తఃబీతునొందిన ఆంగ్లసైనికులు తరిబీతునొందని అమెరికెను
ఐచ్ఛిక భటులగు రైతులచే పరాజయము నొందినందున ఆం
గ్లేయుల ఖ్యాతి నశించెను. అమెరికను సైనికులు వెంటనంటి
తరుమగా ఆంగ్లసైనికులు పారిపోయిరి.

జనరలు గాజుయొక్క సైన్యములు మిక్కిలి తొందరగా
పారిపోయెను. మూడుగంటలలో నిరువదిమైళ్లదూరము
పారిపోయెను. అమెరికనులు వెంబడించిరిగాని అంతతొందర
గా పోజాలక వెనుకకు తగ్గిరి. ఇదియుద్ధప్రారంభము.

దీనితో దేశమునందంతటను గొప్పకలవరము జరిగెను.
ఇంతటినుండియు తమగవర్నరగు జనరలు గాజునకట్టి విధేయ

తను చూపకూడదనియు తమ దేశమున కాయన గర్నరవు్రవ నియు మెసచుసెట్సు రాష్ట్రీయసభవారు తీర్మానించిరి. కొలది దినములలో నిరువదివేల అమెరికను సైన్యములు బోస్టనును ముట్టడించి అందలియాంగ్లేయ సైన్యముల కాహారపదార్థములు బయటనుండి రాకుండచేసెను. దక్షిణమున చాల దూరమున నున్న యుత్తర కారొలీనా రాష్ట్రములోని యొక పట్టణ ప్రజలు తమ కాంగ్లేయ రాజునందు రాజభక్తి లేదనియు స్వతంత్ర్యము పొందితిమనియు ప్రకటించిరి.

ఆంగ్లేయులు లోబడుట.

న్యూయార్కు రాష్ట్రములోని రెండువందల డెబ్బది మంది సైనికులను వెంటబెట్టుకొనిపోయి యీథను ఆలను అను అమెరికను సేనాని మే 10 తేదీన ఆకస్మికముగా ఆంగ్లేయుల స్వాధీనమందున్నట్టి కొండరీనా యనుకోటను ముట్టడించెను. అందులోని ఆంగ్లేయసేనాధిపతిని సైన్యములను భగవంతుని పేరను అమెరికా దేశీయ మహాజనసభ పేరను తనకు లోబడమని కోరెను. ఎదిరించుటకు శక్తి చాలక ఆంగ్ల సైన్యములోబడెను. నూట యిరువది రెండు ఫిరంగులును విశేష సంఖ్యగల పడవలును చాలగ నాయుధసామగ్రిలును తుపాకిమందును నాకోటతో కూడ అమెరికనులవశమయ్యెను. రెండుదినములతరువాత నీఅమెరికను సైన్యములు ఎట్టిఆటంకము లేకుండ మరియొకకోటను లోబర్చుకొనిరి. మే 10 వ తేదీన అమెరికా దేశీయ మహాజనసభ రెండవసారి ఫిలడల్ఫియా పట్టణమున సమావేశమయ్యెను. వచ్చినప్రతినిధులలో ముందుసంయుక్త రాష్ట్రముల కధ్యక్షులుకాబోవు వాషింగ్టన్

థామసు జఫర్సన్ జాన్ఆడమ్సులు కూడనుండిరి. మెసచుసెట్సు రాష్ట్రప్రతినిధులచే నుపపాదింపబడి ఆంగ్లేయులతో యుద్ధము చేయుటకు దేశీయమహాజనసభవారు తీర్మానించిరి. పదిహేను వేలసైన్యములను, ఇరువదిలక్షల డాలరులఖర్చును ప్రోగుచేయుటకును తీర్మానించిరి.

జార్జి వాషింగ్టను అమెరికను సేనలకు సర్వసేనాధిపతి యగుట

దేశీయమహాజన సభవారిటులతీర్మానములు చేయుచుండగా రెండువేలమంది సైనికులతో నొక ఆంగ్లేయనౌకాదళము బాస్టను రేవులోనికి వచ్చెను. జూన్ 12 వ తేదీన జనరలుగాజు సైనిక శాసనమును ప్రకటించెను. ప్రజానాయకులగు సామ్యుయలు ఆడమ్సు హాంకాకులు తప్పమఱిఎవరైన ప్రజలు తమలో చేరినయెడల క్షమాపణనొసగెదననికూడ ప్రకటించెను. ఈప్రకటనమును లక్ష్యముచేసినవారెవరును లేరు. దేశీయమహాజనసభవారు అమెరికను సైన్యములపై జార్జివాషింగ్టన్‌ను సర్వసేనాధిపతిగ నియమించిరి వాషింగ్టనున కిప్పుడు నలువదిమూడుసంవత్సరములువయసు గలదు. పదుహేను సంవత్సరములనుండియు వర్జీనియా రాష్ట్ర ప్రజాప్రతినిధిసభలో సభ్యుడుగా నుండెను. ఇదివరకాంగ్లేయప్రభుత్వపక్షమున వర్జీనియా సైన్యములకు సేనాధిపతియై యేడుసంవత్సరములు యుద్ధములో పరాసువారిపైయుద్ధము చేసెను. విషయజ్ఞానమునందును సరియగు నాలోచనమునందును అమెరికాలో నప్పుడున్న ప్రముఖులందరిలోను శ్రేష్ఠుడని ఈయనను గూర్చి హెన్రీపాట్రికు చెప్పెను. అమెరికను సర్వసేనాధిపత్యమున కాయనజీతము పుచ్చుకొనుటకు

తిరస్కరించి తనకగు ఖర్చులు మాత్రము తీసుకొనుటకొప్పుకొనెను. వాషింగ్టన్ సర్వ సేనాధిపత్యము వహించకమునుపే బంకరు కొండవద్ద యుద్ధము జరిగెను. ఇది బాస్టను పట్టణమునకు సమీపముననున్న 110 అడుగుల ఎత్తుగల మిట్ట ప్రదేశము. జనరలు గాజు దీని నాక్రమించి అచట నొక చిన్నకోటను నిర్మింపబోవుచున్నాడను వార్త తెలిసి ప్రెస్కాటు సేనాని వెయ్యిమంది అమెరికను సైనికులతో వెళ్ళి ముందుగనే నాప్రదేశమున ప్రవేశించ దలచెను. గాని బంకరు కొండకు మారుగ అమెరికను సైన్యములు పొరబాటున దానికి దక్షిణముననున్న బ్రీడు కొండ నాక్రమించెను. ఇదియు ననుకూలమైన ప్రదేశమే. మూడువేల మంది ఆంగ్లసైనికు లచటికిపోయి అమెరికను సైన్యములను ముట్టడించిరి. అపుడు జరిగిన యుద్ధములో నాంగ్లేయులలో నెక్కువమంది హతులగుటయు గాయములు పొందుటయు జరిగెను. గాని అమెరికనుల యుద్ధసామాగ్రులయి పోయినందున ప్రెస్కాటు సేనాని యాప్రదేశమును వదలి తన అమెరికను సైన్యములను సురక్షితముగ నొక మైలు దూరముననున్న ప్రాస్పెక్టుకొండకు చేర్చెను. ఈ యుద్ధము బాస్టనున కతి సమీపమున జరిగియుండుటంబట్టి బాస్టను ప్రజలు గుంపులు గుంపులుగా మిద్దెలమీద నుండియు మేడలమీదనుండియు చూచుచుండిరి. ఆంగ్లేయసైనికులు చార్లెస్టను పట్టణము నంతయు తగులబెట్టి భస్మీపటలము గావించిరి.

సేనలకు హెచ్చరిక

ఈ యుద్ధము జరిగిన దినముననే దేశీయమహాజనసభ వారు నలుగురు సేనాధిపతులను ఎనిమిది మంది సహాయ సేనానులను కూడ నియమించిరి. ఇంగ్లండియనులు తటస్థముగ నుండునట్లేర్పాటు చేయుటకై కొంత ద్రవ్యముతో కొందరు రాయబారులను పంపిరి. జూను 21 వ తేదీన జార్జివాషింగ్టను సర్వసేనాధిపత్యము వహించుటకు బయలుదేరెను. త్రోవలో బంకరు కొండ యుద్ధసమాచారము తెలిసెను. సైన్యములవద్దకు చేరగనే వారిపుడు అమెరికా సంయుక్తరాష్ట్రముల సైనికులనియు రాష్ట్రభేదములు నశించి యందరిని యేకజాతీయభావము పురిగొలుపవలెననియు మనమందర మవలంబించియున్న పోరాటములో నెవరెక్కువ సేవచేయుదురను తలంపుమాత్రమే వారి మనసు నందుండవలెననియు సేనలకొక హెచ్చరికను బంపెను. గాని సేనలు మంచిస్థితియందు లేవు. సేనాధిపతులు అసమర్థులు. సైనికులు అవిధేయులు. వాషింగ్టను తరుచుగ సైనికులను కఠినముగ శిక్షించుచు వారిలో జాగ్రత్తను విధేయతను కలుగజేసెను. సేనలన్నియు బాస్టను పట్టణము చుట్టునుంచబడినవి. ఆంగ్లేయసైనికులకును అమెరికను సైనికులకును తరుచుగ చిన్నచిన్న కలహములు కలుగుచుండెను. వాషింగ్టనేమి చేయుటకును మందుగుండుసామాను బహుస్వల్పముగనున్నది. అదయిపోగనే చేయవలసినదేమిటో తోచకుండెను. రోడు ఐయిలండు న్యూయార్కు మొదలగు రాష్ట్రముల వారికి మందుగుండు సామానెంత స్వల్పముగ లభించినను పంపవలసినదని వ్రాసెను. ఇంతలో సైనికుల నిర్ణయకాల సమాప్తి

సమీపించుచున్నది. కొంతగడువు వరకుమాత్రము పనిచేయ వలెనని వివిధ రాష్ట్రములనుండి ఐచ్ఛిక జాతీయసైనికు లను పోగుచేసి యుండిరి. గడువుకాగనే వారు స్వగృహములకు చేరెదరు. కనెక్టికటు, రోడుఐలెండు సైనికులకాలము డిశంబరు ప్రథమ తేదీనను మెసచుసెట్సు నుండివచ్చినవారి గడువు డిశంబరు నెలాఖరునను ముగియును. దేశీయమహా జన సభవారికి ఋణములు తగినంతపోగుకాలేదు. చేతిలో సొమ్ములేదు. కాని బాస్టనును వాషింగ్టను స్వాధీన పరచు కొనవలెనని మాత్రము దేశములో నాతురతయుండెను. ఈ సందర్భములలో బాస్టనును ముట్టడించుట వెర్రితనమని వాషింగ్టను సంగతుల నన్నిటిని దేశీయమహాజన సభవారికి విశదముగ తెలియచేసినమీదట బెంజమిను ఫ్రాంక్లిను అధ్యక్షత క్రింద నిరువదిమూడువేల మంది సైనికులను జమచేయుటకును వాషింగ్టనుతో సంప్రదించుటకును నొక యుపసంఘము నేర్పాటుచేసిరి.

2

రాష్ట్రములలో స్వతంత్రస్థాపనము

ఈ సమయమున దక్షిణ రాష్ట్రములలో నాంగ్లేయ రాజ్యాధికారము తొలగిపోవుచుండెను. వర్జీనియారాష్ట్రపు గవర్నరగు డనుమొరు ప్రభువు అక్కడి మందుగుండుసామానును వశపరచు కొనెను. రాష్ట్రప్రజా ప్రతినిధిసభవారు సమావేశమై యా మందుగుండు సామాగ్రియొక్క మూల్యమును గవర్నరువద్ద నుండి బలవంతముగ వసూలుచేసి యాసొమ్మును దేశీయమహా జనసభవారికి పంపిరి. తరువాత కొలదికాలమునకు ప్రజలకు

తరుమబడి గవర్నరు పారిపోయి యొక యాంగ్లేయ నౌకలో చేరెను. అక్కడ సమావేశము కావలెనని ప్రజాప్రతినిధిసభ కాజ్ఞాపించగ వారు పోవుటకు నిరాకరించి యొకస్వతంత్ర ప్రజాప్రభుత్వము నేర్పాటుచేసిరి. రెండు కారొలీనా రాష్ట్రములలోను కూడ ప్రజల కొందరలచేత నాంగ్లేయ గవర్నరులు పారిపోయిరి. యాంగ్ల నౌకలలోనికి చేరిరి. ఆ రాష్ట్రములలోను స్వతంత్ర ప్రభుత్వము లేర్పడెను. ఇక్కాలమున నాంగ్లేయ ప్రముఖుడగు వాల్పోలు ''అమెరికా పిరికిపందల దేశమని ప్రకటించి తమ తేయాకు త్రాగనితో ఉపవాసము చేయించెదమని యాంగ్లేయ పార్లమెంటువారు బెదరించిరి. కొంత సైన్యము నొక పట్టణమునిరాటికి బంపగా నదియక్కడ చిక్కువడెను. ముట్టడికై సగము నౌకాదళమును పంపిరి. ఫిలడల్ఫియాలో సమావేశమైన అమెరికను మహాసభ ఆంగ్లసైనికులు కష్టములో చిక్కువడుటకు చూచి భయపడి రాజికై ప్రయత్నించినను యాతడు సైనికుల నేమియు చేయవలదని యుత్తరువిచ్చిరి. చివరకు సైన్యములను పోరాడుట కాజ్ఞాపించిరి. రెండుపర్యాయము లోడిపోగనే యొక మనుష్యుడైన మిగులకుండ యుద్ధము చేయవలెనని యుత్తరువు చేసిరి. అమెరికా పూర్తిగ నాంగ్లేయులనుండి పోవుటతోగాని తృప్తి చెందద" ని తన స్నేహితునికి వ్రాసెను. 1775 సంవత్సరం ఏప్రిలునెలలో నాంగ్లేయప్రముఖుడగు బర్కుతో నమెరికా యింగ్లాండునుండి విడిపోక తప్పదని బెంజమిను ఫ్రాంక్లిన్ చెప్పెను.

దేశీయ మహాజన సభవారి అర్జీలను ఆంగ్లపార్లమెంటు వారు నిరాకరించిరి.

బర్కు మొదలగు కొందరు పార్లమెంటు సభ్యులు సంధికై ప్రయత్నించిరి. 1763 సంవత్సరమువరకు నాంగ్లేయ ప్రభుత్వమువారు చేసియున్న శాసనముల నన్నిటిని తాము శిరసావహింతుమనియు తరువాత చేసిన చట్టములను రద్దుపరచినచో తా మాంగ్లప్రభుత్వము క్రిందనే యుందుమనియు మరియొక మనవిని వ్రాసుకొని అమెరికను దేశీయ మహాజనసభవారి పక్షమున విలియం పెన్ను 1775 సంవత్సరం జులై నెలలో నాంగ్లేయ పార్లమెంటువారి దర్శనము చేయుటకు వెళ్ళెను. కాని విలియం పెన్నుకు ఆంగ్లప్రభుత్వమువారు దర్శనమిచ్చుటకు నిరాకరించిరి. ఆయన దాఖలుచేసిన అర్జీకి జవాబేమని యడుగగ జవాబు చెప్పుటకు తిరస్కరించిరి. తరువాత పదిరోజులకనగ 23 వ ఆగస్టు తేదిన తిరుగబాటును రాజద్రోహమును నణచివేసెదమని యాంగ్లేయరాజు ప్రకటనమును గావించెను. జనరలు గాజు సేనాని పిలిపించి యాతనకు సహాయకులుగ కార్లెటన్, హౌ, అను నిద్దరు సేనాధ్యక్షులను నియమించిరి. రాజుయొక్క స్వంతదేశమగు హానోవరునుండియు నితర జర్మను రాష్ట్రములనుండియు జర్మను సేనలను కూడ రావించిరి. హాలెండు, రుష్యాదేశముల ప్రభుత్వములతోను సైన్యములు పంపమని కోరిరి. గాని వారు పంపలేదు.

అక్టోబరు 26 వ తేదీన నాంగ్ల పార్లమెంటు తిరిగి సమావేశమయ్యెను. రాజుయొక్క తీవ్ర

**ఆంగ్లప్రభుత్వము వారమెరికనులను చీలదీయుట.** మగు నుపన్యాసములో అమెరికనులు స్వతంత్రమును పొందుటకు యుద్ధము చేయుచున్నారనియు వారిని జయించి లోబరచుకొనుటకు ఆంగ్లేయప్రభుత్వము నిశ్చయించినదనియు నుడివెను. పార్లమెంటులోని కొందరు ప్రముఖులగు సభ్యులు అమెరికావారితో సంధి చేసుకొనవలెనని చెప్పిరి.టొ కాని యెక్కువమంది సభ్యులును రాజును మంత్రులును అమెరికావారి యవిధేయతకు బుద్ధివచ్చునట్లు శిక్షించవలెననియే పట్టుదలను చూపిరి. ఆంగ్లదేశములోని చాలమంది ప్రజలును రాజుపక్షముననేయుండిరి. అమెరికాలోని తిరుగబాటు నణచివేయుటకై కావలసిన సైన్యములను బంపుటకును ఈయుద్ధమున కవసరమగు వ్యయము చేయుటకును మంత్రుల కధికార మొసంగబడెను. అమెరికాలోని పదమూడు రాష్ట్రములతోను నెట్టివర్తకము జరుపగూడదని పార్లమెంటువారు చట్టమును చేసిరి. గాని ఏరాష్ట్రముగాని లేక రాష్ట్రములోని కొంతమంది ప్రజలుగాని ఆంగ్లేయులతో సఖ్యముగ నుండునట్లొడంబడినయెడల వారిమీద యుద్ధము చేయమనికూడ ప్రకటించి ఇట్లు ఆంగ్లేయులతో చేరువారిని ప్రోత్సహించుటకై కమీషనరులను బంపిరి. ఇదిఅమెరికాలోని ప్రజలను చీలదీయుటకై యుద్దేశింపబడినపన్నుగడ. అమెరికాలోకూడ పెనిసిల్వానియా, న్యూజర్సీ, డెలవేరు, మేరీలాండు, అనునాలుగు రాష్ట్రములకును ఆంగ్లేయరాజ్యముతో విడిపోవుటకింకనుయిష్టము లేకుండెను.

అమెరికనుల అపజయము.

దేశీయమహాజనసభ వారు అమెరికను నౌకాదళ మేర్పారచిదాని నిబంధనలను చేసిరి. ఆంగ్లేయ సైనికుల కాహారము తీసుకొనిపోవు పడవలను పట్టుకొనుటకు తీర్మానించిరి. ఆంగ్లేయ సైన్యములను వదలి అమెరికను పక్షమునచేరిన మాంగమరీ సేనాని కొంతమంది అమెరికను సైనికులతో ఆంగ్లేయ రాజ్యముగుకనడాపైకి దండెత్తి నవంబరు 12వ తేదీన మాంటురీయలు పట్టణమును పట్టుకొనెను. అక్కడనున్న పరాసులును ఎఱ్ఱయిండియనులును కూడ అమెరికనులకు స్నేహభావమును చూపిరి గాని అక్కడచేరిన తరువాత మాంగమరికి నూతనకష్ట మెదుర్కొనెను. తన క్రింది సైనికులలో చాలమందికి గడువయిపోయినందున తమ స్వగ్రామములకు వెళ్లెదమని పట్టుబట్టిరి. ఇంతలో ఆర్నల్డు సేనానిని పదకొండువందల మంది అమెరికను సేవలతో కనడాలోని క్విబెకు పట్టణమును ముట్టడించుటకు బయలుదేరెను. గాని త్రోవలో నాహారపదార్థము లయిపోయెను. కొందరు సైనికులు విడిచివెళ్లిపోయిరి. మిగిలినవారు తిండిలేక ఎద్దులను కుక్కలను చంపుకొని తినిరి. తరువాత దుంపలనుతినిరి. చెట్లబెరడులను తినిరి. ఇవియు దొరకక రెండురోజులు పూర్తిగ నుపవాసముచేసిరి. చివర నెటులనో ఆర్నల్డు క్విబెకుచేరెను. అప్పటికి తొమ్మిది వందల సైనికులుండిరి. వస్త్రములుగాని తగినఆయుధసామానుగాని లేకుండెను. ఇట్టివారితో నేమియుచేయ జాలక కనిపెట్టుకొనియుండగా మాంగుమరీసేన నిమూడువందలమంది సైనికులతో వచ్చి కలసెను. ఈస్వల్ప సైన్యముతో అమెరికనులు

సైనికులు ధైర్యముగా క్విబెకుకోటను ముట్టడించిరి. గాని క్విబెకుకోట మిగుల బలముగ సంరక్షింపబడినది. లోపల రెండు సంవత్సరముల కుండదగిన భోజనములును బయటనుండిన అమెరికనులకు రెట్టింపుసంఖ్యగల ఆంగ్లేయసైన్యములు నుండెను. అమెరికనులు క్విబెకుకోట వశపరచుకొనలేకపోయిరి. మాంగమరీ సేనాని హతుడయ్యెను. మూడవవంతు అమెరికను సైనికులాంగ్లేయులచే ఖయిదీలుగా పట్టుకొనబడిరి. అమెరికనులు సంపూర్ణముగా నోడిపోయిరి.

అమెరికను జాతీయ పతాక మెత్తబడుట.

వర్జీనియారాష్ట్రముయొక్క ఆంగ్లేయగవర్నరు డనుమొరు ప్రభువు సైనికశాసనమును ప్రకటించెను. 1776 సంవత్సరం 1 వ జనేవరి తేదిన నాయనను నారుఫోకుపట్టణ ప్రజలు వెళ్ళగొట్టిరి. ఆయన నాంగ్లసైన్యములతో నాపట్టణమును ముట్టడించి తగలబెట్టెను. అందువలన అమెరికనులలో నాంగ్లేయులయందు ద్వేషమును కసితీర్చుకొనవలెనను నుద్రేకమును వృద్ధిచెందెను. ఆనూతనసంవత్సర ప్రథమదినముననే ఎరుపు తెలుపువర్ణముల పదమూడుచారలు గల అమెరికను జాతీయజండా ఎత్తబడెను. పదమూడు యుద్ధనౌకలుకూడ నిర్మించబడెను.

(3)

వాషింగ్టను దుస్థితి.

వాషింగ్టను సేనాని స్వల్పసైన్యములతో బాస్టనుపట్టణము బయట విడిసియుండెను. ఆయన కష్టములలో నీదుచుండెను. ఆయనవద్ద తగిన మందుగుండు సామానుగాని ద్రవ్యముగాని లేకుండెను. సైనికులు ఇండ్లకు పోవలెనని యాతురపడుచుండిరి. ముఖ్యముగా

కనెక్టికటు రాష్ట్రమునుండి వచ్చిన సైనికులు నిర్ణయకాలము గాకముందే గృహములకు వెళ్ళిరి. ఇంకకొన్ని రాష్ట్రములవారును గడువుకాగనే వెళ్ళిరి. క్రొత్తసైన్యములు కొన్ని వచ్చిచేరెను. కాని తగిన శిక్షపొందియుండ లేదు. దేశీయమహాజన సభవారు బాస్టను పట్టణమును ముట్టడించవలసినదని వాషింగ్టను కుత్తరు విచ్చియుండిరి. తనవద్దనున్న యుద్ధసాధనములు చాలక అందుకు సమయమును వేచియుండెను. మానవ చరిత్రలో నెక్కడనైన వినుదుము. ఇటువంటి దీనస్థితి ఎవరికైన కలిగినదాయని ప్రశ్నించుచున్నాను. బలవంతమయిన ఆంగ్లసేనలు బాస్టనులో నుండగ ఆపట్టణమును బంధించుటకు తుపాకి మందు కూడ లేక మే మారు నెలలనుండియు నూరక కాచుకొని యున్నారము. మా సైన్యములలో నొకటి విడిపోవుటయు మరియొకదానిని నూతనముగ తరబీదు చేసుకొనుటయు జరుగుచున్నది. ఇట్టిస్థితిలో మేమేమిచేయగలము? గాని యెటులో పరమేశ్వరుడు మాశత్రువుల కన్నులకంధకారముగప్పునని మాత్రము నేనత్రికరణశుద్ధిగనమ్మచున్నాను అని వాషింగ్టను ఒకస్నేహితునికి వ్రాసెను. గాని ఇట్టికష్టస్థితిలో గూడ నమెరికావారు స్వాతంత్ర్య ప్రకటనము గావింపక తప్పదని ఆయన నిశ్చయించెను.

వాషింగ్టను యొక్క జయము

తుట్టతుదకు మార్చి 4 వ తేదీన ఆకస్మికముగా నొక రాత్రి వాషింగ్టనుసేనాని బాస్టను పట్టణమునకును దానిసముద్ర రేవునకును ముఖ్యాబలమైన డార్చెష్టరు మిట్టప్రదేశమును పట్టుకొని స్వాధీనమును పొంది అక్కడకందకములు త్రివ్వ కోటబురు

జాలను కట్టి సంరక్షణకాయత్త పరచుచుండెను. గొప్ప తుపాను కలిగి ఆంగ్లనౌకాదళము నిష్ప్రయోజక మయ్యెను. అమెరికను సైన్యములు మిట్టప్రదేశములనుండి బోస్టనులోని ఆంగ్లేయ సైన్యములపై కాల్చుచుండెను. 17 వ మార్చి తేదీన ఆంగ్లేయసైన్యములు బోస్టను పట్టణమును వదలి వెళ్ళిపోయెను. మార్చి 20 వ తేదీన వాషింగ్టను తన అమెరికను సైన్యములతో పురవాసుల జయజయధ్వానములమధ్య బోస్టనుపుర ప్రవేశము గావించెను. పదిరోజుల తరువాత బోస్టను రేవునకు సమీపముననున్న ఆంగ్లేయ నౌకాసైన్యము కూడ వెళ్ళిపోయెను. న్యూ ఇంగ్లాండు రాష్ట్రసముదాయ మంతయు నింతటినుంచి ఆంగ్లేయుల నుండి విముక్తినిచెందెను.

దేశీయమహాజన సభవారి యుత్తరువుల ననుసరించి అమెరికను యుద్ధనౌకలు ఆంగ్లయోడలను వెంబడించుచు తరుముచుండెను. ఐర్లాండు దేశపునౌకల జోలికిపోవుటలేదు. అమెరికాసంయుక్త రాష్ట్రములలోనికి ఇంతటినుండియు బానిసలను దిగుమతిచేయకూడ దని దేశీయమహాజనసభ నిషేధించెను. ఏప్రిలు 6 వ తేదీన "ఇంగ్లాండురాజునకు లోబడియున్న ప్రదేశములు" గాక మిగిలిన యావత్ప్రపంచముతోను స్వేచ్ఛగా వాణిజ్యము చేయుటకు దేశీమహాజనసభవారు తీర్మానించిరి. దీనితో అమెరికనుల వర్తక స్వాతంత్ర్యము పూర్తియయ్యెను.

ఫ్రాన్సువారి సహాయ మన్వేషించుటకొరకు రహస్య యుపసంఘ మేర్పాటుచేయబడినది. ఆమెరికను రాయ

ఫరాసువారు సహాయముచేయుటకు తీర్మానించుట.

బారి పరాసు దేశములోని ముఖ్యుల సానుభూతికై ప్రయత్నించుచుండెను. ఇరువదియైదు వేల అమెరికను సైనికులకు వలయు యుద్ధపరికరములను మందుగుండు సామాగ్రిని వస్త్రములను నూరుఫిరంగులను ఇవ్వవలసినదని ఫ్రెంచివారిని కోరిరి. అమెరికను రాయబారి రాకమునుపే అమెరికనులకు సహాయము చేయు విషయమును గూర్చి పరాసుమంత్రివర్గమువారు యోచించసాగిరి. ఏప్రిలు 6 వ తేదీన సమావేశమయిరి. ప్రధానమంత్రి తుర్గోకు పరాసుదేశము నెట్టియుద్ధములోను దింపుటకిష్టము లేకుండెను "అమెరికనులు స్వాతంత్ర్యముపొందక తప్పదు. ఈనాడు కానిచో రేపయినను పొందుదురు కాని మనమాంగ్లేయులతో యుద్ధములో ప్రవేశించుట నాకిష్టము లేదు. అని ఆయన చెప్పెను. విదేశవ్యవహారమంత్రి వర్జెన్ అమెరికనులకు సహాయము చేయవలెనని పట్టుదలకలిగి యుండెను. అమెరికను లోడిపోయినచో, మానవకోటియొక్క స్వాతంత్ర్యమునకు గొప్పనష్టము కలుగును. తిరిగి ఎట్టి స్వాతంత్ర్యోద్యమమును తలపెట్టుటకును ఏజాతియు సాహసించదు. అని ఆయన నుడివెను. మంత్రివర్గములో అధిక సంఖ్యాకులు సహాయముచేయుటకే తీర్మానించిరి. మే నెలలో పరాసు దేశపు రాజు తాము పదిలక్షల పరాసు లివరీలను అమెరికను సహాయార్థము పంపబోవుచున్నామని స్పైన్ రాజునకు తెలియ చేసెను. స్పైన్ రాజుకూడ మరియొక పదిలక్షల లివరీలను పంపెను.

ఈ మధ్యకాలమున అమెరికను రాష్ట్రములలో నాంగ్లే

రాష్ట్రములలో స్వాతంత్ర్య ప్రకటనములు.

జాత్ర ప్రభుత్వము కూలిపోవుచుండెను. 26 వ మార్చి తేదీన దక్షిణ కారొలీనా రాష్ట్రము స్వతంత్రప్రభుత్వమును స్థాపించుకొనెను. ఉత్తర కారొలీనా రాష్ట్రములోని న్యాయస్థానము తెరవబడిన ప్రథమ న్యాయాధిపతి 'ఆంగ్లేయరాజు మాపైన ప్రభుత్వ విసర్జనము చేసెననియు మనమీద నాయనకెట్టి యధికారము లేదనియు మన మాయనకెట్టి రాజభక్తిని చూపు నవసరము లేదనియు" ప్రకటించెను. 4 వ మే తేదీన రోడు అయిలండులోని ప్రజాప్రతినిధసభవారు" ఈరాష్ట్రములోని ప్రజ లాంగ్లేయరాజునకు లోబడిన పాలితులు కారు" అని ప్రకటించిరి. 6 వ తేదీన" ఆంగ్లేయరాజు చేతను పార్లమెంటు తమకుగల అనాదిసిద్ధమగు హక్కులు భంగము కావింపబడినందున వారిలో నెట్టి సంబంధము తమకు లేదని" వర్జీనియా రాష్ట్రీయసభవారు తీర్మానించిరి. మే 15 వ తేదీన" అమెరికా సంయుక్త రాష్ట్రములు ఆంగ్లేయ రాజునకును పార్లమెంటునకును లోబడని స్వేచ్ఛాయుతమైనట్టియు స్వాతంత్ర్యమైనట్టియు రాష్ట్రములని ప్రకటించుటకు " దేశీయమహాజనసభలో నుపపాదించవలసినదని వర్జీనియానుండి వెళ్లిన ప్రతినిధుల కాజ్ఞాపించిరి. జూను 12 వ తేదీన నొక సుప్రసిద్ధమైన హక్కుల ప్రకటనమును గావించిరి. దీనినిబట్టియే దేశీయమహాజనసభవారు 4 వ జులై తేదీన తమ ప్రకటనమును చేసిరి. ఇంతలో" అమెరికను రాష్ట్రముల ప్రజలు ఆంగ్లేయరాజుయొక్క పాలనమునందుండుట న్యాయమునకును మనస్సాక్షికిని వ్యతిరేకమగుటనందున ఆంగ్లేయ పాలనమును పూర్తిగా కూలద్రోయుట అత్యవసరము"ను

సుహోద్ఘాతముతో ప్రతిరాష్ట్రమును తమకనుకూలమగు స్వతంత్రరాజ్యాంగ విధానమును తయారు చేసుకొనవలసినదని దేశీయమహాజనసభ తీర్మానించెను. జూన్ 7వ తేదీన "సంయుక్త రాష్ట్రములు స్వతంత్రమును పొందినవి. గావున విదేశములతో నొడంబడికలు చేసుకొనుటకును సంయుక్తరాజ్యాంగ విధానమును తయారుచేయుటకును" దేశీయమహాసభవారు మరియొక తీర్మానమును కూడచేసిరి. వీటి నమలులో పెట్టుటకుపసంఘములను నియమించిరి.

(4)

కనడాలో అమెరికను లోడిపోవుట

జూన్ 28వ తేదీన చార్లెసుటనులో జరిగిన యుద్ధమునందు ఆంగ్లేయ సైనికులలో రెండువందలయిదుగురును, అమెరికనులు ముప్పది రేడుగురును హతులైరి. ఇదికూడ అమెరికను పక్షమునకు కొంతప్రోత్సాహమును కలుగచేసెను. కాని కనడాలో నమెరికనులకు గొప్పపరాభవము కలిగెను. మాంగుమరి సేనాని చనిపోయినతరువాత కొద్దిసైన్యములతో ఆర్నల్డు సేనాని క్విబికు వద్దనేయుండి ఇంకకొంతసైన్యమును తెప్పించుకొనెను. కాని వీరును ఆంగ్లేయులముందర చాలలేదు. ద్రవ్యముగాని సామగ్రులుగాని అమెరికనులకు తగినంత లేకుండెను. మొదట వీరియందు సానుభూతిని చూపిన కనడా ప్రజలు వీరికి వ్యతిరేకులైరి. వాషింగ్టను కూడ మూడువేలసైనికులను వీరికి సహాయముగా పంపెను. కాని అంతయు వ్యర్థమయ్యెను. అమెరికను సైన్యములలో స్ఫోటకము వ్యాపించెను. ముట్టడిని వదలి మరలి రాసాగిరి. ఆంగ్లేయులు వెంటనంటి తరిమిరి.

అమెరికనులు పారిపోయిరి. త్రోవలో జాడ్యమువలనను తిండిలేకను శత్రువులవలనను అనేకులు మరణించిరి. కొందరు శత్రువులచే జిక్కిరి. బహుస్వల్ప సంఖ్య మిగుల దౌర్భాగ్య మగు స్థితిలో కనడా సరిహద్దునుదాటి అమెరికను రాష్ట్రములలో ప్రవేశించెను.

అమెరికను సైనికుల దౌర్భాగ్యస్థితి

బొస్టను స్వాధీనమయిన తరువాత వాషింగ్టను న్యూయార్కు పట్టణమును తన సైన్యములకు ముఖ్యస్థానముగా చేసికొనెను. న్యూయార్కు నందు కొందరాంగ్లేయులయందు భక్తిగలవారు గలరు. ఇది మిక్కిలి అపాయకరమైనస్థితి కాన వాషింగ్టను న్యూయార్కు సంరక్షణకై కోటలను నిర్మించెను. గాని ఆయన క్రింద నుండిన సైన్యములు మిగుల హీనస్థితిలో నుండెను. ఏడువేలమంది సైనికులు మాత్రముండిరి. ఆయుధసామగ్రి చాలదు. ద్రవ్యము లేదు. దుస్తులు లేవు. సైనికులిండ్లకుపోవుటకు తొందరపడుచుండిరి. ఇంతలో అమెరికను సైన్యములలో కొందరాంగ్లేయుల పక్షమునచేరుటకు కుట్ర సలిపినట్లు కూడ బయల్పడెను. విచారణచేసి కుట్రదార్లలో ముఖ్యులను సైనికాధికార్లు ఉరితీసిరి. జూన్ నెల చివరభాగమున మూడు సంవత్సరములవరకుగాని లేక యుద్ధమాఖరగువరకు గాని కొలువులోనుండు షరతుతో సైనికులను పోగుచేయుటకు దేశీయ సభవారు తీర్మానించిరి. జూన్ 29వ తేదీన నలుబదియైదు ఆంగ్లేయనౌకలు ముప్పదివేలమంది సైనికులతో సాండిహూకు రేవులో దిగెను. ఇంకను కొన్ని యోడలువచ్చు సమాచారముకూడ తెలిసెను. ఈ సంగతి వాషింగ్టను దేశీయమహా

జనసభ వారికి తెలిపెను. కానిచేయునదేమి? ఎటు చూచి నను క్లిష్టమగు పరిస్థితులెదురొ్కనెను. వాషింగ్టను క్రిందసహాయసేనానిగనున్న జోసెఫు రీడు నిరాశచెంది తనకుస్థితిగతులింత హీనముగనున్నవని ప్రథమముననే తెలిసియున్నచో తా నీయుద్ధములో ప్రవేశించియుండనని వాషింగ్టనుకు వ్రాసెను.

## (5)
## అమెరికా సంయుక్త రాష్ట్రముల స్వతంత్ర ప్రకటనము.

(1776 సంవత్సరము జులై 4వ తేదీ)

దేశీయమహాజనసభ వారి స్వాతంత్ర్య ప్రకటనము

ఈ కష్టమగు పరిస్థితులమధ్యనే 1776 వ సంవత్సరం 4వ జులై తేదీన అమెరికా దేశీయమహాజన సభవారు సమావేశమై చరిత్రలో మిగుల ఖ్యాతివడసినట్టియు మానవకోటి కాదర్శ ప్రాయమైనట్టియు స్వాతంత్ర్య ప్రకటనమును గావించిరి. "మానవులందరును పుట్టుకవల్లసమానులు. స్వభావముగ సృష్టికర్త మానవులకందరకును ఎప్పటికిని భంగము చేయబడగూడని కొన్నిహక్కుల నిచ్చియున్నాడు. అవి

ప్రాణము స్వతంత్రము సౌఖ్యముపొందు ప్రయత్నము మొదలగునవి. ఈసహజ హక్కులను కాపాడుటకై మానవులు బుద్ధి పూర్వకముగ ప్రభుత్వముల నేర్పరచుకొని యున్నారు. ప్రభుత్వములు చెలాయించు నధికారములన్నియు పాలితు లిచ్చినవేగాని ప్రభుత్వములకు స్వంతమగు హక్కులేమియు లేవు. ఏప్రభుత్వమైనను ప్రజల జన్మహక్కులకు వ్యతిరేకముగ సంచరించినచో దానిని మార్చుటకును నాశనము చేయుటకును క్రొత్తవిధమగు ప్రభుత్వమును స్థాపించుకొనుటకును ప్రజలకు సంపూర్ణమగు హక్కుగలదు." అను మొదలగు మానవహక్కులను సిద్ధాంతీకరించిరి. ఆంగ్లేయ రాజు వలసరాష్ట్రములమీద జరిపిన నిరంకుశ చర్యలను ఖండించిరి. "మేమాయన సంరక్షణలో లేమని ప్రకటించుట వలనను మామీద యుద్ధము గావించుట వలనను ఆయన మా మీద రాజ్యమును కోల్పోయినాడు. ఆయన మాసముద్ర తీరములను దోచుకొనెను. రేవులను నాశనముచేసెను. మాపట్టణములను తగులబెట్టెను. మా ప్రజలను హత్యగావించెను. మామీద నిరంకుశత్వమును స్థాపించు నుద్దేశ్యముతో విదేశసైన్యములను మామీదకు బంపి నాగరీకతగల రాజ్యమని తిమకుగల పేరునకు వ్యతిరేకముగ మిక్కిలి యనాగరీకమైనట్టియు క్రూరమైనట్టియు ఘాతుకకృత్యములను మాపై సలుపుచున్నాడు తనరాయబారులను బంపి మాలో గృహకల్లోలములను కుట్రలనుచేయించ ప్రయత్నించినాడు. మేము పెట్టిన అర్జీలు త్రోసివేయబడినవి. రాయబారములు నిష్ఫలమైనవి. మహాసోదరులగు ఆంగ్లేయదేశప్రజలు ఔదార్యమును

న్యాయమును చూపుదురని ఆశించియుంటిమి. కాని మా ఆశనిరాశమైనది. న్యాయమునకును ధర్మమునకును ఆంగ్ల ప్రజలు పెడచెవిని పెట్టినారు "అని వ్రాసిరి. కావున" దేశీయమహాజనసభలో సమావేశమైన అమెరికా సంయుక్తరాష్ట్రముల ప్రతినిధులమైన మేము మాయొక్క యుద్దేశ్యముల పవిత్రతనుగూర్చియు మాపక్షముయొక్క న్యాయమును గూర్చియు జాతుల యదృష్టమును నిర్ణయించు పరమేశ్వరునికి మనవిచేసికొనుచు; సంయుక్తరాష్ట్రములలో నివశించు ప్రజలతరఫునను వారి అధికారము క్రిందను, సంయుక్తరాష్ట్రములు స్వతంత్రమైన రాష్ట్రములుగ నేర్పడినవనియు స్వతంత్రమును పొందుటకు హక్కుకలిగి యున్నవనియు; బ్రిటిషు రాజునకు చూపవలసి యుండిన రాజభక్తినుండి పూర్తిగ విముక్తిచెందినవనియు ఆంగ్లేయరాజ్యమునకును మాకును గల రాజకీయసంబంధము సంపూర్ణముగ తొలగిపోయినదనియు స్వతంత్రమైన రాష్ట్రములయినందున సంయుక్తరాష్ట్రములవారు యుద్ధముచేయుటకును సంధిచేసుకొనుటకును యొడంబడికెలలో ప్రవేశించుటకును వర్తకపు టేర్పాట్లుచేయుటకును స్వతంత్రమైన ప్రభుత్వములు చేయగల సమస్త ఇతరకార్యములను నిర్వర్తించుటకును సంపూర్ణమగు హక్కును కలిగియున్నారనియు; దృఢదీక్షతో ప్రకటించుచున్నాము. ఈప్రకటనము సఫలమగుటకై ధర్మస్వరూపుడగు భగవంతుని మీద పూర్తిగ భారమువైచి మాప్రాణములను మాఆస్తులను పవిత్రమైన మాగౌరవమును సమర్పించుచున్నాము"ని తెలియజేసిరి. ఈస్వాతంత్ర్య

ప్రకటనము న్యూయార్కు రాష్ట్రముగాక మిగిలిన యన్ని రాష్ట్రముల ప్రతినిధుల చేతను నేకగ్రీవముగా నంగీకరించబడెను. దీనిలో నిమిడియున్న ముఖ్య సూత్రములు అన్ని కాలములలోను ఇతరులచే వత్తిడి చేయబడి స్వాతంత్ర్యమును కోరుజాతుల కాశను పురిగొల్పుచున్నవి. మరియు ప్రపంచములోని రాజకీయ విప్లవముల కెల్ల పునాదిగ నున్నవి.

ఈ స్వాతంత్ర్య ప్రకటనము సంయుక్త రాష్ట్రముల ప్రజలలో మితిలేని యుత్సాహమును కలుగచేసెను. ఫిలడల్ఫియా పట్టణమున నున్న స్వాతంత్ర్య పుర

అమెరికనులలో మితిలేని యుత్సాహము.

మందిరములో జయ సూచకముగ గంటలు మ్రోగించబడెను. "దేశములోని యందరు ప్రజలకును స్వతంత్రము" అని యాపురమందిరము మీద చిత్రించబడెను. వర్జీనియా రాష్ట్రము ప్రజాస్వామ్యమయినదని చట్టమును చేసినది. న్యూయార్కులో మూడవ జార్జి సార్వభౌముని ప్రతిమ ప్రజలచే నాశనము చేయబడినది. స్వాతంత్ర్య ప్రకటనము వాషింగ్టనుకు చేరిన 9వ జులై దినమున సైనికుల నందరిని నిలువబెట్టి వినిపించెను. సైనికులందరును నెత్తిమీది టోపీలుతీసి బహుసమ్మతితో నాలకించిరి.

(6)

కాని దుర్దినములు రానున్నవి. న్యూయార్కు పట్టణము

ఆంగ్లేయులు జయ మొందిరి.

నందు వాషింగుటను సేనలుండెను. దానిని బలపరచుటకు వాషింగ్టను కోటలను కట్టుచుండెను. దానికి సమీపమునను న్న లాంగు ద్వీపములో తొమ్మిదివేల అమెరికను సైనికులు సల్లివను సర్లింగు సేనానుల

క్రిందవిడిసి యుండెను. ఆంగ్లేయ నౌకాదళ మొకవైపు నుండియు సేనలొకవైపునుండియు ఆగష్టు 27వ తేదీన నీ లాంగు ద్వీపములోని అమెరికను సేనలను ముట్టడించెను. ఆంగ్ల సేనలు చాలనధికముగ వచ్చిపైబడెను. ఉభయులకు జరిగిన పోరాటములో ఆంగ్లేయులు, పూర్తిగ జయమొందిరి. ఇద్దరమెరికను సేనానులను వెయ్యిమంది అమెరికను సైనికులను ఖయిదుచేసిరి. ఆరువందలు అమెరికనులు హతులైరి. న్యూయార్కులో స్వల్పసంఖ్యగల సేనలు మాత్రమే యుండినందున వాషింగ్టన్ సహాయము చేయజాలక పోయెను ఆగష్టు 29 వ తేదిరాత్రి వేళ మిగిలిన సైనికులందరను ఎటులనో వాషింగ్టన్ న్యూయార్కు పట్టణములోనికి చేర్చెను. లాంగు ద్వీపములో నమెరికనులకు కలిగిన యపజయము చాలవరకు వలసప్రజలకే గాక అమెరికను సైనికులకు గూడ నిరుత్సాహమును కలుగచేసెను. 2 వ సెప్టెంబరు తేదిన వాషింగ్టను దేశీయ మహాజనసభ వారికిటుల వ్రాసెను ;— "మనస్థితి మిగుల దుఃఖకరముగనున్నది. లాంగు ద్వీపపు యుద్ధమువలన మనఐచ్ఛిక సైనికులలో నధిక సంఖ్యాకులు అధైర్యమును నిరాశను చెందినారు. సైనికులిండ్లకు పోవుటకు ఆతురతను జూపుచున్నారు. అనేకమంది యిదివరకే చెప్పకుండ పారిపోయినారు కొన్ని పటాలములు యావత్తును కొన్ని కొంతవరకును ఏవిధమున ఖాళీ అయినవి. మిగిలియున్న సైనికులోర్పునుగాని నిగ్రహమునుగాని విధేయతనుగాని చూపుట లేదు. నాకైచ్ఛిక సైన్యముల యందు విశ్వాసముపోయినదని వ్రాయుటకు చింతిల్లుచున్నాను." యుద్ధమాఖరగువరకు స్థిరముగానుండు సైన్యముల నేర్పాటుచేసిన

కాని మనమేమియు చేయజాలమనియు కొంత కాలమువరకు మాత్రమే కొలువులోనుందుమని చేరినఐచ్ఛిక భటులను నమ్మిన యెడల మోసమువాటిల్లుననియుకూడ నాయన గట్టిగ వ్రాసెను. కనెక్టికటు రాష్ట్రమునుండి వచ్చిన ఆరు వేలమంది సైనికులు మాత్రము నిలిచియుండిరి. మిగిలినవారు సేనలను విడిచి గృహములకు జనిరి. సైనికులలో నాలుగవ వంతుకు అనారోగ్యముగ కూడ నుండెను. అందరికిని రెండు నెలల జీతము బాకీపడినది. ఇచ్చుటకు సొమ్ములేదు.

అమెరికనులు న్యూయార్కునువదలి పారిపోయిరి.

ఆంగ్లేయ సైన్యములు విజృంభించి న్యూయార్కు పట్టణమును ముట్టడించుటకు తలపడెను. 11 వ సెప్టెంబరు తేదీన అమెరికనులకును ఆంగ్లేయులకును సంధి కుదర్చవలెనని ఉభయ పక్షముల ప్రముఖులును స్టేటనుద్వీపములో చేరిరి. కాని ఏమియు కుదరలేదు. 13 వ తేదీనాడు ఆంగ్లేయసైన్యములు న్యూయార్కు ముట్టడిని ప్రారంభించెను. రెండుదినములు కాగనే అమెరికను సైన్యములలో నిస్పృహ జనించినది. అమెరికనులు సైన్యములను విడచి పలాయనమగుచుండిరి. వాష్టింగ్టనెంత ప్రోత్సాహించినను ఆగలేదు. ఎనిమిదిపటాలముల సైనికులు పారిపోయి ఖాళీ అయినవి. ఆంగ్లేయులమీద తుపాకులను గూడ కాల్చకుండ పారిపోయిరి. వాషింగ్టను ఖడ్గమును తుపాకిని ధరించి శత్రువులముందు నిలిచి తనసైనికులను హెచ్చరించుచుండెను. ప్రయోజనమేమియు లేదయ్యె. అమెరికను సేనానులందరును కలసి న్యూయార్కుపట్టణము వదలిపోవ

టయే చేయదగినపనియని నిశ్చయించిరి. సెప్టెంబరు 15 వ తేదీన యుద్ధసామాగ్రిలను ఫిరంగులను వదలిపెట్టి అమెరికను సేనలన్నియు న్యూయార్కును వదలిపోయెను. ఆంగ్లేయ సేనలు న్యూయార్కుపట్టణమునజయప్రదముగా ప్రవేశించెను. అమెరికను సేనలను వాషింగ్టను న్యూయార్కుకుసమీపమున నున్న నొక చిన్న మిట్టమీద ప్రవేశపెట్టెను. అక్కడనొక కోటను నిర్మించెను. దానికి వాషింగ్టను కోటయని నామకరణము చేసిరి.

(7)

వాషింగ్టను కోట ఆంగ్లేయుల వశ మయ్యెను.

దేశీయమహాజనసభవారు వాషింగ్టనుకోరికపైన ఎనుబదియెనిమిది పటాలములసైనికులను ప్రోగుచేయుటకు తీర్మానించిరి. వీరు యుద్ధము ముగియువరకును పనిచేయవలసియుందురు. ఈలోపుగ వదలిపెట్టుటకు వీలులేదు. ద్రవ్యమును భూములను సైనికులకు పారితోషికముగ నిచ్చెదమనికూడ ప్రకటించిరి. ప్రత్యేక రాష్ట్రములవారును ప్రత్యేక పట్టణములును కూడ నెక్కువ పారితోషికముల నిచ్చెదమని ప్రచురించిరి. ఈవిధముగ సైన్యములను ప్రోగుచేయుచుండిరి. ఆంగ్లసేన లింతలో పోయి నవంబరు 16 వ తేదీని వాషింగ్టను కోటపైబడెను. అమెరికనులు హడ్సనునదిని దాటకుండుటకై రెండు ఆంగ్లేయ నౌకలు హడ్సనునదిలో నుంచిరి. వాషింగ్టను కొన్ని సేనలను వాషింగ్టనుకోటలో నిలిపి మిగిలినసైన్యములతో హ్వాయిటుప్లైను

లకు చేరెను. అక్కడ ఆంగ్లేయులు ముట్టడించగా నిలువలేక నార్తుకాసిలుకుపోయెను. అక్కడనుంచితిరిగియెటులనోహడ్సను నదినిదాటి వాషింగ్టను కోటకెదురుగనున్న లీకోటలో ప్రవేశించెను. వాషింగ్టను కోటను నవంబరు 16 వ తేదీన నలువైపుల నుండియు నధికసంఖ్యాకులగు నాంగ్లేయసైన్యములు ముట్టడించగ లోపలనున్న అమెరికను సైనికులు లోబడిరి. 2818 మంది అమెరికను సైనికు లాంగ్లేయులచే ఖయిదుచేయబడిరి. అమెరికనుల యుద్ధసామాగ్రి లాంగ్లేయులకు చిక్కెను. వాషింగ్టనుకోట ఆంగ్లేయుల వశమయ్యెను. వాషింగ్టను సేనాని ఏమియుచేయజాలక తనసైనికులు శత్రువులచే జిక్కుటచూచి పసిపిల్లవానివలె ఊరక రోదనముచేసెను.

మూడుదినముల తరువాత కారన్‌వాలీసు ప్రభువు వాషింగ్టను సేనలతో యొక్క సేనాధిపత్యముక్రింద ఆరువేల ఆంగ్లేయసేనలు హడ్సనునదిని దాటి వాషింగ్టను స్థావరమేర్పరచుకొనిన లీకోటను ముట్టడించిరి. వాషింగ్టను సేనాని త్వరితముగ నీకోటను శత్రువులకు వదలివైచి డేరాలు, సామానులు, కంబళములు త్రవ్వుకొనుటకు పరికరములు మొదలగునవేమియు లేకనే మూడువేల సైన్యములతో న్యూజర్సీ రాష్ట్రములోనికి పారిపోయెను. ఆంగ్లేయసైన్యములు వెంబడించి తరుముచుండెను. న్యూజర్సీప్రజలు ధైర్యమును కోల్పోయి వాషింగ్టను కెట్టిసహాయము చేయుటకును సాహసించలేదు. వాషింగ్టను డెలవేరునదినిదాటి పెనిసి

ల్వేనియా రాష్ట్రములోనికిచేరెను. అదృష్ట వశమున ఆంగ్లేయు లింతదూరము రాలేదు. ఇంతలో కనడానుంచి ఆంగ్లేయ సేనలు వచ్చి క్రౌనుపాయింటును వశపర్చుకొనెను. న్యూయార్కులోనుండిన ఆంగ్లసైన్యములు రోడు అయిలండును స్వాధీనము పొందెను.

వాషింగ్టనకు కష్టములమధ్య ధర్మము జయించు నను విశ్వాసము.

ఇట్లు 1776వ సంవత్సరాంతముకు ఆంగ్లేయులకే ప్రతిదిక్కునను జయములు కలిగి 204 గురు అమెరికను సైనికోద్యోగులును 4504 మంది అమెరికను సైనికులును ఆంగ్లేయులచే ఖయిదు చేయబడియుండిరి. రోడు అయిలాండు, న్యూజర్సీ, రాష్ట్రములు ఆంగ్లేయులకు స్వాధీనమయ్యెను. పెనిసిల్వేనియాపైకి ఆంగ్లేయులు దండువెడలుటకు సిద్ధముగ నుండిరి. దేశీయమహాజన సభ కార్యస్థానమిచటనుండి బాల్టిమోరునకు మార్చిరి. అమెరికను సర్వసేనాధ్యక్షుడగు వాషింగ్టనునందు ఆయన క్రిందనుండిన చాలమంది యుద్యోగస్థులకు విశ్వాసము నశించెను ఎటుచూచినను అధైర్యము, అవిశ్వాసము, నిరాశ ప్రబలియుండెను. గాని వాషింగ్టనుకు మాత్రము తమ యుద్యమము ధర్మమైన దయినందున తప్పక జయముకలుగునని దృఢమయిన నమ్మకముండెను. దేశీయమహాజన సభవారును ధైర్యమును వదలక వాషింగ్టనునందు అపనమ్మకము పొందక ధర్మమూర్తియగు పరమేశ్వరుని మీద భారము మోపి సకల ప్రయత్నములు చేయుచుండిరి. వాషింగ్టనుకు

యుద్ధవిషయమున సమస్తకార్యములు చేయుటకును సంపూర్ణాధికారమిచ్చిరి. బెంజమిను ఫ్రాన్కులినను ఫ్రాన్సునకు బంపిరి. ఆయన ఫరాసుదేశీయుల సానుభూతిని సంపాదించుచుండెను. ఫ్రాన్సు, స్పైన్, దేశములతో నమెరికనులు వాణిజ్యమునలుపునటుల యొడంబడికలు చేసికొనిరి.

1776వ సంవత్సరము 25వ డిశంబరురాత్రి వాషింగ్టను వాషింగ్టను ఆంగ్లే రెండువేల నాలుగు వందల అమెరికను సైనియులతోడించుట. కులతో మంచుతో కప్పబడియున్న డెలవేరు నదినిదాటి న్యూజర్సీరాష్ట్రములో ప్రవేశించి ఆకస్మికముగా ట్రెంటను వద్దనుండిన ఆంగ్లేయ సేనల బడెను. ఆంగ్లేయులోడిపోయిరి. ఆంగ్లేయ సైన్యాధిపతి గాయములచే మరణించెను. వెయ్యిమంది ఆంగ్లేయులు వాషింగ్టను చేతిలో జిక్కిరి. వీరిని ఖయిదీలుగాపట్టుకొని వాషింగ్టను ఖయిదీలతోడను తనసైన్యములతోడను తిరిగి నదినిదాటి న్యూజర్సీలో చేరెను. మిగిలిన ఆంగ్లేయసైనికులు ట్రెంటనును వదలిపోగానే వాషింగ్టనిచట చేరి స్థావరమేర్పరచుకొనెను. దేశీయ మహాజనసభవారు క్రొత్తసైన్యముల నేర్పరచి వాషింగ్టను వద్దకు బంపిరి. ఆంగ్లేయసేనాధిపతి కారన్వాలీసు ప్రభువు సైన్యములతో వచ్చి 1777వ సంవత్సరము 13వ జనేవరి నాడు అమెరికనులను ముట్టడించెను. ప్రిన్సటనువద్ద కారన్ వాలీసునకును వాషింగ్టనుకును యుద్ధముజరిగెను వాషింగ్టనుకు జయము కలిగెను. వాషింగ్టను తన సైన్యములతో మారిస్ టౌను

లో ప్రవేశించి శీతకాలమచట గడపెను. అచటనుండి అకస్మాత్తుగా నింగ్లీషువారి పైబడి బాధించు చుండెను. వాషింగ్టనుయొక్క సైన్యములు బలపడుచుండెను. నూతనసైన్యములు వచ్చి చేరుచుండెను. కొలదికాలములో నాంగ్లేయులు న్యూజర్సీరాష్ట్రమును పూర్తిగ ఖాళీచేసి వెడలిపోయిరి.

ఆమెరికను సైన్యగుల నెక్కువ చేయుటకు ప్రయత్నములు జరుగుచుండెను. క్రొత్త సైనికులు చేరుచుండిరి. కాని చాలమంది పాతసైనికులు సైన్యములను వదలిపోవుచుండిరి. ఇంతలో స్ఫోటకజాడ్యము అమెరికను సైనికులలో వ్యాపించెను. ఇందువలన క్రొత్తవారు చేరుటకు సంకోచించుచుండిరి. జీతము బాకీపడెను. 1 వ జూన్ తేదీన తనకు క్రొత్తగ చేరుచున్నవారికంటె తనను వదలిపెట్టి పోవుచున్న పాతవారి సంఖ్య ఎక్కువగుచున్నదని వాషింగ్టను వ్రాసెను గాని న్యూజర్సీరాష్ట్రములో నాంగ్లేయ సైనికులు చేయుచున్న దోపిళ్ళు జరుపుచున్న దుండగములు కొంతవరకు కసి తీర్చుకొనుట కమెరికను సైనికులను ప్రోత్సహించ సాగెను.

మానవస్వాతంత్ర్య వాదులు.

ఈ సమయమున అమెరికా స్వాతంత్ర్య యుద్ధము యూరపుఖండపుదృష్టి నాకర్షించినది. అమెరికనుల పక్షమున యుద్ధము చేయుటకు పరాసు దేశమునుండి కొందరువచ్చి అమెరికను సేనలలో నుద్యోగములను పొందుచుండిరి. లఫయతు

ప్రభువను నొక పదునెనిమిది వత్సరముల యీడుగల పరాసు యువకుడు పరాసు దేశములోని మెట్జుపట్టణమున నొక పరాసుసేనకు సేనానిగనుండెను. ఒక దినమున నాంగ్లేయ రాజగు మూడవజార్జియొక్క సోదరుడగు గ్లాస్టరు ప్రభువు ఆపట్టణము సందర్శించుటకు వచ్చెను. ఆసందర్భమున లఫయతుకు పైయధికారియగు పరాసు సేనాధిపతి గ్లాసరు ప్రభువుకు విందుచేసెను. అపుడు లఫయతుకూడ నుండెను. అమెరికావారు స్వాతంత్ర్య ప్రకటనము గావించిరను వార్త అప్పుడే గ్లాస్టరుప్రభువు కింగ్లాండునుండి వచ్చిన లేఖలవలన తెలిసెను. ఈసంగతి లఫయతు బహుశ్రద్ధగా గమనించి గ్లాస్టరుప్రభువును ప్రశ్నించి తనకు కావలసిన విషయములు తెలుసుకొనెను. అప్పటినుండియు నమెరికావారి సైన్యములో చేరి పనిచేయ వలెనని లఫయతు ప్రభువు మనసునందు నిశ్చయించుకొనెను. మరునాడే పారిసునకుపోయి అమెరికావారి సహాయముగ యుద్ధపరికరములను భోజనపదార్థములను గొనిపోవుట కేర్పడిన నౌకయందు ప్రయాణముచేయుటకు రహదారి చీటిని గొనెను. పారిసులోని అమెరికను ప్రతినిధినిదర్శించి మేజరు జనరలుద్యోగ మిప్పించెదనను వాగ్దత్తమును పొందెను. కాని ఇంతలో న్యూజర్సీరాష్ట్రమునుండి వాషింగ్టను పారిపోయెనను వార్త తెలియగ నమెరికాకు పోవుటకు నౌక దొరకక పోయెను. పరాసుదేశములోని అమెరికనులుకూడ నీయువకుడగు సేనానిని అమెరికాకు వెళ్ళుటకు మంచి సమయము

కాదని నిరుత్సాహపరచిరి. దీనితో లఫయతు నిరుత్సాహమును చెందలేదు. తనయుద్యమమును మానలేదు. తానే యొక యోడను సంపాదించెను. దానిలో తానే అమెరికాకు వాషింగ్టను సేనానియొద్దకు యుద్ధసామాగ్రిలను తీసుకొని పోయెదనని కూడ చెప్పెను. పరాసు ప్రభుత్వమువారును ఆంగ్లేయ ప్రభుత్వమువారును నీయనను పోకుండ నాటంకపరచిరి గాని ఎటులనో తప్పించుకొని పన్నెండుమంది పరాసు సేనానులుగనున్న స్నేహితులతో బయలుదేరి స్పెయిను దేశమునుచేరి యచ్చటనుండి సముద్రముమీద పయనము చేసి సురక్షితముగ దక్షిణకారొలీనా రాష్ట్రములోని జార్జిటౌను రేవులో దిగెను. అక్కడనుండి యీ వదమువ్గురు పరాసు సేనానులును ఫిలడెల్ఫియా పట్టణమును చేరిరి. కొంతకాలము వీరిని అమెరికను సేనలలో చేర్చుకొనలేదు. కాని వీరు జీతము లేకుండకూడ పనిచేసెదమని చెప్పినందున చేర్చుకొనిరి. 1777వ సంవత్సరము జులై 31 వ తేదీన వాషింగ్టను కొన్ని అమెరికను సేనలపై లఫయతు ప్రభువును మేజరుజనరలుగ నియమించెను. అప్పటినుండియు లఫయతు సేనాని వాషింగ్టనునందు మిగుల గౌరవమును భక్తిని కలిగిన పరమమిత్రుడయ్యెను. ఈనెలలోనే యూరోపు ఖండములోని పోలండు దేశమునుండి కోసియజుకోయను యువకుడు యింజనీయరుగ (శిల్పశాస్త్రజ్ఞుడుగ) అమెరికాకువచ్చి వాషింగ్టనుతో చేరెను. ఈసమయముననే నొక యమెరికను సైన్యము రోడుఐయిలెండు రాష్ట్రములో నుండియున్న ఆంగ్లేయ సేనపై యాకస్మికముగ

బడి యాంగ్లేయ సైనికుల నందరను సేనాధిపతితో కూడ ఖయిదుచేసెను. లఫయెతు ప్రభువు ముందు రాబోవు ఫరాసు ప్రజాస్వాతంత్ర్య విప్లవములోను కోసియజ్కో పోలండు జాతీయ స్వాతంత్ర్య పోరాటములోను స్వాతంత్ర్యపక్షమున పోరాడి సుప్రసిద్ధులుగా నున్నారు.

**అమెరికను రాజభక్తులు**

ఇంగ్లాండులో మూడవ జార్జి సార్వభౌముడును మంత్రులును అమెరికనులమీద పట్టుదలతో యుద్ధమును సాగించుచుండిరి. 1777 వ సంవత్సరము మేనెల 30వ తేదీన ప్రభువుల సభకు విలియంపిట్టు (చాతాం ప్రభువు) అనారోగ్యస్థితి యందే వచ్చెను. ఫరాసు, స్పైన్, దేశములవా రమెరికనులతో చేరకమునుపే అమెరికనులతో సంధి చేసుకొనవలసినదని యొక తీర్మానము నుపపాదించెను. "మీరమెరికనులను జయించ జాలరు. వారిదేశమునుండి వారిని మీరు తరిమివేయ గలరా? వారుస్వాతంత్ర్యమును పొందుటకు దీక్షవహించినపుడు వారిని మీరేమి చేయ గలరు? వారిని మీరెటుల పాలించ గలరు!" అని ఆయన నుడివెను. కాని ఆయనపక్షమున ఇరువది ఎనిమిది సమ్మతులును, వ్యతిరేకముగ తొంబదితొమ్మిది సమ్మతులును వచ్చినందున ఆయనతీర్మానమోడిపోయెను. అమెరికనులలో రాజభక్తిగలవారింకను గలరనియు వారిని ఎర్రయిండియనులను రాజద్రోహులగు నమెరికనులమీద ప్రయోగించుటకును, కనడా దేశమునుండి యొకగొప్పసైన్యము నమెరికనులపై పంపుటకును, మంత్రులు నిశ్చయించిరి.

ఆంగ్లేయుల జయములు.

జూలై 1వ తేదీన గొప్ప సైన్యముతో నాంగ్ల సేనాని జనరలు బర్గాయును క్రౌన్ పాయింటు నుండి బయలుదేరి దక్షిణముగా వెళ్లెను. దక్షిణమునుండి హౌ సేనాని క్రింద కొంత సైన్యము వచ్చి కలసెను. ఈసైన్య సమూహము టికాండెరోగా మీదపడగ నక్కడి అమెరికను సైన్యము లెదిరింపకనే పారిపోయెను. ఆంగ్లేయసైన్యము లమెరికెనులను వెంటనంటెను. స్కీనస్‌బరోవద్ద అమెరికనులమీదపడి యోడించెను. హడసన్నదిమీదనున్న ఎడ్వర్డు కోటను స్వాధీనపర్చుకొనెను. స్కూలరు కోటను ముట్టడించి దాని సంరక్షణకై వచ్చిన అమెరికను సేనలను పూర్తిగ నోడించెను. ఈవిధమున ఆంగ్లేయులు జయము లొందుచుండిరి.

రాజభక్తుల నోడించుట.

న్యూహాంపుషైరు రాష్ట్రములోని బెన్నింగ్టను వద్ద అమెరికను సేనలు స్టార్కు సేనాధిపతిక్రింద యుండెను. వీరిమీదికి ఆంగ్లేయసైన్యములు వచ్చి ముట్టడించగ స్టార్కుసేనాధిపతి ఆంగ్లేయుల నోడించి తరిమెను. మరియొక ఆంగ్లేయసేనకూడా రాగా వారికిని పరాజయమే కలిగెను. బెన్నింగ్టను యుద్ధములవలన కొంతవరకమెరికను ప్రతిష్ట నిలువబడెను. అమెరికను సైన్యములు స్కూలరు కోటను ముట్టడించగ న్యూయార్కులోని రాజభక్తిపరాయణులను ఎర్రయిండియనులను తరిబీతు చేయుచుండిన లిజరను ఆంగ్లేయసేనాని మిగుల అధైర్యముతో నాకోటను, అందులోని డేరాలు, సామానులు, యుద్ధపరికరములను వదలి కనడాదేశమునకు పారిపోయెను. అమెరికనులు స్కూలరుకోటలో ప్రవేశించిరి.

వాషింగ్టనుయొక్క అపజయములు.

సెప్టెంబరు నెలలో న్యూయార్కునందు బలమైన సైన్యములను క్లింటను యొక్క యాధిపత్యము క్రింద నుంచి ఆంగ్లేయసేనాని హోవా పదునెనిమిది వేల సైనికులతో ఫిలడల్ఫియాకు ఏబది మైళ్ళ దూరముననున్న ఎల్కునది యొడ్డున దిగెను. అమెరికను సేనాని వాషింగ్టను పదునాలుగువేల సైన్యములతో నాంగ్లేయులపై దాడివెడలెను. సెప్టెంబరు 11 వ తేదీన బ్రాండీవైన్‌వద్ద యుద్ధము జరిగెను. అమెరికను లోడిపోయిరి. మూడువందలమంది హతులగుటయు ఆరువందలమంది గాయములనొందుటయు నాలుగువందల మంది ఆంగ్లేయులచే పట్టుబడుటయు జరిగెను. లఫయతు ప్రభువునకుకూడ గాయము తగిలెను. ఈ యుద్ధములో పోలండు దేశమునుండివచ్చిన మరియొక స్వాతంత్ర్యవాది పులాస్కీప్రభువు వాషింగ్టనునకు ఉపసేనాధిపతిగ పోరుసలిపెను. ఇంక కొన్ని సైన్యములు వచ్చి వాషింగ్టనును చేరెను. వీటితో తిరిగి ఆంగ్లేయులతో యుద్ధముచేయ యత్నించెను. కాని తుపానుపట్టి వాషింగ్టను యుద్ధసామానులు చెడిపోయెను. వాషింగ్టను తనసేనలను మరల్చుకొని వచ్చెను. మరియొక అమెరికను సేనాని పదిహేనువందల సైన్యములతో ఫిలడల్ఫియా సమీపమున నాంగ్లేయులచే నోడింపబడెను. ఆంగ్లేయులు సెప్టెంబరు 26 వ తేదీన ఫిలడల్ఫియా పట్టణమున ప్రవేశించిరి. అమెరికా దేశీయ మహాజనసభవారు తమ కార్యస్థానమును అచటనుండి లంకాస్టరునకు మార్చిరి. అక్టోబరు 4 వ తేదీన అమెరికను సైన్యములువచ్చి ఆకస్మికముగ జర్మను టౌనులోని ఆంగ్లసేనలపై

బడెను గాని అమెరికనులే విశేషనష్టముతో నోడిపోయి పలాయనమైరి. నాలుగు దినములతరువాత న్యూయార్కులోని ఆంగ్లేయసైన్యములు హడ్సను నదిమీదనున్న మాంగమరీ, క్లింటను కోటలనుపట్టుకొనుటయేగాక రెండు అమెరికనుయుద్ధ నౌకలనుకూడ నాశనముచేసిరి. వాషింగ్టను తన సైన్యములతో డెలవేరుకోటలోనుండెను. ఆంగ్లేయులువచ్చి ముట్టడించిరి. అయిదుదినములు వాషింగ్టను తీవ్రముగ పోరునలిపెను. కాని ఆంగ్లేయ సేనలసంఖ్య వారికి జయమును కలుగచేసెను. నవంబరు 20 వ తేదీన వాషింగ్టను డెలవేరుకోట నాంగ్లేయుల వశముచేసి వెడలిపోయెను. వాషింగ్టను తన సేనలతో వ్హైటు మార్షను చేరెను. అక్కడనుండి ఆంగ్లేయసేనాని హోవా వాషింగ్టనును తరుమగ వాలీఫోర్జిలో వాషింగ్టను ప్రవేశించెను. వాషింగ్టను సమర్థుడుకాడని యనేకమంది అమెరికనుల కపోహాలు కలుగసాగెను.

సెరటోగా మిట్టల వద్ద అమెరికనులు గొప్ప జయమునొందుట.

కాని మరియొక ప్రాంతమున భగవదనుగ్రహమువలన అమెరికనుల నావరించిన యంధకారము విడిపోయి ఆశాసూర్యుడు తన కిరణములను ప్రకాశింపజేయుచున్నాడు. ఆంగ్లసేనాపతి బర్గాయిను హడ్సనునదినిదాటి సెరటోగా మిట్టప్రదేశమును చేరి అక్కడనుంచి హడ్సను నదియొడ్డుననే పోయి బెమిసుకొండలవద్దనున్న అమెరికను సైన్యములను తాకెను. ఆదినమంతయు ఆంగ్లేయులకును అమెరికనులకును జరిగిన పోరాటములో ఆంగ్లేయులే యెక్కువ నష్టమును పొందిరి. అమెరికను సేనలు సురక్షితముగ తమ విడిదిచేరిరి.

ఆంగ్లసేనలనుండి ఎర్రయిండియనులును అమెరికను రాజభక్తవరాయణులును జారిపోసాగిరి. ఆంగ్లేయులకు భోజనపదార్థములును వారిగుఱ్ఱములకు తిండియు దొరకకుండెను. ఇంతలో గేట్సను అమెరికను సేనాని క్రొత్తసేనలతో వచ్చెను. అమెరికనుసేవలు బలపడెను. తిరిగి ఆంగ్లేయులును అమెరికనులును తీవ్రమగు పోరును సలిపిరి. ఆంగ్లేయసేనాని ఫ్రెజరు చంపబడెను. రాత్రివరకు యుద్ధముజరిగి రాత్రివేళ ఎవరిబసలకు వారువెళ్ళిరి. ఆంగ్లేయులనష్టము ఏడువందలమందియు నమెరికనుల నష్టము నూటయేబదిమందియు కలిగెను. బర్గాయిను సేనాని ఆంగ్లేయ సేనలను సెరటోగా పట్టప్రదేశములకు తీసుకొనివెళ్ళెను. ఎడ్వర్డుకోటలో ప్రవేశించదలచెను. కాని అది అమెరికనుల వశమైయుండినందున ప్రవేశించలేదు. ఈయనవద్ద మూడువేల యయిదువందలమంది పోరునకుపనికివచ్చు సైనికులుమాత్రమే గలరు. సరియైన తిండిలేక బాధపడుచుండిరి. పదునాలుగువేల అమెరికను సైనికులు గేట్సు సేనాని క్రింద వచ్చి వీరిని చుట్టుకొనిరి. ఆంగ్లేయసేనానులు యుద్ధము సలుపజాలక అమెరికనులకు లోబడుటకే నిశ్చయించిరి. అక్టోబరు 16 వ తేదీన అయిదువేల ఏడువందల తొంబదియొక్కమంది బ్రిటిషుసైనికులు యుద్ధసామానులతోడను నలుబదిరెండు ఫిరంగులతోడను అమెరికనులకు లోబడిరి. నిరాయుధులుగ చేయబడి అమెరికనులమీద యుద్ధముచేయకుండునట్లును వెంటనే యింగ్లాండునకు పయనమైపోవుటకును వాగ్దానముచేసి విడువబడిరి. ఆంగ్లేయసైనికులు తిండిలేక శల్యములై చిక్కియుండుటజూచి యమెరికను సైనికులు జాలి

నొంది వదలివేసిరి. క్లింటన్ సేనాని కొందఱాంగ్లేయసైనికులను తీసుకొని యిచటికి వచ్చెనుగాని ఆయన వచ్చువరకే ఇక్కడ ఆంగ్లేయులకు గాఁగిన పరాభవము పూర్తియయ్యెను. అక్టోబరు 26 వ తేదీన నాంగ్లేయులు మాంగుమరీ క్లింటన్ కోటను విడిచివెళ్ళిరి.

దేశీయమహాజనసభ వారివద్ద ద్రవ్యము లేక ఇబ్బందులు.

అమెరికను సేనాని గేట్సు సెరటోగా మిట్టప్రదేశములలోపొందిన జయమును తన సేనాధ్యక్షుడగు వాషింగ్టనుకు తెలుపక సూటిగ దేశీయమహాజనసభ వారికే తెలియపరచెను. దేశీయసభ వారు గేట్సుసేనానికి వందనములను సువర్ణపతకమును నిచ్చిరి. గేట్సుసేనాని సంతోషముతో నుప్పొంగి వాషింగ్టనును లక్ష్యముచేయలేదు. వాషింగ్టను కొన్ని సైన్యములను తనకు సహాయముగ పంపమని కోరినను గేట్సు పంపలేదు. కాని తనవద్ద నుండిన స్వల్పసేనలతోనే నాంగ్లేయులతో పోరి ఫిలడల్ఫియా రాష్ట్రమును సంరక్షించుటకు వాషింగ్టను ప్రయత్నించెను. ఫిలడల్ఫియా రాష్ట్రములో కూడ రాజభక్తి పరాయణులగు నమెరికనుల సంఖ్య వృద్ధియగుచుండెను. ఈ అపాయమునుండి తొలగించవలెనని వాషింగ్టను ప్రయత్నించెను. కాని వాషింగ్టనుకు కొంతకాలమువరకు కష్టములే ఎదుర్కొనెను. వాషింగ్టను వాలీఫోర్జిలో చేరెనని పైన వ్రాసియుంటిమి. ఇచటనే ఆయన చలికాలమును గడపెను. కాని చుట్టుపట్టు ప్రదేశమంతయు రాజభక్తి పరాయణులగు నమెరికనులతో నిండియుండెను. ఆంగ్లేయులు రొఖ్ఖమిచ్చి వస్తువులను కొనుచుండిరి. వాషింగ్టనువద్ద రొఖ్ఖము

లేదు. అమెరికను దేశీయమహాజనసభవారు సృష్టించిన (కర్రెన్సీనోట్లు) కాగితపు ద్రవ్యము మాత్రము గలదు. దీనిని పుచ్చుకొని కావలసిన వస్తువుల నిచ్చువారు లేకుండిరి. దేశీయమహాజనసభవారివద్ద ద్రవ్యము లేదు. ఎవరునుఋణములిచ్చుటలేదు. ఉత్సాహముతో సభ్యులు సభలకు వచ్చుటలేదు. ఊరకే కాగితములను సృష్టించుచుండిరి. ఈ కాగితపు ముక్కల విలువ తగ్గిపోయెను. వాషింగ్టనకు గాని ఆయన సైనికులకు గాని దుస్తులు లేకుండెను. డిశంబరు నెలలో నాహారపదార్థము లయిపోయెను. "వెంటనే తగిన ఏర్పాటులను చేయనిచో సైనికు లుపవాసము చేయుటగాని లేక ఇండ్లకు పోవుటగాని జరుగ గలదని" ఆయన దేశీయసభాధ్యక్షునికి వ్రాసెను. "ధరించుటకు దుస్తులుగాని తొడుగుకొనుటకు పాదరక్షలుగాని లేక దాదాపు మూడువేలమంది సైనికులెట్టి పనిచేయుటకును అనర్హులుగ నుండిరి. చుట్టుప్రాంతములనుండి దొరకినదానినెల్ల బలవంతముగ తెమ్మని సైనికులను బంపవలసివచ్చెను. ఇట్లు చేయుటవలన ప్రజల సానుభూతిని గోల్పోవుదునని కూడ నాయన దేశీయమహాసభవారికి వ్రాసియుండెను. కొంతకాలమునకు దుప్పట్లనుకూడ ఏమియు దొరుకకుండెను. గుర్రములు చాలవరకు తిండిలేక చనిపోయెను. మార్చి 11 వ తేదీనుండియు మనుష్యులకు కూడ తిండి లేకుండెను. ఆరు దివసములు వాషింగ్టను సైనికులతో కూడ నుపవాసము చేసెను. యావత్తు సేనలో రెండు పాదరక్షల జతలుమాత్రమే మిగిలియుండెను. సైన్యములలో జ్వరములు వ్యాపించి యనేకులు మరణించిరి. అనేకమంది సైన్యములను వదలి వెళ్ళిపోవుచుం

డిరి. బహు స్వల్పకాలములో రెండు మూడు వందలమంది సైనికోద్యోగులు రాజీనామాల నిచ్చి లేచిపోయిరి. ఈ సమయమున నాంగ్లేయసేనలు వీరిని ముట్టడించినచో వీరిని చులకనగ నాశనము చేసియుండును. కాని యదృష్టవశమున నాంగ్లేయ సైన్యములు ఫిలడల్ఫియా పట్టణమునుండి కదలి రాలేదు. చలికాలమంతయు నా పట్టణములో నాంగ్లేయులు సంతోషముతోను ఆటపాటలతోను గడపుచుండిరి. ఇట్టి దుఃఖకరమైన స్థితిలో వాషింగ్టనుండగ పెన్సిల్వేనియా రాష్ట్రీయసభవారీయనను అసమర్థుడని తీవ్రముగ ఖండించిరి. దేశీయమహాజనసభలో కొందరీయనకు వ్యతిరేకముగ నొక కక్షి బయలుదేరెను. యుద్ధమును నడుపుటకేర్పడిన యుద్ధసంఘములో నీయనకు ప్రతికక్షులగువారుకూడ నియమింపబడిరి. ఈయనను సర్వసేనాధ్యక్ష పదవినుండి తొలగించి గేట్సు సేనానినిగాని లీసేనానినిగాని నియమించవలెనని కూడ కొంతవరకు యత్నములు జరిగెను. లుఫయతు సేనానిని యీయనక్రిందనుండి వేరుచేయవలెనని యోచించిరిగాని లఫయతుసేనాని వాషింగ్టను క్రిందసేవనిచేసెదనని ఖండితముగ చెప్పెను. చివరకు వాషింగ్టనుకు సహాయమును సామాగ్రిలును పంపి దేశీయ మహాజనసభవారాయననే సర్వసేనాధిపతిగ నుండవలెనని తీర్మానించిరి.

ఫిలడల్ఫియా తమకులోబడెనను వార్త ఆంగ్లేయ దేశ
ఆంగ్లేయ పార్లమెంములో నధికముగ సంతోషమును కలుగచే
టువారు యుద్ధమును సెను. కాని శీఘ్రముగనే సెరటోగా మిట్ట్రప్రదే
తీవ్రముగ సాగించుటమున నాంగ్లేయులకు కలిగిన పరాభవము
టకు నిశ్చయించుట సంగతి కూడ తెలిసెను. దీనితో సమిత

మిగుల దుఃఖము కలిగెను. ప్రధాన మంత్రినార్తు ప్రభుత్వ భోజనముగాని నిద్రగాని లేక విచారములో మునిగెను. అమెరికను యుద్ధమును వదలివేయవలెనా లేక తానుమాత్రి పదవిని త్యజించవలెనాయని యాలోచించుచుండెను. ఆంగ్లేయరాజునకు కలిగిన పరితాపమునకు మేరలేదు. పార్లమెంటులో గొప్ప కలవరము కలిగెను. కొందరుసభ్యులువెంటనే అమెరికావారి స్వాతంత్ర్యమునంగీకరించి వారితో మైత్రి పొందవలసినదని చెప్పిరి. పార్లమెంటు సభ 1778వ సంవత్సరం జనవరి 20 వ తేదీవరకు నిలుపుదల చేయబడెను. ఈలోపున నాంగ్లేయ రాజు సంధి షరతులను గూర్చి సంధానపరచుటకై గాను ఫ్రాన్సు దేశములో నున్న అమెరికా ప్రతినిధి బెంజమిను ఫ్రాంక్లినునకు స్నేహితుడగు హట్టను వద్దకు రాయబారులను పంపెనుగాని హట్టనుని సంప్రదించగ నీసందర్భమున సంధికుదురుట యసంభవమని ఫ్రాంక్లిను చెప్పెను. జనేవరి 20 వ తేదీన పార్లమెంటు సమావేశమయినపుడు తిరిగి చర్చజరిగెను. వెంటనే అమెరికనులకు స్వాతంత్ర్య మిచ్చి రాజీపడవలసినదని కొందరు సభ్యులుచెప్పిరి. అమెరికాకు స్వాతంత్ర్యమిచ్చుటకు విల్లియం పిట్టు సమ్మతించలేదు. యుద్ధముమాని ఆంగ్లేయ రాజ్యముక్రింద నమెరికానుంచుకొనుటయే అతని యుద్దేశ్యము. ప్రధాన మంత్రి రాజీనామా నిచ్చెదనని చెప్పెనుగాని రాజు రాజీనామా నివ్వకుండ నిర్బంధించెను. "ఇప్పుడమెరికనులకు లోబడుట ఆంగ్లేయుల కగౌరవము గాన యుద్ధమును జరుపవలసినద"నియే పార్లమెంటు వారు తుదకు తీర్మానించిరి.

అమెరికాకును ఫ్రాన్సునకును స్పైన్‌కును ఒడంబడికెలు.

1778 సంవత్సరము ఫిబ్రేవరి 6 వ తేదీన పరాసు దేశ ప్రభుత్వమునకును అమెరికా సంయుక్త రాష్ట్రములకును నొడంబడికెలు జరిగెను. పరాసు ప్రభుత్వము అమెరికా సంయుక్త రాష్ట్రముల స్వతంత్రము నంగీకరించి, సంయుక్త రాష్ట్రములవారు సంపూర్ణమగు స్వతంత్రమును పొందువరకును నిలుపదల చేయకుండునట్లును ఈ యుద్ధములో పరాసువారు పూర్తిగ సహాయము చేయునట్లును నొడంబడిరి. స్పైన్ రాజు కూడ నీసంధి కంగీకరించెను. గాని ఇంకను సంధిపత్రముపై సంతకము చేయలేదు. పరాసు దేశముతో చేసుకొనిన సంధి వలన నమెరికా స్వాతంత్ర్య యుద్ధమునకు నూతన వికాసము కలిగెను.

# అమెరికా సంయుక్త రాష్ట్రములు.

## ఎనిమిదవ అధ్యాయము.

## స్వతంత్రయుద్ధము — రెండభాగము.

(1)

ఫ్రాన్సు మంచిస్థితి లో లేదు.

ఫ్రాన్సు దేశమునకును సంయుక్త రాష్ట్రములకును జరిగిన సంధి కొలదికాలమువరకు ఫ్రాన్సులో ప్రచురము కాలేదు. ఫ్రాన్సు దేశము యుద్ధము చేయుటకు తగిన మంచిస్థితిలో లేదు. ప్రభుత్వము యొక్క ఆర్థికస్థితి మిగుల బలహీనముగ నున్నది. జాతీయ ఋణము విశేషముగ నుండెను. ఆదాయముకంటె వ్యయ మెక్కువగ నుండెను. పదునారవ లూయిరాజు యోగ్యుడుగాని సమర్థుడుగాడు. తుర్గోమంత్రి కొన్ని సంస్కరణములను చేయ ప్రయత్నించి రాజుయొక్క సహాయము పొందజాలక రాజీనామా నిచ్చెను. నూతనముగ వచ్చిన ప్రధానమంత్రి నెక్కరార్థిక విషయములలో మిగులసమర్థుడే. కాని యీయనయును ఏమియు చేయజాలకపోయెను. నెక్కరుమంత్రి ఋణములు చేయయత్నించెను. ప్రథమములో కావలసిన ఋణము లభించెను. మధ్యమతరగతి ప్రజలు నెక్కరునందు

విశ్వాసము కలిగి ప్రభుత్వములకు ఋణముల నిచ్చిరి. మంచి నౌకాదళమును నిర్మించుటకు విశేషముగ ద్రవ్యము వెచ్చింపఁబడెను. ఈ సమయమున స్పైయిను యొక్క సహాయముతో తిరిగి సముద్రములపైన అధికారము పొందుటకు ఫ్రాన్సు ఉద్దేశించెను.

ఆంగ్లేయప్రభుత్వము కొంతవరకు లోబడుట.

ఇంగ్లాండులో నీ సంధిసంగతి తెలియగనే గొప్ప కలవరము జనించెను. రాజు ఆంగ్లేయసైన్యములను పూర్తిగ అమెరికానుండి తీసివైచి ఫ్రాన్సుదేశముతో మాత్రము యుద్ధము చేయవలెనని తలచెను. అమెరికా పోయినను సరే, ఫ్రాన్సుదేశముపై పగ తీర్చుకొనవలెనను నూహ ఆయన మనముసందు పొడమెను. గాని ఈ యూహ ననుసరించి ప్రవర్తించలేదు. అమెరికనులకు కొన్ని హక్కుల నిచ్చి రాజీపర్చుకొనవలె ననుతలంపు పార్లమెంటుసభ్యులకు కలిగెను. ఈ తలంపు ప్రథమముననే నుండినచో యుద్ధమే జరిగియుండెడిది కాదు. ఫిబ్రవరి 17 వ తేదీన అమెరికనులను సంతృప్తిపరచు నుద్దేశముతో కొన్ని చట్టములను చేసిరి. అమెరికాకు చట్టప్రకారము స్వతంత్రి మివ్వకపోయినను ప్రవర్తనలో స్వతంత్రముగ చేయుచున్నామని ప్రధానమంత్రి నార్తుప్రభువు చెప్పెను. ఆదినమున ఇంగ్లాండు పార్లమెంటువారు అమెరికనులకు లోబడుస్థితిలోనుండిరి. కానివారిపూర్ణమగు స్వాతంత్ర్యము సంగీకరించుట కిష్టము లేకుండెను. కావున ఎట్లుప్రవర్తించుటకును తోచక ఏవో యర్థములేని కొన్ని చట్టములను చేసిరి. అమెరికావారికిని పరాసువారికిని సంధి జరిగినసంగతి తెలియలేదా

మని రొకర్ సభ్యుడు ప్రధానమంత్రిని ప్రశ్నించెను. ప్రధాన మంత్రి ఆప్రశ్నకు జవాబుచెప్పక వేరు సంగతులను గూర్చి ప్రసంగించుచుండెను "దీనికి ముందు జవాబుచెప్పుము, జవాబుచెప్పుము" అని కొందరుసభ్యులు కేకలువేసిరి. అందు మీద సంధి జరగలేదని చెప్పక తనకు ఉద్యోగరీత్యా సంధి సంగతి తెలియదని ప్రధానమంత్రి జవాబు చెప్పెను. అమెరి కనులను తృప్తిపరచుటకని మూడుచట్టములు చేయబడెను. మొదటిది ఇట్టి ప్రజలలో నాందోళనము కలుగుచున్నది. కావున నా రాష్ట్రమున కివివరకుగల ఎన్నిక హక్కులను తిరిగి కలుగచేయుట మొదటి చట్టముకటి. తేయాకు చట్టమును రద్దుపరచుట విదేశ వాణిజ్య విషయములోతప్ప రాష్ట్రము లలోని ఆంగ్లేయపార్లమెంటువారుపన్నులువేయుటకు ప్రజలపై హక్కు లేదను చట్టము రెండవది. అమెరికానుండి ఆంగ్లేయ సైన్యములను తీసివేయుటకును ఏరాష్ట్రముతోనైనను సంధిచేసు కొనుటకును తీర్మానముల నిచ్చుటకును ప్రజల యిబ్బందులను తొలగించుటకును యుద్ధకమీషనరులను నియమించుచట్టము మూడవది. ఈచట్టములు చేయుటవలన నాంగ్ల పార్లమెంటు వారు తమ బలహీనతను వెల్లడించిరేగాని వీటివలన అమెరి కనులు తృప్తిచెందలేదు.

మార్చి 17 వ తేదీన అమెరికాలో చేసికొనిన సంధిషర తులను పరాసు ప్రభుత్వమువారు పంపినారని ఆంగ్లేయమంత్రి విలియంపిట్టు యుక్తులు పార్లమెంటు సభకు చదివి వినిపించిరి. ఈ [illegible] సమయమున అనారోగ్యమువలన బాధపడుచుం డిన విలియంపిట్టును ప్రధానమంత్రిగా చేసిన యుక్తముగ నుండు

వని సభ్యులలో చాలమంది తలంచిరి. రాజునకువాని బ్రతిభువును ప్రధాన మంత్రిత్వమునుండి తప్పించుట కిష్టము లేదు. ఏప్రిలు 7 వ తేదీన పార్లమెంటు సభకు విలియంపిట్టును [illegible]వించిరి. ఆయన పడకకుర్చీలో పరుండెను. లేచి నిలువగలస్థితిలో లేడు. ఆంగ్లేయుల సైన్యములను నౌకాదళములను తీసివేయవలసిన దనియు మంచిమాటలచే రాజీపడవలెననియు రిచ్మండు ప్రభువొక తీర్మానము నుపపాదించెను అందుమీద చర్చ జరిగెను. ఇదివరకు అమెరికావారితో సంధి చేసుకొమ్మని చెప్పియున్న విలియంపిట్టు కిపుడు తమ శత్రుదేశములగు ఫ్రాన్సు, స్పైన్ దేశము అమెరికనులతో చేరియున్న సమయమున రాజీపడుట అసంబద్ధమని తోచెను. ఇట్టి స్థితిగతులలో నమెరికాకు స్వాతంత్ర్య మిచ్చుట అవ్యక్తమని ఆయన తలచెను, "నేనీ సభలో మాట్లాడ శక్తియున్నంతవరకు అమెరికాకు స్వతంత్రి మివ్వగూడదని చెప్పితీరెదన"ని ఆయన చెప్పెను. ఆయన ధ్వనిమిగుల బలహీనముగ నుండెను. చెప్పినదానినే మరల మరల చెప్పెను. తలంపులు సరిగవచ్చుటలేదు. దీనికి రిచ్మండు ప్రభువు ప్రత్యుత్తరమిచ్చెను. అందుమీద విలియంపిట్టు లేచెను. ఏమో చెప్పెను. స్పృహతప్పి పడిపోయెను. పార్లమెంటు సభ చాలించబడెను. మే 11 తేదీ వరకును ఆయన జీవించియుండెను. ఆయన చనిపోవగనే పార్లమెంటు సమావేశమై ఆయనకుగల ఋణములను తీర్చుకొనుటయే గాక ఆయన దినవారీ ఖర్చుకగు వ్యయమును ఆయనవారసులకు సంవత్సరమునకు నాలుగు వేల సవరనుల యుపకారవేతనమును ఇచ్చుటకు తీర్మానించిరి. ఫ్రాన్సుపై యుద్ధముచేయుట కాంగ్లదేశమువం

ఉత్సాహము వ్యాపించెను. అనేకులు వచ్చి సైన్యములలో చేరుచుండిరి.

(2)

వరాసుసంధికి వాషింగ్టనుయొక్క సంతోషము.

1778 సంవత్సరము మేనెల వరాసు దేశముతో చేసికొనిన 3వ తేదిన సంధిమాట లమెరికా దేశీయ మహాజనసభవారికి చేరగానే వారు వాషింగ్టనుకు బంపిరి. "అమెరికా సంయుక్త రాష్ట్రముల స్వతంత్రమును కాపాడుటకును మాహక్కులను స్వతంత్రములను స్థిరముగ స్థాపించుటకును లోకములోని రాజులలో నొకబలవంతుడగు ప్రభువును మాపక్షమున చేర్చుటకు సర్వశక్తుడగు భగవంతుని కనుగ్రహము వచ్చినద"ని ఆయన సైనికులలో ప్రకటించెను. మరునాడు సంతోషదినముగ సలుపబడినది. సైనికులు దేవునికి వందనముల నర్పించిరి. జయసూచకముగ తుపాకులు కాల్చబడెను. "ఫ్రాన్సు దేశపు రాజు చిరాయువగుగాక!" "అమెరికా సంయుక్త రాష్ట్రములకును వీరికి మిత్రులగు యూరోపు దేశముల వారికిని జయము కలుగుగాక!" అని జయధ్వనులు చేయబడెను. దేశీయ మహాసభవారు క్రొత్త సైన్యములను ప్రోగుచేసిరి. యుద్ధము ముగిసిన తరువాత సైనికోద్యోగులకు సగము జీతమిచ్చెదమని వాగ్దత్తము చేసిరి.

దేశీయమహాసభ వారిపట్టుదల.

ఫ్రాన్సుతో సంధిచేసుకొనిన సంగతి అమెరికాలో తెలియుటకు కొన్నివారములకు మునుపే ఆంగ్లేయ పార్లమెంటువారు అమెరికలను తృప్తిపరచుటకై చేసిన చట్టములను ఆసందర్భమున నార్తు ప్రభువిచ్చిన యుపన్యాసమును న్యూయార్కు

లో తెలిసెను. వాషింగ్టను సేనాని గాని దేశీయమహాజన సభాధ్యక్షుడుగాని కొన్ని దినములవరకా వర్తమానమును నమ్మలేదు. వాటియాదార్థ్యమును వాషింగ్టను నమ్మగనే వాటినిగూర్చి అమెరికాలోని ప్రజలెట్టుల భావించెదరో యని ఆయనకు సంకోచముకలిగెను. అప్పటికి అమెరికనులలో చాల మందికి యుద్ధమునందు విసుగుపుట్టినట్టుల సూచనలు పొడగట్టు చుండెను కావున ప్రజలుపట్టుదలతో స్వతంత్రయుద్ధమును జయప్రదముగా కొనసాగించుటకు మారుగ ఆంగ్లేయులిచ్చిన హక్కులతో తృప్తిచెంది రాజీ కొడంబడెదరేమోనను సందేహమాయనకు కలిగెను. ఈ సంధిరాయబారములను త్వరపడి అంగీకరించుటగాని లేక తిరస్కరించుటగాని యుక్తముకాదని ఆయన తలంచెను. ఏప్రియలు 22 వ తేదీన దేశీయ మహాజనసభవారు మాత్రము "వెంటనే అమెరికాలోనుండి ఆంగ్లేయసేనలన్నియు తీసివేయబడిననే గాని, లేదా స్పష్టమగు మాటలతో నమెరికా సంయుక్తరాష్ట్రముల స్వతంత్రము నంగీకరించిననేగాని, ఆంగ్లేయరాయబారులతో సంధివిషయమున నెట్టిమాటలను జరుపగూడద"ని తీర్మానించిరి. ఇంతలో ఫ్రాన్సుతో జరిగిన సంధిసంగతికూడ తెలిసినందున వీరి పట్టుదల యనేకమడుంగు లధికమయ్యెను.

దేశీయమహాసభవారి ఆత్మగౌరవము.

జూను 4 వ తేదీన ముగ్గురాంగ్లేయ సంధిరాయబారులు అమెరికాకుచేరిరి. జూను 6 వ తేదీన ఆంగ్లేయపార్లమెంటువారి చట్టములను అమెరికా దేశీయమహాజన సభవారికి బంపిరి. "ఏప్రిలునెలలోనే కామీవిషయమున తీర్మానము చేసియుంటి

మనియు, ఆంగ్లేయరాజు అమెరికా సంయుక్తరాష్ట్రములతో చేయుచున్న అధర్మమగు యుద్ధము నంతరింపజేయవలెనని నిజముగ కోరుచో, స్వతంత్ర దేశముయొక్క మర్యాదల తోడను సంధిషరతుల నమలుజరుపు పవిత్రైశ్వర్యముతోడను తాము రాజీకివచ్చుట కెట్టియభ్యంతరము లేదనియు" దేశీయ మహాజనసభ వారు ప్రత్యుత్తరమును బంపిరి.

వారి ధీరత్వము.

ఆదినముననే ఆంగ్లరాయబారులు ఫిలడెల్ఫియా పట్టణ మునకువచ్చిరి. ఆసమయమున నాంగ్లేయులా పట్టణమును వదలివెళ్ళుచుండిరి. ఆసమయమున నాంగ్లేయ ప్రభుత్వమునుండి వచ్చిన రహస్యపు టుత్తరువుల ననుసరించి వారటుల వదలిపోవుచుండిరి. కాని యీయుత్తరువులు రాజభక్తిగల అమెరికనులలో మితిలేని విచారమును కలిగించెను. ఆంగ్లసేనలతో కూడ మూడువేలమంది అమెరికను రాజభక్తులు బయలుదేరి వెళ్ళిపోయిరి. రాష్ట్రములన్నియు తమయిచ్చవచ్చిన చట్టములను చేసుకొను హక్కును తమ కిచ్చవచ్చినరీతిని రాష్ట్రపరిపాలనను జరుపుకొను హక్కును, ఆంగ్లేయపార్లమెంటులో నమెరికనులకు ప్రాతినిధ్యమును వీరి యిష్టములేనిది ఎట్టిసేనలను వీరి ప్రదేశములలోని నాంగ్లేయులు తేకుండు హక్కును ఇప్పించెదమనియు, నౌకలమీద ఆంగ్లేయసేనలనన్నిటిని ఇంగ్లాండునకు వెంటనే చేర్పించెదమనియు, సంధికిరావలసినదనియు, నాంగ్లేయ రాయబారులు తిరిగి దేశీయమహాజనసభవారికి వ్రాసిరి. జూలై 17 వ తేదీన "ఆంగ్లేయరాజు తమ స్వతంత్రమును స్పష్టముగ నంగీకరించవలసినది లేదా ఆంగ్లేయ సేనలనన్నిటిని ఆంగ్ల దేశములో

చేర్చనిది" ఎట్టిషరతులను గూర్చియు రాయబారములు జరు పమనియు నిదివరకే యిట్టి జవాబును చెప్పి యున్నా మనియు దేశీయ మహాసభ వారు ప్రత్యుత్తర మిచ్చిరి. జూన్ 17, 18 తేదీలను ఆంగ్లేయసేనలన్నియు ఫిలడల్ఫియాను వదలి డెలవేరునదిని దాటి వెళ్లిపోయెను.

మానుమాతువద్ద అమెరికనుల జయము.

జూన్ 28 వ తేదీని వాషింగ్టను మానుమాతువద్ద నాంగ్లేయసేనలను తలపడెను. అప్పుడుష్ణము అతియెక్కువగ నుండెను. యుద్ధము తీవ్రముగ జరిగెను. అమెరికనులకు సంపూర్ణముగ జయము గలిగెను. రాత్రివేళ ఆంగ్లేయులు పారిపోయిరి. నూరుమంది ఆంగ్లేయసైనికులు ఖయిదీలయిరి. రెండువందల యేబదిమంది మరణించిరి.

జులై 2 వ తేదీన దేశీయమహా జనసభవారు ఫిలడల్ఫియా పట్టణమున సమావేశమైరి. తొమ్మిదవ తేదీన సంయుక్తప్రభుత్వపు నిబంధనలమీద ఎనిమిది రాష్ట్రముల ప్రతినిధులు సంతకములు చేసిరి. తక్కిన అయిదు రాష్ట్రములకు నీపవిత్రమైన యొడంబడికపై సంతకములు చేయవలసినదని యుత్తరమును బంపిరి. నెలలోపలనే మరి రెండు రాష్ట్రములవారును సంతకములు చేసిరి.

(2)

పరాసు సేనలు వచ్చుట.

జులై 8 వ తేదీన పరాసుదేశమునుండి నౌకాదళ మమెరికాకు చేరి డెలవేరునది ముఖద్వారమువద్ద దిగెను. ఎస్టింగు ప్రభువుయొక్క సేనాధిపత్యముక్రింద పరాసు సేనలుకూడ దిగెను.

రోడు అయిలండులోని నీ రిపోర్టునందుగల ఆంగ్లేయ సేనలను ముట్టడించతలచిరి. సల్లెర్లీ, లఫయతు, గ్రీన్, సేనానుల క్రింద నమెరికను సైన్యములు భూమిమీదనుండియు, పరాసు నౌకాదళము సముద్రముమీద నుండియు, ఆంగ్లేయులను ముట్టడించవలెనని పన్నిరి. కాని వారమురోజులవర కమెరికను సేనలు సిద్ధము కాలేదు. ఇంతలో హౌ సేనానిక్రింద నొక ఆంగ్ల నౌకాదళము వచ్చెను. దానిని ముట్టడించుటకు ఎస్టింగుప్రభువు పరాసు నౌకాబలమును తీసుకొని వెళ్ళెను. కాని గొప్ప తుపాను సంభవించి ఉభయ పక్షములవారును తలపడుటయే తప్పిపోయినది. పరాసు నౌకలకు కొంత తుపానువలన నష్టము కలిగినదని బాగుచేసుకొనుటకు బాస్టను రేవులోనికి ఎస్టింగు పరాసు నౌకాదళమును చేర్చెను. ఇట్లు చేయుట లఫయతునకును గ్రీన్ సేనానికిని ఇష్టము లేదు. ఇందువలన సల్లివను సేనానిక్రింద వచ్చిన అమెరికను సైన్యములు వెనుకకు మరలి రావలసివచ్చెను.

అమెరికనులపై ఎఱ్ఱయిండియనులు ప్రయోగింపబడుట.

1778 సంవత్సరము జులై నెలలోను నవంబరు నెలలోను ఆంగ్లేయులును అమెరికను రాజభక్తులును ఎఱ్ఱయిండియనులును అమెరికను దేశభక్తులపై ప్రయోగించిరి. సుష్క్విహానా, షెర్రి వల్లపు భూములలోను ముఖ్యముగ వ్యోమింగు ప్రాంతములోను వున్న అమెరికనులమీద ఎఱ్ఱయిండియను లకస్మాత్తుగపడి పట్టణములను తగులబెట్టి అమెరికను పురుషులను స్త్రీలను శిశువులను క్రూరవధల గావించిరి.

ఆంగ్లేయులకును పరాసులకును యుద్ధములు.

ఆంగ్లేయులకును పరాసువారికిని ప్రపంచములో వివిధ ప్రాంతములలో యుద్ధము ప్రారంభమయ్యెను. జులై 27 న తేదిన ఉభయుల నౌకాదళములును బెస్టురేవుకు సమీపమున పోరు సలిపిరి. ఎవరికిని జయము కలుగలేదు. సెప్టెంబరు నెలలో పశ్చిమయిండియా ద్వీపములలోని ఆంగ్లేయులదగు డొమినికా ద్వీపమును పరాసువారు స్వాధీనపరచుకొనిరి. పరాసువారి సెంటులూసియా ద్వీపము నాంగ్లేయు లాక్రమించిరి. అమెరికా యుద్ధనౌకలు ఇంగ్లాండు దేశముయొక్క పశ్చిమతీరమును కొంతవరకు నష్టపరచెను. వైటుహావెను రేవులో నున్న ఆంగ్లేయపడవలను తగులబెట్టెను. హిందూదేశములో నప్పటికి పరాసువారికి పుదుచ్చేరి, కారైకాలు, యానాం, మాహి, చంద్రనాగూరు పట్టణములుమాత్రమే గలవు. ఆంగ్లేయులకు గొప్పగొప్ప రాష్ట్రములు స్వాధీనమందుండెను. ఆంగ్లేయ గవర్నరు జనరలు వారన్ హేస్టింగ్సు పరాసువారి చెందిన పుదుచ్చేరి మొదలగు పట్టణముల నన్నిటిని స్వాధీనము పొందదలచెను. పుదుచ్చేరి డెబ్బదిరోజులవరకు లోబడక ఎదిరించెను. తక్కినవి వెంటనే ఆంగ్లేయుల వశమయ్యెను. మాహి పట్టణమును పట్టుకొనినచో తాను యుద్ధమునకు దిగుదునని మైసూరుప్రభువు హైదరాలి చెప్పెను. ఆయన మాటలు లక్ష్యముచేయక ఆంగ్లేయులు మాహిని పట్టుకొనిరి. హైదరాలి ఆంగ్లేయులపై యుద్ధమును ప్రకటించి కర్నాటకముపై దాడివెడలెను.

*ఆర్థిక స్వతంత్రము లేని ప్రజలు.*

అమెరికాలో నింకను అమెరికనులస్థితి ఏమియు బాగుగలేదు. వీరికింక నొక ప్రభుత్వము స్థాపనకాలేదు. ప్రభుత్వము లేని ప్రజలుగ నుండిరి. "ఫ్రాన్సు మన స్వాతంత్ర్యము నంగీకరించి మనకు సహాయము చేతునని యొప్పుకొనుటచేత, మనవారు తాము చేయవలసిన పని యేమియు లేదని తలచి విశ్రాంతిని చెందుదురని తోచుచున్నది" అని వాషింగ్టను మెనల శివ లేదినసే వ్రాసెను. దేశీయ మహాజనసభవారు కాగితపు నోట్లను పుట్టించుచున్నారే గాని వాటి చలామణి సంగతి యోచించుటలేదు. రాష్ట్రముల వారును కాగితములను వేయుచున్నారు. ఈ కాగితములను తోడి రాష్ట్రముల వారికిచ్చి ఋణములను తీర్చుకొనుచుండిరి. అమెరికాలో ద్రవ్యమును ప్రోగుచేయు సాధనము కనుపించక ఫ్రాన్సులో పన్నెండులక్షల నవరనుల ఋణము చేయవలసినదని ఫ్రాన్సులోని తమ ప్రతినిధులకు తెలియచేసిరి. ఏదో విధమున యాచించి సొమ్ము ప్రోగుచేయవలెనని వీరి యుద్దేశ్యము. ఆంగ్లేయ రాజుమీద స్వతంత్రమును ప్రకటించిరేగాని వీరు స్వతంత్రమగు ఆర్థిక స్థితిని పొందుట కశక్తులై "ఫ్రాన్సురాజు మిక్కిలి యౌదార్యముతో తమను సంరక్షించ వలెనని" మిగుల వినయముగా కోరవలసినదని బెంజమిన్ ఫ్రాన్కులినుకు వ్రాసిరి. యూరపు ఖండమునుండి ఋణములను ద్రవ్యసహాయమును పొందుటకన్న గత్యంతరము లేదని తలచిరి. బెంజమిను ఫ్రాన్కులినుపరాసు దేశములో ఋణమునకై యత్నించుచుండగా హాలెండులో కూడ ఋణము సంపాదించుటకు

లారెన్సు అను నాయకుని పంపిరి. మిక్కిలి అవమానకర మగు విషయ మేమన యుద్ధము కొన్ని సముద్రతీర ప్రాంతములలోను సరిహద్దులలోను మాత్రము జరుగుచుండగ రాష్ట్రములలోని ప్రజలు మామూలుగ ద్రవ్యార్జనము చేసికొనుచుండిరి. వర్జీనియాలోని పొగాకు పంటకు లోపము కలుగలేదు. మొసచుసెట్సు వారు వర్తకముచేసి ధనవంతులగుట మానలేదు. యుద్ధ విరాళముల నిచ్చుటకును ఋణముల నిచ్చుటకును మాత్రమే లోపము కలుగుచున్నది.

ఆంగ్లేయులు జార్జియా రాష్ట్రము నాక్రమించుట.

వాషింగ్టను సేనావిపద్ద తగిన సేనలుగాని ఆయుధములుగాని లేక యుద్ధము తీవ్రముగ సాగించుట కళకష్టముగనుండెను. దక్షిణ ప్రాంతమంతయు అమెరికను రాజభక్తులచే నిండియుండెను. ఈ రాజభక్తులు జార్జియా రాష్ట్రముపై రెండుసార్లు దండెత్తియుండిరి వీరిపైకి అమెరికను సైన్యములు వెడలెను. ఇంతలో రెండువేలమంది ఆంగ్లసేనలు శవన్నావద్ద నీయమెరికనులను ముట్టడించెను. డిశంబరు 29 వ తేదిన జరిగిన యుద్ధములో పూర్తిగ నమెరికను లోడిపోయిరి. శవన్నా శత్రువుల వశమయ్యెను. 1779 వ సంవత్సరము జనేవరి నెలలో నిచట నుండి ఆంగ్లేయ సేనలు జార్జియా రాష్ట్రము నంతను స్వాధీనమును పొందెను.

*రాజభక్తులు నాశనము గావింపబడిరి.*

*ఆంగ్లేయులు దక్షిణ కారోలీనా నాక్రమించుట.*

తరువాత శత్రువులు దక్షిణ కారోలీనా రాష్ట్రము నాక్రమించ తలచిరి. అమెరికను రాజభక్తుల సేనలు ఆంగ్లేయులతో కలయుటకై పోవుచుండెను. 14 వ ఫిబ్రేవరి నాడు వీరిని అమెరికను సేనలు ముట్టడించి చాలమందిని నాశనము గావించెను. రెండువందలమంది మాత్రము తప్పించుకొనిపోయి యాంగ్లేయులతో చేరిరి. ఈ సమయమున ఖయిదీలుగ చేయబడిన డెబ్బదిమంది రాజభక్తులను అమెరికను సైనికోద్యోగులు దేశ ద్రోహనేరమునకై విచారించి అయిదుగురికి ఉరి శిక్షయు తక్కినవారికి కఠిన ఖైదును విధించిరి. కాని మార్చి 3 వ తేదీన బ్రైరు ఆర్చివద్ద అమెరికనులను ఆంగ్లేయు లోడించిరి. మే నెలలో ఆంగ్లేయ సేనలు ఛార్లెసుటను వరకు నెట్టుకొని పోయి దక్షిణ కారోలీనా నాక్రమించెను. ఆ రాష్ట్రమున ఆంగ్లేయ సైనికులు ప్రజలను దోచుకొనియు పెక్కు అవమాన కృత్యములను చేసియు ప్రజాపీడనము గావించిరి. వేసంగివచ్చుటచే నత్యధికమగు నుష్ణమును సహించ జాలక యుభయ పక్షములవారును కొంతకాలము యుద్ధము సాగించలేదు.

*ఎఱ్ఱ యిండియనులు అమెరికనులచే నాశనము చేయబడుట.*

ఈ సమయముననే నయిదువేలమంది అమెరికను సైన్యములు సల్లివను సేనానికింద బయలుదేరి వెడలి, సుస్కుహానా, గెనీస్ నదులమధ్యనున్న ఎఱ్ఱయిండియనుల దేశమునంతను నాశనముచేసి ఆక్రమించుకొనెను. అక్కడ

నున్న ఎఱ్ఱయిండియనుల గ్రామముల నన్నిటిని అమెరికను సేనలు తగులబెట్టి భస్మీపటలము గావించెను. వారి భూములలోని పంటల నన్నిటిని నాశనము చేసెను. ఒక్క గ్రామములోనే లక్ష అరవై వేల పడుల ధాన్యమును మంటలలో పడవేసెను. దొరికినంతవరకు పురుషులనక స్త్రీలనక శిశువులనక ఎఱ్ఱయిండియనుల నందరను మిక్కిలి క్రూరముగ వధించెను. పారిపోయిన ఎఱ్ఱయిండియనులను నయగారా వరకు తరమివేసెను. ఈ ప్రదేశమంతయు నమెరికనులకు స్థిరముగ లోబడినది. తిరిగి ఎప్పుడును ఎఱ్ఱయిండియను లీ ప్రాంతమున కనపడలేదు. వెనుక వ్యోమింగు ప్రాంతమున ఆంగ్లేయులు ఎఱ్ఱయిండియనులచే గావింప చేసిన క్రూర కృత్యములకు ప్రతిగ నిపుడీ ఘోర కృత్యములను వాషింగ్టను సేనాధ్యక్షుని యుత్తరువుల ననుసరించి సల్లివను సేనాని చేయించెను. ఆంగ్లేయులకును అమెరికనులకును మధ్య ఎఱ్ఱయిండియనులు నాశనమయిరి.

ఆంగ్లేయులు మెరపుపెట్టు నాక్రమించుట.

1779వ సంవత్సరమున దేశీయ మహాజన సభవారు కనడా దేశముపై దండెత్త తలచిరిగాని తగిన ద్రవ్యము లేకను నూతన సైనికులుత్సాహముతో చేరకను ఏమియు చేయజాలక పోయిరి. జీతములు లేక సైనికోద్యోగులు చాల యిబ్బందులు పడుచున్నారనియు వెంటనే తగిన ఏర్పాటులు చేయనిచో చాలమంది మానుకొని పోవుదురనియు వాషింగ్టను వ్రాయుచుండెను. ఈలోపున నాంగ్లేయ సైన్యములు కనెక్టికటు రాష్ట్రములోని సముద్ర తీరములను ముట్ట

తించి ధ్వంసము చేయుచుండిరి. న్యూహావను మొదలగు పట్టణములను దోచుకొని తగులబెట్టిరి. ష్టోనీపాయింటును న్యూయార్కు కెదురుగనున్న మరియొక కోటను వశపరచుకొనిరి. (ఆగష్టు 19) జనరలు మెక్లీయను క్రింద మరియొక యాంగ్లేయ సైన్యము మెసషుసెట్సులోని పెనబుస్కాటుచే నాక్రమించెను. వీరిని వెడలగొట్టుటకు మెసషుసెట్సు రాష్ట్రమువారు గొప్ప అమెరికను సైన్యమును బంపిరి. గాని అమెరికనులు పూర్తిగ నోడిపోయిరి. వీరి పడవలను ఆంగ్లేయులు పట్టుకొనిరి. కొన్నిటిని అమెరికనులే తగులబెట్టుకొనిరి. అనేక మంది సైనికులు అరణ్యములలోనికి పారిపోయి యచట మరణించిరి. ఆ ప్రదేశమంతయు నాంగ్లేయుల వశమయ్యెను.

అమెరికను రాజభక్తుల భావములు.

అమెరికను రాజభక్తుల సంగతియేమి? మాతృదేశమగు ఇంగ్లాండునుండి పూర్తిగ స్వతంత్రముపొందుట కమెరికనులలో ననేకుల కిష్టము లేకుండెను. ప్రతి రాష్ట్రములోని ప్రజలలోను నభిప్రాయ భేదములు గలవు. అధిక సంఖ్యాకులు స్వాతంత్ర్యపక్షమున నుండుటయు దేశీయమహాజన సభవారధిక సంఖ్యాకుల ప్రాతినిధ్యము వహించుటయు నిర్వివాదమగు విషయమే. కాని కొంత దృఢమైన సంఖ్యయే స్వాతంత్ర్యమునకు వ్యతిరేకులుగ నుండిరి. వీరిలో ధనవంతులును పలుకుబడిగలవారును గూడ గలరు. వీరాంగ్లేయ రాజునందు తమ రాజభక్తిని ప్రకటించుటయేగాక రాజభక్తుల సంఘముల నేర్పరచి తమ యభిప్రాయములను వ్యాపింపజేయుచుండిరి. కొన్ని రాష్ట్రములలో నీరాజభక్తులెక్కువ బలవంతులుగను మరికొన్ని చోట్ల బలహీనులుగను

నుండిరి. యుద్ధముచాలకాలము సాగినకొలదియు నాంగ్లే
యులు పెక్కువిధముల కృషిసలిపి యనేక యుపాయములచే
నమెరికనులను చీలదీసి రాజభక్తులను వివిధప్రాంతములలోను
బలపరచుట యేగాక రాజభక్తుల పటాలములను బయలుదేర
దీసి అమెరికను స్వాతంత్ర్యవాదులపై యుద్ధములను చేయించు
చువచ్చిరి. అమెరికాలోని రాజభక్తులే తమకుముఖ్యమగు
బలమని ప్రథమమున కొంతకాలమాంగ్లేయులు నమ్మియుండిరి.
1780 వ సంవత్సరం డిశంబరునెలలో 8954 మంది రాజభక్తు
లాంగ్లేయ పటాలములలో చేరియుండిరి. 1781 వ సంవత్సరము
7 వ మార్చి తేదీన "దేశీయమహాసభవారి క్రిందనుండిన
అమెరికను సైనికుల మొత్తముకంటె నాంగ్లేయసేనలలో నుం
డిన రాజభక్తులసంఖ్య ఎక్కువగ నున్నదని" ఆంగ్లేయసేనాధి
పతి వ్రాసెను. 1781 వ సంవత్సరము సెప్టెంబరులో ఏడువేల
మంది రాజభక్తు లాంగ్లేయుల సైనికకొలువునం దుండిరి.
మెసషుసెట్సు, మేరీలాండు, పెన్సిసల్వేనియా, న్యూయార్కు
రాష్ట్రములలో బలమయిన రాజభక్తుల సంఘము లుండెను.
న్యూయార్కుకు సమీపమున రాజభక్తులొక కోటను కూడ
నిర్మించియుండిరి. 1775 వ సంవత్సరము నవంబరు నెలలో
కనెక్టికటు రాష్ట్రములోని రాజభక్తులను ఖయిదుచేయుటకు
వాషింగ్టను సూచించెను. 1776 సంవత్సరము మార్చిలో
బాస్టనునుండి ఆంగ్లేయ సేనలతో కూడ వెయ్యిమంది రాజ
భక్తులు వెళ్లిపోయినందున న్యూఇంగ్లాండు రాష్ట్రములలో
రాజభక్తుల పక్షము మిగుల బలహీనమయ్యెను. చాలకాలము
వరకు న్యూయార్కు, పెన్సిసల్వేనియా, న్యూజర్సి రాష్ట్రి

ములు రాజభక్తులతో నిండియుండెను. న్యూజర్సిలోనికి వాషింగ్టను ప్రవేశించినపుడు ప్రజలు భయమువలనను దేశద్రోహమువలనను వాషింగ్టనుకు సహాయముచేయకుండుటను చూచియున్నాము. 1778 వ సంవత్సరమున వోమింగు మొదలగు ప్రాంతములలో రాజభక్తు లాంగ్లేయులతో చేరి ఎఱ్ఱయిండియనులను దేశభక్తులమీద ఘాతకకృత్యములను చేయుటకు పురిగొలుపుటను చూచియున్నాము. దక్షిణముననున్న జార్జియా కారొలీనా రాష్ట్రములలో రాజభక్తులు చాల పలుకుబడి గలిగియుండిరి. 1776, 79 సంవత్సరములలో కారొలీనారాష్ట్రములలో తేలికగ నాంగ్లేయులు రాజభక్తుల పటాలములను ప్రోగుచేయ గలిగిరి. ఈ రాష్ట్రములలో రాజభక్తులకును దేశభక్తులకును ఎడతెగని పోరాటములుకలుగుచుండెను. ఇందువలనఅన్నిరాష్ట్రములలోను యుద్ధమాఖరగువరకును అమెరికను రాజభక్తులు ప్రబలియుండి యాంగ్లేయులకు కొంతవరకు సాయము చేయుచుండిరనుట స్పష్టమగుచున్నది. కాని ఈరాజభక్తులు స్వార్థపరులుగనుండిరి. ధర్మపక్షమున తాము పనిచేయుచున్నామను నుత్సాహముగాని భగవదోద్దేశమును నెరవేర్చుచున్నామను విశ్వాసముగాని వీరికిలేకుండెను. కావున నీరాజభక్తులు ఆంగ్లేయులు జయమందినపుడు వారిపక్షమున చేరుచుండుటయు వారోడిపోవుచున్నపుడు జారిపోవుటయు చేయుచుండిరి. జయమెటుపక్షముననున్నదో చూచి మరి ప్రవర్తించుచుండిరి. కావున వీరి వలన నాంగ్లేయులకు తగిన చేయూతకలుగలేదు. ఈ రాజభక్తుల నుండి యొక పేరు వడసిన సేనాధిపతియైనను బయలుదేర లేదు. క్రమముగా

నీసంగతి యాంగ్లేయ సేనాధిపతులును బాగుగ గ్రహించి వీరిని గూర్చి హీనముగ వ్రాయుచుండిరి. ఆంగ్లసేనాధ్యక్షుడగు కారన్ వాలీసు ప్రభువు వీరినిగూర్చి చెడువిధమున వ్రాసెను. యుద్ధము చాలకాల మాంగ్లేయులు చేయగలిగిన దీరాజభక్తుల సహాయమువలన కాదు. దమస్వంత బలముమీదనే నాధారపడి చేసిరి.

(3)

స్పెయిను వారి యుద్ధములో చేరుట.

స్పెయిన్ దేశము కొంతకాలమువరకు యుద్ధములో దిగలేదు. అటు ఇంగ్లాండుతోను ఇటు ఫ్రాన్సుతోను రాయబారములు జరుపుచునేయుండెను. కాని జిబ్రాల్టరు పట్టణమును మైనార్కా ద్వీపమును ఇంగ్లాండునుండి సంపాదించవలెనని స్పెయిన్ ప్రభుత్వమునకు గలదు. వీటిని స్వాధీనపరచుకొనెదమని ఫ్రాన్సు చెప్పినందున 1779 వ సంవత్సరం 12 వ ఏప్రిలు తేదీన స్పెయిన్ వారు ఫ్రాన్సువారితో నొడంబడికె చేసుకొని యాంగ్లేయులతో యుద్ధముచేయుటకు సమ్మతించిరి. ఫ్రాన్సువారు ఇంగ్లాండుమీదికిగాని ఐర్లండు మీదికిగాని దాడి వెడలుదు మని చెప్పిరి. జూన్ 16 వ తేదీన నింగ్లాండునకును స్పెయినుకును మధ్య యుద్ధము ప్రకటించబడెను. ఆంగ్లేయదేశములోని ప్రజలకు పౌరుషమతిశయించెను. వెంటనే ఏబదివేలమంది ఐచ్ఛిక సైనికులు చేరిరి. ఇదిగాక ఏబదివేల సైనికులుండిరి. పార్లమెంటులో అమెరికాతో యుద్ధమెట్లైన సంతరింప చేయవలెనను పక్షమువారు వృద్ధి యగుచుండిరి. రాజుమాత్రము పట్టుదలను విడువలేదు. అమెరికాస్వతంత్రి మంగీకరించి అమ

మానకరమైనసంధి చేసుకొనుటకు తాను సమ్మతించ జాలనని చెప్పెను. ఫ్రాన్సు, స్పైన్, అమెరికాలతో యుద్ధముచేయుటకు రాజు సన్నద్ధుడయ్యెను.

**అన్ని ఖండములలోను యుద్ధములు.**

జూలై 8 వ తేదీన స్పైన్ సైన్యములు జిబ్రాల్టరును ముట్టడించెను ఫ్రాన్సువారిని ఇంగ్లాండుపైదాడి వెడలమని స్పైన్ ప్రోత్సహించెను. పరాసు, స్పైన్ దేశముల నౌకాదళములు కలిసి ఇంగ్లీషు ఛానలులోనికి వచ్చెను. అటునిటు క్రిందికిపైకి గ్రుమ్మరెను. ప్లిమాతు రేవువద్దకు వచ్చి ఆంగ్లేయ వర్తకపడవలను పట్టుకొనెను. ఒక ఆంగ్లయుద్ధ నౌకనుగూడ స్వాధీనపరచుకొనెను. ఇంతకంటె నేమియుచేయలేదు. పరాసు, స్పైన్ నౌకాసేనాధిపతుల కభిప్రాయ భేదములు కలిగెను. బంక విరేచనములు సైనికులలో వ్యాపించెను. బ్రెస్టు రేవునకు మరలి పోయెను. అక్కడనుంచి చీలిపోయెను. పరాసు సేనలలో జ్వరముకూడ ప్రబలెను. ఏమియు చేయకపోయినను వృధాగా విశేషసొమ్ము మాత్రము ఖర్చయ్యెను.

యూరోపు ఖండమున (నార్తుసీ) ఉత్తర సముద్రములో రెండు అమెరికను యుద్ధనౌకలు ఆంగ్లేయ నౌకలను ముట్టడించెను. పోరుతీవ్రముగనే జరిగెను. ఆంగ్లేయ నౌకలను అమెరికనులు పట్టుకొని హాలండు రేవులోనికి చేర్చిరి. ఒక ఆంగ్లనౌక తగులబడిపోయెను. ఒకఅమెరికను నౌకవిశేషముగ నష్టమొందెను. అమెరికా ఖండమున వెస్టిండియా ద్వీపములలో పరాసువారి రెండు ద్వీపముల నాంగ్లేయులు పట్టుకొనిరి. స్పైన్

వారు ఫ్లోరిడా పైకెత్తిరి. మిస్సిసిపీనది ప్రాంతమువనున్న ఆంగ్లేయుల వలన రాజ్యమునంతను స్వాకరించిరి. ఆఫ్రికా ఖండమున పరాసువారు సినిగలును ఆంగ్లేయులుగోరీని పట్టుకొనిరి. ఆసియా ఖండమున హిందూదేశములో హైదరాలీ నైజాం, మహారాష్ట్రులు మిత్రమండలిగ నేర్పడి ఆంగ్లేయులతో యుద్ధము చేయుచుండిరి. పైమిత్రమండలి క్రింద సమర్థులగు పరాసు సేనాధిపతులు కొలువు చేయుచుండిరి. ఈవిధమున ప్రపంచములోని అన్నిఖండములలోను యుద్ధము జరుగుచుండెను.

1779 వ సంవత్సరము సెప్టెంబరు 1 వ తేదిన పశ్చిమయిండియా ద్వీపములనుండి పరాసు సేనాని ఎస్టింగు ముప్పది యుద్ధనౌకలతో వచ్చి నాలుగు ఆంగ్లేయ నౌకలపై ఆకస్మికముగా పడెను. ఆంగ్లేయులు పారిపోయిరి. పరాసు సైన్యములు 10 వ తేదిన శవన్నాకేవులో దిగెను. ఆపట్టణమును ముట్టడించుటకు తగినస్థితిలో లేమని తలచెను. ఇంతలో ఆంగ్ల సైన్యములు బ్యూఫర్డుసేనాని క్రిందవచ్చి పరాసువారిని ముట్టడించెను. అమెరికను సేనాని లింకను కొన్ని సేనలను పరాసుల సహాయమునకు తెచ్చెను. 1779 వ సంవత్సరమున సెప్టెంబరు నెలలో శవన్నావద్ద జరిగిన గొప్ప యుద్ధములో ఆంగ్లేయులకే పూర్తిగ జయము కలిగెను. పరాసు సేనాని ఎస్టింగునకు రెండుసార్లు గాయములు తగిలెను. వీరి క్రింద పోరాడుచున్న పోలాండుస్వాతంత్ర్యవాదియగు పులస్కికి బలమయిన గాయము తగిలి మరణించెను. పరాసు అమెరికనుల

శవన్నా యుద్ధము.

పక్షమున ఎనిమిది వందలమంది చనిపోయిరి. ఆంగ్లేయులకు బహుకొద్ది నష్టము కలిగెను. వరాసు సేనాని యుద్ధము చాలించి యోడసైన్యముతోడను మిట్టసైనికులతోడను వెడలి పోయెను. లింకను సేనాని మిగిలిన సైన్యములతో ఛార్లెసు టనుకు పోయెను.

అమెరికను సేనాని ఆంగ్లేయులకు లోబడుట.

యుద్ధము బాగుగా జరుపుటకై రోడు అయిలండులో నున్న ఆంగ్లేయ సేనలన్నియు న్యూయార్కు వద్ద క్లింటను సేనాని క్రిందనున్న సైన్యములతో చేరెను. ఇంగ్లాండునుండి కొన్ని క్రొత్త సేనలు వచ్చి వీరితో కలసెను. ఈసైన్యములన్నియు డిశంబరు 26 వ తేదీన న్యూయార్కు నుండి బయలుదేరి త్రోవలో చలిబాధవలనను నౌకల లోపములవలనను శత్రుపౌరజల అడ్డంకములవలనను కొంతనష్టమునుపొందుచు 1780 వ సంవత్సరం ఫిబ్రవరి 26వ తేదీన ఛార్లెస్టన్ పట్టణమును చేరెను. దానిని ముట్టడించెను. లింకను సేనాని అమెరికను సైన్యములనన్నిటితోడను నా పట్టణములో నుండెను. గాని ఆంగ్లేయుల నెదిరింప జాలకపోయెను. ఆపట్టణములోని ప్రజలందరును రాజభక్తులై అమెరికనులకు సహాయ మేమియు చేయరైరి. పట్టణమును సంరక్షించుటకు తగిన బలము లేదు. గావున మే నెల 12 వ తేదీన అమెరికను సేనాని లింకను ఆంగ్లేయులకు లోబడెను. జార్జియాప్రాంతమున కారన్‌వాలీసు ప్రభువు ఆంగ్లేయ సేనలను నడుపుచుండెను. జూన్ నెలలో జార్జియా రాష్ట్రమంతయు ఆంగ్లేయుల వశమయ్యెను.

దేశీయమహాసభ వారి దివాళాస్థితి

1779-80 చలికాలము వాషింగ్టను క్రిందనున్న అమెరికను సేనలకు మిగుల బాధకరముగ నుండెను. చలికాలము శీఘ్రముగ ప్రారంభించెను. చలి మిక్కుటముగ నుండెను. అమెరికనులు అంతయు తమ మిత్రులగు ఫరాసువారు చేసిపెట్టెదరని భారమంతయు వారిమీద త్రోయుచుండిరి. స్వయం సహాయము తక్కువయ్యెను. "అమెరికనులతో మనమును స్పెయిన్‌వారును చేరిన తరువాత అమెరికనుల ప్రయత్నములు క్షీణించినవి. సోమరితనముతోడను అశ్రద్ధతోడను కూడుకొనినారు." అని 1779వ సంవత్సరం సెప్టెంబరు నెలలోనే అమెరికాలోని ఫరాసు రాయబారి ఫరాసు ప్రభుత్వమునకు వ్రాసెను. అమెరికా విప్లవ ప్రభుత్వము (దేశీయ మహాజనసభ) దివాళాయగు స్థితిలో నుండెను. ఇరవైకోట్ల డాలరుల కాగితములను సృష్టించినారు. ఈ కాగితపు డాలరులను పుచ్చుకొనువారు అరుదుగ నుండిరి. ఆరువందల కాగితపు డాలరులకు గాని యొక పాదరక్షలజత దొరకకుండెను. వాషింగ్టనువద్ద ద్రవ్యములేక కాగితపు ముక్కలను పుచ్చుకొనువారులేక సైనికులందరును చలికాలమున దుస్తులును తిండియు లేక చాలబాధపడిరి. చాలకాలము స్వల్పమగు భోజనముతోనే తృప్తినొందుచుండిరి. కొంతకాల మదియుకూడ లేకుండెను. వివిధరాష్ట్రములవారును సైనికులకు భోజనపదార్థములను సమకూర్చవలెనని దేశీయ మహాజనసభవారుత్తరువు చేసిరిగాని దాని ప్రకారము జరుపువారు లేరైరి. సైనికులే చుట్టునున్న ప్రజలనుండి బలవంతముగ భోజనపదార్థములను దోచుకొని తెచ్చు

కొనుచుండిరి. నిర్ణయమైన యొక దినమువరకు మంచి యేర్పాట్లను చేయనిచో తామందరము వెళ్ళిపోయెదమని సైనికోద్యోగులందరును కట్టుకట్టి వాషింగ్టనుకు దెలియచేసిరి. 1780 సంవత్సరం ఏప్రిలు 3 వ తేదీన "యింత తీవ్రముగ నసంతృప్తి ప్రబలిన సమయము యుద్ధకాలములో నెప్పుడును తటస్థించలేద" ని వాషింగ్టను వ్రాసెను. సైన్యములకు అయిదు నెలల జీతము బాకీయున్నదనియు, యెప్పుడును ఆరు దినములకన్న యెక్కువ రోజులకు చాలిన ఆహారపదార్థములు సైన్యములవద్ద లేవనియు, అనేక సమయములలో భోజనము లేకుండ కూడ నుండుచు వచ్చిరనియు సైన్యములవద్ద ద్రవ్యము బొత్తిగా లేదనియు, వీరికి ఋణమునిచ్చువారు లేరనియు, సైనికులయొక్క సహనశక్తి అత్యద్భుతముగ చూపబడుచున్నదనియు, దేశీయ మహాసభ కువసంఘమువారు తెలియబరచిరి. కన్నెక్టికటు సేనలలో తిరుగబాటు సిద్ధమయ్యెనుగాని వాషింగ్టనెటులనో నణచివేసెను. ఆరు నెలలవరకు నూరు రొక్కడాలర్లు ముందుగ చేతిలో బెట్టినగాని యొక్క అమెరికనైనను సైన్యములలో చేరకుండెను. జూన్ నెలలో వాషింగ్టనువద్ద పోరుసలుపుటకు తగినస్థితిలోనున్న సైనికులమొత్తము మూడు వేల ఏడువందల అరవైమందిమాత్రముండిరి.

**అమెరికనుల నిస్సహాయత.**

ఫ్రాన్సునుండి తగిన సహాయము తీసుకొనిరమ్మని లఫయతు ప్రభువును పరాసు దేశమునకు బంపిరి. ఆయన చేయదగిన ప్రయత్నమంతయు చేసి ఏప్రిలు నెలలో నమెరికాకు తిరిగివచ్చెను. కాలదికాలములో పరాసుసైన్యము లమెరికాకు వచ్చి చేరునని

చెప్పెను. జులై నెలలో నారువేలమంది పరాసు సైనికులు న్యూపోర్టు రేవులో వచ్చిదిగిరి. వారితో చేరుటకు వాషింగ్టనువద్ద మనుష్యులుగాని సామగ్రిలుగాని లేకుండెను. రెండవ పరాసుసేన ఫ్రాన్సులోనుండి బయలుదేరకముందే బ్రెస్టు రేవులో నాంగ్లేయులచే నాటంక పరచబడెను. మరియు నిచట న్యూపోర్టు రేవునుకూడ ఆంగ్లేయనౌకావళము ముట్టడించెను. పశ్చిమ ఇండియా ద్వీపములలోని పరాసువారిని, స్పెయిన్‌వారిని సహాయము తెచ్చుకొమ్మని వాషింగ్టనుకు దేశీయ మహాజనసభవారు అధికారమిచ్చిరి. వాషింగ్టను మిగుల దుస్థితిలో నుండెను. ఏమిసైన్యము తెచ్చుకున్నను ప్రయోజనము లేదయ్యెను. వచ్చినవారు తిండిలేక మాడవలసినదే. లేనిచో వారిని యిండ్లకు పంపివేయవలసినదే. ఇంతకన్న యేమిచేయుటకును తోచుటలేదని వాషింగ్టను వ్రాయుచుండెను. జనేవరి 1 వ తేదీన తనవద్దనున్న సైన్యములో సగము వెళ్ళిపోవుననియు తక్కినవారు దేశాభిమానమువలన మాత్రమే నిలిచి యుండవలసినదేగాని మరి యే కారణముచేతను నిలిచియుండరనియు వాషింగ్టను మరల వ్రాసెను. అమెరికాదేశీయు లింతకన్న యెక్కువ సహాయమును చేయనిచో అమెరికను సైన్యములు పేరునకుగూడ నుండవనియు అమెరికా దేశములో అమెరికా ప్రజలపక్షమున విదేశీయులు మాత్రమే పోరాడుచుండు సంతటి యవమానకరమగు స్థితి త్వరలో సంభవింప నున్నదనియుకూడ నాయన దేశీయ మహాసభవారికి తెలిపెను. కానియాకాలమున నాంగ్లేయులును న్యూజెర్సీలో దండెత్తుట తప్ప మరి యేమియును చేయలేదు.

సముద్రము మీఁద యుద్ధము తీవ్రముగ జరుగుచుండెను. ఆంగ్లేయ నౌకాసేనాని అడ్మిరలు రోడ్నీ జనేవరి 8 వ తేదీన 15 స్పైను వర్తక యోడలను 7 యుద్ధనౌకలను పట్టుకొనెను. 16 వ తేదీన సెంటువిన్సెంటువద్ద స్పైను వారి నౌకాదళము నోడించి వారి పదకొండు నౌకలలో నేడింటిని నాశనము చేసెను. జిబ్రాల్టరు పైబడి దానిని స్వాధీనపరచుకొనెను. మైనార్కా ద్వీపమును జయించెను. పశ్చిమ యిండియా ద్వీపములకై పయనమై పోయెను. అక్కడ ఫరాసు నౌకాదళమును ముట్టడించెను. గాని జయము పొందలేదు. నాంగ్లేయ సేనానికి సాయము చేయుటకుగాను తన నౌకాదళముతో అమెరికా దేశమునకు చేరెను.

*ఆంగ్లేయ నౌకాదళము యొక్క జయములు.*

ఈలోపున మఱియొక దేశము యుద్ధములోనికి లాగబడుచున్నది. తటస్థముగనున్న దేశములలోకెల్ల హాలండునకు విరివిగ విదేశవాణిజ్యము గలదు. యుద్ధమువలన వీరు ఎక్కువ లాభము పొందుచున్నారు. అమెరికా వారుకూడ వీరి సరుకులనే ఎక్కువగా కొనుచున్నారు. యుద్ధములోనికి దిగియున్న నితర దేశములవారును వీరి సరుకులనే కొనుచున్నారు. వీరి నెట్లయిన తమ పక్షమున యుద్ధములోనికి చేర్చుకొనవలెనని ఆంగ్లేయులు ప్రయత్నించిరి. పాత యొడంబడికలను బయటపెట్టిరి. ఆంగ్లేయులకు యుద్ధములో సహాయము చేయుటకు హాలండువారిదివరకే యొడంబడియుండిరని చెప్పిరి. కాని హాలండువారు పోరాడదలచలేదు.

*హాలండుతో ఆంగ్లేయులకు కలహము.*

అమెరికను నౌకలకు హాలెండు రేవులలో శరణ్యమిచ్చుట అక్రమమని ఆంగ్లేయులు చెప్పిరి. ఎవరైనను తమ రేవులలోనికివచ్చి సురక్షితముగ నుండవచ్చునని హాలెండువారు జవాబు చెప్పిరి. తమ శత్రువులకేమైన ఆయుధములనుగాని భోజనపదార్థములనుగాని తీసుకొని పోవుచున్నారేమో చూచుటకై ఆంగ్లేయులు తటస్థులగు దేశములవారి వర్తకపు టోడలను సోదా చూడ నారంభించిరి. దీనికి హాలెండు వారొప్పుకొనలేదు. జనేవరి నెలలో అయిదు హాలెండు యుద్ధనౌకల సంరక్షణ క్రింద పరాసువారి బ్రెస్టు రేవునకు పోవుచున్న యొక హాలెండు వర్తకపు నౌకాదళమును ఇంగ్లీషు ఛానలులో నాంగ్లేయ నౌకాదళ మాపి సోదా చూచెదమనిరి. దీనికి హాలెండువారు తిరస్కరించిరి. ఇరుపక్షములవారును కలహించిరి. కొన్ని హాలెండువారి వర్తకపు టోడల నింగ్లీషు వారు పట్టుకొని ఆంగ్లేయదేశపు రేవులోనికి తెచ్చిరి. తక్కిన హాలెండు నౌకలు వెళ్లిపోయెను. కొన్ని నెలలతరువాత హాలెండతో జరుపుచున్న వర్తకమును మానుట కాంగ్లేయులు తీర్మానించిరి. ఉభయులకును సంవత్సరాంతమువరకును యుద్ధము ప్రారంభము కాలేదు.

ఆంగ్లేయులు హాలెండు వారి వర్తకపు నౌకల నాపు తటస్థదేశముల టయు స్పైన్‌వారు రుష్యావారి వర్తకపు కట్టడి. నౌకల నాపుటయు జరిగినందున యూరపు ఖండములోని తటస్థ దేశములవారొక కట్టడిని చేసికొనిరి. దీనికి ముఖ్యులు ప్రష్యారాజును రుష్యారాణియును మార్చి 8 వ తేదీన "తటస్థదేశముల వారిపడ

వలు సముద్రములమధ్యనేగాక యుద్ధము చేయుచున్న దేశములవారి రేవురేవునకును ప్రయాణము చేయుచున్నను ఎవరును ఎట్టిఅభ్యంతరమును చేయగూడదనియు తటస్థ దేశములవారి పడవలమీద నాయుధములుగాక మిగతానేమి తీసుకొని పోవుచున్నను ఆటంకపరచ గూడదనియు" రుష్యా రాణి ప్రకటించి ఈధర్మమును కొనసాగించుటకు తటస్థ దేశముల వారందరు నొకయొడంబడిక చేసుకొని దీని నములు జరుపుటకు తమసైన్యములతో సిద్ధముగ నుండవలెనని కోరెను. రుష్యా, ప్రష్యా, హాలెండు, స్వీడను, డెన్మార్కు, పోర్చుగలు ప్రభుత్వములవారీకట్టడిలో చేరిరి. ఏప్రిలు నెలలో ఫ్రాన్సు, స్పెయిన్, దేశములవారుకూడ నిందు కంగీకరించిరి. అక్టోబరు నెలలో అమెరికా సంయుక్త రాష్ట్రములు సమ్మతిని వెలిబుచ్చెను. సంవత్సరాంతమున ఆస్ట్రియా చక్రవర్తికూడ చేరెను. ఇందువలన ఆంగ్లేయ వర్తకమునకు నష్టమని యింగ్లాండు చేరలేదు.

(4)

ఐర్లాండులో కల్లోలము.

ఈ సమయమున ఐర్లాండులో గొప్పకల్లోలము బయలుదేరెను. అప్పటికి ఐర్లాండు ఆంగ్లేయరాజు క్రిందనున్నను వేరుపార్లమెంటును కలిగియుండెను. ఆపార్లమెంటు కింగ్లాండు పార్లమెంటువలెనే ప్రజా ప్రతినిధి సభయు ప్రభువుల సభయునని రెండు సభ లుండెను. ఇంగ్లాండులోని ప్రివి కౌన్సిలు వారు తయారు చేసి పంపెడి చట్టములను అవును, కాదు యని సమ్మతుల నిచ్చి యిష్టము వచ్చినచో

నెక్కవమంది యంగీకరించుటయు లేదా తిరస్కరించుటయు మాత్రమే చేయవలెనుగాని ఐర్లండు పార్లమెంటువారికి స్వంతముగ చట్టముల నుపపాదించు నధికారము లేకుండెను. ఐర్లండు ప్రభువ్రల సభమీాద ఇంగ్లాండు ప్రభువుల సభకు వీట్వేలు (విమర్శనాధికారము) గలదు. ఆంగ్లేయ పార్లమెంటువారు చేయు చట్టములను ఐర్లాండువారిని బద్ధులను చేయును. కాని ఐర్లాండుయొక్క పార్లమెంటులో నున్నవారందరును ఇంగ్లాండు నుండియు స్కాట్లండు నుండియు వచ్చి కాపురమున్న ప్రాటస్టంటు మతస్థులు. ఆంగ్లేయులు ఐర్లండులో ముఖ్యముగ అలస్టరు ప్రాంతమున వలసవచ్చి నివసించి ఐర్లాండులోని చాల భూములను స్వాధీనమునుపొంది గొప్ప భూఖామందులై యుండిరి. వీరాంగ్లేయదేశపు ప్రాటస్టంటు క్రైస్తవమత శాఖకు చెందినవారు. వీరు ఐర్లాండులోని ప్రభువ్రల సభలో సభ్యులగుటయేగాక ఐర్లాండు ప్రజా ప్రతినిధిసభయు వీరి చేతులలోనే యుండెను. వీరికిష్టమువచ్చిన వీరి పలుకుబడిలోని ప్రాటస్టంటులను ప్రజాప్రతినిధిసభకు నియమించుచుండిరి. ఐర్లాండు ప్రజలలో నత్యధిక సంఖ్యాకులు రోమనుకాథలిక్కులు. ఆంగ్లేయరాజులు అయిర్లాండును జయించగనే రోమనుకాథలిక్కు భూఖామందుల భూములను లాగుకొని ఆంగ్లేయదేశమునుండివచ్చిన ప్రాటస్టంటుభూఖామందులకిచ్చిరి. ఐర్లాండులో నూటికి ఎనుబదినలుగురు రోమను కాథలిక్కులుండిరి. నూటికి పదునారుగురు మాత్రమే ప్రాటస్టెంటులు గలరు. ఆంగ్లేయ ప్రభుత్వమువారు ఐర్లాండులోని రోమను కాథలిక్కుల కన్ని రాచకీయహక్కులను తీసివైచిరి. రోమను

కాథలిక్కులు పార్లమెంటు సభ్యులగుటకుగాని, పార్లమెంటు సభ్యులను నెన్నుకొనుటకుగాని, సైనికులుగ చేరుటకుగాని ప్రభుత్వోద్యోగమును చేయుటకుగాని న్యాయవాదు లగుటకుగాని పురపాలకసంఘముల సభ్యులగుటకుగాని వీలులేకుండ చట్టములను చేసిరి. రోమనుకాథలిక్కులేగాక ఆంగ్లేయదేశపు ప్రొటస్టంటుశాఖకు చెందని యితరప్రొటస్టంటు మతస్థులుకూడ నెట్టి యుద్యోగములకును అర్హులు కారని శాసించిరి. కావున ఐర్లాండుయొక్క పరిపాలనాధికార మంతయు ఆంగ్లేయ దేశమునుండి వచ్చి కాపురముండినట్టియు ఆంగ్లేయదేశపు ప్రొటస్టెంటు మతశాఖకు చెందినట్టియు నూటికి పదిమంది జన సంఖ్యగల ప్రభువులయొక్కయు వారి ఆంగ్లేయ యనుచరుల యొక్కయు నధీనమున నుండెను. ఐర్లాండు ప్రజలు చాలవరకు ఆంగ్లేయుల భూములను దున్నుచుండెడి బీదరైతు లైరి. ఐర్లాండు ప్రజనవర్తకమునకు కూడా భంగకర మగు చట్టము లాంగ్లేయ ప్రభుత్వముచేచేయబడెను. ఐర్లండుప్రజలు పేదరికములో మునిగి యుండిరి. అచట క్షామదేవత తన నివాస మేర్పరచుకొనినది.

1779న సంవత్సరమున ఫరాసువారు ఐర్లాండుపై దండెత్తుదు రనువార్త తెలిసి అరువది వేలమంది ప్రొటస్టెంటు ఐచ్ఛిక సైనికులు పోగయిరి. కాని ఈఅవకాశము తీసుకొని ఐర్లాండులోని ఆంగ్లేయ ప్రభువులు ఐర్లాండు పార్లమెంటుకు ఆంగ్లేయ పార్లమెంటుమీద పరాధీనత తప్పించవలసినదనియు వర్తకపు హక్కుల నివ్వవలసినదనియు నాందోళనము చేయ సాగిరి. ప్రొటస్టంటు ఐచ్ఛిక సైనికులు రోమనుకాథలిక్కు

ప్రజలకుగూడ కొన్నిహక్కుల నిప్పించెదమని యాశ బెట్టి
యాంగ్లేయ దేశముపై తిరుగబాటు చేయుటకు సిద్ధము
చేయుచుండిరి. ఐర్లాండు పార్లమెంటుకు స్వతంత్రాధికారము
కావలెననికూడ కోరిరి. 1779వ సంవత్సరము నవంబరు
25 వ తేదిన లండనులో ఆంగ్లేయ పార్లమెంటు సమావేశమై
నపుడు ఐర్లాండుదేశములోని కల్లోలమునుగూర్చి యోచిం
చిరి. ఐర్లాండుదేశవు వర్తకమునకును రోమనుకాథలిక్కు
మతస్థులకును కొన్నిహక్కుల నిచ్చుటవసరమని ప్రధాన
మంత్రి చెప్పెను. రోమను కాథలిక్కులకు హక్కు లనగనే
పార్లమెంటు సభ్యులలో కొందరికి చాలకష్టముగ తోచెను.
వెంటనే ఇంగ్లాండులోను స్కాట్లండులోను రోమనుకేథలిక్కుల
కిట్టిహక్కుల నివ్వగూడదని యాందోళనము చేయుటకు అనేక
సంఘములు స్థాపించబడెను. ఈసంఘములన్నియు కేంద్రీ
కరింపబడి యొకప్రొటెస్టెంటు సంఘమున కనుబంధములుగ
చేయబడెను. వీరనేక మహజర్లను పార్లమెంటునకు బంపిరి.
పైగ జూన్ 2 మొదలు జూన్ 8వ తేదివరకును లండనులో
గొప్ప ప్రజాయల్లరులు జరిగెను. ప్రజాసమూహములు
బయలుదేరి రోమనుకాథలిక్కుల దేవాలయములను యిండ్లను
తగులబెట్టిరి. బ్యాంకిని దోచుకొనిరి. ప్రభుత్వసైనికు
లీయల్లరుల నణచుటకు యత్నించగ యనేకమంది యుభయ
పక్షములను హతులైరి. లండనులోని యనేకభాగములలో
మంటలు లేచెను. మంటలలోకూడ ననేకులు చనిపోయిరి.
లక్ష యెనుబది వేల సవరనులు కిమ్మతుగల యాస్తిపాడ
య్యెను. ఇట్టియల్లరులే బ్రిస్టలు మొదలగు కొన్ని ఇతర

చోట్లను ప్రారంభించగ వెంటనే నణచివేయబడెను. 19వ జూన్న పార్లమెంటు సమావేశమయ్యెను. రోమను కాథలిక్కులకు కొన్ని స్వల్పమగుహక్కుల నిచ్చుచు చట్టమును చేసిరి. జులై 6 వ తేదిన యల్లరులు చేసినవారిలో ముఖ్యులను విచారించి శిక్షలను విధించిరి. స్పైన్ దేశము ఇంగ్లేయులతో రాజీకి రావలెనని కొంతవరకు రాయబారములు జరిపెను. కాని రోమనుకాథలిక్కులపై జరిగిన అల్లరులవలన రోమనుకాథలిక్కులగు స్పైన్ ప్రభుత్వమువారు మనస్తాపము నొంది సంధి ప్రయత్నములను విరమించిరి. అమెరికా, స్పైన్ మొదలగు దేశములతో ఇంగ్లాండు యుద్ధము చేయుచు యూరపులోని పెక్కుప్రభుత్వముల వా రింగ్లాండుయొక్క వర్తకమునకు నష్టకరముగ కట్టడిచేసుకొనియున్న యీసమయమున నీఅల్లరులు జరుగుటంబట్టి యాంగ్లేయ జనబాహుళ్య మీయుద్ధవిషయములలో నెట్టిశ్రద్ధయు పుచ్చుకొనుటలేదని గోచరించుచున్నది.

1780 సంవత్సరమంతయు అమెరికాలోని దక్షిణప్రాంతముననే యుద్ధము జరుగుచుండెను. దక్షిణ

ఇంగ్లసేనాని కారన్ వాలీసుప్రభువు కాండను వద్ద గొప్ప జయమును పొందెను.

కారోలీనా రాష్ట్ర మాంగ్లేయుల వశమయ్యెను. కాని యారాష్ట్రమునుండి కొందరమెరికను దేశభక్తులు లేచిపోయి ప్రక్కనున్న ఉత్తరకారోలీనా రాష్ట్రములో చేరియుండి సమయము దొరకినపుడెల్ల నాంగ్లేయులపైబడుచుండిరి. ఆగస్టు నెలలో నచటికి వాషింగ్టను కొంతసైన్యము నంపెను. వర్జీనియా రాష్ట్రమునుండియు కొంతసైన్యము

వచ్చెను. గేట్సుసేనాని ఈ అమెరికను సైన్యములన్నిటికిని సేనాధిపత్యము వహించి పదునారవ యాగస్టున కాండన్ వద్ద కారన్‌వాలీసు ప్రభువు క్రిందనుండిన యాంగ్లేయ సైన్యములను తాఱ్కొనెను. కాని యీదిన మమెరికనులకు మిగుల దురదృష్టమైనది. వర్జీనియా నుండివచ్చిన మైన్యికభటులాయుధములను పారవేసి ఆంగ్లేయులు వెంబడించినను చిక్కక సమీపముననున్న అడవులలోనికి పారిపోయిరి. చాలమంది ఇతర సైనికులును నదేపనిని చేసిరి. మొత్తముమీద అమెరికను సైన్యములలో రెండు భాగము లొకతుపాకియైన శత్రువులమీద కాల్చకుండగనే నత్యంతభయమువలన పలాయనమైరి. అమెరికనుసేనాని డికాల్బునకు బలమైనగాయములు తగిలి మరణించెను. యుద్ధమునకు నిలువబడిన అమెరికను సైనికులలో రెండువేలమంది హతులైరి. అమెరికను సామాగ్రిలును యుద్ధసామానులును ఆంగ్లేయులు స్వాధీనము పొందిరి. మిగిలిన కొద్దిసైన్యములతో నమెరికను సేనాని గేట్సు ఉత్తరకారోలినా రాష్ట్రములోనికి పారిపోయెను. దక్షిణకారోలినా రాష్ట్రములోనుండి వచ్చిన దేశాభిమానులను నడపుచున్న సమ్ప్టరుసేనానిపై ఆంగ్లసేనలాకస్మికముగ పడి యోడించి చాలమందిని యుద్ధములో చంపి కొందరిని ఖైదీలుగా పట్టుకొనిరి సమ్ప్టరు సేనాని ఒంటరిగా నెత్తిమీద టోపీకూడా లేకుండా జీనులేని గుఱ్ఱముపై నెక్కి పారిపోయెను.

౬)

కాని వేరొకచోట అమెరికను శత్రుమునకు

కింగ్సుకొండవద్ద అమెరికనులు జయమొందిరి.

కొంతవరకు జయము కలుగుచున్నది. ఆంగ్లేయ సేనానియగు కారన్‌వాలీసు ప్రభువు అమెరికను ప్రజలను తన సైన్యములలో చేరమనియు, తమ కాహారసామగ్రుల నిమ్మని, నిర్బంధించుటయు, దేశభక్తుల ఆస్తులను వశపరచుకొనుటయు, ఆంగ్లేయ సైనికులు ప్రజలను దోచుకొనుటయు, హింసించుటయు, పట్టణములను తగులబెట్టుటయు, చాలమంది అమెరికనులలో నింగ్లీషువారిపై ద్వేషమును పురిగొల్పుచుండెను. ప్రజలు నాయుధులై జేమ్సు విలియమ్సు, మారియనుల క్రింద ఐచ్ఛిక సైనికులుగ తయారుచేయబడిరి. ఆంగ్లేయులపై యాకస్మికముగబడుచు పెద్దసేనలు వచ్చి యెదిరించినపుడు తప్పించుకొని పోవుచుండిరి. ఉత్తరకారొలీనాలోని పీడీ, సాంటి నదులమధ్యనున్న ప్రదేశములో నాంగ్లేయులపై యుద్ధము చేయుటకు సిద్ధపడని వాడొకడైన లేడని కారన్‌వాలీసు వ్రాసెను. ఉత్తర కారొలీనా రాష్ట్రమంతయు నీవిధముననే యుండెను. రాజభక్తులనుండి కొంత తనకు సహాయము కలుగునని యాశించి కారాన్‌వాలీసుప్రభువు ఉత్తర కారొలేనాపై దండయాత్ర సలిపెను. మేజరు ఫర్గూసనుక్రింద కొంత సైన్యమును మిట్టప్రదేశములకు బంపి తాను మిగిలినసేనలతో చెర్లొటిమీదికి వెడలెను గాని త్రోవలో మేజరు ఫర్గూసను గొప్ప యపజయమును పొందెనను వార్త చేరెను. కింగ్సుకొండ వద్ద మేజరు ఫర్గూసను క్రిందిసేనలను అమెరికనులు తార్కొని పూర్తిగ నోడించిరి. మేజరు ఫర్గూసను హతుడయ్యెను. ఆంగ్లేయసైనికులు మరణించినవారుగాక మిగిలినవారినందరను

అమెరికనులు ఖయిదు చేసిరి. ఈ వార్త తెలియగనే కారన్ వాలీసు ప్రభువు వెనుకకు మరలి దక్షిణ కారొలీనాలోనికి చేరెను. కాని త్రోవపొడుగునను అమెరికను ఐచ్ఛికభటులును రైయితులును పెక్కు విధములగు నిబ్బందులును కలుగజేసిరి. ఆంగ్లేయుల యాహారపదార్థముల నమెరికనులు వశపరచుకొనుచుండిరి. దొరికిన యాంగ్లేయులను హతులను గావించుచుండిరి. జ్ఞాకుస్టాకువద్ద ఆంగ్లేయులు అమెరికనులతో యుద్ధముచేసి ఓడిపోయిరి.

1780 సంవత్సరమున హిందూదేశములో మైసూరు హిందూదేశములో రాజగు హైదరాలీ ఆంగ్లేయుల నోడించెను. హైదరాలీ ఆంగ్లే క్వెబికువద్దనుండిన ఆంగ్లేయ నౌకాదళమును యుల నోడించెను అమెరికను నౌకాదళముపట్టుకొనెను. పశ్చిమయిండియా ద్వీపములకు తూర్పుయిండియా ద్వీపములకును వెళ్ళుచుండెడి ఆంగ్లేయ నౌకాదళమును స్పైన్‌వారు పట్టుకొని రెండువేల ఎనిమిదివందల ఆంగ్లేయసైనికులను ఖయిదుచేసిరి. ఇందువలన ఆంగ్లేయవర్తకమునకు నష్టము కలిగెను. 1780 సంవత్సరము డిశంబరు 20 తేదీన నాంగ్లేయప్రభుత్వమువారు హాలెండుదేశముపై యుద్ధమును ప్రకటించిరి.

1781 సంవత్సరము మార్చినెలలో హిందూదేశములో కూటు సేనాని పరాసువారి పుదుచ్చేరిని వశపరచుకొని అక్కడనున్న పరాసువారిని నిరాయుధులు గావించి హైదరాలీని మహారాష్ట్రులను ఓడించెను. హిందూదేశములోని హాలండు వారికి (ఒలందావారికి) గల పట్టణములను నవంబరు నెలలో ఆంగ్లేయులు వశపరచుకొనిరి. ఫిబ్రేవరి నెలలో సింకను

హాలెండుతో యుద్ధము బాగుగ ప్రచురించకమునుపే హాలెండువారి యూస్టేషియసు ద్వీపమును ఆంగ్లేయ నౌకా సేనాని యాకస్మికముగా ముట్టడించి యందులోని హాలెండువారి ముప్పదిలక్షల సవరనుల కిమ్మతుగల వర్తకసరుకులను నూటయేబది వర్తకపు పడవలను అయిదు చిన్న యుద్ధనౌకలను స్వాధీనమును పొందెను. ఇంతేగాక యూరోపునకు వచ్చుచున్న నలుబదియేడు హాలెండువర్తకపు నౌకలనుకూడ నాంగ్లేయులు సముద్రమధ్యమునందు పట్టుకొనిరి. మార్చినెలలో పశ్చిమ యిండియా ద్వీపములలోని హాలెండువారికి చెందిన డెమరారా మొదలగు ద్వీపముల నాంగ్లేయు లాక్రమించుకొనిరి. ఉత్తర అమెరికాతీరమున నాంగ్లేయుల పెన్సకోలా ద్వీపమును స్పైన్ వారు వశపరచుకొనిరి.

పరాసుదేశపు ఆర్థికస్థితి మిగుల చెడుగ నుండెను.

అమెరికను సైనికుల కష్ట పరంపరలు

పరాసు ప్రభుత్వము పదునారుకోట్ల సవరనులవరకు ఋణపడియుండిరి. దీనిని తీర్చుమార్గ మెద్దియును లేకుండెను. అమెరికాకుసాయము చేయుటకుగాను హాలెండులో పరాసువారు ఒకకోటి లివరీల ఋణమును చేసిరి. కొన్ని సంస్కరణములను చేయ యత్నించి సాగక పరాసుమంత్రి నెక్కరు రాజీనామా నిచ్చెను. అమెరికాలోకూడ నింకను స్థితిగతులు వృద్ధిచెందలేదు. 1780 డిశంబరు నెలలోను 1781 సంవత్సరము జనేవరి నెలలోను మిక్కుటమగు చలికాలమగుటచే అమెరికను సేనలు పడిన కష్టములు వర్ణనాతీతములు. సైనికులకు పదినెలల జీతము బాకీ బడినది. అమెరికను కాగితపు నోట్లవంటివాటిని ఆంగ్లే

యులుకూడ సృష్టించి మోసము చేయసాగిరి. ఇందువలవ ప్రజలకీ కాగితపు నోట్లయందు పూర్తిగ విశ్వాసము పోయినది. విదేశములనుండి సామగ్రిని దిగుమతిచేయుటకును వీలు లేదని వాషింగ్టను గట్టిగ వ్రాయుచుండెను. 1781 సంవత్సరము జనేవరి 1 వ తేదీన పెన్సిల్వేనియా రాష్ట్రమునుండి వచ్చిన సైనికులలో చాలభాగము తిరుగబాటు చేసి వెళ్ళిపోయెదమనిరి. వారిని పోకుండ చేయుటకు ప్రయత్నించగ నొక యుద్యోగస్తుడు చంపబడెను. పదమూడువందల సైనికులాయుధములతో వెడలిపోయిరి. కాని వారు దేశద్రోహులు గారు. ఆంగ్లేయులు వారిని తమపక్షమున చేరుమని కోరగా వారు నిరాకరించిరి. దేశీయ మహాజనసభవారు వారితో నెలులనో రాజీపడి కొందరిని యిండ్లకు పంపివేసి కొందరిని సేనలలో చేర్చుకొనిరి. జనేవరి 20 వ తేదీన న్యూజర్సీ రాష్ట్రమునుండి వచ్చిన సైనికులు తిరుగబాటు చేసిరి. ఇద్దరు ముఖ్యులను వాషింగ్టను ఉరితీయించెను. ఇట్టి సందర్భమువలన క్రొత్తవారు సేనలలో చేరుటలేదు. కొన్ని రాష్ట్రములలో మాత్రము కొద్ది కాలమువరకు సేనలలోనుండు షరతుతో సైనికులు చేరుచుండిరి. దేశీయ మహాజనసభ వారు కాపలెనని తీర్మానించిన ముప్పదియేడువేల సైనికులకు ఏడువేలమంది మాత్రమే యుండిరి. భోజనసామాగ్రిలు దొరకక సైనికులు చుట్టుపట్టు ప్రజలను నిర్బంధించి తెచ్చుకొనుట జరుగుచుండెను. ఇటుల చేయుటవలన ప్రజలకిబ్బంది కలిగించుటయు సైనికులకు దురభ్యాసములు నేర్పుటయు ప్రజల

సానుభూతిని గోల్పోవుటయు కలుగుచున్నదని వాషింగ్టను వ్రాయుచుండెను.

1781 సంవత్సరము ఫిబ్రేవరు నెలలో రాబర్టు మారిసుయొక్క యాధిపత్యము క్రింద దేశీయ
*అమెరికా వారిబ్యాంకి* మహాజన సభవారొక బ్యాంకిని స్థాపించిరి. దీనితో సైనికుల యార్థికస్థితి వృద్ధిచెందెను. మార్చి 1 వ తేదీన మిగిలిన యన్ని రాష్ట్రములును సంయుక్త ప్రభుత్వపు నిబంధనలపై సంతకములు చేసినవి. ఈ కాలమున "అమెరికాలోని యన్ని భాగములలోను తిరుగబాటుదార్ల బలము క్షీణించి పోయినదనియు తిరుగబాటు నణచుటకు రాజుగారి సేనలు చేయుచున్న ప్రయత్నముల నాటంకపరచుటకు తగిన శక్తి లేదనియు కొలదికాలములో నమెరికాయంతయు రాజుగారికి స్వాధీనమగుననియు" నాంగ్లేయమంత్రి తమ ప్రభుత్వమువారికి వ్రాయుచుండెను.

(౯)

1781 సం॥రం జనేవరి 17వ తేదీన ఆంగ్లేయసేనలువచ్చి కౌపన్సు యుద్ధము. అమెరికాసేనాని మార్గమును ముట్టడించెను. జరిగిన దారుణయుద్ధములో నాంగ్లేయులు పూర్తిగ నోడింపబడిరి. ఈకౌపన్సు యుద్ధములోనొందినదయము అమెరికనులకు మంచిఖ్యాతిని కలుగచేసినది. దీనికిఆంగ్లసేనాధ్యక్షుడు కారన్ వాలీసుప్రభువు కినుకవహించి మంచి సైన్యములతో అమెరికనులపైకి దాడివెడలెను. అమెరికను సేనలు ఆంగ్లేయులకు వెరచి రెండువందల మైళ్ళదూరము పారిపోయెను. కారన్ వాలీసు వెంటనంటి తరుముచుండెను. అమెరికనులు పారి

పోవుచుండిరి. అమెరికను సేనలకు సరిగ తిండికూడ లేకుండెను. నలుగురి కొకటిచొప్పున నా చలికాలములో కప్పుకొనుటకు దుప్పటులుండెను. కారన్‌వాలీసు ప్రభువు నెమ్మదిగ పిల్సుబరోను చేరెను. రాజభక్తులందరును వచ్చి తన సైన్యములలో చేరవలెనని యుత్తరువు చేసెను. రాజభక్తు లెక్కువైరి. ఒక్క దినముననే ఏడు రాజభక్తుల సైన్యములేర్పడెను. కాని పిక్కెన్సు, లీయను వారి క్రింద కొంతమంది అమెరికను దేశభక్తులు రాజభక్తులపై బడి మూడువందల మందిని ముక్కలు ముక్కలుగ చీల్చివేసిరి. దీనివలన రాజభక్తులలో చాల భయము కలిగెను. "మన స్నేహితులగు నీ రాజభక్తులు పిరికి పందలనియు శత్రువులగు తిరుగబాటుదార్లు మెండిధైర్యము గలవారనియు" కారన్ వాలీసుప్రభువు వ్రాసెను.

గిల్ఫర్డు కోర్టుహౌసు యుద్ధము

తుదకు మార్చినెల 15 వ తేదీన గ్రీన్ క్రింద నుండిన అమెరికను సేనలకును కారన్‌వాలీసు ప్రభువు క్రిందనుండిన అంగ్లేయ సేనలకును గిల్ఫర్డుకోర్టుహౌసు అను ప్రదేశమున యుద్ధము జరిగెను. అమెరికను సైన్యములు మూడు భాగములుగ విభజించబడి మూడు ప్రదేశములలో నుంచబడెను. మొదటిభాగమున ఉత్తరకారొలీనా ఐచ్ఛిక భటులుండిరి. ఆంగ్లేయులు ముట్టడించగనే వీరు పారిపోయిరి. ఇచట ఆంగ్లేయులకు తేలికగ జయము కలిగెను. రెండవ భాగమున వర్జీనియా సైనికులుండిరి. ఇచటకూడ ఆంగ్లేయులే జయమొందిరి. మూడవ భాగమున గ్రీన్ సేనాని నడుపుచుండెను. ఇక్కడ యుద్ధము మిగుల తీవ్రముగ జరిగెను. చివరకు గ్రీన్ సేనాని ఓడిపోయి మిగిలి

సైన్యముతో వెడలిపోయెను. కాని యుద్ధమందు ఆంగ్లేయులే ఎక్కువ నష్టమొందిరి. విశేషముగ సైనికులను కారన్‌వాలీసు పోగొట్టుకొనెను. అందువలన కారన్‌వాలీసు సైనికులతో మరలి పోవుచుండగ గ్రీన్ నూతన సైన్యములతో వెంబడించెను. కారన్‌వాలీసు శీఘ్రముగా నుత్తరకారొలీనా రాష్ట్రమునంతను నమెరికనులకు వదలి సముద్రతీరమునందున్న విల్మింగుటనును జేరెను. ఇచటనుండి వర్జీనియా రాష్ట్రమునకు పోవనుద్యుక్తుడయ్యెను. వర్జీనియాలోని ఆంగ్లేయ సైన్యముల పైకి పరాసు ప్రభువగు లఫయతు సేనాని వెడలెను. లఫయతు జీతము పుచ్చుకొనకుండ వాషింగ్టన్‌క్రింద పని చేయుచుండెను. ఈయనక్రిందనున్న సైనికులకు జీతముగాని సరియైన తిండిగాని దుస్తులుగాని లేకుండెను. ఈయన స్వంతముగ రెండువేల నవరసుల ఋణముచేసి తనక్రింది సైనికులకు అవసరమగు నేర్పాటులనెల్ల జేసెను. ఆ ప్రాంతములలోని ఐచ్ఛిక సైనికులను గూడ చేర్చి ఆంగ్లేయులను ముందుకు రాకుండ నాటంక పర్చ గలిగెను. ఏప్రియల్ నెల చివరభాగమున ఆంగ్లసేనాని కారన్‌వాలీసు ప్రభువు పదునాలుగు వందల సైనికులతో విల్మింగుటను వదలి వర్జీనియాలోని పీటర్సు బర్గును చేరెను. కారన్ వాలీసు వెడలిపోయిన తరువాత దక్షిణకారొలీనా, జార్జియా రాష్ట్రములను స్వాధీనమును పొందుటకు అమెరికను సేనాని గ్రీన్ ప్రయత్నములను చేసెను. ఆ ప్రాంతములలోని వివిధభాగములకును తగిన సేనలను పంపెను. తాను కాండెన్ పైకి వెడలెను. ఏప్రియల్ 18 వ తేదీన ఈయనను రాడన్‌ప్రభువు

క్రిందనాంగ్లేయ సేనలు ముట్టడించెను. అమెరికను లోడిపోయిరి. రాడన్ ప్రభువు మొదట అమెరికన్ సేనాని గ్రీనను తిరుమను చుండెను. ఈ మధ్యను లీ, మేరియాన్ సేనానులక్రింద నమెరికను సేనలు వచ్చి రాడను నాటంకపరచెను. రాడన్ వెనుకకుమరలి సాంటీ నదియొద్దనే పోవుచుండెను. దక్షిణ కారొలీనా రాష్ట్రములోని వాయవ్య భాగమంతయు నమెరికనుల వశమయ్యెను. రాడన్‌కు నిలువ నీడదొరకక నమెరికన్ సైన్యములచే నలువైపులనుండియు తరుమబడి కొలదికాలములో నా రాష్ట్రమును వదలి ఛార్లెస్టన్‌ను చేరెను. రాజభక్తులతో తాను వారిని సంరక్షించలేననియు వారి తిప్పలు వారే చూచుకొమ్మనియు చెప్పి వెళ్ళెను. అక్కడ జబ్బుపడి యుద్ధములో విసికి రాడన్ ప్రభువు ఇంగ్లండునకు పయనమై పోయెను. దక్షిణ కారొలీనా రాష్ట్రములో చాలభాగము నమెరికను సేనాని గ్రీను వశపరచుకొనెను. సాంటి ప్రాంతముల మాత్రమే ఆంగ్లేయు లింకను యుండిరి ఈ రాష్ట్రము నుండి కారన్ వాలీసుప్రభువు వర్జీనియాకు పోవుటవలన నదివరకాంగ్లేయులు పొందిన జయములన్నియు మాసిపోయెను. "ఇచట తగినంతమంది రాజభక్తులు తమ పక్షమున పోరాడుదురనిగాని, పోరాడినను ప్రయోజనము కలుగుననిగాని," అయనకు నమ్మకము లేక నీరాష్ట్రము ను విడిచి వెళ్ళెను. దేశమును జయించుట కాంగ్లేయసైన్యము చాలదేమోనని కూడా నాయనకు సందేహము కలిగెను. మేనెలలో నాంగ్లేయ పార్లమెంటు సమావేశమైనపుడు, పిట్టు, ఫాక్సు, మొదలగు సభ్యులు కారన్‌వాలీసుప్రభువు పంపిన నివేదికనుబట్టి

యుద్ధము జయప్రదముగ సాగించుట దుర్లభ మని తోచు చున్నందున నేదోవిధముగ సంధి చేసికొనవలసినదని చెప్పిరి. కాని ఎక్కువమంది దీనికి సమ్మతింపలేదు.

కారన్‌వాలీసు వర్జీనియా రాష్ట్రసభ్యులను ఖైదుచేయుట.

మే 20 వ తేదీన కారన్‌వాలీసు ప్రభువు తనక్రింద నున్న ఆంగ్లేయసేనలతో పీటర్సుబర్గును చేరెను. వర్జీనియా రాష్ట్రీయసభవారు చార్లటస్వనీ పట్టణమున సమావేశమై యుండగ వారిపైకి టార్లెటనుక్రింద కొంత యాంగ్లేయ సేనను పంపెను. టార్లెటను వెళ్ళి ఏడుగురి సభ్యులను ఖైదీలుగా పట్టుకొనెను. కారన్‌వాలీసుప్రభువు స్వయముగా లఫయతును ముట్టడించుటకై బయలుదేరెను. లఫయతు యుద్ధము చేయక తప్పించుకొనుచు నాంగ్లేయులు ముందుకు సాగకుండ పెక్కువిధముల చిక్కులు మాత్రము కలుగచేయుచుండెను. వేసవికాల మంతయు నాంగ్లేయసేన ఇటు నిటు తిరుగుచు ప్రజలసొత్తులను పాడు చేయుచుండెను. ముప్పదిలక్షల నవరసుల కిమ్మతుగల యాస్తి పాడుచేయబడెను. ఇటుల వృధాగా కాలయాపనము చేయుటకన్న తాను వర్జీనియాన నదలి కారొలీనాకుపోయిన బాగుండునని కారన్‌వాలీసు తలంచెను.

కాని ఇంతలో తన క్రిందిసైన్యములలోనుంచి మూడు వేలమందిని న్యూయార్కుకు పంపవలసిన దనియు మిగతా సేనలతో నెక్కడనైన సురక్షితమగు తావున నుండవలసిన దనియు పైనుండి యుత్తరవులు వచ్చెను. దీని ననుసరించి కారన్‌వాలీసు ప్రభువు ఆగస్టు 8 వ తేదిన యార్కుటౌను

ఆక్రమించెను. అక్కడ మంచిరక్షణ ఏర్పాటులను చేయుచుండెను. మంచి నౌకాదళముగలవారి కాప్రదేశము మిగుల యుక్తమైనది.

దక్షిణ కారొలీనా రాష్ట్రమమెరికనుల వశమయ్యెను.

దక్షిణకారొలీనాలో నమెరికను సేనాని గ్రీను సెప్టెంబరు 8 వ తేదీన నాంగ్లేయుల నోడించగ నాంగ్లేయులా రాష్ట్రమును పూర్తిగ వదలి రాత్రివేళ ఛార్లెస్టను వైపుకు వెడలిపోయిరి. విల్మింగటను, ఛార్లెసుటను, శవాన్నా పట్టణములలో మాత్ర మాంగ్లేయులుండిరి. మిగిలిన దక్షిణ ప్రాంతమంతయు స్థిరముగ నమెరికనులకు స్వాధీనమై ఈరాష్ట్రములలో యుద్ధము ముగిసెను.

ఆర్నాల్డు న్యూయింగ్లాండును తగులబెట్టుట.

అమెరికను సేనాధ్యక్షునితో కలహించి అమెరికను సేవను వదలి యాంగ్లేయ పక్షమున చేరిన ఆర్నాల్డు సేనాని తన స్వంతరాష్ట్రమగు కనెక్టికటుకు కార్న్వాలీసుచే పంపబడి యక్కడ రాజభక్తుల పటాలములను ప్రోగుజేయు చాలకను అమెరికను సైన్యములను ముట్టడించ జాలకను తన వద్దనుండిన ఆంగ్లేయసేనలతో న్యూ లండను పట్టణమును దోచుకొని తగులబెట్టి నిలుచుటకు తావుదొరకక తిరిగి వచ్చెను.

ఈ మధ్యకాలమున యుద్ధము జయప్రదముగ కొనసాగించుకొనుట వాషింగ్టను. సేనాధిపతి

యార్కుటౌను వద్ద అమెరికనులకు గొప్ప జయము, కారన్ వాలీసు ప్రభువు లొంగబడెను.

మంచి యేర్పాటులను చేయుచుండెను. కొన్ని సైన్యములు ఫరాసు దేశమునుండి వచ్చిదిగెను. ఫరాసు దేశమునుండి ఇరువది లక్షల లివర్లీల ధనముకూడ వచ్చి చేరెను. ఫరాసు సైన్యములును అమెరికను సైన్యములును కలసి న్యూయార్కును ముట్టడించెను. వాషింగ్టను యోచించెను. కాని లఫయతు సేనానియు ఫరాసు సైన్యముల సేనాధ్యక్షుడగు రోషంబోయును యార్కుటౌను మీదికి వెడలుట యుక్తమని సలహానిచ్చిరి. యార్కుటౌనును సముద్రము వైపునుండి డిగ్రాసీప్రభువు క్రిందనున్న ఫరాసు నౌకాదళముకూడ ముట్టడింపవచ్చునని తలచిరి. దీనికి వాషింగ్టనకూడ సమ్మతించెను. ఆగస్టు 21 వ తేదీన ఫరాసు, అమెరికను సేనలు వాషింగ్టను, లఫయతు, రోషంబో సేనానులక్రింద బయలుదేరెను. 23, 24, తేదీలను హడ్సను నదిని దాటెను. వీరు వచ్చి న్యూయార్కుమీద పడుదురేమోనని న్యూయార్కులోని యాంగ్లేయసేనలు సిద్ధపడుచుండెనేగాని న్యూయార్కునువదలి వీరిని ముట్టడించుటకు సాహసించలేదు. ఫరాసు అమెరికను సేన లప్రతిహతముగ సాగిపోవుచుండెను. త్రోవలో వాషింగ్టను స్వగ్రామ మగు మౌంటువెర్నను దాటి సెప్టెంబరు 14 వ తేదీన విలియమ్సుబర్గును చేరెను. సెప్టెంబరు 28 వ తేదీన నీసైన్యమంతయు యార్కుటౌనుకు రెండుమైళ్ళ దూరమున విడిసెను. ఫరాసు నౌకాసేనాని డిగ్రాసిప్రభువు ఇరువది ఎనిమిదియుద్ధనౌకలతో బయలుదేరి. త్రోవలో యూరపునకు వెడలిపోవుచున్న

ఆంగ్లేయ సేనాని రాడను ప్రభువును ఖయిదీగ పట్టుకొని గ్రేవ్సు సేనాని క్రిందవచ్చిన యాంగ్లేయ నౌకాదళము నోడించి తరుమగొట్టి రెండు ఆంగ్లేయ యుద్ధనౌకలను పట్టుకొని జయప్రదముగా యార్కుటౌను పట్టణపు సముద్రరేవులో నిలచెను. అమెరికను సైన్యములు కుడివైపునుండియు, ఎడమవైపునుండి కొంత పరాసు సైన్యమును యార్కునది కావలియొడ్డుననున్న గ్లౌస్టరునుండి కొంతపరాసు సైన్యమును, యార్కుటౌనును ముట్టడించెను. కారన్వాలీసు ప్రభువు తనకు కొంత సహాయము వచ్చి చేరునని తలచెను. కాని రాలేదు. అక్టోబరు 6 వ తేదీన ముట్టడి ప్రారంభమయ్యెను. 9, 10 తారీఖులను ఫిరంగులు బాగుగా కాల్చబడెను. కోటగోడలు బ్రద్దలుచేయబడెను. 11వ తేదీనుండియు నాంగ్లేయులు బదులు కాల్చుట క్షీణించెను. 14 వ తేదీన ఆంగ్లేయు లంత్య ప్రయత్నమును చేసి విఫలులైరి. మరునాడాంగ్లేయ సేనాని కారన్వాలీసు ప్రభువు యుద్ధము మానవలసినదని వర్తమానమంపెను. 19 వ తేదీన ఆంగ్లేయ సైన్యమంతయు నూరు ఫిరంగులతో కూడ వాషింగ్టను సేనానికిని సముద్రరేవులలోని అంగ్లేయనౌకలు డిగ్రాసి సేనానికిని స్వాధీనపర్చబడెను. యార్కుటౌను గ్లౌస్టరు పట్టణములమెరికనుల వశమయ్యెను. కారన్వాలీసు ప్రభువు వాషింగ్టనువద్ద శరణుజొచ్చెను.

అమెరికనుల సంతసము.

ఈ వార్త అమెరికాలో కలిగించిన సంతసమునకు మేరలేదు. వాషింగ్టను తన క్రిందియుద్యోగస్తునొకనిని దీనిని తెలుపుటకై ఫిలడల్ఫియాకు బంపెను. అతను రాత్రి కచటికి

చేరెను. దేశీయ మహాజన సభాధ్యక్షుని యింటికి పోయి బిగ్గరగా తలుపు తట్టెను. ద్వారపాలకుడీసంగతి విని అత్యధిక సంతోషముతో నధ్యక్షుని లేపెను. ఆరాత్రి ఫిలడల్ఫియాపురములో జరిగిన కోలాహలము వర్ణనాతీతము. నేరములు చేసిన సైనికుల కందరకును వాషింగ్టను క్షమాపణ నొసంగెను. సైన్యములు భగవదారాధనను సలిపెను. సేనాధిపతులకు వందనము లర్పించబడెను. పరాసువారికి కృతజ్ఞత వెల్లడించబడెను. ఈ జయముయొక్క స్మారక చిహ్నముగ యార్కుటౌనులో నొక చలువరాతి స్తంభము ప్రతిష్ఠించబడెను. దేశీయ మహాజన సభవారు వాషింగ్టను సేనానికి రెండు పతాకములును రోషంబో. సేనానికి రెండు తుపాకులును బహుమానముగ నిచ్చిరి.

ఆంగ్లేయ పార్లమెంటులో చర్చ.

ఈ వార్త నవంబరు 25వ తేదీన నాంగ్లేయదేశములో చేరెను. ప్రధానమంత్రి నార్తుప్రభువు గుండెలో గుండుదెబ్బ తగిలినట్లుకూలబడెను. "భగవంతుడా! అంతయు ముగిసినది" అని కేకవేసెను. కాని కొలదిరోజులలో పార్లమెంటు సమావేశమయినప్పుడు, అమెరికాను తన రాజ్యములో నుంచుకొనుటకు నిశ్చయించితిననియు తన సేనలు చూపుచున్న పరాక్రమమువలన తన రాజ్యములలో శాంతి నెలకొలుపబడుచున్నదనియు రాజు తన యుపన్యాసములో చెప్పెను. ప్రభువుల సభలోను ప్రజాప్రతినిధిసభలోను కొందరుసభ్యులు రాజుగారి యుపన్యాసమును ఖండించిరి. రాజుగారి యుపన్యాసమువలన "రాజ్యకాంక్ష తనివితీరనిది. నాక్రోధముచల్లా

రనేరదు. నామీద తిరుగబాటుచేసిన అమెరికనులను పూర్తిగ లోబరచుకొనుటకన్న మరియెద్దియు నాకు సంతృప్తి కలుగ చేయనేరద"ని యర్థమగుచున్నదని ఫాక్సు చెప్పెను. ఇందుకు ప్రత్యుత్తరముగ అమెరికామీద ఆంగ్లేయ దేశముయొక్క బ్రతుకు ఆధారపడియున్నదనియు అమెరికాయొక్క స్వాతంత్ర్యమునకు తామంగీరించజాలమనియు వర్జీనియాలో నాంగ్లేయులకు గలిగిన పరాభవమువలన నాంగ్లేయులు మరింత పట్టుదలతో యుద్ధమును కొనసాగించవలెననియు మంత్రిలు చెప్పిరి. పార్లమెంటు సభ్యులలో నెక్కువమంది మంత్రిల పక్షముననే సమ్మతుల నిచ్చిరి. కాని పదిహేనురోజుల తరువాత "అమెరికావారిని నిర్బంధించి రాజభక్తిని పొందుట సాధ్యమయిన పని కానేరదని" ప్రధానమంత్రి పార్లమెంటులో నొప్పుకొనెను. ఆంగ్లేయదేశములోని లండను, వెస్టుమినిస్టరు, సర్రే, మిడిల్ సెక్సు ప్రాంతములలో ప్రజలు బహిరంగ సభలు జరిపి యమెరికనులతో యుద్ధము చాలించుమని తీర్మానములు చేసి పార్లమెంటుకు బంపిరి.

1782 వ సంవత్సరము జనేవరి 31 వ తేదీన డెమరారాను పరాసువారు జయించిరి. ఫిబ్రవరి నెలలో సెంటుకిట్సు నెవిసు, మాంటుసిరాటులను సైన్క వారాక్రమించిరి. కేపుఆఫ్ గుడ్ హోపును ఆంగ్లేయులు ముట్టడించిరి. పరాసువారికిని ఆంగ్లేయులకును సముద్రముమీద కొన్ని కలతలు జరిగెను. ఎవరుగెలిచినది చెప్పుటకు వీలులేదు. పరాసు నౌకలమీద మూడువేల పరాసు సైన్యములు హిందూ దేశము

*ఇతరఖండములలో యుద్ధములు.*

నకు చేరినవి. హైదరాలికి వప్పగింత చేయబడెను. హైదరాలి కుమారుడగు టిప్పుసుల్తాను డిశంబరు నెలలో జయముల నొందుచుండెను. హైదరాలి డిశంబరు 7 వ తేదీన స్వర్గస్థుడయ్యెను. మహారాష్ట్రులతో నాంగ్లేయులు మే నెలలోనే సంధి చేసికొనిరి. మైనార్కా ద్వీపములోని యాంగ్లేయుల నోడించి పరాసువారు స్వాధీనమును పొందిరి. ఆంగ్ల నౌకాదళము పరాసు నౌకాదళము ముందర నిలువజాలక నాంగ్లదేశమును చేరెను.

**యుద్ధములో కలుగుచున్న యపజయములవలన ఆంగ్లేయ పార్లమెంటులో మంత్రుల పలుకుబడి తగ్గెను.**

ఆంగ్లేయ పార్లమెంటులో సంధిపక్షము వృద్ధిచెందినది ప్రధానమంత్రి రాజీనామానిచ్చెను.

1782 వ సంవత్సరము ఫిబ్రేబరి 22 వ తేదీన యుద్ధము చాలించవలసినదని జనరలు కన్వే ప్రజా ప్రతినిధిసభలో నుపపాదించిన తీర్మానమున కనుకూలముగ నూట తొంబది యిద్దరును, వ్యతిరేకముగ నూట తొంబదిముగ్గురును సమ్మతుల నిచ్చిరి. ఇందువలన మంత్రిలపక్షమున నున్న సంఖ్య చాలవరకు తగ్గినదని స్పష్టమగుచున్నది. అయిదుదినముల తరువాత యుద్ధము చాలించవలసిన దను తీర్మానము పార్లమెంటులోని యధిక సంఖ్యాకులచేనామోదింపబడినది. అయినను యుద్ధము మానుటకు రాజు సమ్మతించలేదు. ప్రధానమంత్రి రాజీనామానిచ్చెదనని చెప్పెను. రాజు రాజీనామా నంగీకరించనైను. అమెరికాతో యుద్ధము చేయువారు రాజునకును దేశమునకును శత్రువులని మరియొక తీర్మానమును కన్వే యుపపాదించెను. ఈ తీర్మా

నము పార్లమెంటువారిచే నేకగ్రీవముగ నంగీకరించబడెను. మరునాడు అమెరికావారితో వెంటనే సంధిచేసుకొనుటకు రాజున కధికార మివ్వబడెనను చట్టము నొక సభ్యుడు పెట్టుటకు పార్లమెంటువా రనుమతి నిచ్చిరి. మంత్రుల పదవి దుర్భరమయ్యెను. ప్రధానమంత్రి నార్తుప్రభువుయొక్క రాజీనామాను రాజంగీకరించెను. "నీవే నన్ను వదలిపోవుచున్నావు. నేను నిన్ను వదలుటలేదు" అని రాజు చెప్పెను. మార్చినెల 20 వ తేదీన ప్రధానమంత్రి రాజీనామానిచ్చి బయటనున్న గుర్రపుబండిపై నెక్కి వెళ్ళిపోయెను. పార్లమెంటు సభ చాలించబడెను.

మూడవ జార్జిరాజు ఆంగ్లేయదేశమును వదలి స్వదేశమగు హానోవరుకు పోయెదనని బెదిరించెను. కాని తుదకట్టియుద్దేశ్యమును విరమించుకొని మార్చి 22 వ తేదీన నూతన మంత్రివర్గము నేర్పాటుచేసెను. అమెరికా వ్యవహారములు షెల్బర్ను మంత్రి చూచునట్లేర్పడెను. ఈయన వెంటనే క్లింటన్ సేనాని స్థానమున సర్ గై కార్లటనును అమెరికాలోని యాంగ్లసేనల కధ్యక్షునిగ నియమించి ఎట్లైన సంధిప్రయత్నములు చేయవలెనని చెప్పి యమెరికాకు బంపెను. తాను స్వయముగ నిదివరకు అమెరికా దేశీయ మహాజనసభ కధ్యక్షుడుగ నుండిన హెన్రీ లారెన్సుతోను బెంజమిను ఫ్రాంక్లినుతోను నొక స్కాచి పెద్దమనుష్యునిద్వారా సంధిరాయబారములను నడుపసాగెను.

అమెరికాలోని ప్రజలు తాము చాల బలహీనముగనున్నామనియు ఆంగ్లేయులు చాల బలవంతు

**అమెరికాప్రజలు ఆత్మవిశ్వాసమును గోల్పోయిరి.**

లనియు, యుద్ధము త్వరలో ముగియునేరదనియే నమ్ముచుండిరి. కారొలీనా రాష్ట్రములలో రాజభక్తులకును దేశభక్తులకును నప్పుడప్పుడు యుద్ధములు జరిగి యొకరిపై నొకరు ఘోరహత్యలు గావించుకొనుచుండిరి. క్రమముగా రాజభక్తుల సంఖ్య క్షీణించెను. కాని దేశీయ మహాసభవారివద్దనుండిన ద్రవ్యమంతయు జనేవరివరకు ఖర్చయిపోయినది. జూను 1 వ తేదీవరకు నిరువదివేల డాలరులుమాత్రము రాష్ట్రముల నుండి వసూలయ్యెను. వాషింగుటనువద్ద పదివేల సైనికులు మాత్ర ముండిరి. జీతముకొరకు తొందర జేయుచుండిరి. ఇంతలో నూతనాంగ్ల సేనాధ్యక్షు డమెరికాకు జేరెను. సంధి రాయబారములను పంపసాగెను. కాని వాషింగుటనుగాని, దేశీయ మహాసభవారుగాని, ఆరాయబారములు నిజమైనవని నమ్ముటలేదు. బ్రిటిషువారు తమమీదికి గండెత్తుచో సంరక్షణ జేసికొనుటకు తగిన సైన్యములు లేవనియే వాషింగ్టను వ్రాయుచుండెను. ఈ సమయమున వాషింగ్టనువద్ద నుండిన సేనలలోకూడ నసంతృప్తి మిగుల వ్యాపించియుండెను. యెటులనో తిరుగబాటులు జరుగకుండ వాషింగ్టను చేసెను. ఆర్థిక వ్యవహారమును చూచుచున్న రాబర్టువారిసు పెట్టుబడి పెట్టిన సొమ్మును తిరుగ నివ్వవలసినదని దేశీయ మహాసభవారి నడుగగా సొమ్ము నివ్వకపోవుటయేగాక కఠినముగ మందలించిరి. సైనికులును సైనికోద్యోగులును కలసి యొకసభచేసి తమకు దేశీయ మహాసభవారివలన న్యాయము కలుగనేరదుగావున వాషింగుటను అమెరికాకు రాజుగ నేర్పడు

ట యుత్తమమని తీర్మానించి రాజరికమును ప్రజాపరిపాలనమును కలిసియుండుట మంచిదనియు వాషింగ్టను నమెరికాయొక్క కిరీటాధిపత్యము నంగీకరించ వలయుననియు కోరిరి. వాషింగ్టను అమెరికాదేశము స్వతంత్రమగు ప్రజాపాలనమగుటయే తన యుద్దేశ్యముగాని తానుగాని మరియొకరుగాని యెప్పటికిని రాజుగ నేర్పడకూడదని చెప్పి వారినందరిని గట్టిగా మందలించి పంపివేసెను.

సంధిరాయబారములు

ఆంగ్లేయమంత్రి అమెరికా వారితోడను పరాసువారితోడను సంధి రాయబారములు జరుపుచుండెను. ఆంగ్లేయనౌకాసేనాని పశ్చిమ యిండియా ద్వీపములవద్ద పరాసు నౌకాదళము నోడించి, నౌకాసేనానిని తొమ్మిది యుద్ధనౌకలతోగూడ పట్టుకొనెను. కాని ఆంగ్లేయుల బహామాద్వీపములను స్పైనువారు వశపరుచుకొనిరి. ఆంగ్లేయ ప్రధానమంత్రి బక్కింగుహాం చనిపోయినందున అమెరికా వ్యవహారములను చూచుచున్న హెల్బర్ను ప్రధాన మంత్రిత్వమును కూడ వహించెను. కీర్తిశేషులగు విలియంపిట్టు కుమారుడగు పిట్టు యువకుడయ్యును ఆర్థికమంత్రి యయ్యెను. ఈలోపుగా జార్జియా రాష్ట్రమునుండి ఆంగ్లేయులు తరిమివేయబడిరి. ఆరాష్ట్రమంతయు జూలై 12 వ తేదిన నమెరికనుల వశమయ్యెను. ఆరాష్ట్రమందుండిన రాజభక్తులు ఫ్లారిడాకు పారిపోయిరి. ఆంగ్లేయసేనలు ఛార్లెసుటనులో చేరిరి. స్పైనువారు చాల సైన్యములతో చాల కాలము జిబ్రాల్టరును ముట్టడించిరిగాని తుదకు 1782 సంవత్సరము సెప్టెంబరు 13 వ తేదిన ఆంగ్లేయులు ముట్టడిని వదలించు

కొనిరి. పరాసు, స్పెయిన్ నౌకాదళములను ఆంగ్ల నౌకా సేనాని ఓడించెను.

ఈలోపున పారిసుపట్టణములో అమెరికావారితో వేరుగను పరాసువారితో వేరుగను సంధి ప్రయత్నములు జరుగుచుండెను. బెంజమిను ఫ్రాంక్లిను కొంతకాలము ఒంటరిగను తరువాత జేయి, ఆడమ్సు అనువారమెరికానుండి వచ్చి తోడ్పడియు నమెరికాతరపున సంధి యుద్యమమును సాగించుచుండెను. పెన్సిల్వేనియా, మేరీలాండు, డెలవేరు, న్యూయార్కు రాష్ట్రములలోని రాజభక్తులు సంధి చేసుకొనవలదనియు తాము దేశీయ మహాజనసభను నాశనము చేతుమనియు, నాంగ్లేయ ప్రభుత్వమువారికి మహజరులు బంపిరి. అక్టోబరు నెలలో "సేనలు చాల యిబ్బంది పడుచున్నవి, సంధి త్వరలో జరిగిన మంచిది." అని వాషింగ్టను వ్రాసెను. పరాసు ప్రభుత్వమువారికి తెలియకుండ సంధిని కుదుర్చుకొనమని అమెరికావారు వాగ్దత్తము చేసియున్నప్పటికిని తుదకు పరాసువారికి తెలియకుండగనే అమెరికాప్రతినిధులు చిత్తు సంధి షరతులపై సంతకములుచేసిరి. అది పరాసువారిని అమెరికావారు మరియొక ఋణమిమ్మని కోరుచున్న సమయము. తమకు తెలియకుండ సంధి చేసుకొనుట న్యాయము కాదని పరాసుమంత్రులు చెప్పిరి. బెంజమిను ఫ్రాంక్లిను క్షమాపణకోరెను. పరాసువారు మిగుల నౌదార్యమును చూపిరి. అరువదిలక్షల లివరీల ఋణమునిచ్చుట కంగీకరించి వెంటనే యారులక్షల లివరీలను చెల్లించివేసిరి. స్పెయిన్‌వారుకూడ ద్రవ్యములేక

హోప్సుగల్ వారి వద్దనుండి నూటికి యెనిమిది చొప్పున వడ్డితో ఋణము చేయవలసివచ్చెను.

అమెరికా స్వతంత్ర మంగీకరింప బడుట.

1782 సంవత్సరము డిశంబరు నెల 5 వ తేదీన ఆంగ్లేయ పార్లమెంటు సమావేశముకాగనే అమెరికా వలసరాష్ట్రముల స్వతంత్రమును తా నంగీకరించుచున్నానని రాజు తెలియచేసెను. "ఇటుల ఆంగ్లేయ రాజ్యమునుండి అమెరికావారు విడిపోవుటను నేను నా ప్రజల యుద్దేశ్యము ననుసరించి యంగీకరించుచున్నాను. నా యభిప్రాయములు నా ప్రజలకొరకై మార్చుకొనినాను. ఇంతగొప్పభాగ మాంగ్లేయరాజ్యము నుండి విడిపోవుటవలన ఆంగ్లేయ దేశమునకెట్టినష్టము వాటిల్లకుండునుగాక యని పరమేశ్వరుని ప్రార్థించుచున్నాను. మరియు రాజకీయస్వాతంత్ర్యమునకు రాజరిక మెంతయావశ్యకమో అమెరికావారు గ్రహింతురని నమ్ముచున్నాను. మతము, భాష, పరస్పరలాభము, ప్రేమానుబంధములు, ఉభయ దేశముల వారి మధ్యను శాశ్వతమగు నైకమత్యమునకు తోడ్పడునని విశ్వసించుచున్నాను. ఐకమత్యము పురిగొనుపుటలో నా శక్తివంచనలేక పాటుపడుదునని వాగ్దత్తము చేయుచున్నాను" అని రాజుపన్యసించెను. ఈ నెలలోపలనే పరాను సేలను తీసుకొని నౌకాదళ మమెరికానుండి పరాను దేశమునకు వచ్చెను.

1783 సంవత్సరము జనేవరి 20 వ తేదీన ఇంగ్లాండు ఫ్రాన్సు, స్పైన్ ప్రభుత్వముల వారి

సంధిపత్రములపై సంతకములు చేయబడెను.

మధ్య సంధి యొడంబడికలు కుదిరి చిత్తుపత్రములపై సంతకములు చేసుకొనిరి. (1) అమెరికా వలసరాష్ట్రములు సంపూర్ణముగ స్వతంత్రదేశమైనదని యంగీకరించబడెను. (2) ఈ వలసరాష్ట్రములకును ఆంగ్లేయుల రాజ్యములో చేరియున్న కనడా దేశమునకును మధ్యసరిహద్దు నిర్ణయించబడినది. (3) ఆంగ్లేయులును ఫరాసువారును స్పైను వారును యుద్ధకాలములలో నొకరివద్దనుండి యొకరు జయించిన ప్రదేశములను తిరిగి యిచ్చివేయవలెను. ఆఫ్రికాఖండమున ఆంగ్లేయులును ఫరాసువారును కొంత ప్రదేశమును మార్చుకొనిరి. (4) హిందూదేశములోని నాగపట్టణమును ఆంగ్లేయులు తీసుకొని హాలెండు వారితో నిదేవిధమున నాంగ్లేయ ప్రభుత్వమువారు రాజీపడిరి. (5) అమెరికాలోని రాజభక్తులయందు న్యాయము కరుణయు కనపరచవలసినదని అమెరికా దేశీయ మహాసభ వారికి సిఫారసుచేయబడినది. (6) టిప్పు సుల్తానుకును ఆంగ్లేయులకును యుద్ధము జరుగుచుండగ నీసంధివర్తమానము తెలసి ఫరాసువారు టిప్పును వదలి వెళ్ళిపోయిరి. టిప్పు సుల్తాను మంగళూరును పట్టుకొని తరువాత ఎవరు జయించినది వారు విడిచివేయు షరతుతో నాంగ్లేయులతో 1784 వ సం॥ మార్చి నెలలో రాజీపడెను.

రాజభక్తులకు నష్టపరిహారమిచ్చుట

పార్లమెంటులో నీరాజీనామాలనుగూర్చి చర్చ జరిగినపుడు వెనుక ప్రధానమంత్రి పదవిని త్యజించిన నార్తుప్రభువును ఫాక్సు మొదలగు సభ్యులును సంధిషరతులను ఖండించిరి.

రాజభక్తులకెట్టి సంరక్షణయు నివ్వక రెండవకక్షవారి యనుగ్రహమునకు వారిని వదలి పెట్టుట అక్రమమని చెప్పిరి. నూతనమంత్రుల చర్యలను తీవ్రముగ విమర్శించిరి. తుద కొకయుపసంఘ మేర్పాటై అమెరికను రాజభక్తులకు కొంత నష్టపరిహార మిచ్చుటకును సైన్యములలో చేరిన రాజభక్తులకు సగముజీతము లిచ్చుటకును తీర్మానింపబడెను. ఒక కోటి యిరువది లక్షల సవరనులు ఆంగ్లేయ ప్రభుత్వముచే అమెరికను రాజభక్తుల కివ్వబడెను.

అమెరికను సైనికులకు దేశస్వాతంత్ర్యమును సంపాదించితిమను తృప్తి.

అమెరికనువారి సైన్యములు జీతములకు తొందర చేయుచుండెను. 1780 సం॥ న సైనికోద్యోగియుల కందరకును యావజ్జీవమును సగము జీతమును పింఛనులుగ (ఉపకార వేతనములు) నిచ్చుటకు వాగ్దత్తము చేయబడెను. ఆపరిహార మిచ్చుటలేదు. తగినంతమంది రాష్ట్రములవా రంగీకరించను లేదు. దీనికి బదులుగ కొంత సొమ్ము మొత్తముగనైన యివ్వమని సైనికోద్యోగులు కోరిరి. దీనికిని దేశీయ మహాసభవారు ప్రత్యుత్తర మివ్వలేదు.

సైనికోద్యోగులు అంతఃకలహమును ప్రారంభించుటకు తీర్మానము చేయుటకుగాను సమావేశమైరి. వాషింగ్టను అక్కడికి వచ్చి తొందర పడవద్దనియు వారియొక్క హక్కులకై తాను సర్వవిధముల కృషి చేసెదననియు చెప్పి సమావేశమును సమాప్తి చేయించెను. మరునాడే సంధిషరతులపై సంతకము లయిన వనువార్త చేరెను. మరియొక

నెలలోపల యుద్ధ మంతరించినదని దేశీయ మహాసభవారు ప్రచురించిరి. సేనలకు జీతము లిచ్చుటకు ద్రవ్యము లేదు. చాలవరకు వాషింగ్టను సైనికుల నూరకనే యిండ్లకు పంపివేసెను. దేశస్వాతంత్ర్యమును సంపాదించితి మను తృప్తి కంటె ద్రవ్యము ముఖ్యవిషయము కాదని చాలమంది జీతమును కోరకనే సంతోషముగ గృహములకు వెడలిపోయిరి. పెన్సిల్వేనియానుండి వచ్చిన యొకసేన ఫిలడల్ఫియాలో నున్న దేశీయ మహాజన సభామందిరమును ముట్టడించి తమకు వెంటనే రావలసిన సొమ్ము నివ్వనిచో మహాసభవారిమీద పగతీర్చుకొందుమని బెదరించిరి. వాషింగ్టను మరియొక సైన్యమును బంపి వీరిని చెదరగొట్టి వీరిలో ముఖ్యులను ఖయిదుచేసెను. ఈవిధమున నసంతృప్తివలన నక్కడక్కడ సైనికులు తిరుగబాటులు చేయుచుండగ వాషింగ్టను తిరుగబాటులను కొన్నిచోటుల మంచిమాటలతోడను కొంతమందికి కొంతద్రవ్య మిప్పించియు కొన్నిచోటుల శిక్షించి బెదిరించియు నేర్పుతో నణచివేసి శాంతిని పూర్తిగ నెలగొలిపెను.

సంధియొడంబడికలు స్థిరపడినవి.

1783 వ సంవత్సరము సెప్టెంబరు 3 వ తేదీన ఇంగ్లాండు, అమెరికా, ఫ్రాన్సు, స్పైన్, హాలెండు దేశములమధ్య జరిగిన సంధియొడంబడికెలన్నియు స్థిరపర్చబడెను. అందరును సంధిపత్రములపై సంతకములు చేసిరి. అమెరికా దేశము స్వాతంత్ర్యమును సంపాదించెను. ఫ్రాన్సుదేశ మీస్వాతంత్ర్య సంపాదనమునకు ముఖ్యముగ తోడ్పడెనను కీర్తిని వడసెను. ఆంగ్లేయసేనలు అమెరికాను విడిచి వెళ్ళెను. అమెరికావారు

చాలవరకు సేనలను తీసివేసిరి. రాజభక్తులలో చాలమంది పక్కనున్న ఆంగ్లేయరాజ్యమగు కనడాదేశములోనికి వలస పోయిరి. తక్కినవారు దేశభక్తులుగామారి తోడి దేశీయులతో కలసి మెలసి నెమ్మదిగ నివసించిరి. ఇరుపక్షముల వారును యుద్ధములో పట్టుకొనిన ఖయిదీల నందరను విడుదలచేసి యిండ్లకు పంపివేసిరి. రాజకీయ నేరములు చేసిన వారందరకును క్షమాపణ నొసంగిరి అమెరికా రాష్ట్రములన్నిటిలోను పండుగలు ఉత్సవములు వేడుకలు మిగుల సంరంభముతో సలిపిరి

వాషింగ్టను సైనికుల వద్ద శెలవు పుచ్చుకొనుట.

డిశంబరు 4 వ తేదీన వాషింగ్టను న్యూయార్కు పట్టణమున తన సేనానుల వద్దను నిల్చియున్న సైనికులవద్దను శెలవుపుచ్చుకొనెను. ప్రేమాపూరితమైన హృదయముతో వాషింగ్టను తన కృతజ్ఞతను వెల్లడించి గడచిన దినములు ఘనతను కీర్తిని సంపాదించినటులే వారికి గానున్న దినములు సౌఖ్యప్రదములుగను మంగళకరములుగను నుండునుగాక యని పరమేశ్వరుని ప్రార్థించెను. అందరును తమ బలహీనమగు ప్రయత్నముల నాశీర్వదించి జయము సమకూర్చినందునకు ధర్మస్వరూపుడగు భగవంతునికి హృదయ పూర్వకవందనములర్పించిరి. ఆనందముతోను ప్రేమతోను కూడుకొనిన బాష్పములు కనులనుండి రాల వాషింగ్టను సమావేశమునకు వచ్చిన ప్రతివారినుండియు శెలవు గైకొనెను. అచటనుండి న్యూజర్సీమీదుగా ఫిలడల్ఫియాకు బోయి యచట దేశీయ మహాసభవారి కోశాధికారికి తన జమాఖర్చు లెక్కను వప్ప

గించి దేశీయ మహాజనసభ వారు సమావేశమైయున్న అన్నాపోలీసునకు పోయెను. వాషింగ్టను జీతమేమియు పుచ్చుకొనలేదు. సైనికుల దుస్తులు యుద్ధసామాగ్రులు భోజన పదార్థములు మొదలగునవి కొనుటకుగాను తన స్వంతము నుండి యుద్ధకాలములో పదునాలుగువేల నాలుగువందల డెబ్బదితొమ్మిది నవరసుల పదునెనిమిది షిల్లింగుల తొమ్మిది పెన్సులను పెట్టుబడికూడ పెట్టెను. అమెరికావారు జయము పొందనిచో ఈపెట్టుబడి పెట్టినసొమ్ము తిరిగి రానేరదనుట నిస్సంశయము. తన మాతృదేశ స్వాతంత్ర్యమునకై తన మాన ప్రాణధనముల నర్పించిన ధీరుడు జార్జివాషింగ్టను గాక మరియెవరు? డిశెంబరు 19 వ తేదీన దేశీయసభా సమావేశమును చేరి నాలుగు దినములతరువాత తన యుద్యోగమును దేశీయ సభవారికి త్యజించెను. దేశీయ మహాసభ వారు జార్జివాషింగ్టనుకు కృతజ్ఞతా వందనముల నర్పించిరి. ఆయన పెట్టుబడిపెట్టిన సొమ్మంతయు నిచ్చివేసిరి.

స్వాతంత్ర్య యుద్ధ వ్యయము.

ఈస్వాతంత్ర్యయుద్ధములో అమెరికావారికి మూడుకోట్ల డెబ్బదిలక్షల నవరసుల ద్రవ్యము ఖర్చగుటయేగాక తొంబదిలక్షల నవరసులు పరాసు దేశమునకు ఋణపడిరి. ఎంతఖర్చయినను తాము భగవదనుగ్రహమువలన స్వాతంత్ర్యమును పొందితిమను ఆనందమును పొందిరి. ఆంగ్లేయులకు పదునాలుగు కోట్ల నవరసులసొమ్ము ఖర్చయ్యెను. స్వదేశములోనే పోరాడవలసినవారగుటచే అమెరికనులకు తక్కువఖర్చును, పదునారువందలమైళ్ళదూరమునుండి సేనలను తెచ్చి తమకెట్టిసానుభూ

తెరయు చూపని ప్రజలమధ్య పోరాడవలసిన వారగుటచే నాంగ్లేయుల కధికప్రియమును కలుగుటకు కారణమయ్యెను.

ఎర్ర యిండియనుల గతియేమి.

ఈ యుద్ధములో ఎర్రయిండియను లాంగ్లేయులతో చేరిరి. కాని లాభమును పొందుటకుమారుగా నపారమగు నష్టమును పొందిరి కొన్నివరదలమంది అమెరికనుల పైబడి శిరములను ఖండించి పెరెత్తుకొనిపోయి యుండురు. కాని సుస్కిహానా నదికిని గెన్సీ నదికిని మధ్యనున్న ప్రదేశములోని ఎర్రయిండియనులను నాశనము చేసి దానినంతయు నమెరికను లాక్రమించుకొనిరి వర్జీనియా రాష్ట్రమునకు పశ్చిమముననున్న ఇల్లినాయిసు జాతులు నిర్మూలముగా గావింపబడి యాప్రాంతమంతయు నమెరికనులకు స్వాధీనమయ్యెను మిస్సిసిపీ నదియొడ్డున జెఫరసను కోట నమెరికనులు కట్టి దానికి పశ్చిమముననున్న ఎర్రయిండియను జాతుల నరికట్టిరి దక్షిణముననున్న చెరుకీలయొక్కయు వారిమిత్రులగు జాతులయొక్కయు దేశమంతయు అమెరికనులచే ధ్వంసముచేయబడి యాక్రమించబడినది. అమెరికనులు యుద్ధకాలములో తమకు చుట్టుపట్టుననున్న నూతనప్రదేశమును ఆక్రమణచేసిఅచటస్థిరనివాసములను పొంది నూతనజిల్లాల నేర్పరచుచుండిరి వీటిని కొలదికాలములో నూతన రాష్ట్రములుగ నామకరణము చేయుచున్నారు. అమెరికనుల వలసప్రదేశము అలిఘనీసు కొండలనుదాటి మిస్సిసిపీనది ప్రవహించు ప్రాంతమువరకును వ్యాపించినది. ఎర్రయిండియను లదృశ్యమైపోయినకొలదియు నాఫలవంతమగు సేద్యభూములు, గనులు, అడవులు అమెరికనుల వశమయ్యెను. తమకు

యుద్ధ కాలమున సహాయము చేసి అమెరికనుల శత్రుత్వమును పొందిన ఎర్రయిండియనుల ముందుగతినిగూర్చి, తెల్లవారగు అమెరికను రాజభక్తులనుగూర్చి చేసినటుల, సంధి కాలమున ఆంగ్లేయులుకూడ యోచించలేదు. వారిగతిని గూర్చి యోచించువారే లేరు. సంధిషరతులలో వారిసంగతి ప్రస్తాపింపబడనే లేదు.

నీగ్రోబానిసలు.

యుద్ధములో తమపక్షమున చేరిన నల్లనీగ్రో బానిసల నందరిని బానిసత్వమునుండి విముక్తి చేసెదమని ఆంగ్లసేనాని డనుమోరు ప్రభువు యుద్ధ కాలమున ప్రకటించెను. నీగ్రోలనేకులువచ్చి యాంగ్లసేనలలో చేరిరి. కాని బానిసత్వమును రద్దుపరచుట కాంగ్లేయ మంత్రులుగాని యితర సేనానులుగాని అంగీకరించలేదు. తమ సైన్యములలో చేరిన నీగ్రోలనుకూడ బానిసలుగ పట్టుకొని అనేకమారులు విక్రయించిరి. కొందరిని బహామానముల క్రింద పంచిపెట్టిరి. రెండువేలమందిని పశ్చిమ యిండీయా ద్వీపములలోని తెల్లభూస్వాములకు మనిషిని రెండు వందల ఏబది వెండి డాలరుల చొప్పున విక్రయించిరి. అమెరికావారుకూడ తమ సైన్యములలో చేరు నీగ్రో బానిసలకు స్వేచ్ఛను కలుగచేసి వారియజమానులకు నష్టపరిహారమిచ్చుటకు నిశ్చయించి ముఖ్యముగ నుత్తర రాష్ట్రములలో నీగ్రోలను పటాలములలోనికి చేర్చుకొనుచుండిరి. కాని దక్షిణ రాష్ట్రములవారు బానిసత్వమును తీసివేయుటకు సమ్మతించలేదు. అచట నీగ్రోలను సేవలలో చేర్చలేదు 1776 సం॥ జులై 4వ తేదిన అమెరికావారు చేసిన స్వతంత్రప్రకటన

ములో నమెరికా రాష్ట్రములలో బానిసత్వమును రద్దుపర చుట కొకనిబంధనను జెఫర్సను చేర్చెను. కాని దక్షిణమున నున్న దక్షిణ కారొలీనా జార్జియా రాష్ట్రములవారు బానిసత్వమును మాన్పుటకు ప్రయత్నించినచో తాము సంయుక్త రాష్ట్రములలో చేరమని బెదిరించినందున యీనిబంధనను కొట్టివేసిరి. ఇష్టవచ్చినరాష్ట్రములవారు బానిసలకు స్వేచ్ఛ నివ్వవచ్చుననియు నిష్టములేనివా రివ్వనక్కరలేదనియు చివరకు రాజీపడిరి. ఉత్తరరాష్ట్రములలో బానిసత్వమునకు వ్యతిరేకభావము తీవ్రముగ ప్రబలియుండెను. 1780 వ సంవత్సరమున మెసచుసెట్సు, పెన్సిల్వేనియా రాష్ట్రముల వారును, 1783 సం॥రం న్యూహాంప్షైరు రాష్ట్రమువారును, 1784 సంవత్సరమున కనెక్టికటు, రోడు అయిలాండు రాష్ట్రములవారును బానిసత్వమును రద్దుపరచిరి. 1783 సంవత్సర మొక బానిస తప్పించుకొని మెసచుసెట్సు రాష్ట్రములో వచ్చిచేరెను. వెంటనే బానిసత్వము తొలగెను. యజమాని యాబానిసను పట్టుకొన యత్నించెను. స్వేచ్ఛనొందిన వానిని పట్టుకొనుటకు హక్కులేదని తీర్మానించిరి. 1790 వ సంవత్సరమున జరిగిన జనాభాగణితిలో నీరాష్ట్రములోని బానిసలసంఖ్య సున్న యనివ్రాసియుండిరి. డెలవేరు న్యూజర్సీ రాష్ట్రములలోకూడ బానిసలకు స్వేచ్ఛ నొసంగుటకు యజమానులను ప్రోత్సాహించు చట్టములను చేసిరి. వర్జీనియా రాష్ట్రప్రముఖులగు జెఫర్సను పాట్రికుహెన్రీ, జార్జిమేసనులు బానిసత్వమునకు బద్ధశత్రువులుగ నుండిరి. కాని సేవలలో చేరెడు ప్రతిఅమెరికనునకును నొకనీగ్రోబానిసను పారితోషిక

మొగనిచ్ఛేదమని వర్జీనియా రాష్ట్రపతివారు తీర్మానము చేసిరి. వాషింగ్టనుమాత్ర మీవిషయమున తటస్థుడుగ నుండెను. ఆంగ్లేయులకును అమెరికనులకును జరిగిన సంధిలో బానిసత్వ మంగీకరించబడెను. "నీగ్రోలను మరియితర ఆస్తులను" ఆంగ్లేయసైనికు లమెరికానుండి తమతో కూడ తీసుకొనిపోగూడదని నిబంధనచేసిరి. యుద్ధములో నేవైపున చేరినను (నల్లవాని) నీగ్రోయొక్కస్థితి బాగుపడలేదు. కాని నీగ్రో బానిసత్వమునుగూర్చి ఇంక డెబ్బదిసంవత్సరములలో నమెరికాలోని యుత్తరరాష్ట్రముల వారికిని దక్షిణరాష్ట్రములవారికిని గొప్పయుద్ధము జరుగనున్నది.

1783 వ సంవత్సరముననే అమెరికా సంయుక్త రాష్ట్రముల స్వాతంత్ర్యమును స్వీడను, డెన్మార్కు, స్పెయిన్, రుష్యా ప్రభుత్వములవా రంగీకరించిరి. అమెరికావారితో ఒడంబడికెలు చేసికొనిరి. రెండుసంవత్సరముల తరువాత ప్రష్యావారును ఒడంబడికెలు గావించుకొనిరి.

# అమెరికా సంయుక్త రాష్ట్రములు.

## సంయుక్త రాష్ట్రముల ప్రభుత్వము.

### తొమ్మిదవ అధ్యాయము.

(1)

పరిపాలనాభారము.

స్వతంత్ర్యము పొందిననాటికి సంయుక్త రాష్ట్రముల ఆంతరంగిక వ్యవహారముల సంతృప్తికరముగా నుండెను. ప్రజలు స్వతంత్ర్యమును సంపాదించుకొనిరే గాని చక్కని పద్ధతులమీద స్వపరిపాలనను 'నిర్మాణము చేసికొనుటకు తయారై యుండలేదు. గొప్ప ఆదర్శములు కలిగి స్వతంత్ర్య పోరాటములో నాయకులుగా పని చేసినవారిలో కూడ చాలమంది నూతన ప్రభుత్వమును నడుపుటకు తగిన యనుభవము లేనివారనియే చెప్పక తప్పదు. అంతవరకును ఆంగ్లేయ ప్రభుత్వమువారిచే నియమింప బడినవారిని ఎదిరించుటకే అలవాటుపడి యుండిరి గాని తాము స్వయముగా జవాబుదారిని వహించి ప్రభుత్వము నడుపు అవకాశము లేనివారై యుండిరి. ఇపుడు ఆంగ్లేయ ప్రభుత్వము పోయి దేశమును సరిగా పాలించు భారము వారిమీద పడినది. రాష్ట్రములలో పరస్పర మనస్పర్థలును,

అన్యాయములును, నిండియుండెను. ఉత్తర రాష్ట్రముల వారికిని, దక్షిణ రాష్ట్రముల వారికిని, తీవ్రమగు భేదాభిప్రాయములుండెను. వారి లాభనష్టములు వేరుగను, వీరి లాభనష్టములు మరియొక విధముగను నుండెను.

కావున పదమూడు రాష్ట్రములను కలిపియుంచి వాటి కన్నిటికిని అనువగు సంయుక్త ప్రభుత్వమును స్థాపించుట కష్టతరమగు కార్యముగ నుండెను. దేశీయ మహాజనసభ దేశమునంతను పాలించుటకు తగినంత అధికారము తోడను కట్టుదిట్టములతోడను కూడి యుండలేదు. శత్రువుపై ప్రజలకు ద్వేషమును పురిగొలిపి స్వతంత్రమును స్థాపించుటకు మాత్రమే తగియుండెను. యుద్ధకాలములో శత్రువునందు గల ద్వేషము వలనను స్వతంత్రేచ్ఛ వలనను రాష్ట్రములన్నియు ఐక్యత నొందెను. యుద్ధము ముగిసిన తరువాత నట్టి ఐక్యత నిలుచుట కష్టముగ నుండెను. దూరదృష్టిగల నాయకులందరును యీ విషయములో నాత్రతను కలిగి యుండిరి. ప్రధాన నాయకుడగు జార్జి వాషింగ్టను సర్వ సేనాధిపత్యము వదలివైచుటకు ముందు ఈ విషయమునుగూర్చి అన్ని రాష్ట్రముల ప్రతినిధి సభలకును వ్రాసెను. అన్ని రాష్ట్రములును కలిసి యొకే ప్రభుత్వముక్రింద పని చేసినగాని అభివృద్ధిని గొప్పతనమును పొందనేరవనియు, చీలిపోయి యెవరికివారు స్వతంత్రముగా నున్నచో సంపాదించిన స్వతంత్రము యొక్క లాభమును విశేషకాల మనుభవించ నేరరనియు హెచ్చరించెను. బందోబస్తగు నొక రాజ్యాంగ విధానమును తయారు చేసికొని దానికి లోబడుట యావశ్యకమని సలహా నిచ్చెను.

కాని నాలుగు సంవత్సరముల వరకును రాష్ట్రములు తాము సంపాదించిన స్వేచ్ఛలో కొంత తగ్గించుకొని ఒక జాతీయ సంయుక్త ప్రభుత్వమునకు లోబడి నడచుకొనుటకు తగిన కుదురుబాటును పొందలేదు. ఈ నాలుగు సంవత్సరములును దేశీయ మహాసభయే జాతీయ ప్రభుత్వమును చలాయించెను. కాని దాని అధికారము నామమాత్రావశిష్టముగ నుండెను. తగిన ధనము లేదు. సైన్యములను తగినన్ని పెట్టుకొని సరిహద్దులను కాపాడగల స్థితిలో లేదు. ఇతర దేశీయుల గౌరవమును పొందు అర్హతను సంపాదించలేదు. రాష్ట్రము లెవరి లాభము కొరకు వారు ప్రయత్నించుచు సమిష్టిలాభమును నిర్లక్ష్యము చేసిరి. కాని క్రమముగా అనుభవముమీద తగిన అధికారములుగల జాతీయ ప్రభుత్వము నేర్పరచు ఆవశ్యకత గోచరించసాగెను. న్యూయార్కు రాష్ట్రము తనతోడి రాష్ట్రములనుండి వచ్చు సరుకులపై పన్నులు విధించెను. దీనితో దేశములోని వర్తక వ్యాపారమును సరిగా నడుపు అధికారము దేశీయ మహాజనసభ కిచ్చుట మంచిదని యొక అభిప్రాయము వ్యాపించెను.

జాతీయ ప్రభుత్వపు ఆవశ్యకత.

దేశీయ మహాసభకుగల అధికారములు నిర్ణయము కానందున స్పెయినుతో వర్తక సంధి చేసుకొనుటకు వీలు కలుగలేదు. ఆంగ్లేయులు ఓడవర్తక చట్టముల నమెరికా రాష్ట్రములపై అమలు జరుపుచుండగ దేశీయ మహాసభ వాటిని ఆటంకపరచుటకు చేతగాని అసహాయ స్థితియం దుండెను. ఉత్తర

రాష్ట్రములు ఆంగ్లేయుల ఓడవర్తక చట్టములకు లోబడుటయు దక్షిణరాష్ట్రము లెదిరించుటయు జరిగెను.

మరియు అలిఘనీను పర్వతములకు పశ్చిమమునన్న ప్రదేశమంతయు సంయుక్తరాష్ట్రములకు చేరవలెనని ప్రథమము నుండియు అమెరికావారు తలచిరి. కాని ఏరాష్ట్రమునకెంత ప్రదేశము చెందవలెనను విషయములో చాలరాష్ట్రములకు తగవులు కలిగెను. తుదకు ఆప్రదేశమంతయు నే రాష్ట్రమునకును చెందక జాతీయ ఆస్థిగా దేశీయ మహాజనసభ క్రింద నుండవలెనని అంగీకరించబడెను.

ఆప్రదేశములో కొంత భాగములో నమెరికనులు వలసల నేర్పరచుటయు నిందువలన రెండు రాష్ట్రము లేర్పడుటయు జరిగెను. మరియు ఓహియో నదికి యుత్తరమున నున్న ప్రదేశము కూడ కాంగ్రెసునందు (దేశీయ మహాజనసభ) సంక్రమించెను. దానిలో విభాగములను అమ్మి యుద్ధఋణములను తీర్చుకొనుటకును, తీసివేసిన సైనికుల జీతములిచ్చుటకును దేశీయమహాసభ కధికారమివ్వబడెను. అచట కాపురమునకు పోవువారికి సంపూర్ణమగు మతస్వేచ్ఛ యుండునటుల శాసించబడెను. మరియు నచట బానిసలను తేగూడదని కూడ నిబంధనలు చేయబడెను. స్పెయినువారు మిస్సిసిపీ ముఖద్వారముగుండ అమెరికనులు రాకుండ నాటంకపరచిరి. దక్షిణరాష్ట్రము లేమియు చేయజాలకుండెను. ఛెసపీకు బేనుండి ఓహియో నదివరకును గొప్పకాలువను త్రవ్వించిన చాల రాష్ట్రములకు లాభకరమని యెంచిరి. దేశీయమహాసభ బలపడినగాని యీపని సంపూర్ణము గాదయ్యెను. కావున సం-

యుక్త ప్రభుత్వము బలపడనిచో ననేక నష్టములు కలుగునని అనుభవము మీఁద నన్ని రాష్ట్రములకును క్రమముగా తోఁచెను.

సంయుక్త ప్రభుత్వము యేర్పరచుట.

1787 వ సంవత్సరము మే నెలలో ఫిలడల్ఫియానగరమును సంయుక్త ప్రభుత్వ విధానమును సంయుక్త ప్రభుత్వమునకును రాష్ట్రప్రభుత్వములకును గల సంబంధమును నిర్ణయించుటకు పన్నెండు రాష్ట్రములనుండి ఏబది అయిదుగురు ప్రతినిధులు సమావేశమగునట్లు ఏర్పాట్లుగావింపబడెను.

ఆ సమావేశమునకు జార్జివాషింగ్టను అధ్యక్షత వహించెను. రెండుమూడు నెలలు పెక్కుమారులు సమావేశములు జరిగి వివిధ విషయములు బాగుగ చర్చించబడి ప్రస్తుతమున్న పదమూడు రాష్ట్రములకును ఇకముందు ఏర్పడబోవు రాష్ట్రములకును వర్తించునట్లుగ నొక సంయుక్త ప్రభుత్వ విధానమును తయారుచేసిరి.

దానిని 1787వ సంవత్సరము 20వ సెప్టెంబరు తేదీన దేశీయమహాసభ వారంగీకరించి వివిధరాష్ట్ర ప్రభుత్వములకంపగ వారొక్కొకటి చొప్పున అన్ని రాష్ట్రములవారును అంగీకరించి దస్కతులు పెట్టిరి.

జార్జివాషింగ్టను అధ్యక్షుడగుట

1789 సంవత్సరము జనేవరి 7వ తేదీన నూతన రాజ్యాంగ విధాన ప్రకారము ఎన్నికలు జరిగి అమెరికా సంయుక్త రాష్ట్రములకు ప్రథమ అధ్యక్షుడుగ జార్జివాషింగ్టను ఎన్నుకొనబడెను.

అమెరికాను సురక్షితముగ నడిపించుటకు జార్జివాషింగను కన్న అర్హులెవరు! ఉత్కృష్టమగు ఆదర్శములను కలిగి,

యుండుటయే కాక, ఆయనకు విశేషమగు లోకానుభవము కూడనుండెను. తన సర్వస్వమును తన దేశముయొక్క ఘనత కొరకై అర్పించుటయే గాక, తన దేశముయొక్క భావ్య దృష్టమునందును గొప్పదనము నందును సంపూర్ణమగు విశ్వాసమును కలిగియుండెను. ఆయన కాంక్షించక పోయినను ఆయన నేకగ్రీవముగ నధ్యక్షునిగ నెన్నుకొనుటవలన ఆయన చేసిన మహత్తరమగు దేశసేవకు కృతజ్ఞత చూపినట్లయ్యెను. ఆయన రాజకీయశక్తుల కతీతుడై దేశమును బహువిధముల అభివృద్ధి నొందించి రెండవమారుకూడ నేకగ్రీవముగా నధ్యక్షుడుగ నెన్నుకొన బడెను. మూడవవారికూడ అధ్యక్షత పదవి నివ్వగా నాయన స్వీకరించుటకు నిరాకరించెను.

(2)

సంపూర్ణ ప్రజా స్వామికము

అమెరికా సంయుక్త రాష్ట్రములు ఆంగ్లేయ ప్రభుత్వమునుండి చీలిపోయిన తరువాత సంపూర్ణ ప్రజాస్వామికము నేర్పరచుకొనెను. వారి రాజ్యాంగ విధానములో రాజు లేడు. ప్రభువులు లేరు. ప్రభువుల సభ లేదు. ప్రభు బిరుదము మొదలగు ఏ బిరుదములను రాజ్యములోని పౌరుల కెవరికిని యివ్వరు. బిరుదముల నెవరును ధరించరు. మానవుల గౌరవము వారు పొందు బిరుదములనుబట్టి గాక సమర్థత యోగ్యతల వలననే గలుగునని వారి యభిప్రాయము. పరిపాలన 1787 వ సంవత్సరమున జార్జి వాషింగ్టను గారిచేత లిఖితముగా నిర్ణయించబడిన రాజ్యాంగ విధానమునుబట్టియే నేటికిని జరుగుచున్నది. అందులో ఏదైన మార్పులు కావలసియున్నచో మార్పులు

చేయుట కందులో చెప్పబడిన విధానము ననుసరించియే మార్పులు జరుగుచున్నవి. సంయుక్త రాష్ట్రములు యేబది రెండు రాష్ట్రములను కలిగియున్నవి. ఈ అన్ని రాష్ట్రములును కలిసి సమిష్టి విషయములలో నొక జాతీయ ప్రభుత్వము క్రింద నున్నవి. ఇదిగాక యేరాష్ట్ర ప్రభుత్వము ఆరాష్ట్రమున కున్నది.

రాష్ట్రముల వ్యక్తిత్వము.

ప్రథమమున సంయుక్త రాష్ట్రములుగా చేరి సంయుక్త ప్రభుత్వము నేర్పరచుకున్న పదమూడు రాష్ట్రములను ఒకేకాలమున ఒకే చట్టప్రకారము పుట్టినవి కావు. దేనికది ప్రత్యేక పరిస్థితులలో ఏర్పడినవి. ఆంగ్లేయ ప్రభుత్వముక్రింద నివి యన్నియు నున్నప్పటికిని అన్నిటికిని సమానహక్కులు లేకుండెను. వివిధ రాష్ట్రములకును వివిధములగు హక్కులుగల దానశాసనము లుండెను కొన్ని రాష్ట్రములు ఆంగ్లేయ రాజుయొక్క స్వంతముక్రిందను, కొన్ని భూ స్వాముల క్రిందను, కొన్ని ప్రజా సమూహముల క్రిందను, కొన్ని ప్రత్యేక సంఘముల క్రిందను, దానపట్టాలు పొందెను. ప్రతి రాష్ట్రమునకును వేరు వేరగు పద్ధతులమీద శాసనసభలు, అధికారవర్గము, న్యాయ స్థానములు మొదలగు పరిపాలనా పరికరము లుండెను. ఆంగ్లేయ ప్రభుత్వమువారి నిర్బంధములకు తాళజాలక అన్ని రాష్ట్రములును కలిసి తిరుగబాటును సాగించి స్వతంత్రమును పొందెను. స్వతంత్రము పొందిన తరువాత విడి విడిగా నుండుటవలన తమ కపాయము కలుగునని తలచి అన్ని రాష్ట్రములును కలిసి యొక జాతీయ సంయుక్త ప్రభుత్వము క్రిందికి వచ్చుటకు

అంగీకరించెను. గాని సంయుక్త ప్రభుత్వ విధానము నేర్పరచుకొనుటతో రాష్ట్రములు తమ ప్రత్యేక వ్యక్తిత్వమును పోగొట్టుకొనుటకును తమ యావత్తు స్వతంత్రమును పూర్తిగా జాతీయ ప్రభుత్వమునకు లోబరచుటకును సమ్మతించలేదు. రాష్ట్రములు ప్రథమమున సర్వాధికారములు గలవి. అవి అవసరమునుబట్టి కలసినవి గావున అన్ని రాష్ట్రములకును అనగా మొత్తపు సంయుక్త రాష్ట్రముల జాతికి సంబంధించిన సమిష్టి విషయములలో మాత్రమేననగా రాజ్యాంగ విధానములో స్పష్టీకరించిన విషయములలో మాత్రమే నిర్దిష్టమగు అధికారములు చెలాయించుటకు జాతీయ సంయుక్త ప్రభుత్వము నేర్పరచుకొనెను. ఈ యేర్పాటు ప్రకారము రాష్ట్రములన్నియు ననేక ముఖ్యమగు విషయములలో జాతీయ ప్రభుత్వమునకు లోబడి నడచుకొనవలసి నప్పటికిని, జాతీయ ప్రభుత్వమునకు యివ్వబడని అధికారము లన్నియు రాష్ట్ర ప్రభుత్వములకుందే యుండును. జాతీయ ప్రభుత్వపు అధికారము నిర్దిష్టమైనది, మితమైనది. రాష్ట్ర ప్రభుత్వముల అధికారము అనిర్దిష్టమైనది, అమితమైనది. జాతీయ ప్రభుత్వమును చలాయించుట కవసరమగు పన్నులు, జాతీయ ఋణము, సుంకములు, ఎగుమతి దిగుమతి సరుకులమీాద పన్నులు, విదేశ సరుకులమీాద పన్నులు, విదేశములతోను రాష్ట్రముల మధ్యను వర్తక వ్యాపారములను గూర్చిన నిబంధనలు, పోస్టు, పోస్టురోడ్లు, లెంతి, ధూమశకటములు, పోగమూడలు, సైన్యము, నావికాదళము, విదేశస్థుల విషయములు, యుద్ధము, సంధి, క్రొత్త రాజ్యములను సంపాదించుట, విదేశ వ్యవ

హారములు, టిఫ్రిడమార్కులు, కాపీరైటులు, నాణెములు, కరెన్సీనోట్లు, ( కాగితపు ధనము, ) జాతీయ ప్రభుత్వముపై నేరములు, సముద్రములమీద నేరములు, దివాళ చట్టము, పౌరసత్వపు హక్కులు, సంయుక్త ప్రభుత్వపు రాజధాని లోను, వారి కోటలు, గిడ్డంగులు, నౌకా నిర్మాణశాలలు, మొదలగు ప్రదేశములలోను సమస్త శాసనములు చేయుట, మొదలగు అధికారములు జాతీయ ప్రభుత్వమునకు గలవు. రాష్ట్రములలోని పౌరులకు సంబంధించిన సమస్త యితర విషయములలోను, శాసనములుచేయు అధికారము రాష్ట్ర ప్రభుత్వముల కుండును. అనగా స్థానిక స్వపరిపాలన; విద్య; దాయభాగము; దండనా శాసనములు; ( క్రిమినలు లా; ) ధర్మస్మృతి; ( సివిలు లా; ) పోలీసు; శాంతి సంరక్షణము; వివాహము; కంట్రాక్టులు; భాగస్వాములు; ఏజంట్లు; ఓటర్లు; భార్యాభర్తల తండ్రి పిల్లల యాజమాని నౌకరుల సంబంధములు; భీమా; ఋణములు; రాష్ట్రములోని పరిశ్రమలు; వర్తక వ్యాపారములు; ఆస్థి పంపకము; మొదలగు సమస్త విషయములలోను శాసించుటకు రాష్ట్ర ప్రభుత్వములకే అధికారము గలదు. రాష్ట్రముల వ్యక్తిత్వము చెడకుండ రాష్ట్ర ప్రభుత్వములు జరుగుచు, రాష్ట్రములన్నియు కలిసి యేర్పాటు చేసుకున్న జాతీయ ప్రభుత్వమునకు సంయుక్త (Federal) ప్రభుత్వమని పేరు. ఇదియే అమెరికా సంయుక్త రాష్ట్రముల ప్రభుత్వమునకును ఇతర దేశముల ప్రభుత్వములకును భేదము.

సంయుక్త ప్రభుత్వము.

ఇంగ్లాండు, ఫ్రాన్సు, స్పైన్, ఇటలీ, జపాను మొదలగు చిన్న దేశములలో రాష్ట్రప్రభుత్వములే లేవు. శాసనసభలుగల రాష్ట్రములే లేవు. ఆ దేశములన్నిటిలోను ఒకే ప్రభుత్వముగలదు. అది జాతీయప్రభుత్వము. కావున ఆ దేశముల ప్రభుత్వములు సంయుక్త ప్రభుత్వములుగావు. కనడా దేశములో రాష్ట్రముల కన్నిటికిని శాసనసభలు గలవు. పైన జాతీయప్రభుత్వము గలదు. దానికి రెండు శాసనసభలుగలవు. అయితే జాతీయప్రభుత్వమును రాష్ట్రప్రభుత్వమును ఒకే చట్టప్రకారము ఏర్పడినవి. గావున రాష్ట్ర ప్రభుత్వములకు నిర్దిష్టమైన యధికారములును మిగిలిన సర్వాధికారములను జాతీయ ప్రభుత్వము నకును గలదు. రాష్ట్ర ప్రభుత్వములు జాతీయ ప్రభుత్వము నకు సంపూర్ణముగ లోబడియున్నవి. కనడా కూడ సంయుక్త (Federal) ప్రభుత్వమనియే చెప్పవచ్చును. ఆస్ట్రేలియాకూడ కనడానుబోలిన సంయుక్త ప్రభుత్వమే కలిగియున్నది. ప్రస్తుతము ఆంగ్లేయ పాలనముక్రింద హిందూదేశములో శాసనసభలుగలరాష్ట్ర ప్రభుత్వములును వీటిపైన రెండుశాసనసభలుగల జాతీయప్రభుత్వమును గలవు. ఇచటకూడ కనడా, ఆస్ట్రేలియాలవలె రాష్ట్రీయ ప్రభుత్వములకు నిర్దిష్టమైన అధికారములును జాతీయ ప్రభుత్వమునకు ఎక్కువ అధికారములును గలవు. కాని హిందూదేశములో జాతీయప్రభుత్వమునకుగూడ సంపూర్ణమగు అధికారములులేవు. హిందూదేశముమీద సంపూర్ణమగునట్టియు అమితమైనట్టియు అనిర్దిష్టమైనట్టియు అధికారములు ఉండను-

లోని ఆంగ్లేయ పార్లమెంటుకు [illegible] గలవు. హిందూ దేశమునకు స్వరాజ్యములేదు. ఆంగ్లేయ పార్లమెంటుయొక్క పరిపాలనకులోబడి హైందవ జాతీయ ప్రభుత్వమును రాష్ట్ర ప్రభుత్వములును నిర్దిష్టమగు అధికారములను చలాయించుచున్నవి. హిందూదేశము స్వరాజ్యము పొందినతరువాత కనడా, ఆస్ట్రేలియాలలోవంటి సంయుక్త ప్రభుత్వము నేర్పరచుకొనునో అమెరికా సంయుక్తరాష్ట్రములలోవంటి సంయుక్త ప్రభుత్వము నేర్పరచుకొనునో చెప్పుటకు వీలులేదు.

కాంగ్రెసు.

అమెరికా సంయుక్త రాష్ట్రముల ప్రభుత్వము మూడు భాగములు గలది. మొదటిది శాసన సభలు. దీనికి కాంగ్రెసు అనిపేరు. శాసన సభలు రెండుగలవు. ఒకటి ప్రజాప్రతినిధిసభ (House of Representatives,) రెండవది శిష్టసభ (Senate) ప్రజాప్రతినిధిసభలో 435మంది సభ్యులుగలరు. రెండుసంవత్సరముల కొకసారి ఎన్నికలు జరుగును. దేశములోని రాష్ట్రములన్నిటిలోను షుమారు రెండులక్షల పదకొండువేల జనుల కొక ప్రతినిధి చొప్పున ఎన్నుకొనుటకు జిల్లాలుగా పంపిణీచేయబడినది. ప్రతినిధి ఇరువది ఐదుసంవత్సరములకు తక్కువలేనివయస్సు గలవాడుగను, సంయుక్తరాష్ట్రములలో ఏడుసంవత్సరములు పౌరుడుగను, ఎన్నుకొనబడిన కాలమున ఎన్నుకొనబడిన రాష్ట్రములో కాపురస్తుడుగను, ఉండితీరవలెను. ఓట్ల ఎన్నిక హక్కులు రాష్ట్రప్రభుత్వములే నిర్ణయించును. అన్నిరాష్ట్రములలోను ఇరువదియొక్క సంవత్సరములు దాటినపురుషులగు పౌరులకందరకును ఓట్లు (ఎన్ను

కొరకు అధికారము) ఇవ్వబడినవి. కొన్ని రాష్ట్రములలో స్త్రీలకుకూడ ఎన్నిక అధికారము లివ్వబడినవి. చాలరాష్ట్రములలో పౌరసత్వత్వములను కోరిన విదేశస్థులకును ఓటు చేయు అధికారమివ్వబడినది. ఓటర్లు కొన్నిరాష్ట్రములలో వ్రాయను చదువను నేర్చినవారుగనుండవలెను లేదా కొంత ఎక్కువ ఆస్తిగలవారుగ నుండవలెను మరికొన్ని రాష్ట్రములలో కొంతపన్ను చెల్లించువారుగనుండవలెను. అన్నిరాష్ట్రములలోను ఓటుచేయు అధికారమునుపొందకముందుకొంతకాలమారాష్ట్రములో కాపురముండి తీరవలెనని శాసించబడెను. గాని ఎంత కాలము కాపుర ముండవలెనను విషయమున కొన్ని రాష్ట్రములలో మూడు నెలలు మొదలు మరికొన్ని రాష్ట్రములలో రెండున్నరసంవత్సరములవరకు వివిధరాష్ట్రములలో వేరువేరువిధముల నిర్ణయించబడినది.

శిష్టసభకు ఆరుసంవత్సరముల కొకసారి ఎన్నికలుజరుగును, గాని ప్రజాప్రతినిధి సభవలె అందరిసభ్యుల ఎన్నికలు ఒక్కసారిజరగవు. శిష్టసభలోని మూడవవంతు సభ్యులు ప్రతి రెండుసంవత్సరములకును ఎన్నుకొనబడుదురు. ఈసభలో రాష్ట్రమున కిద్దరుసభ్యుల చొప్పున రాష్ట్రశాసనసభలచే ఎన్నుకొనబడిన ప్రతినిధులుందురు, సభ్యుడు ముప్పదిసంవత్సరములకు తక్కువగాని వయస్సుగలవాడుగను తొమ్మిదిసంవత్సరములు సంయుక్తరాష్ట్రముల పౌరుడుగను ఎన్నుకొనబడిన రాష్ట్రములో కాపుర మున్నవాడుగను ఉండితీరవలెను. ఇందువలన ప్రజాప్రతినిధిసభ దేశములోని యావన్మంది ప్రజల కొక్క ప్రాతినిధ్యమును వహించుచు సమిష్టిజాతీయ భావమును

పోషించుచున్నది. శిష్టసభ రాష్ట్రముల ప్రాతినిధ్యము నువహించుచు రాష్ట్రముల వ్యక్తభావమును సంరక్షించుచున్నది. ఈ రెండుసభల సభ్యులకును జీతములిచ్చెదరు. ప్రతిశాసనమును రెండుసభలవలనను అంగీకరించబడవలెను. తరువాత అధ్యక్షుని సంతకముకై పోవును. ఆయన సంతకము చేయగానే చట్టమగును. ఆయన సంతకము చేయక పునర్విమర్శకై శాసనము ప్రవేశపెట్టబడిన శాసనసభకు పంపవచ్చును. వారు పునర్విమర్శచేసి మూడింట రెండువంతుల మంది తిరిగి దానిని అంగీకరించినచో గాని యంతట అందే చట్టమగును. మరియు అధ్యక్షుడు పదిదినములలో సంతకమైన చేయవలెను లేదా పునర్విమర్శకైన బంపవలెను. లేనిచో దానంతట అదే చట్టమగును. ఆర్థిక విషయమగు శాసనములు ముందుగా ప్రజాప్రతినిధిసభలోనే ప్రవేశపెట్టబడవలెను. తక్కినవి ఏసభలోనైనను ప్రవేశపెట్టబడవచ్చును. రెండు శాసనసభలకును ఏశాసనము విషయములోనైన భేదాభిప్రాయము కలిగినపుడు చెరియొక యుపసంఘమును నియమించి యా యుపసంఘములు కలిసి నిర్ణయించినటుల రెండు శాసనసభలును అంగీకరింపును. శిష్టసభకు సంయుక్తరాష్ట్రముల ఉపాధ్యక్షుడు అధ్యక్షతవహింపును. ప్రజాప్రతినిధిసభకు వారిచే నెన్నుకొనబడిన స్పీకరు (Speaker) అను ఆయన అధ్యక్షతవహించును. ఉద్యోగస్థులెవరును ఏశాసనసభలోను సభ్యులుగానుండకూడదు. సభ్యులు శాసనసభలలో నేమిమాట్లాడినను ఏనేరము క్రిందను సివిలు క్రిమినలు న్యాయస్థానములలో విచారించబడకూడదు. ఏసభ్యుడైనను శాసనసభవారు మూడింట రెండువంతులమంది అంగీకారముతో సభ్యత్వమునుండి తొలగించవచ్చును.

అధ్యక్షుడు.

సంయుక్త ప్రభుత్వములో రెండవభాగము అధ్యక్షుడు. యూనైటెడ్ ప్రభుత్వనిర్వహణ భారమును ఈయనవహించును. ఈయనయును ఉపాధ్యక్షుడును నాలుగుసంవత్సరముల కొకసారి ఎన్నుకొనబడుదురు. ఇందునిమిత్తము ప్రతిరాష్ట్రములోని ప్రజలు కొంతమంది ఓటర్లను (ఎన్నుకొను అధికారముగలవారిని) ఎన్నుకొనెదరు. ఆఓటర్లు సంయుక్తరాష్ట్రముల అధ్యక్షుని ఉపాధ్యక్షుని ఎన్నుకొనెదరు. ఏరాష్ట్రమునకైనను శిష్టసభలోను ప్రజాప్రతినిధిసభలోను కలిసి ఎంతమంది సభ్యులు గలరో అంతమంది ఓటర్లు (electors) ఆరాష్ట్ర ప్రజలెన్నుకొనవలెను. శాసనసభ్యులుగాని ఉద్యోగస్థులుగాని ఓటర్లు (electors) గాఎన్నుకొనబడగూడదు. పాత అధ్యక్షుని కాలపరిమితి యొక్క ఆఖరు నవంబరులోని మొదటి మంగళవారము నాడు ఎలెక్టర్లు (ఓటర్లు) ఎన్నుకొనబడెదరు. అధ్యక్షపదవికిగాని ఉపాధ్యక్షపదవికిగాని అభ్యర్థిగానుండువాడు సంయుక్తరాష్ట్రములలో జననమొందిన పౌరుడుగనుండవలెను. విదేశస్థుడై సంయుక్తరాష్ట్రముల పౌరసత్వములను పొందినవాడు ఏయుద్యోగమునకైన అర్హుడేగాని అధ్యక్షుడుగాని ఉపాధ్యక్షుడుగాని కానేరడు. అధ్యక్షుడును ఉపాధ్యక్షుడును ముప్పది అయిదు సంవత్సరములకు తక్కువగాని వయసుగలవారుగను సంయుక్త రాష్ట్రములలో పదునాలుగు సంవత్సరములకు తక్కువగాని కాలము కాపురమున్నవారుగను ఉండవలెను. ఉపాధ్యక్షునకు నెలకు నాలుగువేల రూప్యములు తమిచ్చెదరు. అధ్యక్షపదవి ఖాళీఅయినచో ఉపాధ్యక్షుడు

ఆపదవి వహించును. అధ్యక్షుడును ఉపాధ్యక్షుడును ఇద్దరును లేనప్పుడు మంత్రులలోనుంచి యొకరిని అధ్యక్షుని హోదాను చలాయించుటకు శిష్టసభవారెన్నుకొనెదరు.

సంయుక్తరాష్ట్రీయుల సేనలకును నౌకాదళమునకును అధ్యక్షుడే సర్వసేనాధిపతియైయున్నాడు. ఈయన శిష్టసభవారి సలహాతో మంత్రులను న్యాయాధిపతులను విదేశరాయబారులను పెద్దయుద్యోగస్థులను నియమించును. చిన్నయుద్యోగస్థులను శిష్టసభవారి సలహాలేకుండనే నియమించవచ్చును. మంత్రులు అధ్యక్షునకు జవాబుదారులుగాని శాసనసభలకు జవాబుదారులుగారు. శాసనసభలలో మంత్రులు సభ్యులుగారు. మంత్రులుతొమ్మిదిమంది విదేశవ్యవహారముల మంత్రి, ఆర్థికమంత్రి, యుద్ధమంత్రి, నౌకాదళమంత్రి, అంతర్వ్యవహారమంత్రి, న్యాయశాఖమంత్రి, పోస్టు(టపా)మంత్రి, వ్యవసాయమంత్రి, వర్తకపుమంత్రి, అనువారు. అన్నిచట్టములను క్రమముగా అమలుజరుపు విధి అధ్యక్షునియందున్నది. ఏదేశముతోనైనను అధ్యక్షుడు సంధిచేసుకొనిన యెడల దానిని శిష్టసభలోని మూడింట రెండువంతులమంది అంగీకరించవలసియుండును. శాసనసభలలో తాముపెట్టిన ముఖ్యమగు చట్టములోడిపోయినను సాధారణ విశ్వాసరాహిత్య తీర్మానమువలనను అధ్యక్షుడు ఉపాధ్యక్షుడు మంత్రివర్గము రాజీనామా నివ్వనక్కరలేదు. ఎందువల్లననగా వీరి నెవరిని శాసనసభలు ఎన్నుకొనలేదు. వీరెవరును శాసనసభలలో సభ్యులుగారు. అధ్యక్షుడు ఉపాధ్యక్షుడుగాని మంత్రులు మొదలగు పెద్దయుద్యోగస్థులుగాని, దేశద్రోహము, లంచము

పుచ్చుకొనుట, మొదలగు గొప్ప నేరములు చేసినపుడు మాత్రము ప్రజాప్రతినిధిసభవారు తీర్మానము చేసి, శిష్టసభ యెదుట ప్రధాననేరము మోపెదరు. శిష్టసభవారు సంయుక్తరాష్ట్రముల వ న్యాయాధిపతి యొక్క అధ్యక్షతక్రింద విచారణసలిపి మూడింట రెండువంతులమంది యొక్క సమ్మతులందుకు వచ్చినచో నేరస్థులగువారిని యుద్యోగములనుండి తీసివేయుదురు. ఎన్నటికిని అట్టియుద్యోగములు చేయకూడదని శాసించవచ్చును. మరియు న్యాయస్థానములలో నేరారోపణచేసి శిక్షింపజేయవచ్చును. అమెరికా సంయుక్తరాష్ట్రముల ప్రభుత్వముక్రింద వాషింగ్టనుపట్టణము మాత్రముగాదు. తక్కిన యావత్తు ప్రదేశము ఏదో రాష్ట్రముక్రిందనుండును. వాషింగ్టను పట్టణముమీదను సంయుక్త ప్రభుత్వమునకు చెందిన ఆయుధాగారములు నౌకానిర్మాణ శాలలు మొదలగు ప్రదేశములమీదను సర్వాధికారము సంయుక్తప్రభుత్వమునకేగలదు. వాషింగ్టను పట్టణములోని (White House) శ్వేతమందిరము అను గొప్ప నగరునందు అధ్యక్షుడు నివసించును. సంయుక్త రాష్ట్రముల గౌరవమునకు మర్యాదలకు చిహ్నమైనవాడు అధ్యక్షుడు. ఆయనకు నెలకు ఇరువదిఅయిదు వేల రూప్యముల జీతమునిచ్చెదరు. ఇంకను ఖర్చులన్నియు ప్రభుత్వ బొక్కసమునుండి భరించెదరు. విదేశ రాజులను మంత్రులను అధ్యక్షుడు తనమందిరమున గొప్పదర్జాగా ఆదరించును. న్యాయస్థానములలో శిక్షింపబడిన నేరస్థులకు క్షమాపణనిచ్చుటకు అధ్యక్షునికే అధికారముగలదు.

సంయుక్తరాష్ట్రముల జాతీయ ప్రభుత్వములో మూడవభాగము న్యాయస్థానములు. పౌరుల స్వతంత్రములను కాపాడుటకును శాసనములను ధర్మబుద్ధితో పాలించుటకును ఏర్పడినవి న్యాయస్థానములు.

న్యాయ విచారణ శాఖ.

న్యాయస్థానములలోని న్యాయాధిపతులు న్యాయమూర్తులుగను ధర్మస్వరూపులుగను ఉండవలెను. లేనిచో ప్రభుత్వము అధర్మప్రభుత్వముగ నుండును. గావున స్వతంత్రదేశములలో న్యాయస్థానములు కార్యనిర్వాహకశాఖకు ( Executive ) లోబడకుండ స్వతంత్రముగ నుండునట్లు ఏర్పాటుచేసికొనియున్నారు. అట్టి ఏర్పాటే సంయుక్తరాష్ట్రములలోను గలదు. న్యాయస్థానములును అందలి న్యాయాధిపతులును శాసనసభలకు(కాంగ్రెసునకు) గాని అధ్యక్షుడు, మంత్రులు వారిక్రింది యుద్యోగస్థులు మొదలగువారికి గాని లోబడియుండక స్వతంత్రముగ నున్నారు. సంయుక్తరాష్ట్రములలో ఉన్నత న్యాయస్థానమునకు ( Supreme Court ) సుప్రీం కోర్టు అని పేరు దానికిలోబడి సమస్త శివిలు క్రిమినలుకోర్టులు (న్యాయస్థానములు) ను ఉన్నవి. సుప్రీంకోర్టు (ఉన్నత న్యాయస్థానము) లో నొక ప్రధానన్యాయాధిపతియు ఎనిమిది మంది సహాయన్యాయాధిపతులును గలరు. ఒకసారి ఏర్పడిన తరువాత న్యాయాధిపతులను కేవలము చెడు ప్రవర్తన రుజువైనతప్ప తీసివేయుటకు వీలులేదు. డెబ్బది సంవత్సరముల వయస్సు వచ్చువరకును పనిచేయవచ్చును. అటుపైన పింఛన్ (ఉపకారవేతనము) ఇచ్చెదరు. శివిన్యా పోలీసు మొదలగు ఇతర పనులు చేయు ఉద్యోగస్థులెవరికిని

క్రిమినలు సివిలు కేసులను విచారణచేయు అధికారము లేదు. సంయుక్త ప్రభుత్వమువారు చేయు ఏచట్టములైనను రాజ్యాంగ విధానమునకు వ్యతిరేకముగా చేయబడినవని ఏవారైనను సుప్రీం కోర్టులో (ఉన్నత న్యాయస్థానములో) దావా తెచ్చినచో ఆన్యాయస్థానమువారు ప్రభుత్వమువారికి తెలియజేసి ఉభయపక్షములను విచారించి తీర్పుచెప్పెదరు. ఆచట్టము రాజ్యాంగ విధానమునకు వ్యతిరేకముగ చేయబడినట్లు తీర్మానించినచో నది రద్దగును. ప్రభుత్వపు ఉద్యోగస్థులు చేయు చర్యలన్నియు కోర్టులలో దావాలమూలకముగ ఆక్షేపించి అక్రమమయినవాటిని రద్దుపర్చుకొనుటకు అమెరికాలోనివారులకు హక్కుగలదు.

హిందూదేశమున న్యాయవిచారణ శాఖ.

హిందూదేశమున ఆంగ్లేయపాలనము క్రింద ముఖ్యముగా క్రిమినలు న్యాయస్థానములు స్వతంత్రముగ లేవు. జిల్లాలలోని క్రిమినలు న్యాయాధిపతులందరును జిల్లాకలెక్టరుకు లోబడియున్నారు. జిల్లాకలెక్టరు కార్యనిర్వాహకశాఖకు చెందిన యుద్యోగపరంపరలో నతి ముఖ్యమగు స్థానమును వహించియున్నాడు. జిల్లాకలెక్టరే జిల్లామేజస్ట్రీటుగానున్నాడు. జిల్లాలోని రివిన్యూ, అదాయపు పన్ను, ఉప్పుపన్ను, ఆబుకారి, అడవి, పోలీసు, నీటిపారుదల మొదలగు ప్రభుత్వముయొక్క అదాయమునకు ప్రతిష్టకును సంబంధించిన సమస్త శాఖలకును యజమానిగ నున్నాడు. జిల్లాకు మేజస్ట్రీటుక్రింద క్రిమినలు న్యాయవిచారణను చేయు సబుకలెక్టరులు, డెప్యూటీకలెక్టరులు, తహసీల్దారులు, శిరస్తా

దారులు కేవలము జిల్లాకలెక్టరుతోపాటు రివిన్యూ ఉద్యోగస్థులు వ్రితివిషయములోను ఆయా ప్రదేశములలో జిల్లాకలెక్టరుకు లోబడి ప్రభుత్వముయొక్క ప్రతిష్ఠను ఆదాయమును కాపాడ వలసినవారై యున్నారు. వీరి యుద్యోగములు జీతములు అభివృద్ధి కేవలము జిల్లాకలెక్టరుయొక్క అనుగ్రహము మీద ఆధారపడియుండును. ఇదిగాక జిల్లాలలోగల స్టేషనరీ సబు మేజిస్ట్రీటులు (ప్రత్యేక క్రిమినలు న్యాయాధిపతులు) కూడ చిన్న రివిన్యూ ఉద్యోగములనుండి జిల్లాకలెక్టరులచే నియమింప బడి పై యుద్యోగములకును పెద్దజీతములకును జిల్లాకలెక్టరుల అనుగ్రహానుగ్రహములమీద ఆధారపడియున్నారు. కావున జిల్లాలలోని క్రిమినలు న్యాయస్థానములలో రాచకీయనేరము లలోను పోలీసు, సాల్టు, ఆబుకారి, ఫారెస్టు, మొదలగు ప్రభు త్వపుకేసులలోను నిష్పక్షపాతమగు న్యాయము కలుగునని పౌరులకు విశ్వాసముండదు. ముఖ్యముగా రాజకీయనేరము లలో కలెక్టరుల యభిప్రాయానుసారముగ క్రింది మేజిస్ట్రీటులు శిక్షలు విధించుట అనేక చోటుల జరుగుచున్నది. కావున నిర్వాహకశాఖయు క్రిమినలు న్యాయవిచారణా శాఖయు విడ దీయుటయు క్రిమినలు న్యాయాధిపతులందరను హైకోర్టుక్రింద నుంచుటయు చాలఅవసరమని హైందవరాజకీయ వేత్తలు ఆం దోళనము చేయుచున్నప్పటికిని ఆంగ్లేయ అధికారవర్గమువారు ఈమార్పుచేయుటకు ఇంతవరకును సమ్మతించుటలేదు. నైజాంరాష్ట్రములో ఘనతవహించిన నైజాంగారు కార్యనిర్వా హకశాఖను న్యాయవిచారణశాఖను పూర్తిగ విడదీసినారు. రివిన్యూ ఉద్యోగస్థులెవరికిని శివిలుక్రిమినలు అధికారములు

లేకుండ చేసినారు. శివిలు న్యాయాధిపతులకే క్రిమినలు న్యాయమునుకూడ చేయు అధికారములనిచ్చి అందరు న్యాయాధిపతులను హైకోర్టుకు లోబడునట్లు చేసినారు. ఇది మిగుల సమంజసముగానున్నది.

రాష్ట్రములలోని ప్రభుత్వములు.

సంయుక్త రాష్ట్రములలోని రాష్ట్రముల ప్రభుత్వములన్నియు ఒకే పద్ధతిగ లేవు. గాని ప్రతి రాష్ట్రములోను రెండు శాసనసభలు గలవు. చాలవరకు ప్రజా ప్రతినిధి సభయనియు శిష్ట సభయనియు వాటిపేర్లు కొన్ని రాష్ట్రములలో వాటికి వేరు పేర్లు గలవు. ప్రజా ప్రతినిధి సభకు రెండేండ్ల కొకసారియు శిష్టసభకు నాలుగు సంవత్సరముల కొకసారియు యెన్నికలు జరుగును. రెండు సభలకును సభ్యులను యెన్నుకొను అర్హత గల ప్రజలే యెన్నుకొనెదరు. ప్రతి రాష్ట్రమునకు కార్య నిర్వాహణము చేయుటకు గవర్నరు నలుగురు మంత్రులు గలరు. కొన్ని రాష్ట్రములలో నింక నెక్కువమంది మంత్రులు గలరు. వీరినందరిని ప్రజలే యెన్నుకొనెదరు. చాల రాష్ట్రములలో రెండు సంవత్సరముల కొకసారి వీరి యెన్నికలు జరుగును. కొన్ని రాష్ట్రములలో నాలుగు సంవత్సరముల కొకసారియు కొన్నిటిలో మూడు సంవత్సరముల కొకసారియు యెన్నికలు జరుగును. చాలరాష్ట్రములలో న్యాయాధిపతులు కూడ ప్రజలచే యెన్నుకొనబడుదురు. తక్కిన రాష్ట్రములలో గవర్నరులు శిష్టసభవారి సమ్మతితో న్యాయాధిపతులను నియమింతురు. స్వల్ప సంఖ్యగల రాష్ట్రములలో మాత్రము శాసనసభలు న్యాయాధిపతులను నియమిం

చును. దాదాపుగా అన్ని రాష్ట్రములలోను శాసనసభలు న్యాయాధిపతులను ఉద్యోగములోనుండి తీసివేయవచ్చును. కొన్ని రాష్ట్రములలో న్యాయాధిపతులు రెండు సంవత్సరముల కాలము వరకును కొన్ని రాష్ట్రములలో నింక నెక్కువ కాలము వరకును తక్కిన వన్నిటిలో న్యాయాధిపతులు సత్ప్రవర్తన గలిగి, పనిచేయు నంతకాలము వరకును యెన్నుకొనబడుచున్నారు. ప్రతి రాష్ట్రములోను సుప్రీంకోర్టు (ఉన్నత న్యాయస్థానము) ను దానిక్రింద సివిలు క్రిమినలు చట్టముల ప్రకారము విచారణచేయు అన్ని కోర్టులును గలవు. కక్షిదారు ఏ ప్రత్యేక రాష్ట్రమునకు చెందనివాడై యున్నప్పుడును దావాలో సంయుక్త ప్రభుత్వశాసన విషయములకు సంబంధ మున్నప్పుడును మాత్రము రాష్ట్రీయ యున్నత న్యాయస్థానము నుండి సంయుక్త యున్నత న్యాయస్థానమునకు అప్పీలు (విమర్శనాధికారము) గలదు. తక్కిన అన్ని విషయములలోను రాష్ట్రీయ యున్నత న్యాయస్థానపు తీర్పు ఆఖరు తీర్పు అగును. అందుపైన విమర్శించు అధికార మెవరికిని లేదు.

స్థానిక స్వపరి పాలనము.

అమెరికాలో స్థానిక స్వపరిపాలనము ప్రధానమైనది. స్థానిక సంఘములకు చాల అధికారములు గలవు. ముఖ్యముగా పోలీసు, పారిశుద్ధ్యము బీదల సంరక్షణ, పాఠశాలలు, రోడ్లు, వంతెనలు, వర్తక వ్యాపారములకు లైసెన్సు (అనుమతి) నిచ్చుట, స్థానిక పన్నులు విధించుట, వసూలు చేయుట, సామాన్య క్రిమినలు నేరములను, సివిలు దావాలను విచారించుట, జైళ్ల

పరిపాలన, గ్రంథాలయములు, మొదలగు ప్రజల సౌఖ్యము, శాంతి, సుపరిపాలనములకు సంబంధించిన విషయము లన్నిటి లోను అధికారములు కలిగియున్నవి. పెద్ద పట్టణములలో మ్యునిసిపాలిటీలును (బరోలు) జిల్లాలకు జిల్లా బోర్డులును, (కౌంటీలు) గ్రామములలో (పారిషులు) యూనియనులు లేక గ్రామ పంచాయితీలు గలవు. ప్రతి గ్రామములోను (పారిషు) గ్రామ పంచాయితీ గలదు. వోటర్లందరును ప్రతి సంవత్సరము నొకచోట చేరి పంచాయితీదార్లను యితర యుద్యోగస్థులను ఎన్నుకొనెదరు. గ్రామముల పరిమితినిబట్టి ముగ్గురు మొదలు తొమ్మిదివరకు పంచాయితీదార్లెన్నుకొన బడుదురు. పంచాయితీదార్లతో పాటు (పారిష్ క్లర్కు) అను లెక్కల వ్రాయు వుద్యోగస్థుడు, కోశాధిపతి, పన్నులు వేయు అస్సెసర్లు, పన్నులు వసూలుచేయు అధికారి, పాఠశాల తనిఖీ దార్లు, పోలీసు ఉద్యోగస్తులు, గ్రంథాలయ పాలకులు, బీదల విచారణాధికారి, రాజమార్గముల యుద్యోగి, మొదలగు ఉద్యోగస్తులందరిని ఎన్నుకొనెదరు. ఓటర్లసభలు సంవత్సర ములో రెండుమూడుసారులు జరుగును. ఆసభలలో నుద్యో గస్తులు తాముచేయు పనినిగూర్చి ప్రశ్నించబడి జవాబులు చెప్పవలసి యుందురు. జిల్లా బోర్డులక్రింద గ్రామ పంచా యితీ లుండును. జిల్లా పోలీసు, జయిళ్ళు, జిల్లాయొక్క క్రిమినలు సివిలు న్యాయస్థానములు, తీర్పులను అనులు జరుపు షెరిఫులు, రోడ్లుపారిశుద్ధ్యము, విద్య, మొదలగు వివిధవిషయ ములు జిల్లా బోర్డులక్రింద నుండును. న్యాయాధిపతులు, షెరి ఫులు, పోలీసు వుద్యోగస్తులు, మొదలగు పెద్ద యుద్యోగస్తు

లందరును ప్రజలచే నెన్నుకొన బడుదురు. అన్ని విషయములను తనిఖీ చేయుటకు ప్రజలచే నెన్నుకొనబడు బోర్డు గలదు. మ్యునిసిపాలిటీల క్రిందకూడ పోలీసు, జైలు, న్యాయస్థానములు గలవు. ప్రధానోద్యోగస్థు లందరును ప్రజలచే నెన్నుకొన బడుచున్నారు. మ్యునిసిపాలిటీకి సంబంధించిన విషయములన్నిటిలోను మ్యునిసిపలు సభ్యుల సంఘము శాసనసభను బోలియున్నది. మ్యునిసిపలు చైర్మను (మేయరు) కార్యనిర్వాహక భారమును వహించియున్నాడు.

అమెరికాలో సంపూర్ణమగు మత స్వేచ్ఛ గలదు. అధ్యక్షుడు మొదలు యే యుద్యోగస్థుడును ఏ మతమునకు చెందినను చెందవచ్చును. అమెరికా ప్రభుత్వ బొక్కసమునుండి యే మత పోషణకొరకును సొమ్ము ఖర్చు పెట్టరు. సంయుక్త రాష్ట్రముల రాజ్యాంగ విధానము ప్రకారము నడుచుకొందుమని అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, న్యాయాధిపతులు, మంత్రులు, మొదలగు గొప్ప యుద్యోగస్థులును శాసన సభ్యులును ప్రమాణము చేసెదరు. విదేశస్థు డెవడైన సంయుక్త రాష్ట్రముల పౌరుడు కావలెనని కోరినచో సంయుక్త రాష్ట్రములలో అయిదేండ్లయినను కాపురమున్నట్లును యే రాష్ట్రములో తాను దరఖాస్తు చేయుచున్నాడో అచట నొక సంవత్సరమైన కాపురమున్నట్లును మంచిప్రవర్తన గలవాడైనట్లును ఒక రాష్ట్రములోని న్యాయస్థానములో దరఖాస్తుచేసి పౌరసత్వములను పొందవలెను. అదివరకు ప్రభుభక్తి యున్నచో దానిని విసర్జించవలెను.

# అమెరికా

# సంయుక్త రాష్ట్రములు.

## అమెరికా ప్రజల హక్కులు.

### పదవ అధ్యాయము.

(1)

జన సంఖ్య, వైశాల్యము.

నేడు అమెరికా సంయుక్తరాష్ట్రములు తూర్పు అట్లాంటికు మహాసముద్రము మొదలు పడమర పసిఫిక్కు మహాసముద్రమువరకును వ్యాపించియున్నవి. వీటికి ఉత్తరమున ఆంగ్లేయ రాజ్యములో చేరిన కనడా దేశమును దక్షిణమున స్వాతంత్ర్య ప్రజాస్వామికమగు మెక్సికో దేశమును గలవు. సంయుక్త రాష్ట్రముల వైశాల్యము ముప్పది ఆరులక్షల పదునారువేల చతురపుమైళ్ళును జనసంఖ్య పదికోట్ల తొంబది అయిదులక్షలును గలవు. ఇంగ్లాండు దేశపు వైశాల్యము ఎనుబది తొమ్మిదివేల చతురపుమైళ్ళు జనసంఖ్య నాలుగుకోట్ల ఇరువది లక్షలు. బర్మాగాక మిగిలిన భరతవర్షముయొక్క వైశాల్యము పదిహేనులక్షల డెబ్బదిరెండువేలచతురపుమైళ్లు జనసంఖ్య ముప్పదికోట్లు. హిందూదేశము ఇంగ్లాండు కన్న వైశాల్యములో

పదునాల్గురెట్లును జనసంఖ్యలో ఏడురెట్లును పెద్దది. సంయుక్తరాష్ట్రములు వైశాల్యమునందు హిందూదేశముకన్న రెట్టింపుగలదు. ప్రస్తుతము జనసంఖ్యయందు మాత్రము హిందూదేశములో మూడవవంతుగలదు. కాని జనసంఖ్య త్వరితముగ పెరుగుచున్నది. సంయుక్తరాష్ట్రములలో పందొమ్మిది రాష్ట్రములలో పదిలక్షలకన్న తక్కువ జనసంఖ్య గలదు. అనగ కృష్ణాజిల్లాయొక్క జనసంఖ్యలో సగమైన లేకున్నవి. బర్మాగాక మిగిలిన హిందూదేశము ఆంగ్లేయపాలనము క్రింద పదిరాష్ట్రములుగ మాత్రము విభజించబడినది. సంయుక్తరాష్ట్రములు నలుబది ఎనిమిది రాష్ట్రములుచేరియున్నది. సంయుక్తరాష్ట్రములిపుడు లోకములోకెల్లమిగుల భాగ్యవంతముగనున్నవి. వాటి ప్రభుత్వపు ఆదాయము ఇంగ్లాండుకన్న ఒకటింపాతికె రెట్లును హిందూదేశముకన్న పది రెట్లునుగలదు. హిందూదేశములో ప్రతిమనుష్యునకును సగటున ఆదాయము సాలుకు ఇరువదిఅయిదు రూప్యములు సంయుక్తరాష్ట్రములలో ప్రతిమనుష్యునకును సగటున ఆదాయము సాలుకు ఎనిమిదివందల రూప్యములు. హిందూదేశములో ముప్పది అయిదు వేల మైళ్ల పొడుగున రైలువేలు (ధూమశకటయానములు) వేయబడినవి. సంయుక్తరాష్ట్రములలో రెండులక్షల ఏబదినాలుగు వేల మైళ్ల పొడుగున వేయబడినవి. హిందూదేశము పరాధీనమైయున్నది. రెండువందల సంవత్సరములక్రింద లోకములోకెల్ల భాగ్యవంతమైన దేశము నేడులోకములోకెల్ల దరిద్రవంతమైయున్నది. సంయుక్తరాష్ట్రములు స్వపరిపాలనమనుభవించుచున్నవి. లోకములోకెల్ల దరిద్రవంతమగు అట్టి

ప్రదేశములలోనుండి యభివృద్ధిచెంది నూట ముప్పది సంవత్సరములలో లోకములో కెల్ల భాగ్యవంతమయినవి. హిందూదేశములోని పరిశ్రమలు చేతిపనులు నశించి కేవలము వ్యవసాయముమీద ఆధారపడియున్నది. సంయుక్త రాష్ట్రముల వ్యవసాయము, గనులు, పరిశ్రమలు, వర్తక వ్యాపారములు అనేకరెట్లుగ అభివృద్ధిగాంచి జాతీయ ధనము విశేషముగ హెచ్చుచున్నది. ఇరువదవ శతాబ్ద ప్రారంభమున లోకము యావత్తు యొక్క రాతిసి బొగ్గులో మూడవవంతును, రాగిలో సగమును, ఇనుములో మూడవవంతును, వంతును, సంయుక్తరాష్ట్రములలోని గనులలో తీయబడినవి. సంయుక్త రాష్ట్రముల ప్రభుత్వమువారు విదేశ పరిశ్రమల పోటీవలన తమ దేశములోని పరిశ్రమలకు నష్టము కలుగకుండుటకై విదేశ సరుకులమీద పన్నులు వేయుచున్నారు. హిందూదేశములోని ఆంగ్లేయ ప్రభుత్వము వారు హిందూదేశముయొక్క తలుపులు బాగుగా తెరచి విదేశ సరుకులను అడ్డులేకుండ రానిచ్చుచున్నారు. విదేశ సరుకుల పోటీవలన హిందూదేశములోని పరిశ్రమలు తలయెత్తకుండనున్నవి. పైగా హిందూదేశములో స్థాపించబడిన బట్టల యంత్రశాలలలో తయారయ్యెడి నూలుమీదను వస్త్రముల మీదను హిందూదేశ ప్రభుత్వమువారు పన్నులు వేసియున్నారు.

**విద్యాపద్ధతులు.** సంయుక్త రాష్ట్రములలో ప్రభుత్వమువారును రాష్ట్రప్రభుత్వములును పిల్లల విద్యకొరకు ధనమును అమితముగా ఖర్చుపెట్టుచున్నారు. ఆదేశములో

పుట్టిన ప్రతిపిల్లకును (మొగపిల్లవాడైనను ఆడపిల్లయైనను) విద్యానిర్బంధమును ప్రభుత్వము వహించియున్నది. ఆ దేశములోని అన్ని తరగతులవారి పిల్లలయొక్క జీవితమును గూర్చియు, క్షేమమును గూర్చియు, అనగా వారి జననములు, మరణములు, రోగములు, ఆరోగ్యములు, నీతి, విద్య, పోషణము, మొదలగు సమస్త విషయములను గూర్చి సదా విచారణచేసి అవసరమైన చర్య తీసుకొనుటకు ప్రభుత్వములో నొక ప్రత్యేక శాఖగలదు. దేశములోని పిల్లలే జాతీయ ధనములో ప్రధానభాగమని యాపిల్లలను జాగ్రత్తగా పెంచుటయే ప్రధాన జాతీయధర్మమనియు నచటి ప్రభుత్వము గ్రహించినది. విద్యావిధానములో సాహిత్యమును శాస్త్రములను బోధించు ప్రాథమిక, మధ్యమ, ఉత్తమపాఠశాలలును సర్వకళాశాలలును అనేకములుండుటయే గాక, వర్తకము, వ్యాపారము, వ్యవసాయము వివిధములగు పరిశ్రమలు, మొదలగు వృత్తివిద్యలను నేర్పుపాఠశాలలు లెక్కకుమించియున్నవి. శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన విద్యావిషయిక ప్రదర్శనములో ప్రభుత్వ విద్యాశాఖవారు ఈక్రింది విధముగా ప్రకటనమును కట్టినారు.

“1. తనపిల్లలకు చదువుచెప్పించని జాతి తనపిల్లలకు బాగుగా చదువు చెప్పించెడి జాతికి అర్థికదాస్యమును చేయును. విద్యలేని హేతువుచేత అనేక సాగ్ల జాతులు తమదేశములను పోగొట్టుకొనిరి.

ఈ దేశమును పోగొట్టుకొనకుండ స్వాధీనమందుంచు కొనుటకు మన పిల్లలను తయారుచేతమా?"

2 "మనము గొప్పపారిశ్రామిక సైన్యమును తయారు చేసెదమా?

ఈనవీన యుద్ధమునకు పాఠశాల, సర్వకళాశాల, శాస్త్రపరిశోధనాశాల, కర్మాగారము యుద్ధభూములు. పారిశ్రామిక పోరాటములో ప్రకృతిశాస్త్ర పరికరములు లేనివారు ప్రకృతిశాస్త్ర పరికరములు గలవారిముందర ఎంత శౌర్యశాలులయినను, ఆంగ్లేయ సేనాధిపతియగు కిచనరు ప్రభువు యొక్క ఫిరంగులముందర ఓండర్మాను యుద్ధములో ప్రతిపక్షులగు దర్వీషులను మతగురువులు విరిగిపోయినట్లు, తేలికగా పరాజయము గాంచెదరు. మన పిల్లలు పారిశ్రామిక దర్వీషులగుదురా?" కేవలము వృత్తివిద్యకు సంబంధించిన పాఠశాలల సహాయార్థము 1924వ సంవత్సరమున ౭ కోట్ల రూప్యములను సంయుక్త ప్రభుత్వము వారు ఖర్చుపెట్టియున్నారు. రాష్ట్రములును మ్యునిసిపాలిటీలును ఖర్చుపెట్టునది గాక పై మొత్తమును సంయుక్త ప్రభుత్వమువారు ఖర్చుచేయుచున్నారు.

అమెరికాలో భాగ్యవంతులకు బీదవారికి వేరు వేరు పాఠశాలలు లేవు. అందరు మనుష్యులు సమానులుగావున అందరికిని ఒకే పాఠశాలలు గలవు. ప్రాథమిక, మధ్యమ, ఉన్నత పాఠశాలలన్నిటిలో అయిదింట నాలుగువంతు స్త్రీలు ఉపాధ్యాయినులుగ నున్నారు. అమెరికాలో మొగపిల్లలు ఆడ

పిల్లలు కలిసి పాఠశాలలలోను సర్వకళాశాలలలోను చదువుకొనెదరు. ఆడపిల్లలకు వేరు పాఠశాలలు లేవనియే చెప్పవచ్చును. కలిసి చదువుకొనుటవలన నష్టమేమియు లేదనియు మర్యాద, పరస్పరగౌరవముగల అభ్యాసములు మాత్రమే పుట్టుచుండుననియు అమెరికావారి యభిప్రాయము.

అమెరికనులు పూర్వకాపురస్థులగు ఎఱ్ఱయిండియనులతో పోరాడి వారిని నాశనము చేసి లేక ఎఱ్ఱయిండియనులను తరిమివేసి సంయుక్త రాష్ట్రముల సంపూర్ణ స్వాధీనము చేసికొనుట 1890 వ సంవత్సరముతో ముగిసెను. ఆ సంవత్సరము డెకోటాలోని సియోక్సు జాతికి చెందిన ఎఱ్ఱయిండియనులు తమదేశమును తమక్రిందనే ఉంచుకొనుట కొరకై బహుధైర్యముతోను నిరాశతోను పోరాడి అమెరికనులచే పూర్తిగ నాశనముచేయబడిరి. ఇదియే ఎఱ్ఱయిండియనుల ఆఖరు స్వతంత్ర పోరాటము. తెల్లవారు అమెరికాకు వచ్చుటకు పూర్వము ఎఱ్ఱయిండియనులు ఎన్నికోట్లమంది అచట కాపురమున్నది చెప్పుటకష్టము. వారిజనాభా ఎన్నడును తీసుకొని యుండలేదు. కాని దాదాపుగా ఎఱ్ఱయిండియను జాతియంతయు తెల్లవారిచే నాశనము చేయబడినదనుటలో అతిశయోక్తి లేదు. చావగ మిగిలిన రెండులక్షల ఇరువది అయిదు వేల మంది ఎఱ్ఱయిండియనులు అమెరికనులకు లొంగి సంయుక్త రాష్ట్రములలో కాపురముండుటకు నిర్ణయించబడిన ప్రత్యేక ప్రదేశములలో కాపురముండియున్నారు. వారి స్థితి అమెరికాలోని నీగ్రోల స్థితికన్న హీనముగనున్నది.

## (2)

పౌర హక్కులు.

సంయుక్త రాష్ట్రములలోని పౌరుల స్వతంత్రములను నిర్దిష్టముగా కాపాడుటకై రాజ్యాంగ విధానములో కొన్ని సవరణలు చేర్చబడినవి. అధికారుల నిరంకుశ చర్యలనుండి పౌరులను కాపాడుటకై ప్రతిస్వతంత్ర దేశములోను పౌరుల స్వత్వములను సంరక్షించు చట్టములు చేయబడును. విదేశ ప్రభుత్వముల వలనను నిరంకుశ చక్రవర్తుల వలనను పాలింపబడెడి దేశములో నట్టి చట్టములు పుట్టుట కవకాశ ముండనేరదు.

1. ఇంగ్లాండులో చర్చి ఆఫ్ ఇంగ్లాండుశాఖకు చెందిన ప్రొటెస్టంటు క్రైస్తవమతము ప్రభుత్వమువారి మతమై యున్నది. అనగా రాజు తాను ఆ మతమునకు చెందినట్లును ఆమతమును సంరక్షించు నట్లును ప్రమాణము చేయవలెను. ఆ మతపోషణకై కొంత సొమ్మును ప్రభుత్వ బొక్కసములోనుంచి యిచ్చెదరు. సంయుక్త రాష్ట్రములలో ప్రభుత్వమునకును మతమునకును యెట్టి సంబంధము లేదనియు పౌరులు తమ యిచ్చవచ్చిన యేమతమునైన నవలంబించ వచ్చుననియు మతస్వేచ్ఛను తగ్గించు ఏచట్టమును కాంగ్రెసు (శాసనసభలు) చేయకూడదనియు రాజ్యాంగ విధానములో చేర్చబడినది. ఇది మొదటిది.

2. తమ యిష్టమువచ్చిన అభిప్రాయములను ఉపన్యాస రూపమునగాని పత్రికా రూపమునగాని వెల్లడిచేయు

స్వాతంత్ర్యము సంపూర్ణముగా అమెరికా పౌరుల కివ్వబడినది. పత్రికా స్వాతంత్ర్యము, వాక్స్వాతంత్ర్యము, సభలుచేయు స్వాతంత్ర్యము, ప్రభుత్వమునకు అర్జీలిచ్చుకొను స్వాతంత్ర్యము,- వీటిని సంకుచిత పరచుట కెట్టి చట్టములును కాంగ్రెసు (శాసనసభలు) చేయకూడదని రాజ్యాంగ విధానములో చేర్చబడినది. యిది రెండవది. హిందూదేశములోవలె యిండియను పీనలుకోడ్డు 124 ఏ శెక్షన్ (రాజద్రోహము) 153 ఏ శెక్షన్ (జాతి విరోధము) ప్రొసీజరుకోడ్డు 108 మొదలగు నేరములక్రింద పౌరులు అమెరికాలో విచారించబడ నేరరు. కేవలము అల్లరులు చేసినచో కొట్లాట నేరములక్రింద తప్ప ప్రభుత్వమునకు వ్యతిరేకముగ యెట్టి అభిప్రాయమును వెలిబుచ్చినను పౌరులు అమెరికాలో శిక్షను పొందరు. (ప్రెస్సు ఆక్టు) పత్రికలమీద నిర్బంధములు కల్పించు చట్టములును, సభలు చేయకూడదను నిషేధ చట్టములును (Seditious Meetings Acts) అమెరికాలో చేయబడ నేరవు.

3. దేశములోని పౌరులందరును దేశ సంరక్షణకై తయారు కావలసి యున్నారు గావున పౌరులందరును తమ కిష్టమైన ఆయుధములను ధరించవచ్చును. కత్తి, తుపాకి, మొదలగు ఆయుధములను ధరించగూడదని యే చట్టమును అమెరికా శాసనసభలు (కాంగ్రెసు) చేయగూడదని రాజ్యాంగవిధానములో చేర్చబడినది. యిది మూడవది. మామూలుగా జీతము పుచ్చుకొని కొలువుచేయు సిపాయీలుగాక అమెరికాలోని పదునెనిమిది సంవత్సరములకును పలుబడినవారు

సంవత్సరములకును మధ్య వయస్సుగల శరీర దార్ఢ్యముగల పురుషు లందరును సమయము వచ్చినపుడు సైనికకొలువు చేయుటకు సిద్ధముగా నుండవలెను. అందుకొరకు పౌరులు విధిగా సైనిక శిక్షణము పొందుదురు. పౌరసైన్యమే దేశ సంరక్షణకు ప్రధానమైన మూలబలము.

4 ప్రమాణముమీద సాక్ష్యము పుచ్చుకొని సరియైన హేతువులు కలవని నమ్మి, యొక న్యాయాధిపతి సోదా చూడ వలసిన ప్రదేశమును, అందులోనుంచి పట్టుకొని రావలసిన మనుష్యులను, ఆస్తులను, స్పష్టముగా తెలియజేయుచు నొక వారంటును (సోదాచూచు అధికారము) యిచ్చిననేతప్ప, పోలీసువారు యెవరియింటిని సోదా చూడకూడదనియు మనుష్యులనుగాని కాగితములనుగాని దస్తులనుగాని పట్టుకొని పోకూడదనియు అమెరికా రాజ్యాంగవిధానములో చేర్చబడినది.

ఈ నిబంధన పోలీసువారు చేయు దౌర్జన్యముల నుండియు అక్రమముల నుండియు పౌరులను కాపాడుచున్నది.

5. సైన్యములకును నౌకాదళములకును సంబంధించిన నేరములలో తప్ప తక్కిన ప్రతి గొప్ప నేరములోను ముద్దాయి నేరస్తుని మీద నేరము మోపకముందు గ్రాండుజూరీ యెదుట విచారణ జరిగి వారిచే నేరస్తుడని తీర్మానించ బడ వలసి యుండును. అనగా ప్రతి పెద్ద నేరములోను ముందుగా ముద్దాయి నేరము చేసెనా లేదా యను విషయము నిర్ణయించుటకు జూరీ యెదుట విచారణ జరుగవలెను. జూరీలో 12 మంది మొదలు 24 మంది వరకు ఉందురు. దీనికి

గ్రాండుజూరీ అని పేరు. సదరు జూరీ సభ్యులలో యెక్కువ మంది ముద్దాయి దోషియని నమ్మినయడల అట్టిపైన ముద్దాయిపైన నేరమారోపించి పెద్ద న్యాయాధిపతి యెదుట విచారణ జరుగును. ఆ విచారణలో ఉభయపక్షముల సాక్ష్యములు విచారించి ముద్దాయి నేరస్థుడని తీర్మానమైనచో ముద్దాయికి శిక్ష విధింపబడును.

ప్రతి విచారణలోను నేరము రుజువైననేతప్ప ముద్దాయి నిర్దోషియనియే యెంచబడవలెను. ముద్దాయి యేమి చెప్పినను అది అతనికి వ్యతిరేకముగా నుపయోగించబడ కూడదు. ముద్దాయి అబద్ధము చెప్పినను దానికి శిక్ష లేదు. ముద్దాయిని త్వరగాను, బహిరంగముగాను విచారణ చేయవలెను. క్రిమినలు కేసులలో తొందరగా విచారణ జరిగి త్వరితముగా తీర్పు చెప్పవలసినదేగాని విశేష కాలయాపన జరిగినచో నేరారోపణ జరిగిన వానికి మిగుల మనోవ్యాకులత కలుగును. ప్రతి క్రిమినలు కేసులోను ఏజిల్లాలో నేరముజరిగినట్లుచెప్పబడునో ఆజిల్లాలోనినిష్పాక్షికమగు పన్నెండు మందికిమించని జూరీచే ముద్దాయి నేరముచేసెనా లేదాయని విచారణ జరుగవలెను. నేరము చేసినది లేనిది నిర్ణయించుటకు జూరీకేఅధికారము కలదు జూరీ ముద్దాయి నేరము చేసినట్లు నిర్ణయించినచో న్యాయాధిపతి శాస్త్రప్రకారము ఏమి శిక్ష విధించవలెనో నిర్ణయించును. ముద్దాయి నిర్దోషియని జూరీ చెప్పినచో న్యాయాధిపతి ముద్దాయిని విడుదల చేయవలసినదే. ఎనుబది రూపాయల కిమ్మతుకు మించిన ఆస్తివిషయమైన సివిల్

దావాలలోకూడ జ్యూరీవిచారణగలదు. జ్యూరీవిచారణ హక్కు చాలముఖ్యమైనది. ప్రతిస్వతంత్రదేశములోను ఈ హక్కు పౌరులకుగలదు. ఏజిల్లాకు నేరముగాని, ఆస్తిగాని సంబంధించియున్నదో ఆజిల్లా కాపురస్తులగు ఆరుగురు మొదలు పన్నెండువరకు సంఖ్యగల పెద్దమనుష్యులు ఉభయపక్షముల సాక్ష్యమును విచారణచేసి తగాదాహంశము నిజమా అబద్ధమా అని నిర్ణయించుటవలన చాలవరకు యదార్థము తేలగలను. ఫిర్యాది ముద్దాయిలయొక్క పూర్వపుస్వభావములను సాక్షులయొక్క ప్రవర్తనను ఆస్తిస్వభావమును నేరముయొక్క సాధ్యాసాధ్యములను జ్యూరరులు సాధారణముగ ఎరిగినవారై యుందురు. కావునవారికి సత్యము గోచరించినట్లు కొత్తవాడైన న్యాయాధిపతికి గోచరించదు. న్యాయాధిపతి శాస్త్రమునకు సంబంధించిన విషయములనుగూర్చి మాత్రము తీర్పుచెప్పును. పైనచెప్పబడిన పెద్దక్రిమినల్ నేరములలో ముద్దాయి ముందుగా గ్రాండు జ్యూరీవలన విచారించబడి వారు నేరమును నమ్మినపుడుమాత్రము పెద్ద న్యాయాధిపతియొద్దకు విచారణకు పంపబడును. ఆవిచారణలో కూడ జ్యూరీ ఉండును.

ముద్దాయిమీద ప్రతిఅభియోగములోను ఏమినేరము వచ్చినదో అది అతనికిముందుగా తెలుపవలెను. అతనికివ్యతిరేకముగాసాక్ష్యమిచ్చువారినిఅతనియెదుట విచారించవలెను. అతడు వారిని ప్రశ్నలడుగుటకు హక్కుగలదు. అతడుకోరిన సాక్షు

లందరిని న్యాయాధిపతి పిలిపించి విచారణచేసి తీరవలెను. ముద్దాయికి ప్రతిఅభియోగములోను ప్లీడరును పెట్టుకొనుటకు హక్కు గలదు. ప్లీడరును పెట్టుకొనలేనిచో న్యాయాధిపతియే అతనిపక్షమున నొక ప్లీడరును నియమించును. విచారణ యెప్పుడును బహిరంగముగ జరుగవలసినదిగాని రహస్యముగ చేయకూడదు. ఏముద్దాయిమైనను ఒకే నేరమునకు ఒకసారికన్న ఎక్కువపర్యాయములు శిక్ష అనుభవించకూడదు.

ఏఅభియోగములోను ముద్దాయికి శిక్షించిన జామీను కోరగూడదు. అతి ఎక్కువ జుల్మానాలును, క్రూరమైన శిక్షలును విధించకూడదు. సరియైనట్టియు, బహిరంగమైనట్టియు, న్యాయశాస్త్ర సమ్మతమైనట్టియు విచారణజరిగి న్యాయాధిపతివలన తీర్పు లేకుండ ఏమనుష్యునియొక్క ఆస్తికిని, స్వేచ్ఛకును, ప్రాణమునకును, భంగముకలుగకూడదు.

ప్రభుత్వమువారు ఏపౌరునిఆస్తిని తీసికున్నను దానికి సరియైనఖరీదు ఆపౌరునికిచ్చి తీరవలెను. ఈవిధముగా పౌరుల యొక్క స్వేచ్ఛను కాపాడునిబంధనలు సంయుక్తరాష్ట్రముల యొక్క రాజ్యాంగవిధానములో చేర్చబడినవి. ఇందువలన ఏపౌరునైనను జైలులో పెట్టవలెనన్నను ఒక న్యాయస్థానములో న్యాయశాస్త్రప్రకారము బహిరంగమైన జూరీతో కూడినవిచారణజరిగి నేరస్థుడని శిక్ష విధింపబడవలెను. అంతేకాని అధ్యక్షుడుగాని కార్యనిర్వాహకవర్గమునకు చెందినఏయుద్యోగస్థుడుగాని పౌరులను నేరముచేసినట్లు అనుమానముమీద

పట్టుకొనిపోవుటకును, జైలులో నుంచుటకును, మరియే శిక్ష విధించుటకును ఎట్టి సావకాశమును లేదు. హిందూదేశములో కొన్ని రెగ్యులేషనుల క్రింద విచారణ లేకుండ పట్టి అనుమానము మీద కార్యనిర్వాహక వర్గమునకు జెందిన అధికారులు మనుష్యులను పట్టుకొనిపోయి జైళ్లలోగాని, యితర నిర్బంధవాసములలోగాని ఉంచుట తటస్థించుచున్నది. దేశబాంధవ లాలాలజపతిరాయిగారిని అట్టి రెగ్యులేషను క్రిందనే మాండలే కోటలో నిర్బంధావాసము చేయించియున్నారు. ఇప్పుడు బంగాళములోని కొందరు ప్రముఖులను విచారణ లేకుండ పట్టుకొని జైళ్లలో పెట్టియున్నారు. ప్రభుత్వము వారి యిష్టమువచ్చినంతకాలము వీరిని జైళ్లలో నుంచవచ్చును. ఏ నేరమునకై వారిని పట్టుకొన్నది, వారికి వ్యతిరేకముగా ఏమి సాక్ష్యమున్నది, వారికి తెలుపనక్కరలేదు. విచారణ చేయ నక్కరలేదు. ఇట్టి నిరంకుశ చర్యలు యేమియు జరుగకుండుటకై అమెరికా రాజ్యాంగవిధానములో పైన చెప్పబడిన నిబంధనలు చేర్చబడినవి.

6. రాజ్యాంగవిధానములో కొన్ని పౌరహక్కులు మాత్రమే స్పష్టముగా చెప్పబడియున్నందున పౌరులకుగల యితరహక్కులను తీసివేసినట్లుగా భావించకూడదని కూడ మరియొక సవరణ చేర్చబడినది.

7. సంయుక్తరాష్ట్రములలోను వాటిపాలనలోని

యితర ప్రదేశములలోను బానిసత్వముగాని నిర్బంధముగు నౌకరిగాని ఉండకూడదని మరియొక సవరణ చేయబడినది.

8. సంయుక్తరాష్ట్రములలో పుట్టినట్టియు లేక పౌరులుగా చేయబడినట్టియు అంగరుమనుష్యులకును సమానమైన హక్కు బాధ్యతలుగలవు. సంయుక్తరాష్ట్రముల చట్టములు అందరిని సమానముగా సంరక్షించును. సంయుక్తరాష్ట్రములలోగాని వాటిలోచేరిన ఏ రాష్ట్రములోగాని జాతి, రంగు, యిదివరకు బానిసగా ఉండిన కారణము ఈ హేతువులలో దేనిచేతను వోటుచేయు అధికారము (ఎన్నికలలో పాల్గొను నధికారము) తీసివేయరాదు అనికూడ మరియొక సవరణ గావించబడెను.

ప్రజలదే రాజ్యము

సంయుక్తరాష్ట్రములు స్వతంత్రదేశము. ఆ ప్రభుత్వము ఆ ప్రజల లాభముకొరకై ప్రజాప్రతినిధులచే చేయబడుచున్నది. కావున ఆ దేశ ప్రభుత్వమునకు ఆ దేశ ప్రజల ఆర్థిక, నైతిక, విద్యావిషయక, సాంఘిక అభివృద్ధి తప్ప వేరు ఉద్దేశ్యము లేదు. స్వపరిపాలనము క్రింద ఆ దేశము అత్యాశ్చర్యకరముగా వృద్ధిచెందుచున్నది. ఆ దేశపు పౌరులు తమ దేశములో నేగాక ప్రపంచములో ప్రతిచోటను మిగుల గౌరవముగ చూడబడుచున్నారు. విదేశములలో నెచటనైనను ఆ దేశపు పౌరులలో ఎవరికైనను ఎట్టి అవమానము జరిగి

పను వెంటనే ఆదేశప్రభుత్వమువారు తగినచర్యతీసుకొని పరిష్కారము చేసెదరు. ఆదేశముయొక్క ప్రతిపౌరునికి ప్రపంచములో నెచటసంచరించినను తనయొక్క జాతీయపతాకము తనను సంరక్షించునని సంపూర్ణవిశ్వాసము గలదు.

---

# అమెరికా సంయుక్త రాష్ట్రములు.

## నీగ్రోబానిసత్వము.

### పదకొండవ అధ్యాయము.

(1)

నీగ్రోబానిసత్వము

ఆఫ్రికా ఖండవాసులగు నీగ్రోలు నల్లనివారు. వీరిని వేనకు వేలుగ యూరపుఖండ వాసులగు తెల్లవారు బలవంతముగనో మోసముచేసియో బానిసలుగ పట్టుకొని తీసుకొనివచ్చి అమెరికాఖండములో తెల్లవారికి అమ్ముచుండెడివారు. ఒకప్పుడు అమెరికాలోని తెల్లవారే ఆఫ్రికాకుపోయి నీగ్రోలను పట్టుకొని తెచ్చుచుండెడివారు. నీగ్రోబానిసవ్వ వ్యాపారమువలన యూరపు అమెరికా ఖండములలోని తెల్లజాతులవారికి విశేషమగు లాభమువచ్చుచుండెడిది. అమెరికా ఆఫ్రికాఖండములు యూరపు జాతులవారిచే కనిపెట్టబడినప్పటి నుండియు నీగ్రోబానిసవ్యాపారము చేయబడినది. ఇంగ్లాండు దేశమును ఎలిజబెత్తురాణి పాలిం-

చున్న కాలమున సర్ జాన్ హాకిన్సుగారు ఆఫ్రికానుండి నీగ్రోలను బానిసలుగా పట్టి తెచ్చుటను ప్రారంభించెను. అమెరికాఖండములోని హిస్పానియో యందు నివసించుచున్న తెల్లవారు నీగ్రోబానిసలను విశేషముగా కొనుచుండిరని విని ఆయన 1562 వ సంవత్సరమున నీగ్రోబానిస వ్యాపారము వలన విశేషధనము సంపాదించవలెనని కృతనిశ్చయుడై ఆఫ్రికా ఖండములోని సియారాలియోన్ తీరమునకు పోయి అచట కొంతకాలముండి కొంతవరకు కత్తులుతుపాకులు మొదలగు ఆయుధముల సహాయమువలనను కొంతవరకు ఇతర సాధనములవలనను మూడువందల నీగ్రోలను బానిసలుగా పట్టుకొని పోయి హిస్పానియోలో విక్రయించి విశేష లాభమును గడించెను. మరుసటి సంవత్సరము లీసెస్టరుప్రభువు పెంబ్రోకు ప్రభువు మొదలగు రాజబంధువుల సహాయమున నీగ్రోబానిసవ్యాపారమునకై యొక సంఘమును స్థాపించి నీగ్రోలను తెచ్చుటకు అయిదుపడవలను ఆఫ్రికాఖండమునకు గొనిపోయెను. ఈ బందిపోటుదొంగ నరహంతకుడు" కేపువర్డికి పోయి అచటి కాపరస్థులు మిగులసాధువులుగను మర్యాదస్థులుగను ఉండుట చూచి వారినెట్లయిన పట్టుకొని పోవలెనని యత్నించెనుగాని వారీయనకు చిక్కలేదు. తరువాత రియోగ్రాండి తీరమునకు తనమనుష్యులతో కూడ పోయి ప్రతిదినమును అచటి గ్రామములను తగులబెట్టుచు పారిపోవుచున్న కాపరస్థులను బానిసలుగా పట్టుకొనుచువచ్చెను. వారిని అమెరికాలోని స్పైన్ వారికమ్మి చాలసొమ్మును తెచ్చెను. ఈధీరుని ఆంగ్లేయజాతియు ఆంగ్లేయరాణి ఎలిజబెత్తును చాల గౌరవించిరి. రాణి ఆయనకు

చిరుసముల నొసంగెను. ఈయన చేయుచున్న గౌరవనీయ మైన వ్యాపారములో రాణికికూడ భాగముండెను.

తరువాతరాజులుగవచ్చిన మొదటిజేమ్సు మొదటిఛార్లెసు రెండవఛార్లెసు రాజుల కాలమున ఆంగ్లేయదేశములోని బానిసవ్యాపారులు విశేషముగ ప్రోత్సాహము పొందిరి. రాజబంధువుడగు యార్కు ప్రభువొక బానిస వ్యాపారసంఘమున కధ్యక్షుడుగనుండెను. కొంతకాలమువరకు నీగ్రోబానిస వ్యాపారము కొన్ని ప్రత్యేకసంఘముల చేతులలో నుండెను. గాని విలియంరాజు సంఘముల ప్రత్యేకహక్కులురద్దు పరచి ఆంగ్లేయులందరును నీగ్రోబానిస వ్యాపారము చేయవచ్చునని శాసించెను ఆంగ్లేయవ్యాపారులు ప్రతిసంవత్సరమును ఆఫ్రికాలోని నీగ్రోబానిసలను వేలకువేలుగ పట్టుకొనుచుండెడివారు అమెరికాలోని ఆంగ్లేయ వలసరాజ్యములలోనికి 1680 మొదలు 1786 సంవత్సరము వరకు దిగుమతి అయిన నీగ్రోబానిసలసంఖ్య ఇరువదిమొక్కలక్ష ముప్పదివేలు. 1713 సంవత్సరమున ఉట్రెక్టువద్ద ఇంగ్లాండునకును స్పెయినుకును జరిగినసంధిలో ప్రతిఫలముగ పశ్చిమ యిండియా ద్వీపములలోని స్పెయిను వారికి ఆంగ్లేయప్రభుత్వము వారు నాలుగువేల ఎనిమిదినందలమంది నీగ్రోబానిసల చొప్పున ముప్పదిసంవత్సరములకాలము తెచ్చి యిచ్చునట్లును కొంతసొమ్మునకు స్పెయిను వారు ఆంగ్లేయులకిచ్చునట్లును ఒడంబడికచేసుకొనిరి. ఒక్క ఆంగ్లేయులేగాక యూరపుజాతులన్నియుండరును నీగ్రోబానిస వ్యాపారమును చేయుచుండిరి. వారుకొరకై ఆఫ్రికాఖండతీరములలో గిడ్డంగులను (factories) కట్టుకొనిరి. 1791 వ సంవత్సరమున ఆఫ్రికాతీరము

అరోగల నలుబది గిడ్డంగులలో పదునాలుగు ఆంగ్లేయులవి పదునేను డచ్చివారివి మూడుఫరాసులవి నాలుగుపోర్చుగీసువారివి నాలుగు డేనులవి. 1790 వ సంవత్సరమున ఆంగ్లేయులు రవానాచేసిన నీగ్రోబానిసల సంఖ్యముప్పది ఎనిమిది వేలు. ఫరాసువారు చేసినవారు ఇరువదివేలు. డచ్చివారు చేసినదినాలుగువేలు. డేనులుఎగుమతిచేసినది రెండువేలు. పోర్చుగీసువారు ఎగుమతిచేసినసంఖ్య పదివేలుఅయ్యుండెను. బానిసత్వపు చరిత్రనువ్రాసిన గ్రంథకర్త ఇటుల వ్రాసియున్నాడు. "ఉత్తరఆఫ్రికాటర్కీ మొదలగుదేశములలో మహమ్మదీయుల కొరకు బానిసలనుఅమ్ముపద్ధతిఅదివరకుగూడకొంతవరకుగలదు. కాని తెల్లజాతులవారిమితిలేని దురాశవలనను దుండగములవలననుమానవులను వేటాడిదొంగిలించిబానిసలుగచేయుపద్ధతిఅతివిశేషముగ వృద్ధిచెందినది. ఏమరుపాటుగా రాత్రివేళ గ్రామములపై బడి తగులబెట్టి పారిపోవుచున్న నల్లవారిని స్త్రీలను పురుషులను పిల్లలను పట్టుకొని బానిసలుగ చేయుచుండిరి ఎదిరించినవారిని తుపాకులతో కాల్చి చంపుచుండిరి. పాపకృత్యములకు మేరయే లేదు. రాక్షసస్వభావము సంపూర్ణముగ ప్రదర్శింపబడెను." తెల్లవారవలంబించిన క్రైస్తవమతమునకును వారుచేయుచున్న అమానుష కృత్యములకును సంబంధము లేకుండెను. "అట్లు బానిసలుగ పట్టుకొనబడినవారు సముద్రతీరములోని గిడ్డంగుల వరకును అటుతరువాత సముద్రములమీద పడవలలో అమెరికాఖండమునకును తీసుకొనిపోబడుటలో పొందిన బాధలు వర్ణనాతీతము. వారు తీసికొనపోబడిన పడవలు నరకకూపములు. బానిసల పడవల

లోవలె అంత చిన్న స్థలములో అంతవిశేషమగు దౌర్భాగ్యము మరియెచటను వినబడియుండలేదు" సర్ విలియం డోల్బెను వ్రాసినట్లు నీగ్రోలను ఒకఅంగుళమున్నర యెడయెడముగ యడుగుభాగమున నావడవలలో వరుసగ నందరిని కలిపి పరుండబెట్టి వారిచేతులను పాదములను కట్టివేసి పొడుగాటియినుపగొలుసులచే బంధించిరి. వారావిధముగ షుమారు తొమ్మిదివారములు గాలిదూరనట్టియు యిరుకైనట్టియు అనారోగ్యకరమైనట్టియు నావడవలలోయడుగుభాగమున ప్రయాణముచేయుచు మిగుల దుష్టమగు అంటువ్యాధులకు లోనైరి. వారి శరీరములు కుళ్లుచుండెను. అప్పుడప్పుడు వారిని పరీక్షచేయుటకు వచ్చినవారు చనిపోయినవారి శవములను ఆపగనలోనుండి గొలుసులూడదీసి యెత్తిపారవేయుచుండిరి. అట్లు ఎత్తిపారవేయు వరకును రోజులకొలది కుళ్ళి వాసనకొట్టుచున్నను ఆశవములు బ్రతికియున్నవారి ప్రక్కన వారితో కలిపి బంధింపబడియే యుండెను. ఆఫ్రికాలో పట్టుకొనబడిన బానిసలలో సగముమంది మాత్రమే అమెరికాలోని దుకాణములలో అమ్మబడుటకు అర్హులుగ జీవించియుండిరి.

బానిసల దౌర్భాగ్యస్థితి

పందొమ్మిదవ శతాబ్ద ప్రారంభమునకు బ్రెజీలులో ఇరువదిలక్షలబానిసలును అమెరికాసంయుక్త రాష్ట్రములలో తొమ్మిదిలక్షల బానిసలును ఇంగ్లాండుయొక్క పాలనము క్రిందనుండిన తక్కిన వలసరాజ్యములన్నిటిలోను ఎనిమిదిలక్షలమంది బానిసలును, స్పైన్ పోర్చుగలు రాజ్యముల వలసదేశములలో ఆరు

లక్షల బానిసలును ఫ్రాన్సుయొక్క వలసరాజ్యములలో రెండులక్షల ఏబదివేలమంది బానిసలును ఉండిరి. బానిసలు పారిపోకుండ కఠినమగు చట్టములు చేయబడెను. పారిపోయినవారిని యజమానులుతిరిగి పట్టుకొని తెచ్చుటకు విశేషముగు సౌకర్యములు చేయబడెను. బానిసలకు ఆస్తియుండ నేరదు. బానిసలకు ఆత్మలులేవనియు వారు యజమానుల లాభముకొరకు పుట్టినారనియు తెల్లవారు నమ్మిరి. బానిసలు న్యాయస్థానములలో సాక్ష్యమిచ్చుటకు అర్హులుకారు. బానిసలు యజమానుల తాలూకు ఆస్తి, కుర్చీలు బల్లలు సామానులు పశువులవంటి ఆస్తి అయియుండిరి. వారిశరీరమును యజమాను లేమిచేసినను చేయవచ్చును. బానిస స్త్రీలను మానభంగము గావించుట దోషమేకాదు. బానిసల కెంత కఠినశిక్షలు విధించినను వారిచేత ఎట్టికఠినమగు మోయ లేని బరువుగల పనిచేయించినను యజమానులను అడుగువారు లేరు. యజమానుల క్రూరత్వములవలనను యజమానుల నిర్దయ దురాశవలనను బానిసలు అతివిశేషముగా పనిచేసి విశేషముగా మరణించుచుండిరి. బానిసలజాతి అమెరికాలో స్వేచ్ఛగల జాతులవలె వృద్ధినొందుటకుమారుగా క్షీణించుచుండెను. గావున క్రొత్తబానిసలను ఏటేట వేలకువేలుగ ఆఫ్రికానుండి తెప్పించుచుండిరి. ఉత్తరఅమెరికాలో అనేక రాష్ట్రములలో బానిసలు చదువుకున్నను వారికి చదువుచెప్పినను శిక్షలువిధించు చట్టములు చేయబడెను. చదువుచెప్పిన వానికి ఆరునెలలఖైదు పదిహేనువందల రూప్యముల జరిమానాయు విధించబడుచుండెను. బానిసత్వమునకును విద్య

నేర్చుకొనుటకును విరోధమని యజమానులు గ్రహించిరి. నిరంకుశముగా పాలించు వారికి తమక్రిందనున్న జాతివారు విద్యనేర్చుకొని జ్ఞానమును పొందుట స్వభావముగా ఇష్టముండ నేరదు. కావున వీరివిద్యాభివృద్ధికై విశేషముగా తోడ్ప డరు. బానిసత్వమువలన యజమానిలో దురాశ దురాగ్రహము అధర్మబుద్ధి నిరంకుశత్వము నిర్దయ వృద్ధిచెందును. తనకు కొంచెము అవిధేయతను చూపిన సహించనేరడు. కోపమువచ్చిన కత్తితోనరుకును. తుపాకితో కాల్చును. ఏమి చేసినను అడుగువారుండరు దానికి (tyrant's mentality) నిరంకుశబుద్ధి అనిపేరు. బానిసలో పిరికితనము, అబద్ధము లాడుట యజమాని మెప్పునకై ఎట్టి నీచకార్యమునైనను చేయుట ఆత్మగౌరవము నశించుట ఆత్మవిశ్వాసము లేకుండుట మొదలగు నైచ్యగుణము లలవడును. దీనికి (Slave mentality) బానిసబుద్ధి అనిపేరు. బానిసత్వము యజమాని లోను బానిసలోను మనుష్యత్వమును నిర్మూలింపజేసి యజమానిని రాక్షసునిగను, బానిసను నీచజంతువుగను. చేయును. వ్యక్తులకేగాక జాతులకును అట్లే నిరంకుశముగ పాలించు జాతికి నిరంకుశబుద్ధియు బానిసత్వములోనున్నజాతికి బానిస బుద్ధియు ఏర్పడును.

అమెరికా స్వతంత్ర యుద్ధమువలన అమెరికాలోని తెల్లవారికిమాత్రమే స్వతంత్రము లభించినది. కాని నీగ్రోలు గాని ఎర్రయిండియనులుగాని రాజకీయ హక్కులు పొందక పోగా ఆఖరుకు బానిసత్వము నుండియైన ముక్తి చెందలేదు.

(2)

అమెరికావారి అభివృద్ధి.

అమెరికావారు స్వతంత్రమును పొందినతరువాత అలిఘనీసుపర్వతములను దాటి పశ్చిమమునమన్న దేశమునంతను ఆక్రమించుకొని వలస నేర్పరచుచుండిరి. క్రొత్తగా రాష్ట్రములనస్థాపించి వాటిని సంయుక్తరాష్ట్రములలో చేర్చుకొనచుండిరి. అచటి ఎర్రయిండియనులు నాశనముచేయబడిరి. అమెరికావారు వ్యాపించినకొలదియు ఎర్రయిండియనులుఅదృశ్యులైపోయిరి. తిరిగి మానవులకంటికి కనపడలేదు. వారి సేద్యభూములు తోటలు, గనులు, అడవులు అమెరికనులకు శాశ్వతముగా వశమయ్యెను. అతిత్వరితముగా అమెరికనుల ఐశ్వర్యమును జనసంఖ్యయు పెరిగెను. యూరపుఖండమునుండియు క్రొత్తవారు అమెరికాకువచ్చి చేరుచుండిరి. ఐర్లాండు దేశీయులు చాలమంది తమదేశములో ప్రబలియున్న క్షామబాధ సహించలేకను పైగా ఆంగ్లేయప్రభుత్వమువారు పెట్టుచున్న నిర్బంధములకు కఠినశాసన ప్రయోగములకు తాళజాలకను అమెరికాకు కాపురమునకు వచ్చిరి. ఎప్పటికైన అమెరికానుండి తమ మాతృదేశమగు ఐర్లాండుయొక్క స్వతంత్రముకొరకై ఆంగ్లేయులతో పోరాడవలెననియే వీరు తయారగుచుండిరి. 1848 వ సంవత్సరమున జర్మనీలోని ప్రజలు స్వతంత్రమునకై చేసిన ప్రయత్నములు విఫలమైనందున తమరాజుచేత నిర్బంధములు పడలేక చాలమంది జర్మనులు అమెరికాకు కాపురమునకువచ్చిరి. కాపురమునకు వచ్చినవారు ఆంగ్లేయులైనను

ఫ్రెంచివారైనను జర్మనులైనను ఐర్లాండు దేశీయులైనను అంద రును అమెరికనులైరి. వీరందరి హృదయములలోను తమ మాతృదేశమగు అమెరికా సంయుక్త రాష్ట్రములయందు సంపూర్ణ మగు దేశాభిమానమును అమెరికా పొందుచున్న అత్యాశ్చర్యకర మగు ఐశ్వర్యాభివృద్ధియందు స్వభావమగు గర్వమును ప్రజ్వ రిల్లుచుండెను. స్వతంత్ర యుద్ధమునాటికి పదమూడు రాష్ట్ర ములుండెను. 1860 వ సంవత్సరమునాటికి ముప్పదిమూడు రాష్ట్రములేర్పడెను. మరియు మూడుకోట్ల పదిలక్షల ప్రజ లుండిరి.

బానిసత్వమును గూర్చి భేదాభిప్రాయములు.

కాని ఉత్తర రాష్ట్రములవారికిని దక్షిణ రాష్ట్రముల వారికిని బానిసత్వమును గూర్చిన భేదాభి ప్రాయములు దినదినమునకు వృద్ధియై తీవ్ర రూపము దాల్చుచుండెను. ఉత్తరరాష్ట్రము లలో తెల్లవారే స్వయముగా పరిశ్రమలు వర్తకవ్యాపారములు వ్యవసాయము మొదలగు పనులన్నియు చేసుకొనిరి. తామాక్రమించిన ప్రదేశములలోని ఎఱ్ఱయిండి యనులు దొరికినచో నాశనముచేయుటయు లేదా తరిమి వేయుటయు మాత్రమేచేసిరి. కాని బానిసలుగ చేసికొన లేదు. క్రమముగా తమక్రిందనున్న నీగ్రో బానిసల కందర కును స్వేచ్ఛనిచ్చిరి. దక్షిణరాష్ట్రములవారు ప్రత్తిమొదలగు పంటల వ్యవసాయము నిమిత్తమును తోటలువేయు నిమిత్త మును ఆఫ్రికాఖండమునుండి నీగ్రోలను బానిసలుగ దిగుమతి చేసికొనిరి. వేలకువేల బానిసలను ప్రతిసంవత్సరమును

తెచ్చుకొనుచుండిరి. 1789వ సంవత్సరమున పదమూడు సంయుక్తరాష్ట్రములకును రాజ్యాంగవిధానము వ్రాసికొనినపుడు బానిసత్వము అశాస్త్రీయమని దానిలో వ్రాయవలెనని యే కొందరు ప్రముఖులుద్దేశించిరి. కాని దక్షిణరాష్ట్రములు చీలిపోవునని భయమువలన బానిసత్వమును గూర్చిన ప్రస్తావనను పూర్తిగా విడిచిపెట్టిరి. అందువలన ప్రతిరాష్ట్రమును బానిసత్వము విషయమున తన ఇచ్చవచ్చినటుల ప్రవర్తించెను. ఉత్తరరాష్ట్రములు పరిశ్రమల కాకరములు. బానిసలను తెచ్చినచో సామాన్యులగు తెల్లవారికి జీవనములో పోటీయేర్పడును సొమ్ముపుచ్చుకొను కార్మికులు పనిచేసినటుల ఊరికె నిర్బంధముగ పనిచేయు బానిసలు పని చెయ్యరు. అందువలన క్రమముగా ఉత్తరరాష్ట్రములన్నియు బానిసత్వమునకు విముఖులై బానిసత్వ మశాస్త్రీయమని శాసించెను. దక్షిణరాష్ట్రములు వ్యవసాయమున కునికిపట్టులు. విశేషముగు భూములుగల గొప్ప తెల్ల భూఖామందులతో నిండియుండెను. వీరు బానిసలచే వ్యవసాయము చేయించుకొనిరి. బానిసత్వము న్యాయమైనదని అంగీకరించిరి.

బానిసత్వమును రూపు మాపవలెనను ఆందోళనము.

పందొమ్మిదవ శతాబ్దములో యూరపు ఖండమున బానిసత్వమును రూపు మాపవలెనను గొప్ప ఆందోళనము బయలుదేరెను. ఈ ఆందోళనము అమెరికాకును వ్యాపించెను. ప్రారంభములో చాలా సంవత్సరముల వరకును సంయుక్త రాష్ట్రముల ప్రభుత్వములో దక్షిణ రాష్ట్రముల

వారికి యెక్కువ పలుకుబడి యుండెను. బానిసత్వము పోవునను భీతివలన కూడ దక్షిణ రాష్ట్రముల ప్రతినిధు లందరును యేకమై ఒకేవిధమున సమ్మతుల నిచ్చుచుండిరి. దక్షిణ రాష్ట్రముల ప్రతినిధులమాట యెక్కువ చెల్లుబడి యగుచుండెను. 1831 వ సంవత్సరమున యూరపు ఖండమున రైలు యంత్రము కనిపెట్టబడి మొదటి రైలువే (ధూమ శకటము) వేయబడెను. 1835 వ సంవత్సరమున తంతివార్త (టెలిగ్రఫు) యూరపు ఖండమున ప్రథమమున కనిపెట్టబడినది. 1819 వ సంవత్సరముననే మొదటి పొగయోడ (స్టీమరు) అమెరికా నుండి బయలుదేరెను. 1840 వ సంవత్సర ప్రాంతముల రైలువేలు (ధూమ శకటములు) విశేషముగ వేయబడియు యంత్రశాలలు స్థాపించబడియు అమెరికాలోని ఉత్తర రాష్ట్రములలో నైక్యతకును విశేషమగు సంపదకును కారణమయ్యెను. ఉత్తర రాష్ట్రములు దక్షిణ రాష్ట్రములతో పోటీ బడుటకును మించుటకును సర్వవిధముల తగియుండిరి. బానిసత్వమును అమెరికా సంయుక్త రాష్ట్రము లన్నిటిలోను సంపూర్ణముగ రద్దు పరచవలెనను కక్షి యొకటి ఉత్తరమున బయలుదేరెను.

మానవులను బానిసలుగ చేయుట యేసుక్రీస్తు ప్రభువు యొక్క సిద్ధాంతము లకు వ్యతిరేకమని ఆందోళనము చేయబడినది. బానిసత్వమును రూపు మాపుటకై సంఘములు స్థాపించబడెను. తెల్లవారగు అమెరికనులును స్వేచ్ఛను పొందిన బానిసలును ఇందు సభ్యులుగ చేరిరి. నీగ్రోలలో విద్యా వ్యాపకము

చేయబడెను. అనేక పాఠశాలలును కొన్ని కళాశాలలును కూడ స్థాపించబడెను. అమెరికనులు మిగుల ఉదార హృదయులై విశేషమగు ధనసహాయము చేసిరి. దక్షిణ రాష్ట్రములనుండి బానిసలగు నీగ్రోలను దొంగతనముగ ఉత్తర రాష్ట్రములకు తెచ్చి యిచట స్వేచ్ఛ నిచ్చుటకు గొప్ప యేర్పాటులు చేయబడెను. బానిస యిచట అడుగు పెట్టినతోడనే స్వేచ్ఛను పొందును. పారిపోయి వచ్చినవారిని తిరిగి యజమానులు పట్టుకొని పోవుటకు వీలులేకుండ శాసనములను చేసిరి. 1860 వ సంవత్సరము నాటికి ఉత్తర రాష్ట్రములలో నాలుగు లక్షలమంది స్వేచ్ఛనుపొందిన నీగ్రోలుండిరి. నీగ్రోలను విముక్తిచేయుట కేర్పడిన సంఘములవారు దక్షిణరాష్ట్రములనుండి బానిసలను బహువిధములగు పద్ధతులచే నెత్తుకొని వచ్చిరి. ఒక్కొకప్పుడు పత్తిక సరుకులతో పాటు బానిసలను పెట్టెలలోపెట్టి రైళ్ళమీదను స్టీమరులమీదను పంపిరి. ఇచట చేరగానే పెట్టెలను మిగుల ఆత్రతతో తెరచి లోపలివారిని బయటకు తీయుచుండిరి. 1857 వ సంవత్సరమున నొక నీగ్రోయువతిని బాల్టిమోరునుండి ఒక సామాను పెట్టెలోపెట్టి ఫిలడల్ఫియాకు పడవమీద రవానా చేసిరి. ఈపెట్టె త్రోవలో ఒకటి రెండుసార్లు తలక్రిందు చేయబడెను. ఫిలడల్ఫియా చేరినతరువాత ఒక రాత్రియంతయు నాపెట్టె తెరువబడలేదు. మరునాడుదయము పది గంటల వరకును ఆపెట్టెలో పిల్లయున్నటుల తెలియదు. అప్పుడు తెరచి లోపలనుండిన యా యువతిని బయటకు తీయగా ఆమె స్పృహతప్పి యుండెను. కొంత వైద్యచికిత్స చేసిన

తరువాత భగవదనుగ్రహామువలన ఆమె స్వస్థతను స్వేఛ్ఛను పొందెను. అనేకమారులు స్త్రీలు పురుష వేషములు ధరించియు పురుషులు స్త్రీ వేషములను ధరించియు పారిపోవు చుండిరి. తరుచుగా స్వేచ్ఛావంతముగు రాష్ట్రము ను చేరుటకై అరణ్యములగుండను కొండలగుండను వందల కొలది మైళ్లు నడచుచుండిరి. దక్షిణరాష్ట్రములవారు మిగుల పట్టుదలతో బానిసవ్యాపారమును స్థిరపరచుటకై పనిచేసిరి. బానిసలమీాద నెక్కువ కఠినపద్ధతులను ప్రయోగించిరి. వారికి సహాయము చేయు వారిని కఠినముగ శిక్షించిరి. ముగ్గురుబానిసలను ఉత్తర రాష్ట్రములకు రవానాచేసిన శామ్యుయలుస్మిత్తును పట్టుకొని రాష్ట్రప్రభుత్వమువారు విచారించి ఎనిమిది సంవత్సరముల కఠినఖైదు వేసిరి. బానిసలలో రహస్యసంఘము లేర్పడెను. అక్కడక్కడ స్వతంత్రములకై బానిసలు తిరుగబాటుచేసిరి. ఆతిరుగబాటులను ప్రభుత్వమువారు మిగుల ఘోరమగు పద్ధతులచే నణచిరి. తప్పించుకొని పోవుటకు రహస్య సంఘములో చేరినటుల తెలిసినచో బానిసను క్రూరవధ గావించిరి. గాని స్వేచ్ఛను పొందుటకు కోరికయు పట్టుదలయు బానిసలలో హెచ్చెను. ఏమాత్ర మవకాశమున్నను స్వతంత్రమును పొందగోరుట మానవస్వభావము. దక్షిణరాష్ట్రములలోగూడ బానిస వ్యాపారమువలన తెల్లవారిలో గొప్ప భూఖామందులకు మాత్రమే లాభముగాని బీదస్థితిలోనున్న చిన్నవ్యవసాయికులను కార్మికులునగు తెల్లవారికి బానిసత్వ వలన నష్టమే కలుగుచుండెను. బానిసలు లేకుండిన వీ

కూలి పుచ్చుకొని పనిచేసియుందురు. వీరి జీవనాధారము నకు బానిసలు పోటీగానుండిరి. గాని వీరికిగూడ నల్లవాడగు నీగ్రోపుట్టుకవలన తక్కువవాడనియు బానిసత్వము వారి స్వభావస్థితియనియు నమ్మకయుండెను. తమకు కొంచెము స్థితిపట్టినచో ఒకరిద్దరు నల్లవారిని బానిసలుగకొని పనిచేయించుటకు వీరికిని ఎట్టిఅభ్యంతరము లేకుండెను. దక్షిణ రాష్ట్రములలోని శాసనసభలలో స్వభావముగా గొప్ప భూఖామందులకే పలుకుబడియుండి బానిసవ్యాపారమున కనుకూలమగు చట్టములను చేయుచు దానిపక్షమున ఆందోళనచేయుచుండిరి. ఉత్తరమున బానిసవృత్తికి వ్యతిరేకముగ ఆందోళనము దృఢపడిన కొలదియు క్రమముగా దక్షిణమునగూడ తెల్లవారిలో సామాన్యజనములోను మతగురువులలోను కొందరికి బానిసత్వము ఈశ్వరునికి వ్యతిరేకమను అభిప్రాయములు కలిగి ఆట్టివారు బానిసలు తప్పించుకొనిపోవుటకై సహాయపడుచుండిరి.

దక్షిణ రాష్ట్రములలో చేరిన వర్జీనియా రాష్ట్రనివాసియగు జాన్ బ్రౌను అను తెల్లవాడు మిగులయోగ్యుడు. దైవభక్తిగలవాడు. బానిసలను యజమానులుపెట్టు బాధలు చూడలేక చిన్నతనమునుండియు బానిసత్వమునందత్యంతమగు అసహ్యమును కలిగియుండెను. బానిసత్వమును గూర్చి ప్రమాణపత్రమును కక్షిలో చేరెను. చాలమంది బానిసలు తప్పించుకొనిపోవుటకై సహాయము చేయుచుండెను. బానిసలలో స్వేచ్ఛను పొందుటకై ఆత్మవిశ్వాసమును స్వయంకృషిని పురిగొలిపెను. 1౮౫౯వ సంవత్సరమున ఆయనయును

ఇరువదియిద్దరు నీగ్రోలునుకలిసి వర్జీనియాలోని బానిసల నందరను స్వతంత్రవంతులుగ చేయవలెనని కుట్రలుపన్నిరి. అవసరమైనచో ఆత్మసంరక్షణకొరకు కొన్ని ఆయుధములను కూడ సేకరించిరి. 16 వ అక్టోబరు తేదీన వర్జీనియా రాష్ట్ర ప్రభుత్వమువారు సేనలనుబంపి ఈయనయున్న గ్రామమును ముట్టడించి ఈయనను గొనిపోయిరి. ఈయనను ఈయన యొక్క నలుగురు కుమాళ్ళను ప్రభుత్వమువారు విచారించి ప్రభుత్వవిద్రోహులని తీర్మానించి డిశంబరు రెండవ తేదీన ఉరితీసిరి.

ఇట్టి పరిస్థితులేర్పడి బానిసత్వమునుగూర్చి తీవ్రముగ రెండు కక్షలేర్పడియున్న సమయమున 1860 వ సంవత్సరమున అమెరికా సంయుక్త రాష్ట్రముల కాంగ్రెసు (శాసన సభ)కు ఎన్నికలువచ్చెను. అమెరికా సంయుక్తరాష్ట్రములలో సంపూర్ణముగ బానిసత్వము నిర్మూలము కావలెనా లేదాయను సమస్యమీదనే ఎన్నికలు జరిగెను. సృష్టిలో మానవులు సమానలుగ పుట్టినారను సిద్ధాంతము కల్పితమనియు ఈశ్వరుడే కొందరిని ఎక్కువవారిగను కొందరిని తక్కువవారిగను పుట్టించినాడనియు ఎక్కువవారికి తక్కువవారు కొలువవలెననియు బానిసత్వము ఈశ్వర నిర్మితమైనదనియు దక్షిణపువారు వాదించిరి. వారు విశేష ద్రవ్యము ఖర్చుపెట్టిరి గొప్ప ఆందోళనముచేసిరి. నల్లవాడు కూడ తక్కిన మనుష్యులవలెనే పుట్టినాడనియు అతనికిని ఆత్మ బుద్ధి, మనస్సాక్షి, తెలివితేటలుగలవనియు వానిని నిర్బంధించి వానిబుద్ధిని, ఆత్మను వికసింపకుండునట్లు అణచివేయుట పాప

కృత్యమనియు బానిసత్వమునకు వ్యతిరేకులగు ఉత్తరాది కక్షవారు ఆందోళనమును చేసిరి. మానవ స్వాతంత్ర్యమునకై ప్రాణములర్పించిన ధీరుఁడగు జాన్‌బ్రౌను యొక్కయు ఆతని నలుగురు కుమారుల యొక్కయు, ఆకారములు ఓట్లనిచ్చు ప్రజలయొక్క దృష్టిలో కనబడుచుండెను. 1860 వ సంవత్సరము నవంబరు నెలలో శాసనసభల ఎన్నికలు పూర్తి అయ్యెను. బానిసత్వమును సంపూర్ణముగా రద్దుపర్చవలెనను కక్షికిచెందినవారే అధికసంఖ్యాకులుగ ఎన్నుకొనబడిరి. ఆకక్షికి నాయకుడగు అబ్రహాం లింకను అమెరికా సంయుక్త రాష్ట్రములకు అధ్యక్షుడుగ నెన్నుకొనబడెను. లోకములోని దీనులకొరకును దౌర్భాగ్యులకొరకును పశ్చాత్తాపము నొందు పాపులకొరకును సిలువమీద ఘోర మరణము నొందిన యేసుక్రీస్తు ప్రభువుయొక్క బోధలకు జయము కలిగెను.

దక్షిణరాష్ట్రముల తిరుగబాటు.

ఇందుమీద కొన్ని దక్షిణరాష్ట్రములలోపుట్టిన క్రోధమునకు మేరలేదు. 1860 వ సంవత్సరము డిశంబరు నెల 17 వ తేదిన దక్షిణ రాష్ట్రములలోచేరిన దక్షిణ కారోలీనా రాష్ట్రము వారు సంయుక్త రాష్ట్ర ప్రభుత్వము బానిసత్వమును రద్దుపర్చుటకు బద్ధకంకణులై యున్నది గావున తాము సంయుక్తరాష్ట్రములలోనుంచి చీలిపోయి స్వతంత్రమును స్థాపించుకొనినామని ప్రకటించుచు బానిసత్వము నంగీకరించు తక్కిన రాష్ట్రములవారును తమవలెనే స్వతంత్రమును ప్రకటించవలెనని కోరిరి. కాని వెంటనే దక్షిణరాష్ట్రములన్నియు సం

యుక్త ప్రభుత్వమునుండి చీలుటకు సమ్మతించలేదు. కొన్ని రాష్ట్రములలో బానిసత్వమునందెంత ప్రేమగలదో సంయుక్త ప్రభుత్వపద్ధతి యందుకూడ నంతప్రేమగలదు. 1861 వ సంవత్సరము ఫిబ్రవరి 1 వ తేదీవరకు ఆరురాష్ట్రములవారు దక్షిణ కారోలీనా రాష్ట్రమువారి మార్గము ననుసరించి సంయుక్త ప్రభుత్వమునుండి చీలుటకు తీర్మానించిరి. ఇంకను నాలుగు రాష్ట్రములవారు బానిసత్వమునందు ప్రేమయున్నను సందేహ మనస్కులై నిరీక్షించుచుండిరి.

విడిపోయిన రాష్ట్రములు.

1861 వ సంవత్సరము ఫిబ్రవరి నెల 4 వ తేదీన విడిపోయిన ఏడురాష్ట్రముల ప్రతినిధులును మాంగొమరీ పట్టణమున సమావేశమై యొక సంయుక్త రాజ్యాంగ విధానము నేర్పరచుకొనిరి. ఈనూతన ప్రజాస్వామ్యమునకు పునాది బానిసవ్యాపారము. అమెరికాఖండమున బానిసలు కావలసిన తెల్లవారందరును ఇందు చేరవచ్చునని ప్రకటించబడెను. "నల్లవాడగు నీగ్రో తెల్లవానికన్న తక్కువ వాడనియు అతని స్వభావముగు స్థితి బానిసత్వమనియు నను గొప్పసత్యమే ఈ నూతన ప్రజాస్వామ్యమునకు పునాదిరాయి" యని ఉపాధ్యాక్షుడగు వెన్సగారు చెప్పిరి. మిసిసిపీ ప్రాంతకాపరస్థులగు జెఫర్సను డేవిసు నూతన సంయుక్త ప్రభుత్వమున కధ్యక్షుడుగ నెన్నుకొనబడెను. ఫిబ్రవరి నెల 18 వ తేదీనుండియు నీప్రభుత్వము సాగించబడెను. త్వరగ నావికాదళము, సైన్యము, బొక్కసము, న్యాయవిచారణాశాఖ, తంతి, టపాలా, మొదలగు

సవన్నియు అమర్చుకోబడెను. ప్రతిశాసికిని బానిసలను ఆస్తిగా నుంచుకొను హక్కుగలదని శాసించబడెను.

యుద్ధము. (కాంగ్రెసు) శాసనసభలు ఎన్నికలకై అభ్యర్థులు ప్రయత్నము చేయుచున్నప్పుడే, ఎక్కువ మంది బానిసత్వమునకు వ్యతిరేకు లగువారు ఎన్నుకొనబడినచో తాము విడిపోదుమని దక్షిణరాష్ట్రములలో చాలమంది బెదరించుచుండిరి. కాని నిజముగా నీరాష్ట్రములు విడిపోవునని ఉత్తరమునందున్న ప్రముఖులు తలచలేదు. దక్షిణ కారొలీనా బెదిరించినను బుజ్జగించగనే తిరిగివచ్చి చేరునని మాత్రమే తలచిరి. ఇన్ని రాష్ట్రము లొకటిగా చేరునని తలచలేదు. బానిసత్వము కూడదనువారు తమ యభిప్రాయములను దక్షిణ రాష్ట్రములమీద బలవంతముగా అంటకట్టుట సరికాదని శాసనసభలోని యొక కక్షివారు వాదించసాగిరి. మూడునెలలకాలము కాంగ్రెసువారు రాజీనామా ప్రయత్నములలో నిమగ్నులై యుండిరి. కాని రాజీనామా కుదరలేదు. తమను శాంతముగా విడిపోనిచ్చెదరనియు కాంగ్రెసువారుగాని క్రొత్తఅధ్యక్షుడుగాని తమజోలికి రారనియు దక్షిణాదివారు తలచిరి. మార్చి 4 వ తేదీన అబ్రహాము లింకను (ప్రెసిడెంటు) అధ్యక్షపదవిని స్వీకరించెను. బానిసల యజమానులగు తెల్లవారు ఆయనను హత్యచేయుదురనియు అధ్యక్షపదవిని స్వీకరింప నివ్వరనియు వదంతులు ప్రబలెనుగాని అట్టిది సంభవించలేదు. ఆయన ప్రథమము నుంచియు "బానిసత్వము అక్రమమైనదనియు, సగము స్వేచ్ఛావంతముగను సగము బానిసత్వములోను ప్రభుత్వము శాశ్వ

తముగనుండుట అసంభవమనియు, సంయుక్త రాష్ట్రముల
ప్రభుత్వము బెదిరింపులతో కూలిపోదనియు
యెవరికిని చీలిపోవుటకు హక్కు లేదనియు,"
చెప్పుచుండెను. ఆయన అధ్యక్ష పదవిని స్వీకరించు దిన
మున నెట్టి యాటంకములు కలుగకుండ స్కాటు సేనాని
సైన్యములతో ముఖ్య పట్టణమును కాచుచుండెను. కొంత
కాల మాయన తగిన నూతన యుద్యోగస్తుల నేర్పరచు కొను
టలో గడపవలసి వచ్చెను. మొదటనే బానిసత్వమును రద్దు
పరచుటకొరకై తాను యుద్ధము చేసెదనని ప్రకటించలేదు.
కాని తాను విడచిపోదలచిన రాష్ట్రములను బలవంతపర్చి సం
యుక్త రాష్ట్రముల ప్రభుత్వముక్రింద నుంచెదననియు నిందు
కవసరమైనచో యుద్ధమును చేసెదననియు చెప్పెను. ఎట్లయినను
ఉభయపక్షముల వారును పోరుటకు తయారగుచుండిరి. తిరుగ
బాటుదారులే యుద్ధమును ప్రారంభించినవారైరి. దక్షిణ
కారొలీనా రాష్ట్రములోని కొన్ని కోటలను సంయుక్త రాష్ట్ర
ముల ప్రభుత్వమువారు స్వాధీనమందుంచుకొనియున్నందున
వాటిని వెంటనే తమకు స్వాధీనపరచవలసినదని యా సేనాధి
పతిని దక్షిణకారొలీనా వారుగోరిరి. సేనాధిపతి తిరస్కరిం
చెను. దక్షిణకారొలీనావారు సైన్యములనుబంపి ముట్టడించి
యాకోటలను స్వాధీనమునుపొందిరి. ఇందుమీద అబ్రహాము
లింకను నూతన ప్రభుత్వముపై యుద్ధమును ప్రకటించెను.

పైన చెప్పిన యేడు రాష్ట్రములేగాక మిగిలిన నాలుగు
రాష్ట్రములును వీటిలో చేరెను. యిరువదిరెండు రాష్ట్ర
ములు సంయుక్త రాష్ట్రముల ప్రభుత్వపక్షమునను పదకొండు

రాష్ట్రములు నూతన ప్రభుత్వ పక్షమునను నిలువబడి పోరాడి నవి. అబ్రహాము లింకను కోరగనే ఒక లక్షమంది ఐచ్ఛిక భటులు ఉత్తర రాష్ట్రములనుండి యుద్ధము చేయుటకై సేనలలో జేరిరి. యుద్ధము 1861వ సంవత్సరము జులై నుండి1865వ సంవత్సరము ఏప్రిలు వరకును జరిగెను. జరిగిన యుద్ధములను వర్ణించుట కీచిన్నపుస్తకము లో తావులేనందున వదలివేసితిమి. ప్రారంభమున దక్షిణప్రభుత్వమువారు కొన్ని జయములను పొందినను అబ్రహాములింకను పట్టుదలతో యుద్ధము సాగించి సంపూర్ణ జయములను సంపాదించెను. మధ్యమధ్య కొన్ని రాష్ట్రములు లోబడెను. వాటికి ఆయనసంపూర్ణమగు క్షమాపణనిచ్చుచువచ్చెను. 1864 వ సంవత్సరము సెప్టెంబరు 19 వ తేదీన గెట్టీసుబర్గులో యుద్ధములో మరణించినవారి స్మశానవాటికను తెరచుచు అబ్రహాం లింక నిటులచెప్పెను. "ఎనుబదిఏడు సంవత్సరములకిందట మనపూర్వులీఖండము లో స్వతంత్రమును పొందినట్టియు అందరుమనుష్యులును సమానులునను సిద్ధాంతమును నమ్మినట్టియు నొకజాతిని ఏర్పరచి నారు. ఆజాతిగాని లేదా అట్టిసిద్ధాంతములుగల ఏజాతి గాని చాలకాలము నిలుచునా లేదా యను సమస్యాపరిష్కారమునకై మనమొకగొప్ప అంతర్జాతీయయుద్ధములో నిపుడు మునిగియున్నాము. ఆయుద్ధములోని యొకగొప్ప యుద్ధభూమిలో మనమిపుడు సమావేశమైనారము. ఆజాతిప్రపంచమున స్థిరముగ నిలుచుటకుగాను తమప్రాణములనర్పించిన ధీరులకు విశ్రాంతి స్థలముగా నీభూమిలోకొంతభాగము ఏర్పరచుట కిపటికి చేరినారము. మిగకావనిచేయుట ఎంతయు అగత్యమై

యున్నది. కాని ఈ స్థలమును పవిత్రవంతమయిన దానినిగా మనము చేయజాలము. ఇచట పోరునలిపిన ధీరులు — మరణించినవారును బ్రతికియున్నవారును — దీనిని పవిత్రపరచియున్నారు. మనము అల్పులము. మనమేమి చెప్పినను దానిని ప్రకాశింపచేయుట శక్యము కాదు. వారు చేసినదానిని శాశ్వతముగా జ్ఞాపకముంచుకొనును. బ్రతికియున్నవారమైన మనయొక్క విధి యొక్కటే. మనమును వారి త్రోవను నడచి వారు చేసిన మహాత్కార్యమును పూర్తిచేసి పవిత్రవంతులము కావలసియున్నాము. ఈ చచ్చిపోయినవారు వృథాగా తమ ప్రాణముల నర్పణ చేయలేదని మనమిపుడు తీర్మానించవలసియున్నది. పరమేశ్వరుని అనుగ్రహమువలన ఈజాతి స్వతంత్రియులమగు పునర్జన్మను పొందుతీరునని మనమిపుడు దృఢదీక్షతో నిశ్చయింతము. ప్రజల లాభముకొరకు ప్రజలచే చేయబడెడి ప్రజాప్రభుత్వము భూమిమీదనుండి నాశనము చేయబడజాలదని మనము శ్రీకరిగా శుద్ధిగా ప్రకటింతుము." అని ఆయన చెప్పెను. 1865 వ సంవత్సరము మార్చి నెలలో నూతన సంయుక్త ప్రభుత్వసేనలు విచ్ఛిన్నమై పోయెను. మార్చి 29 వ తేదీన వారి రాజధానియగు పీటర్సు బర్గులో సంయుక్త రాష్ట్రముల సేనలు జొరబడి స్వాధీనమును పొందెను. ఏప్రియల్ 7 వ తేదీన వారి సేనాధిపతులు సంయుక్త రాష్ట్రములకు లొంగి అబ్రహాం లింకనుచే క్షమించబడిరి. యుద్ధము ముగిసెను. అమెరికా సంయుక్త రాష్ట్రముల ఐక్యత కాపాడబడెను. అమెరికా సంయుక్త రాష్ట్రములలో బానిసత్వము సంపూర్ణముగ రద్దుపర్చబడెను. 1865 వ

సంవత్సరము జనేవరినెల 31 వ తేదీననే బానిసత్వము విషయములో అమెరికా సంయుక్త రాష్ట్రముల చట్టము సవరణగావింపబడెను. "ఇంతటినుంచి యు అమెరికా సంయుక్త రాష్ట్రములలో గాని వాటి క్రిందనున్న ప్రదేశములలో గాని బానిసత్వముగాని నిర్బంధమగు నౌకరీగాని యుండనేరవు." అని శాసింపబడెను. తిరుగబాటు చేసిన దక్షిణ రాష్ట్రముల లోనివారిని క్షమించి నిజమైన స్నేహభావమును శాంతమును అన్ని రాష్ట్రముల మధ్యను నెలకొల్పుటకు అబ్రహాంలింకను యత్నించుచుండెను. ఇంతలో ఏప్రిల్ నెల 14 వ తేదీ రాత్రి నాటకశాలనుంచి వచ్చుచుండగా అబ్రహాం లింకనును బానిసత్వ పక్షపు కట్రలో చేరిన యొక దుష్టుడు తుపాకితో కాల్చి చంపెను. మానవ స్వాతంత్ర్యమునకై ప్రాణము లర్పించిన యుత్తమ పురుషులలో అబ్రహాంలింకను పేరెన్నిక గన్నవాడు.

# అమెరికా
# సంయుక్త రాష్ట్రములు.

## పన్నెండవ అధ్యాయము.

## అమెరికాలో నీగ్రోల ప్రస్తుత స్థితి.

(1)

యుద్ధము ముగిసినది. నీగ్రోలకు బానిసత్వము రద్దు పర్చబడినది కాని దక్షిణ రాష్ట్రములలోని తెల్లవారు బుద్ధిపూర్వకముగా నీగ్రోలకు స్వేచ్ఛనివ్వలేదు. సంయుక్త ప్రభుత్వములో నుత్తర రాష్ట్రములవారి కక్షియగు రిపబ్లికను కక్షియే కొంతకాలము పలుకుబడి గలిగియుండెను. దక్షిణ రాష్ట్రములలోని తెల్లవారిలో తోటల యజమానులకును పెద్ద భూఖామందులకును బానిసలకు స్వేచ్ఛనిచ్చుటవలన చాల నష్టముకలిగెను. వారిభూములు తోటలు పాడుబడినవి. తమక్రిందనున్న బానిసలు స్వేచ్ఛనొంది లేచిపోవుటయు సొమ్మిచ్చి కూలీలనుపెట్టుకొని తోటలలోను భూములలోను పనిచేయించుకొనవలసి వచ్చుటయు తటస్థించెను. ఈతోటల యజమానులు నీగ్రోలకు స్వేచ్ఛనివ్వక ప్రతిఘటించిరి. సంయుక్త ప్రభుత్వమువారు తోటల యజమానులకు దయా

దాక్షిణ్యములు చూపక, బానిసలను పోగొట్టుకొనినందుకు భూస్వామందులకెట్టి నష్టపరిహారమును ఇవ్వక, సైనికులను బంపి దక్షిణ రాష్ట్రములలోని బానిసలకందరికిని బలవంతముగా స్వేచ్ఛనిచ్చిరి. దక్షిణాది భూస్వాములు తమతమ రాష్ట్రప్రతినిధి సభలలో విశేషముగ పలుకుబడి గలిగియుండి నందున దానినంతయు వినియోగించి స్వేచ్ఛనొందిన నీగ్రోలపై నిర్బంధములు ప్రయోగించి వారిని బానిసత్వమునకు తుల్యమగు స్థితికి తెచ్చుటకు సర్వప్రయత్నములను చేసిరి. నీగ్రోలకు స్వేచ్ఛవచ్చెనేగాని వారికి తినుటకు తిండిలేదు. కట్టుకొనుటకు బట్టలులేవు. నిలుచుటకు నీడలేదు. ఈ అవకాశము తీసుకొని దక్షిణ రాష్ట్రములవారు పెక్కు నిర్బంధశాసనములను చేసిరి. అయిదుగురు నీగ్రోలు కలిసి మాట్లాడిన నేరమని చట్టము చేసిరి. నీగ్రోలు స్వేచ్ఛనొందినప్పటికి తెల్లవారితో సమానులు కారనియు గావున ఎట్టి పౌరస్వత్వములు లేవనియు శాసించిరి. పదునెనిమిది సంవత్సరములలోపున నున్న నీగ్రోలను నిర్బంధముగా పనినేర్పవలెననియు వెనుకటి యజమానుల క్రిందనే పనినేర్చుకొనవలెననియు శాసించిరి. నీగ్రోలు తెల్లవారిక్రింద కఠినషరతులకు లోబడి నౌకరీచేయునట్లు నిర్బంధించిరి. తెల్లవారికి నీగ్రోలెప్పుడును ఋణపడునట్లు ఏర్పాటుచేసి ఋణపడిన నీగ్రో తనబాకీవారుడగు తెల్లవానిక్రింద నిర్బంధముగా పనిచేయునటుల శాసించిరి. ప్రతి స్వల్ప నేరమునకును నీగ్రోలకు ఖైదువేయుటయు ఖైదువేసినవారిచేత తెల్లవారిక్రింద పనిచేయించుటయు జరిగెను. నీగ్రోలు సాధారణముగా పనిలేక నేరములుచేయ ద్రిమ్మరు

లగు జాతులని పరిగణించు శాసనములను చేసిరి. నీగ్రోల మీద తలపన్ను విధించిరి. పన్ను ఇవ్వనిచో ఖయిదు వేసిరి. తెల్లవారిక్రింద పనిచేయించిరి. కొంచెమించుగా వెనుకటి బానిసత్వపు స్థితికే నీగ్రో తేబడెను.

ఉత్తర రాష్ట్రములవారు దీనిని సహించలేదు. యుద్ధముయొక్క ఫలితములు నాశనమగుటకు సమ్మతించలేదు. వీరిరిపబ్లికనుకక్షిలో దక్షిణరాష్ట్రములలోని తోటల యజమానులుగాక సామాన్యులగు తెల్లవారు చాలామంది చేరిరి. కొంతకాలము రిపబ్లికను కక్షివారే సంయుక్త ప్రభుత్వమునందు ఎక్కువ సంఖ్యాకులుగనుండి దక్షిణరాష్ట్రముల వారిని ప్రతిఘటించిరి. సంయుక్తరాష్ట్రములలో నెచటను కూడ జాతివలనగాని, రంగుకారణమునగాని, లేక వెనుక బానిసగానుండిన కారణముచేతగాని, ఎవరికిని పౌరసత్వములు పోగూడదని సంయుక్తరాష్ట్ర ప్రభుత్వమువారు సంయుక్తరాష్ట్ర రాజ్యాంగ విధానములో సవరణగావించిరి. సంయుక్త ప్రభుత్వము వారు దక్షిణరాష్ట్రములలో స్వేచ్ఛనుపొందిన నీగ్రోల సంరక్షణకై యొకయుద్యోగుల యుపసంఘము నేర్పరచిరి. ఇదివరకు బానిసత్వమును కాపాడుటకై యుద్ధములో పనిచేసిన వారందరును రాజ్యాంగములో పాల్గొనకుండ చట్టములనుచేసిరి. దక్షిణరాష్ట్రములలో సంయుక్త ప్రభుత్వమువారు సైనికులనుంచిరి. నీగ్రోలకు పెద్దయుద్యోగములివ్వబడెను. వీరికిశాసనసభ్యత్వముకూడ లభించెను. తెల్లవారునూటికి ఎనుబదిచొప్పున పన్నులిచ్చుచున్నప్పటికిని చాలచోటుల నీగ్రోలేపన్నులువేయు నధికారమును పొందిరి.

నీగ్రోలు అధికారగర్వమువలన అక్కడక్కడ తెల్లవారి నవమానపరచుట తటస్థించెను. తెల్లవారు రహస్యసంఘములుగా నేర్పడి దుండగులుగా ప్రవర్తించిన నీగ్రోలను తామే క్రూర హింసలుగావించిరి.

ఈవిధముగా ఉత్తరరాష్ట్రముల కక్షివారికిని దక్షిణరాష్ట్రములలోని ముఖ్యులగు తెల్లవారికిని 1870 వ సం॥ రము వఱకును పోరాటములు కలిగెను. 1870 వ సంవత్సరమున నీగ్రోలను సంరక్షించుటకేర్పడిన ఉద్యోగీయుల ఉపసంఘము రద్దుపరచబడెను. యుద్ధములో పాల్గొనిన తెల్లవారిమీద నుపయోగించబడిన నిర్బంధములన్నియు తీసివేయబడెను. ప్రభుత్వపు సైనికులను తీసివేసిరి. నీగ్రోలకు చేయబడిన ప్రత్యేక సహాయమంతయు మానివేసిరి.

(౨)

నీగ్రోల హక్కులు తీసివేయబడెను.

ఉత్తరాదివారును దక్షిణాదివారును రాజీపడిరి. తెల్లవారందరును ఏకమైరి. దక్షిణరాష్ట్రములలోని తెల్లవారికందరికిని వోట్లువచ్చెను. యుద్ధమునకు పూర్వమువలెనే రాజ్యాంగవ్యవహారములను, తెల్లవారు చెలాయించిరి. నీగ్రోలకు వోట్లను పౌరహక్కులును లేకుండా చేయు ప్రయత్నములు తిరిగి బాగుగా సాగెను. ఇప్పుడు బానిసత్వపు యుద్ధమునకు పూర్వమువలెనే దక్షిణరాష్ట్రములలోని నీగ్రోలు రాచకీయ హక్కులు సంపూర్ణముగ కోల్పోయియున్నారు. నీగ్రోల ప్రస్తుతపు రాచకీయ స్థితిని గూర్చి పాలువేలండ హావర్డు అను అమెరికను గ్రంథకర్త ఇటుల వ్రాసియున్నాడు.

“జాతి, వర్ణము, వెనుక బానిసగానుండుట, యీ కారణములలో దేనిచేతనుకూడ నేపౌరునికిని పౌరస్వత్వములు తీసివేయుటకు వీలులేదని సంయుక్త ప్రభుత్వముహారుచేసిన చట్టమువలన నీగ్రోలకు రాజకీయస్వత్వములు పోవుటకు వీలులేదని కొందరుతలచవచ్చును. కాని ఈనిబంధనను తప్పించుకొనుటకనేక మార్గములు తెల్లవారిచే వన్నబడినవి. 1871 సంవత్సరము తరువాత బలవంతిమువలననో మోసమువలననో దక్షిణరాష్ట్రములలో నీగ్రోలకు రాజకీయహక్కులు తీసివేయబడినవి. ప్రతి ఓటరునకు ఆస్తి విద్యయుండవలెనను నిబంధనక్రింద విశేషసంఖ్యాకులగు నీగ్రోలకు ఓట్లు లేకుండచేసిరి. ఇట్టి నిబంధనలక్రిందికేవచ్చు బీదలయినట్టియు విద్యలేనట్టియు తెల్లవారికి, తాతలు గొప్పవారనియో, తగినంత జ్ఞానముకలదనియో మినహాయింపులుచేసి ఓట్లు ఇవ్వబడును. ఈనిబంధనలను వర్తింపచేయుటలో తెల్ల ఉద్యోగస్థులు తెల్ల ఓటర్లకుమిగుల తేలికగను నల్లఓటర్లకు మిగుల కఠినముగను వర్తింపచేయుచున్నారు. దీనికంతకు కారణము నీగ్రోలన ఎటులైన రాజకీయరంగమునుండి వెళ్ళగొట్టవలెనని తెల్లవారికిగల ప్రబలమగు ఇచ్ఛయే ......వర్తమానము దేశములో ప్రబలియున్న పరిస్థితులను బట్టి నీగ్రోలకు రాజకీయహక్కులు ప్రసాదింపబడునని తలచుటకువీలులేదు.”

ఇంతటితో ఆగలేదు నీగ్రోలకు ఓట్లులేకుండచేసి వారిని రాజకీయముగ నీచమగుస్థితిలోనికి తెచ్చుటగాక వారివిషయములో ననేకపాక్షికమగు చట్టములును చేయబడెను. 1910 వ

నీగ్రోలు తెల్లస్త్రీలను వివాహమాడరాదు.

సంవత్సరములో 48 రాష్ట్రములలో 26 రాష్ట్రములవారు నీగ్రోలు తెల్లవారితో వివాహమాడరాదని శాసించిరి. అట్టివివాహములు చెల్లవని శాసించుటయేగాక అట్టివివాహములు చేసుకొనినవారికి శిక్షలువిధించునట్లు చట్టములను చేసిరి. కొన్ని రాష్ట్రములలో 7.. రూప్యముల జుల్మానా మొదలు మరికొన్ని రాష్ట్రములలో పదిసంవత్సరముల ఖైదువరకును శిక్షలు నిర్ణయింపబడెను. ఇటులనే నీగ్రోపురుషులకును తెల్లస్త్రీలకును వ్యభిచారసంబంధమున్నచోటులగూడ నీగ్రోపురుషులకు శిక్షలువిధించు చట్టములను చేసిరి.

నీగ్రోలు తెల్లవారి రైలుడబ్బాలలో ఎక్కకూడదు.

ఇంతేగాక దక్షిణరాష్ట్రములలో తెల్లవారెక్కు రైలుబండిడబ్బాలలో నల్లవారెక్కకూడదని నిర్బంధములుచేసి నల్లవారెక్కుటకు వేరుడబ్బాలు ఏర్పాటుచేయబడెను. కొన్నిరాష్ట్రములలో స్టీమరులలోను ట్రాంబండ్లలోను కూడ తెల్లవారెక్కుటకు వేరుప్రదేశములును నీగ్రోలెక్కుటకు వేరుప్రదేశములును ఏర్పాటుచేయబడెను. సాధారణముగ వేరువేరు ట్రాంబండ్లు ఏర్పడియున్నవి. కానికొన్నిచోటుల ట్రాంబండ్లలో ముందుబల్లలన్నియు తెల్లవారికిని వెనుకబల్లలు నల్లవారికిని నిర్ణయింపబడినవి. సాధారణముగా ఎంతభాగ్యవంతుడైనను నీగ్రో బాటసారికి రైలుబండిలో నిద్రించుటకు స్థానమివ్వబడదు. కొన్నిరాష్ట్రములలోనికి రైలుపోగానే నిద్రించుటకేర్పడిన స్థానమును వదలి నీగ్రోబాటసారి మామూలుగా కూర్చొను స్థానమునకు వెళ్ళితీరవలెను. ఒకేమొత్తమును పుచ్చుకొనియు అతి

తరుచుగా రైలువేలలో తెల్లవారికి మంచి సదుపాయములను నల్లవారికి తక్కువవీళ్ళును చేయబడుచున్నవి.

తెల్లవారు, నల్లవారు కలిసి చదువుకొన రాదు.

దక్షిణ రాష్ట్రములలో తెల్లవారి పిల్లలును నల్లవారి పిల్లలును ఒకే పాఠశాలలలో చదువుకొనకూడదు. కొన్ని రాష్ట్రములలో నీగ్రోలకు తెల్లవారిని తెల్లపిల్లలకు నీగ్రోలును ఉపాధ్యాయులుగ నుండకూడదని చట్టములను చేసిరి.

(౪)

నీగ్రోలు అమెరికాలో మాల మాదిగెలకన్న హీనముగ చూడబడుచున్నారు.

ఉత్తర రాష్ట్రములలో కూడ కొంతకాలమునకు నీగ్రోల యందు దయార్ద్రత కలిగెను. కాని సత్వపు యుద్ధపుకాలమున నీగ్రోల యభివృద్ధికొరకు ఉత్తరాది తెల్లవారు చేయుచుండిన సహాయమును క్రమక్రమముగా మానివేసిరి. నీగ్రోలు తమకన్న తక్కువ జాతియను భావము అమెరికాలోని తెల్లవారందరిలోను తీవ్రముగ వ్యాపించినది. ఎవరో కొద్దిమంది నీగ్రోలకొరకు పనిచేయు క్రైస్తవమత బోధకులు తప్ప మిగిలిన తెల్లవారందరును నీగ్రోలను హిందూదేశములోని మాల మాదిగెలకన్న హీనముగ చూతురు. తెల్లవారి పూటకూళ్ళ యిండ్లలోనికిని, క్రైస్తవ యువజన సంఘములకును, క్రైస్తవ యువతీజన సంఘములకును, నాటకశాలలకును నల్లవారిని రానివ్వరు. తెల్లవారిని పాతిపెట్టు చోట నల్లవారిని పాతిపెట్టనివ్వరు.

నల్లవారి సాంఘిక బహిష్కారము.

తెల్లవారికిని నల్లవారికిని అందరును క్రైస్తవులే యైనను ప్రార్థనామందిరములు వేరుగనున్నవి. తెల్లవారి పూటకూండ్లయిండ్లు వేరు. నల్లవారి పూటకగాలిబసలు వేరు. పట్టణముల లోను పల్లెలలోను తెల్లవారు కాపురముండు ప్రదేశములలో నల్లవారు కాపురముండుటకు వీలులేదు. నల్లవారు కాపురముండుటకై ప్రత్యేక ప్రదేశములు ఏర్పాటు చేయబడినవి. న్యాయస్థానములలో తెల్లవారికిని నల్లవారికిని తగాదాలు కలిగినపుడు తెల్లవారికి పక్షపాతమును నల్లవారికి అన్యాయమును చేయబడుచున్నది. ఒకేనేరమునకు తెల్లవారికి తేలికగుశిక్షలును, నీగ్రోలకు కఠినశిక్షలును తెల్లని న్యాయాధిపతులచేత వేయబడుచున్నవి. నీగ్రో న్యాయాధిపతులు లేనేలేరు.

నీగ్రోలను చిత్రవధలు చేయుదురు.

నీగ్రోలయందు తెల్లవారు చూపుచున్న అసహ్యమునకు ఘోర నిదర్శనము నీగ్రోలను విచారణ లేకుండా తెల్లవారు చేయుచున్న చిత్రవధలే. అమెరికాలోని నీగ్రోలు తెల్లవారి కపచారము నొనర్చిరని నమ్ముటతోడనే తెల్లప్రజలు గుంపులు గుంపులుగా బయలుదేరి నేరముచేసినట్లు తలచిన నీగ్రోలను తమంతట తామే పట్టుకొనివచ్చి చిత్రవధలను గావింతురు. ఇందుకై తెల్లవారు శిక్షింపబడరు. విచారణతోను న్యాయాధిపతుల తీర్పులతోను పనిలేకుండ ఉద్రేకపూరితులగు తెల్లప్రజలే నీగ్రోలను చిత్రవధలు చేయుటయు యిందుకు తెల్లవారికట్టి శిక్షలును లేకుండుటయు ప్రపంచములోకెల్ల మిగులనాగరీకుల

మని చెప్పుకొనుచున్న అమెరికాలో నేటికిని జరుగుచున్న పద్ధతి. 1885 సంవత్సరము మొదలు 1914 సంవత్సరము వరకు షుమారు మూడువేలమంది నీగ్రోలిట్టి చిత్రవధలకు లోనైరని లెక్కలవలన తెలుచున్నది. 1911 వ సంవత్సరమున నూరుమంది నీగ్రోలు చిత్రవధలు గావింపబడిరని క్రైసిస్ అనుపత్రిక వ్రాసినది. శ్రీయుత లాలా లజపతిరాయిగారి అమెరికా సంయుక్తరాష్ట్రముల నగ్రంధము 1916 వ సంవత్సరములో రచించుటచేత 1914 వరకు మాత్రమే వారంకెల నిచ్చినారు. కాని ఈ ఘోరమగు ఆచారము నేటికిని అమెరికాలో జరుగుచున్నది.

ఈచిత్రవధలయొక్క కొన్ని యుదాహరణములు లాలాజీగారి గ్రంధములో అమెరికా పత్రికలనుండి ఎత్తి వ్రాయబడినవి. కొన్నిటిని మాత్రమిచట యుదహరించెదము.

1911 అక్టోబరు 20—జెర్రివలాను అను నీగ్రో ఒక తెల్లవానిని గడచిన రాత్రి కొట్టుచున్నందున పట్టుకొనివచ్చి జైలులోనుంచిరి. ఈఉదయము 2 గంటలవేళ ముప్పదిమంది తెల్లవారు వానిని జైలులోనుంచి బయటకు లాగుకొని వచ్చి చిత్రవధగావించిరి. మే నెల 26వ తేది ఒకనీగ్రో స్త్రీయొక పెరెఁపుమీద తుపాకికాల్చినది. ఒక తెల్ల ప్రజలగుంపు ఆమెను ఆమెయొక్క పదునాలుగు సంవత్సరముల ఈడుగల కుమారునితోకూడ యురితీసిరి. ఆమెను ఉరితీయకముందు బలవంతముగా చెరిచిరి. *

మే నెల 30 వ తేది — ఒకప్రముఖుఁడగు పౌరుని

---

* లజపతిరాయి 152 పుట చూడుము.

హత్యకు సంబంధించినట్టుల ఆరుగురు నీగ్రోలు ఖైదులో నుంచబడిరి. కొంతమంది తెల్లవారు మోటారుకారులో వచ్చి యొక ఫోర్జరీ కెలి గ్రామును జైలరు కుమారునికి చూపి జెలు లోనుంచి వారి యారుగురిని తీసికొనిపోయి చిత్రవధలను గావించిరి. వారిలో నొకడుమాత్రమే హత్యకు సంబంధించిన నేరము మోపబడినట్టు తెలిసినది.

ఆగస్టు 13— ఒకనీగ్రో తాగి యొక తెల్లవానిని తుపాకితో కాల్చిచంపెను. ఆనీగ్రో ఆసుపత్రిలో పడుకొని యుండగా కొందరు తెల్లవారు వానినితీసుకొనిపోయి మంటల లోపడవేసి చంపిరి. మంటలలోనుంచి లేచి బయటకు రాప్రయత్నించగ వానిశరీరమును కర్రలతో గ్రుచ్చి తిరిగి మంటలోకి త్రోసిరి. "ఈ వినోదము" ను సల్పినందుకు వీరిని పట్టుకొని విచారించి కేసుకొట్టివేసిరి.

జులై — లారెన్సువెల్లీలో న్యాయాధిపతిగ నున్న చార్లెసు క్రాండుగార్ వద్దకు యిద్దరు నీగ్రోలు విచారణకు తేబడిరి. ఒకనిపై ఒక తెల్లస్త్రీని అవమానపరచినందుకును మరియొకడు అనుమానముగా తిరుగుచున్నాడని యును నేరమారోపించిరి. వీరిలో నొకడు యిద్దరు పోలీసువారి హవాలాలో రైలులో పోవుచుండగ చాలమంది తెల్లవారు వానిని లాగుకొనిపోయి చిత్రవధ గావించిరి. ఆ చిత్రవధ జరిగినపుడు రైలు ఆగెను. రైలులోని ప్రయాణీకులు వినోదమును చూచుచుండిరి. రెండవవాడు జైలులోనుండగ అనేక వందలమంది తెల్లవారు వచ్చి వానిని లాగుకొనిపోయి చిత్రవధ గావించిరి. పటాలములను పిలిపించి గుంపులను చెదరగొట్టి ఈ యిద్దరు

ఖైదీలను యేల సంరక్షించలేదని ప్రశ్నించగా న్యాయాధిపతి యగు బ్రాండు యిటుల చెప్పెను.

"దేశములోని యిట్టి నీగ్రో నేరస్థు లందరికొరకును యే తెల్లవాని జీవితమునైన బలి యిచ్చుటకు నేను ఒప్పుకొనజాలను. ......... నా మనస్సాక్షికిని నా భగవంతునికిని నేను చేసినపని న్యాయముగా నున్నది. ఇట్టి నూరుమంది నీగ్రోల ప్రాణములను కాపాడుటకై యొక్క తెల్లవాని ప్రాణమునకైన అపాయకరమగు కార్యమును నేను చేయజాలను."

**అమెరికనుల అభిప్రాయములు.**

అమెరికాలోని తెల్లవారిలో నీగ్రోలనుగూర్చి మూడు విధములైన యభిప్రాయములు గలవు. కొంద మంది యుత్తములు భగవంతుని యెదుట తెల్లవారును నీగ్రోలును సమానులు గావున యుభయుల మధ్యను ఎట్టి భేదములు నుండగూడదని తలచుచున్నారు. మరికొందరు నీగ్రోలయందు దయచూపుట చెడు పనియే గాని నీగ్రోలకును తెల్లవారికిని నాగరికతలో చాల భేదమున్నది గావున సాధారణముగ నీగ్రోలను తెల్లవారితో సమానముగా చూచుట అసంభవమనియు వారిలో విద్యాధికులను, యెక్కువ నాగరికులను తెల్లవారితో సమానులుగ చూచుటకెట్టి యభ్యంతర ముండగూడదనియు చెప్పుదురు. మూడవ రకమువారు నీగ్రో యెప్పటికిని తెల్లవాడు కానేరడనియు స్వభావముగా నల్లవారికిని తెల్లవారికిని గలభేదము విద్యవలనను పైమెరుగులవలనను పోవునది కాదనియు గావున నీగ్రోను తెల్లవారితో సమానముగ యెన్నటికి చూడగూడదనియు నమ్ముచున్నారు. వీరే అధిక సంఖ్యాకులుగనున్నారు.

(4)

నీగ్రోలస్థితి.

అమెరికా సంయుక్తరాష్ట్రముల జనసంఖ్య పదికోట్ల తొంబదిఅయిదు లక్షలు గలదు. వీరిలో ఒకకోటి పదిలక్షలు నీగ్రోలున్నారు. ఈ నీగ్రోలలో విద్య బాగుగా వ్యాపించినది. అనేకులు భాగ్యవంతులును గొప్ప విద్యావంతులును గలరు. నీగ్రోయగు డాక్టరు డ్యూబాయిగారికంటె గొప్ప గ్రంథకర్త అమెరికాలో పుట్టలేదు. బుకరు వాషింగ్టనుకంటె మానవసేవా ధురంధరుడు ఏదేశములోను పుట్టలేదు. ఇట్టివారినికన్నందుకు నీగ్రోజాతియే గాక ఏజాతియైనను గర్వపడదగియున్నది. అనేకమందినీగ్రోలు సర్వకళాశాలలలో ప్రతిసంవత్సరము తేరుచున్నారు. అనేకమంది నీగ్రోలలో తెల్లవారిరక్తము ప్రవహించుచున్నది. తెల్లపురుషులకు నీగ్రోస్త్రీలకు పుట్టినవారనేకమందియున్నారు. నీగ్రోలలో అనేకులు తెల్లవారితోపాటు తెల్లగానున్నవారున్నారు అయినను నీగ్రోలను తమతోబాటు తెల్లవారు భోజనమునకు కూర్చోనివ్వరు. తమ పూటకూండ్లయిండ్లలోను ప్రార్థనామందిరములలోను చేర్చుకొనరు నీగ్రో కేవలము కారునలుపైనను మిగుల తెల్లగానున్నను ఒకేవిధముగ తెల్లవారిచే బహిష్కరింపబడుచున్నాడు. స్వయం సహాయము కొరకును తమ అభివృద్ధికొరకును నీగ్రోలనేకసంఘములు పెట్టుకొనియున్నారు. వారితాలూకు ఒక్క క్రైసిసుపత్రికకు ముప్పదివేలమంది నీగ్రోచందాదారులున్నారు. దీనివలన నీగ్రోలెంత నాగరికులుగనున్నారో తెలియగలదు. నీగ్రోలలో దాదాపుగా అందరును క్రైస్తవులే. అయినను

తెల్లవారు వీరిని నౌకర్లుగను, కావలివాండ్రుగను, వంటవాండ్లుగను పెట్టుకొనుటకు ఎట్టిఅభ్యంతరము లేదుగాని తమతో సమానముగ కూర్చొని భోజనముచేయుటకును తమతోకలసి విద్యనేర్చుకొనుటకును తమతో సమానముగ రాచకీయ హక్కులు పొందుటకును అభ్యంతరపర్చుచున్నారు. నీగ్రోలకు నీచమగు ఉద్యోగములు తప్ప న్యాయాధిపతులు మొదలగు గౌరవమగు ఉద్యోగములు లేకుండా చేసినారు. న్యాయస్థానములలో వీరికి న్యాయము లేకుండ చేసినారు. తరుచుగా న్యాయస్థానములతో పనియే లేకుండ నేరస్థులని భావించిన నీగ్రోలను తెల్లప్రజాసమూహములే చిత్రవధలు గావించుటయు ఉరిదీయుటయు మంటలలో పడవేసి చంపుటయు, ఘోర హత్యలకు పాల్పడుటయు జరుగుచున్నది ఎట్టినేరములకు నీగ్రోలనిట్టి హత్యలు గావించుచున్నారో, అట్టినేరములకు తెల్లవారికి ఖైదును లేక జుల్మానాయు విధించబడును.

ఆసియాఖండవాసుల బహిష్కారము.

అమెరికాలో అందులో ముఖ్యముగ పసిఫిక్ సముద్ర తీరమున ఆసియాఖండ వాసులతో కూడ తెల్లవారు కలసి భోజనముచేయరు. ఆసియా ఖండవాసులను కూడ బహిష్కరించుచున్నారు.

భారతీయుల స్థితి.

హిందూదేశీయులగు సిక్కులు, హిందువులు, ముసల్మానులు కొన్ని వేలమంది అమెరికాలో నున్నారు. వీరిలో కొద్దిమంది విద్యార్థులు. చాలమంది కూలిపని చేసికొనుటకు పోయి సొమ్ము సంపాదించుకొనుచుండువారు. అచటికి పోయినను ముఖ్యముగా సిక్కులు

తమ పగ్రీలను కృపాణములను విడిచిపెట్టలేదు. వీరిని చూడగానే సిక్కులని తెలియును. హిందూ దేశీయులు నల్లవారను హేతువుచేత నీగ్రోలను చూచినంత హీనముగనా అసహ్యముగను చూడకపోయినను సాధారణముగ అమెరికావారు పూటకూండ్ల యిండ్లలోనికి రానివ్వరు. సమానులుగ దూర్చొనుట కంగీకరించరు. యూరపు ఖండమునుండి వచ్చు టీదవాండ్రు అజ్ఞానములోను అశుభ్రతను హైందవ కూలీల కంటె మించినను వారిని అమెరికనులు తమతో సమానులుగ చూచెదరు. తురుష్కులను మొసల్మానులను, పర్షియా మొసల్మానులను జపానువారిని హైందవుల కన్న బాగుగా చూచెదరు. ఎందువల్లననగా హిందూ దేశము స్వతంత్రదేశము కాదు. స్వతంత్ర దేశములవారు నల్లవారయినను వారిని కొంతవరకైనను గౌరవించక తప్పదు. దక్షిణ రాష్ట్రములలో హైందవులు తెల్లవారు పెట్టుకొను టోపీలు ధరించినచో వీరిని నీగ్రోలని భావించి మిగుల హీనముగా చూచి నానాబాధలు పెట్టెదరు. అచ్చట తలగుడ్డలు పెట్టుకున్నచో నీగ్రోలకన్న యెక్కువ గౌరవముగా చూచెదరు. [illegible] హైందవులకు అమెరికను మంగలులు క్షౌరము చేయుటకు నిరాకరించెదరు. అమెరికాలోని పశ్చిమ ప్రాంతముల భారతీయులు తెల్లవారి టోపీలు ధరించి పోయినచో అమెరికనుల పూటకూండ్ల యిండ్లలోనికి రానిచ్చెదరు. భారతీయ కూలీలు తెల్లవారికంటె చౌకగా కూలికి పోవుదురనియు యెక్కువ కష్టపడి పనిచేసి మితవ్యయము కలిగి సొమ్ము మిగుల్చుకొనగలుగుదురనియు వర్తకపు పోటీలో తెల్లవారి నోడించుచున్నా

రసియు భావముతో అమెరికాకు అసలే రాకుండా చట్టములు చేయబడు చున్నవి. అమెరికాలో యెంత కాలమున్నను ఆసియాఖండ వాసులకు పౌరహక్కులుండకూడదని చట్టములు చేయుచున్నారు. అమెరికనుల హృదయములలో తెల్ల నల్ల భేదము సంపూర్ణముగా నిండియున్నది. మొత్తముమీద నల్ల జాతులవా రందరును తమకన్న తక్కువవారని వారి యభిప్రాయము.

ఈ "నల్ల, తెల్ల," సమస్యను న్యాయముగా పరిష్కరించనిది అమెరికనులు నాగరికత కలవారని చెప్పుటకు వీలు లేదు. అమెరికానుండి వచ్చెడి క్రైస్తవ మత బోధకులకు హిందూదేశములోని కుల భేదములను గూర్చి వెక్కిరించుటకు హక్కులేదు. "నీ పొరుగువాని కంటిలోని నలుసును తీసి వేయ ప్రయత్నించుటకు ముందు నీ కంటిలోని దూలమును తీసివేసికొనుము" అని బైబిలు చెప్పుచున్నది.

(5)

అమెరికనుల యాందోళనము.

అమెరికాలోని నీగ్రోలు తమ యభివృద్ధికై సంఘములు పెట్టుకొని ఆందోళనము చేయుచున్నారు. వారు కోరునవి మూడు (1) ఓట్లు (2) పౌరస్వత్వపు సమానత్వము (3) యువకుల విద్యా సంపాదనకు సంపూర్ణముగా అవకాశములు.

"ఓట్లు నవీనమనుష్యత్వమునకు ముఖ్యమనియు, రంగునుబట్టి నీచముగా చూచుట నాగరికతకు విరుద్ధమనియు, తెల్లపిల్లల కెంతవిద్య యావశ్యకమో నల్లపిల్లలకుకూడ నంత

విద్యయే కావలెనని యు నీగ్రోలు సంతతము పట్టుదలతో ఆం దోళనము చేయవలెను."

"ప్రతిదినమును అమెరికాలోని నీగ్రోలు నీచత్వము నకును బాధలకును అన్యాయములకును లోబర్చబడుచున్నారు. వారికి రాచకీయ, ఆర్థిక, సాంఘిక అభివృద్ధికి అవకాశములు తీసివేయబడినవి. మనము ఈ పరిస్థితులలో పోరాడవలసి యున్నది. ప్రజాభిప్రాయమును మార్చుటకు మనము సంతతము కృషి సల్పవలెను. తెల్లవారు మనతో సమానులేగాని అధికులుగారని మాకు తెలియును. పోరాటములో మన ఆయుధము గొప్ప ఆదర్శములు కలిగియుండుటయే గాక నూతన ప్రకృతి శాస్త్రపద్ధతులుకూడ అయ్యున్నవి" అని వారు చెప్పుచున్నారు.

నీగ్రోలు కోరు వాంఛలు. డాక్టరు ద్యూబాయి నీగ్రోలకు మూడు బంధనములు తెగిపోవలెనని కోరుచున్నాడు (౧) రాచకీయముగా తెల్లవారి పత్తిడినుండి నీగ్రోలు విముక్తులు కావలెను. నీగ్రోలకు ఓట్లుకావలెను. (౨) నూతనముగా దేశము చెందుచున్న ఆర్థికాభివృద్ధిలో నీగ్రోలకును భాగము రావలెను. (౩) సాంఘికముగా నీగ్రోలు తెల్లవారితో సమానులుగ భావింపబడవలెను.

ఆయన ఇటుల వ్రాసినాడు:—

"దక్షిణాదివారిటుల చెప్పుచున్నారు:— నీగ్రో నీచుడు గనుక వానిని నీచముగా మేము చూచెదము. వానిని నీచత్వమునుంచి పైకివచ్చుటకు మేము వప్పుకొనము. వాడు తెలివినొందుటకు మాకిష్టము లేదుగావున వానికిచదువుచెప్పము.

వాడుమాతో పోటీకివచ్చునుగనుకను ద్రవ్యమును సంపాదించును కనుక వాడుపరిశ్రమలలో ప్రవేశించుటను మేము సహించము. వాడు స్వతంత్రుడై మాప్రక్కన కాపురముండును గనుక వానిని ఆస్తికొననియ్యము. వానికూలిమాకు కావలసియున్నది గావున వానిని మేము విడిచిపెట్టము. వానిని దూరముగా ప్రత్యేక ప్రదేశములలో కాపురముంచెదము. వానికి రాచకీయ హక్కులివ్వము."

"దక్షిణాదివారు మాత్రమే నిందకర్హులుగారు. మొదట నీగ్రోలకు విద్యాభివృద్ధిలో తోడ్పడి ఓట్లనిచ్చి ఆర్థికముగా సహాయముచేసిన ఉత్తరాదివారు కూడ దీనినంతయునదలి దక్షిణాదివారిలో చేరినారు. నీగ్రోల పాఠశాలలను పాడుచేసినారు. కూలిని తగ్గించినారు. సాంఘికముగా వెలివేసినారు. రాచకీయముగా మాలవానిగచేసినారు. నీగ్రోలు చెమటకార్చి సంపాదించిన ఆస్తిని అపహరించవలెననికూడ ఇప్పుడు ప్రయత్నము చేయుచున్నారు."

"అపహరించుటకాక ఏమిటి? నీగ్రోలందరను ప్రత్యేక ప్రదేశములలో కాపురముండవలెననియు వారు సేద్యము చేసుకొను భూములు ఒకేవైపున ఒకే ఖండముగానుండవలెననియు చట్టములు చేయుటలో నీగ్రోలకిదివరకున్న మంచి ఆస్తిని తెల్లవారు అపహరించుటకాక మరేమున్నది? ఎర్రయిండియనుల విషయములో తెల్లవారెంత లజ్జాకరముగా ప్రవర్తించిరో మనకు తెలియదా?

* * * *

"మనము హక్కులుపొందుటకును మన గమ్యస్థానము

చేయుటకును మనము నిర్మాణకార్యమును బాగుగ జరిగించుకొనవలెను. ఇదివరకే అనేకసంఘములు పెట్టుకొనియున్నాము. ఇంకను వారిసంఘములు శాఖోపశాఖలుగ స్థాపించుకొనవలసియున్నది. నిర్మాణకార్యక్రమ మనగా ఆత్మత్యాగము. అనేకులు తమ కాలమును, పనిని, లాభములను ద్రవ్యమును త్యాగము చేయవలసియున్నది. ఇంతకును అమూల్యమగు హక్కులును అనగా స్వతంత్రమును పొందుటకు మనమవలంబించు పద్ధతి మిగులచౌక అయినది. నల్లవారియభివృద్ధికై ఏర్పడిన జాతీయ సంఘమును పోషించుచున్న ద్రవ్యములో విశేషభాగము నల్లవారినుండియె వచ్చుచున్నందునకు భగవంతునికి వందనములర్పించుచున్నాను. ఇంక నెక్కువగా ద్రవ్యసహాయము చేయుటకు నల్లవారు నేర్చుకొనవలసియున్నారు. ఈసంఘముయొక్క శాఖలింక ననేకములు పెట్టి మన ఆదర్శములను మన యుద్దేశ్యములను నెరవేర్చుకొందుముగాక.”

# అమెరికా సంయుక్తరాష్ట్రములు.

## పదమూడవ అధ్యాయము.

### పరిసమాప్తి.

## అభివృద్ధి — విదేశవ్యవహారములు.

(1)

స్వాతంత్ర్యము సర్వతోముఖమైన అభివృద్ధికి కారణమయ్యెను.

అమెరికా స్వతంత్ర యుద్ధకాలములో చాలమంది రాజభక్తులు తమ దేశస్వాతంత్ర్యమునకు వ్యతిరేకముగ (తుదివరకు ఆంగ్లేయపక్షమున నిలచి పనిచేయుట పైనచూచియున్నాము. ధనికులగు వర్తకులలోను గొప్ప భూఖామందులలోను, వకీళ్ళలోను ఛాల మంది రాజభక్తులుగనేయుండిరి. స్వతంత్రముకొరకు పోరాడు చున్నవారిని అల్లరిగుంపు అని పేరు పిలిచిరి. ప్రథమదివసములలో స్వతంత్రపక్షమున నున్నవారి పేళ్ళను ఆంగ్లేయ సైనికులకు వ్రాసియిచ్చి, వారిని కాల్చుమని, దోచుకొమ్మని ప్రోత్సహించిరి. ఆఖరువరకును స్వతంత్రపక్షమునకు వ్యతిరే

ముగ తీవ్రమైన పత్రికాప్రచారము చేసిరి. కరపత్రములను విరివిగా పంచిపెట్టిరి. వారు తెలియపరచిన ముఖ్య హేతువు లేమనగా, "అమెరికాలోని ఐచ్ఛికభటులు ఆంగ్లేయసైన్యముల ముందర నిలువజాలరు. అమెరికాకు స్వతంత్రము వచ్చుననుమాట వట్టికల్ల. 2 ఒకవేళ నిజముగా అమెరికాకు స్వతంత్రమే వచ్చినచో, అమెరికాకు అంతకన్న ఎక్కువ దురదృష్టముండబోదు. ఆంగ్లేయులు దేశమునువిడిచి పోగానే అమెరికాలో అంతఃకలహములుకలిగి ఒకకక్షివారు మరియొక కక్షివారిని, ఒక రాష్ట్రమువారు మరియొక రాష్ట్రమువారిని నరకుకొని దేశమును రక్తప్రవాహములో ముంచెదరు. ఇది నిశ్చయము. స్వతంత్రమని ఆర్భాటము చేయుచున్న దుండగీడుల మాటలువిని దూరాలోచనగలవారెవ్వరు చెడిపోకుడు." ఈ రాజభక్తుల ముఖ్యపత్రికయగు రాయల్ గెజటిఅను పత్రికలో పసిపిల్లలకు తండ్రియొక్క ఆవశ్యకత యెంతగలదో, అమెరికాయొక్క సురక్షితమునకును గౌరవమునకును ఆంగ్లేయప్రభుత్వముయొక్క ఆవశ్యకత యంతకలదని వ్రాయుచుండెను.

అమెరికా స్వతంత్రమును పొందిన తరువాత అదివరకు రాజభక్తులు ప్రకటించుచుండిన భావములన్నియు అబద్ధములాయెను. ఐక్యత చెడలేదు. రక్తప్రవాహములు కలుగలేదు. అంతర్యుద్ధములు రాలేదు. తమ దేశపాలనము యొక్క జవాబుదారీ తమమీద పడగనే తమదేశముయొక్క గౌరవముకొరకును ఘనతకొరకును అందరును కలసి పని చేసిరి. స్వతంత్రము పొందుట అమెరికాకు దురదృష్టముగు

టకు మారుగ అమెరికా అత్యాశ్చర్యకరముగా సర్వతోముఖ మైన అభివృద్ధినిచెంది స్వతంత్రము స్వర్గతుల్యముగ పరిణ మించినది. 'స్వతంత్రము స్వాభావమగు స్థితి, పరతంత్రము అస్వాభావికమగు స్థితి.' అని రూసోపండితుడు వ్రాసిన సిద్ధాం తము నిజమని తేలెను. ఇతరుల క్రింద సుపరిపాలనము కంటెకూడ స్వపరిపాలనము మానవాభివృద్ధికి అనేక మడుం గులు వుపకారకరమని రూఢియయ్యెను.

వ్యవసాయము పరిశ్రమలు.

సంయుక్తరాష్ట్రములు చాల పెద్దదేశము. కావలసి నంత వ్యవసాయమునకు కర్హమగు ప్రదేశము గలదు. అడవులు గలవు. గనులు గలవు. వివిధములగు శీతోష్ణ స్థితులుగలవు. సమస్త మైన పంటలు పండును. పశువులు సమృద్ధిగాగలవు. లోహ ములు, రాతిసిబొగ్గు విరివిగా దొరకును. కలప, కట్టె చాల లభించును. ప్రభుత్వమువారును ప్రజలును కలసి నవీన పద్ధ తులమీద పరిశ్రమలను విశేషముగ వృద్ధి చేసికొనినారు. పరిశ్రమలు చాలవరకు ఆవిరి యంత్రములవలనను, విద్యు చ్ఛక్తివలనను నడపబడుచున్నవి. పరిశ్రమలకు కావలసిన ముడిపదార్థములకొరకు యితర దేశములకు పోవలసిన పని లేదు. యూరపు ఖండములోని ఇంగ్లాండు మొదలగు దేశ ములు కేవలము పారిశ్రామిక దేశములుగ నున్నవి. వాటికి కావలసిన ఆహారపదార్థముల కొరకును ముడి పదార్థముల కొరకును యితర దేశములమీద నాధారపడి యున్నవి. సంయుక్తరాష్ట్రములలో బహుశ్రేష్ఠమగు ప్రత్తిపండును. ఈ దేశములోని బట్టలయంత్రశాలలకై సరిపోగ పండినదానిలో

భాగము ఇంగ్లాండు మొదలగు యూరపుఖండములోని దేశములకు రవాణాయగుచున్నది. హిందూదేశములోని ప్రత్తికన్న అమెరికా ప్రత్తి శ్రేష్ఠమైనది. సంయుక్తరాష్ట్రములు, హిందూదేశము, ఈజిప్టు ఈమూడు దేశములనుండియే యూరపియన్ జాతులు తమ బట్టలయంత్రశాలలకు కావలసిన దూదిని తెప్పించుకొనుచున్నారు. ఈ దేశములనుండి దూదిరానిచో యూరపులోని యంత్రశాలలు మూయబడును. రాష్ట్రములలో ఇనుము, రాగి, వెండి, అల్యూమినం మొదలగు లోహములే గాక, కాలిఫోర్నియా, కొలొరాడో మొదలగు రాష్ట్రములలోను. అలాస్కాలోను బంగారుగనులు త్రవ్వబడి మేలైనబంగారము చాల దొరకుచున్నది. ప్రపంచములోని అన్ని దేశములతోను రాకపోకలు పూర్తిగామానినను సంయుక్త రాష్ట్రముల ప్రజలు ఆహారమునకును, బట్టలుమొదలగు పారిశ్రామిక సరుకులకును కొదువలేకుండ స్వయంసహాయము మీద నిలువగలరు. సంయుక్త రాష్ట్రములలోగల అన్ని సౌకర్యములును హిందూదేశములోను గలవు. రెండువందల సంవత్సరములకు ముందు హిందూదేశము గొప్పపారిశ్రామిక దేశముగను, వ్యవసాయదేశముగనుకూడ ప్రసిద్ధిచెంది దేనికిని ఇతర దేశములమీద అధారపడని స్థితియందుండెను. కాని ఇపుడు హిందూదేశములో పరిశ్రమలన్నియు క్షీణించి కేవలము వ్యవసాయిక దేశమైనది. కట్టుకొను బట్టలకును, వ్రాసుకొను కాగితములకును పోయిరాజవేయు నిప్పుపుల్లకును ఇతర దేశములమీద హిందూదేశ మిపుడాధారపడియున్నది. ప్రకృతి శాస్త్రశోధనలలోను శోధనా ఫలితములను పరిశ్రమల

కొరకును, ఇతరవిధములగు అభివృద్ధికొరకును వినియోగించు టలోను సంయుక్తరాష్ట్రములు ప్రసిద్ధిచెందియున్నవి. ప్రవాహములన్నిటినుండియు విద్యుచ్ఛక్తి ఉత్పత్తిచేయబడుచున్నది. అమెరికనులు ప్రతిపనికిని విద్యుచ్ఛక్తిని వినియోగించుచున్నారు. సంయుక్తరాష్ట్రములలో వాడినంత విద్యుచ్ఛక్తి మరొక దేశములో వాడుటలేదని చెప్పవచ్చును.

నగరముల వైభవము, సంయుక్తరాష్ట్రములలో నగరములు పట్టణములు విశేషముగ వృద్ధిచెందినవి ప్రధాననగరరాజము న్యూయార్కు. ఇది తూర్పుసముద్రతీరమున నొక ద్వీపముమీద కట్టబడినది. దీని జనసంఖ్య అరువది లక్షలు కలిగి ప్రపంచములో మొదటిదిగ నున్నది. ఇంగ్లాండుయొక్క రాజధానియగు లండనునగరమున నెనుబదిలక్షల జనులు గలరు. అమెరికాలో న్యూయార్కు తరువాత ప్రధాన నగరములు చికాగో, ఫిలడల్ఫియా నగరములు. న్యూయార్కులో ప్రపంచములోకెల్ల ఎత్తైనకట్టడములు గలవు. ఆనగరములోని బ్రాడ్వేఅను వీధిలో పది అంతస్తులకు తక్కువమేడ లేదు. నలుబది అంతస్తులవరకు మేడలుగలవు. ఆనగరముయొక్క స్కైలైన్‌వీధిలో మ్యునిసిపలు కచ్చేరి ముప్పదినాలుగంతస్తులు గలది. సింగరు (బట్టలుకుట్టు యంత్రముల) కంపెనీయొక్క కట్టడము నలుబది అంతస్తులు గలది. వులువర్తు కట్టడము ఏబదిఅయిదు అంతస్తుల గలది. ఇట్టి యెత్తయిన కట్టడము లెన్నియో గలవు. నలుబదినాలు గంతస్తులుగల యొక (హోటలు) పూటకూళ్ళ బస గలదు. ఈ కట్టడములలోని ఏఅంతస్తుకైన

పోవుటకును క్రిందికి దిగుటకును విద్యుచ్ఛక్తి వలన లాగబడు బల్లలుండును. బొంబాయి నగరమును చూచినవారు ఇట్టి బల్లలను చూచియుందురు. ఈకట్టడముల వైభవము వర్ణింప నలవికాదు.

కోటీశ్వరులు

ఇంతేగాక అమెరికాలోనున్న కోటీశ్వరులు మరి యెక్కడను లేరు. ఏమియు ద్రవ్యములేకుండ అమెరికాకుపోయి తమ తెలివితేటలవలన కోటీశ్వరులైనవారు పెక్కుమందిగలరు. రాకుఫెల్లరు, కార్నిజీ పీయరుపాంటు మార్గను ఫోర్డు మొదలగువారు బహు సామాన్య స్థితినుండి కోటీశ్వరులైనవారు. న్యూయార్కులో నొక కోటీశ్వరుల బజారు గలదు. (Millionaires avenue) ఆ బజారులలోని కట్టడముల వైభవము సొగసు అందులోని ఐశ్వర్యము ఎవరు వర్ణించగలరు! నిమిషమునకు ఎన్నివేల నవరసుల ఆదాయమువచ్చునో చెప్పవీలులేని కోటీశ్వరులు గలరు. ఈ కోటీశ్వరులు సంయుక్త రాష్ట్రములలోని విద్యావిషయిక ప్రతిష్ఠాపనలకును, ప్రకృతి శాస్త్రశోధనలకును, గ్రంథాలయములకును, వైద్యాలయములకును, విశేషముగ సహాయము చేయుచున్నారు. సంయుక్త రాష్ట్రములలో ప్రతి రాష్ట్రములోను నొక విశ్వవిద్యాలయము ప్రభుత్వమువారిచే స్థాపింపబడియున్నది. ఇవిగాక ధనవంతులు స్థాపించిన విశ్వవిద్యాలయములు, కళాశాలలు, పాఠశాలలు లెక్కలేనన్ని గలవు. యూరపుఖండమునుండి ప్రతి ఏటను లక్షలుగ బీదలగు తెల్లవారు అమెరికాకు వలస పోవుదురు. వారు [illegible] న్యూయార్కు నగరమున దిగుదురు.

న్యూయార్కులో నున్నట్టియు, న్యూయార్కుకు క్రొత్తగా వచ్చుట దిగునట్టియు బీదలగు పిల్లలకందరకును అన్నవస్త్రము లిచ్చి విద్యార్థివసతిగృహములలోనుంచి జీతము లేకుండ ప్రైమరీ, ఉత్తమపారిశ్రామిక విద్యనేర్పుటకు తగిన ప్రతిష్ఠాపనలు న్యూయార్కు పట్టణమున లెక్కలేనన్నిగలవు. ధనవంతులు చేయు సహాయమువలన ఈ ఏర్పాటులు జరుగుచున్నవి. అచట నా పిల్లలాంగ్లేయభాషను వారి స్వభావను ప్రకృతి శాస్త్రము లను అమెరికాదేశ చరిత్రమును చదివి తాము పెంపకము నకు వచ్చిన అమెరికా సంయుక్త రాష్ట్రములందు అత్యంత దేశాభిమానమును గర్వమును నేర్చుకొందురు. పిల్లల ఆరోగ్యము నరయుటకు వైద్యులు మంత్రసానులు గలరు. పిల్లలు ఆడుకొనుటకు ఆటస్థలములును చదువుకొనుటకు గ్రంథాలయములును గలవు. బీదలయిండ్లను దర్శించి తల్లులకు శిశుపోషణ నుగూర్చి సలహానిచ్చుటకును వైద్యసహాయము చేయుటకును తిరుగుచుండు వైద్యులను మంత్రసానులను చాలమంది ఏర్పడి యున్నారు కోటీశ్వరులగు వారిలో చాలమంది తమ ధనము తమ దేశమునకు వినియోగపడవలెనను దేశాభిమానము కలిగి యుండుటవలననే ఇంతపని జరుగుచున్నది. కార్నిజీ అను కోటీశ్వరుడు గ్రంథాలయములకును విద్యాలయములకును ఎంతో దానధర్మములు చేయుచున్నాడు. ఇంతవరకు ఏబది ఆరుకోట్ల రూప్యముల ధనమును దానధర్మములకు వెచ్చించి యున్నాడు. ఇంకను ధనము తరుగుటలేదు. మార్గన్ అను కోటీశ్వరుడు చిత్తరువులకును కళలకును శిల్పములకును ఎక్కువ సహాయము చేయుచున్నాడు. రాకుఫెల్లరు ప్రకృతిశాస్త్రీ

శోధనలకును విశ్వవిద్యాలయములకును లెక్కలేనిసొమ్ము వెచ్చించుచున్నాడు. ఫోర్డు అనువాడు మోటారుకార్ల యజమాని. ఫోర్డుకారు అనునది అతను కనిపెట్టిన కారు. హిందూదేశములోను మరి ఇతరదేశములోను క్రైస్తవమతబోధనల్పు తెల్లపాదిరీలకు (బోధకులకు) తలావక ఫోర్డుకారు ఉచితముగా నిచ్చుచున్నాడట! అమెరికాలో మోటారుకార్లు చాల చవుక. మరియు వాటిని పెట్టుకోగలవారును విశేషముగా గలరు. అచటి కార్మికులలో చాలమందికి స్వంత మోటారు కార్లుండును. వాటిలోనే ఎక్కి కూలిపనిచేసుకొనుటకు పోయివచ్చెదరు. మనదేశములో కార్మికులకు వంటెద్దుబండ్లు ఉన్నట్టులనే అచట మోటారుకార్లుండును. మన దేశమునకును ఆదేశమునకును ఐశ్వర్యములోకూడ అంతే భేదము.

నవనాగరికత

సంయుక్తరాష్ట్రములు నవీనమగు దేశము. ప్రతిసంవత్సరము సగటున పదిలక్షలకు తక్కువగాకుండ యూరపు ఖండమునుండి తెల్లవారు ఇచ్చటికి కాపురమునకు వచ్చుచున్నారు. ప్రథమములో యూరపుయొక్క పశ్చిమభాగమునుండి అనగా యింగ్లాండు, ఫ్రాన్సు, ఐర్లండు, జర్మని, స్పైన్, హాలెండు దేశములనుండి వలస వచ్చిరి. కాని రానురాను ఆదేశములనుండి ప్రజలువలస వచ్చుట చాల తక్కువయినది. యూరపు ఖండపు తూర్పు దేశములగు రొమేనియా, బాల్కనురాష్ట్రములు, రుష్యా, టర్కీ, ఆర్మీనియా, ఆస్ట్రియా మొదలగు దేశములనుండి వచ్చుచున్నారు. రాచకీయ నిర్బంధములకును మతనిర్బంధముల

కును పడలేక ఫలన వచ్చెడి ధీరులిపుడు వచ్చుటలేదు. ఏటేట బీదలగువారు స్త్రీలు పురుషులు పిల్లలు వచ్చుచున్నారు. ఈ వచ్చువారు స్వేచ్ఛగా అమెరికాలో ద్రవ్యార్జన చేసికొనుటకై వచ్చుచున్నారు. సాంఘికాచారములు పూర్వ సాంప్రదాయములు మొదలగు ప్రాతబంధములను పూర్తిగా త్రెంచి వచ్చునట్టియు స్వతంత్రమునే పూర్తిగా కోరునట్టియు జనులే విశేషముగా అమెరికాకు చేరుచున్నారు.

అమెరికా దేశములో పాశ్చాత్య నాగరికత మూర్తీభవించినదని చెప్పదగియున్నది. ప్రజలు క్రైస్తవ మతము నవలంబించుచున్నప్పటికిని అమెరికా ఆధ్యాత్మిక దేశముగాదు. ద్రవ్య సంపాదనము రాజకీయ వ్యవహారములు, ఐహిక సౌఖ్యములు వీటియందు ప్రజలు నిమగ్నులైయున్నారు. హిందూదేశములోవలె నచట గొప్పదేవాలయములు, మసీదులు, పుణ్యక్షేత్రములు లేవు. పవిత్రనదులు, యాత్రా స్థలములు తపోవనములు ఆశ్రమములు లేవు. సన్యాసులు, భిక్షువులు, పకీర్లు, బైరాగులు అచట లేరు. కాని అచ్చట (Organised Social Service) మంచి ఏర్పాట్లతోడ జరుగుచున్న సాంఘికసేవలో తమ జీవితమును గడుపుచున్న స్త్రీలు పురుషులు పిల్లలు వేలకు వేలుగలరు. వీరు విద్యాభివృద్ధి, రోగుల చికిత్స, దీనులపోషణము మొదలగు సాంఘిక సేవయందు పనిచేయుచున్నారు. అమెరికాకు స్వతంత్రము ఐశ్వర్యముగలదు. ఆధ్యాత్మిక జ్ఞానము కావలెను. హిందూదేశమునకు ఆధ్యాత్మిక జ్ఞానము గలదు. స్వతంత్రము ఐశ్వర్యము కావలసియున్నవి.

అమెరికాలో స్త్రీలకు పురుషులతో బాటు సంపూర్ణ స్వతంత్రము గలదని చెప్పనక్కరలేదు.

**స్త్రీలు** పురుషులతో బాటు స్త్రీలు కూడ విద్య నేర్చుకొనినారు. స్వతంత్ర సంపాదనమునందును నీగ్రో బానిసత్వ నిర్మూలమునందును పురుషులతో బాటు స్త్రీలు పనిచేసియున్నారు. ఇపుడు రాచకీయ సాంఘిక వ్యవహారములలో నేగాక దాదాపుగా అన్ని వృత్తులలోను స్త్రీలు ప్రవేశించుచు పురుషులకు పోటీగనున్నారు. అనేక రాష్ట్రములలో స్త్రీలకు ఓట్లుగలవు. స్త్రీలు శాసన సభ్యులుగ నున్నారు. ఉద్యోగములు చేయుచున్నారు. ఈమధ్యనే ఒక స్త్రీ ఒక రాష్ట్రమునకు గవర్నరుగ నెన్నుకొనబడెను.

1910 వ సంవత్సరపు జనాభాగణితీవలన ఆరులక్షల పందొమ్మిది వేలమంది ఉపాధ్యాయవృత్తి స్వీకరించినవారిలో నాలుగులక్షల ఎనుబది నాలుగు వేల మంది స్త్రీలు గలరు 1343 మంది స్త్రీ లాయర్లును (న్యాయవాదినులును) 9015 మంది స్త్రీ డాక్టర్లును (వైద్యులును) గలరు. సంగీతమును నేర్పు ఉపాధ్యాయినులుగా 8447౩ మందియున్నారు. టైపు రైటర్లు 263315 మందియు లెఖలు వ్రాయువారు 187155 మందియున్నారు. ఇంత సాంఘిక స్వతంత్రముగల ఆచారము లేర్పడియుండి, ప్రతిసేటను కడుబీదలగు స్త్రీపురుషులు పది లక్షలమంది, యూరపునుండి వచ్చుచుండినపుడు మానవస్వభావములోగల బలహీనతను అవకాశము తీసుకొనువారుకూడ నుండకపోవుదురా? పట్టణములలో నైతికబలహీనతవలనను పేదరికమువలనను వ్యభిచారవృత్తికి లోబడుచున్న దౌర్భాగ్య

లగు స్త్రీల స్థితినిగూర్చి (Vice Commission) విచారించుట కేర్పడినకమిటీవారు ఒక్క చికాగో పట్టణములో వ్యాధివలనను మరణమువలనను వ్యభిచారమునకు అనర్హులగుచున్న వారిస్థానమునకు ప్రతిసాలున వ్యభిచారమునకు వచ్చుచున్న క్రొత్త స్త్రీలసంఖ్య అయిదువేలనియు అందులో షుమారు సగము మంది పదునేడు సంవత్సరములలోపు వయస్సుబాలికలనియు తేలినదని వ్రాసియున్నారు. ఇంత అమాయికలగు బాలికలను వ్యభిచారదౌర్భాగ్యములో పడకుండ కాపాడుటకై మార్గములను అన్వేషించవలెనని ప్రభుత్వమువారిని కోరియున్నారు. వివాహ విచ్ఛేదములుకూడ అమెరికా కోర్టులలో తరుచుగా జరుగుచుండును. నూటికి ఒకటి చొప్పున వివాహములు కోర్టులద్వారా విచ్ఛేదమగుచున్నవని లెక్కలవలన తేలినది. రోమను కాథలిక్కు మతస్థులలో వివాహవిచ్ఛేదములు జరుగుటకు వీలులేదు. ఇటులనే కాలిఫోర్నియా రాష్ట్రములో కూడ కోర్టులలో వివాహవిచ్ఛేదములు జరుపరు. అమెరికాలో పత్రికాపఠనమెంత ఎక్కువగనున్నదో చూపుటకు క్రింది నిదర్శనములు చాలును. (The Ladies Home Journal) స్త్రీల గృహపత్రిక అనుమాసపత్రికకు పదునెనిమిదిలక్షలమంది స్త్రీలు చందాదారులుగ నున్నారు. "The Woman's Home Companion" స్త్రీకి గృహమునందుతోడు, అనుమాసపత్రికకు పదునాలుగులక్షల అరువదిఏడుమంది స్త్రీలు చందాదారులుగ నున్నారు. అమెరికాలోగల ప్రధాన దినపత్రికల కన్నిటికిని లక్షలకొలది చందాదారులు గలరు. పత్రికలును లెక్కలేనన్ని గలవు.

**విదేశవ్యవహారములు.**

సంయుక్తరాష్ట్రములు చాలా పెద్దదేశమగుటచే వ్యవసాయము గనులు పరిశ్రమలు మొదలగునవి అభివృద్ధి చెందుటకును దేశముయొక్క ఆర్థికసంపదను పెంపొందచేయుటకును ఇంక నెంతయో అవకాశము గలదు. జనులాక్రమించుకొనదగిన ప్రదేశ మెంతయో గలదు. కావున సంయుక్తరాష్ట్రముల ప్రభుత్వమువారు ఖండాంతరములలో రాజ్యవ్యాపకము చేసుకొనుటకు ప్రయత్నించుటలేదు. తమ దేశమును బాగు చేసుకొనుటలోనే తమ ప్రభుత్వముయొక్క యావచ్ఛక్తిని వినియోగించవలెననియు రాజ్యసంపాదన కొద్దిమంది భాగ్యవంతులకు మాత్రమే లాభదాయకమై జనసామాన్యమునకు నష్టకరమనియు తలచు కక్షివారి ప్రాబల్యము ఆ దేశమందు విశేషముగా గలదు. అమెరికాఖండములో యూరపు ప్రభుత్వములవారు జోక్యము కలుగజేసుకొనగూడదనియు క్రొత్త రాజ్యములను స్థాపించగూడదనియు అమెరికా ఖండములోని ప్రతిదేశప్రజలును తమ యిచ్చవచ్చిన ప్రభుత్వమును స్థాపించుకొనుటకు సంపూర్ణమగు అవకాశ ముండవలెననియు యూరపు ప్రభుత్వములవారు అమెరికాఖండములోని ఏ దేశముతో జోక్యము పుచ్చుకున్నను తాము దానిని ప్రతిఘటింతుమనియు 1823 వ సంవత్సరమున సంయుక్తరాష్ట్రముల అధ్యక్షుడగు మన్రో ప్రకటించెను. తరువాత యూరపు ప్రభుత్వముల కుట్రలోను తగాదాలలోను యుద్ధములలోను సంయుక్తరాష్ట్రముల ప్రభుత్వమువారు జోక్యము పుచ్చుకొనకుండుటయే రాజనీతిగా పెట్టుకొనినారు. అమెరికాఖండము

అమెరికనులక్రిందనే ఉండవలెను” అను భావమును సంయుక్తరాష్ట్రములు ప్రోత్సహించుచున్నవి. సంయుక్తరాష్ట్ర స్వాతంత్ర్యమును ప్రకటించినతరువాత నూరు సంవత్సరములు నిండిన తేదీన ఉత్సవము జరపినపుడు అమెరికాఖండములోని అన్ని దేశముల ప్రతినిధులను రావించి అమెరికాఖండము అమెరికావాసులది అను తీర్మానములను చేసియున్నారు. కనడా దేశము ఇంగ్లీషువారికిని గైనాదేశము ఇంగ్లీషువారికిని ఫ్రెంచివారికిని డచ్చివారికిని లోబడియున్నవి. ఈ రెండు దేశములు తప్ప ఉత్తర దక్షిణ అమెరికా ఖండములలోని తక్కిన అన్ని దేశములును స్పెయిన్ మొదలగు యూరపు ప్రభుత్వముల క్రింద తిరుగబడి స్వతంత్రములై పోరాడి సంపూర్ణ ప్రజాస్వామ్యములై విలసిల్లుచున్నవి గాని 1914వ సంవత్సరము మొదలు 1919 వరకు జరిగిన ప్రపంచ యుద్ధములో మాత్రము సంయుక్తరాష్ట్రములు జోక్యము కలుగ చేసుకొని జర్మనులకు వ్యతిరేకముగ మిత్రమండలి వారికి సహాయము చేసియున్నారు. మానవకోటికి స్వాతంత్ర్యము అన్ని జాతులకును స్వయం నిర్ణయము మొదలగు గొప్ప ఆదర్శములతో అమెరికా అధ్యక్షుడగు విల్సన్ మహాశయుడు ఆ యుద్ధములోనికి దిగి సుప్రసిద్ధమగు పదునాలుగు సూత్రములను ప్రతిపాదించెను. కాని ఆంగ్లేయ ప్రధానమంత్రియగు లాయిడుజార్జి, ఫ్రాన్సు ప్రధానమంత్రి క్లెమెన్షో, ఇటలీ ప్రధానమంత్రి ఆర్లెండో వీరి కూటాలోచనలకు లోబడి విల్సన్ సభాపతి తనయుత్కృష్ట స్థానమున గోల్పోయెను. విల్సన్ సభాపతియొక్క పదునాలుగు సూత్రములను మంటగలిపెను.

రాజ్యసంపాదనము.

పసిఫిక్ మహాసముద్రములో యాజమాన్యము వహించవలెనని సంయుక్తరాష్ట్రముల ప్రభుత్వము వారు ప్రయత్నించుచున్నారు. జపాను, చైనా, రుష్యాలు ఆ మహాసముద్రముయొక్క ముఖ్యరాజ్యములు. చైనా, రుష్యాలు సంయుక్తరాష్ట్రములతో పోటీకి రాలేవు జపానుమాత్రము బలవంతమైనదై సంయుక్తరాష్ట్రములకు పోటీగనున్నది. జపానువారు చైనానుమ్రింగి అధికబలవంతులుగాకుండా సంయుక్తరాష్ట్రముల ప్రభుత్వము వారు. చైనాయొక్క స్వతంత్రమునకు అండగా నిలువబడినారు. యూరపుప్రభుత్వము లెవరును పసిఫిక్ మహాసముద్రములో క్రొత్తగా బలవంతమైన స్థానము లేర్పరచుకొనకుండ జపాను, సంయుక్తరాష్ట్రములు చూచుచున్నవి. ఇంగ్లాండునకు అచట ఆస్ట్రేలియా గలదు. ఇంగ్లాండు ఇటు జపానుతోను అటు సంయుక్తరాష్ట్రములతోను సంధిచేసుకొని జాగ్రత్తగ వచ్చుచున్నది. ఇరువది సంవత్సరముల కాలములో పసిఫిక్ మహాసముద్రములోని కొన్ని ముఖ్యమగు ద్వీపములను సంయుక్తరాష్ట్రములు సంపాదించినవి.

1867 వ సంవత్సరమున అలాస్కాను రుష్యాప్రభుత్వమునుండి సంయుక్త రాష్ట్రములు కొనినది. దానిలోనిపుడు మేలైనబంగారమును విశేషముగా నేలబొగ్గును దొరకుచున్నవి. అలాస్కాకు సమీపముననున్న హావాయిద్వీపములలో మొదట మతబోధకులుగను తరువాత వర్తకులుగను కాఫీతోటల వ్యవసాయకులుగను ప్రవేశించి అచట జరిగిన నొక తిరుగబాటు నవకాశము తీసుకొని యా ద్వీపములను

సంయుక్త రాష్ట్రములక్రింద చేర్చుకొనిరి. ఆ ద్వీపవాసులకు అమెరికనులతోపాటు పౌర స్వత్వముల నిచ్చియున్నారు. ఆద్వీపములు పసిఫిక్కు మహా సముద్రమునకు తాళముచెవివలె నున్నవి. అచట అమెరికావారి నౌకాదళ ముంచబడుచున్నది. పసిఫిక్కు మహా సముద్రముయొక్క వుత్తరప్రాంతమున జరుగు వర్తక వ్యాపారమునకవి మిక్కిలి యుపయోగకారిగా నున్నవి. వానినుండి వుత్తర దక్షిణ అమెరికా ఖండములను రెంటిని సంరక్షించు కొనుటకు వీలగును. గ్వాము ద్వీపమును 1898 సంవత్సరమున స్పెయిన్ వారితో జరిగిన యుద్ధములో సంపాదించిరి. టూట్యుయిలా, రోజు, ద్వీపములను ఫిలిప్పైన్ దీపములనుకూడ సంపాదించిరి. వీటివలన పసిఫిక్కు మహా సముద్రములోని వర్తకపు త్రోవలపై యాజమాన్యము వహించుటయేగాక సంయుక్త రాష్ట్రముల నౌకాదళము లుండుటకుకూడ మంచి తావులు దొరికినవి. 1914 సంవత్సరములో పనామా జలసంధివరకు గొప్ప కాలువను త్రవ్వట వలన అమెరికాయొక్క వర్తకాభివృద్ధికి మంచి వీలుకలిగినది. పసిఫిక్కుమహాసముద్రముగుండవచ్చి అమెరికాసరుకులు చీనా రాజ్యములో విశేషముగ అమ్ముడువోవుచున్నవి. హిందూదేశ మునకుగూడ బాగుగా వచ్చుచున్నవి. అట్లాంటిక్కు మహా సముద్రములోని క్యూబా ద్వీపము స్పెయిన్ వారిక్రింద నుండెను. దానిని తను కమ్మవలసినదని స్పెయిన్‌వారిని సంయుక్తరాష్ట్ర ముల ప్రభుత్వమువారు కోరిరి కాని స్పెయిన్ ప్రభుత్వమువారు నిరాకరించిరి. 1895 మొదలు 1898 వరకు క్యూబాలోని ప్రజలు స్పెయిన్ ప్రభుత్వముపై తిరుగబాటులు చేయు

చుండుటయు స్పెయిన్ వారు క్రూరముగా అణచుచుండుటయు జరిగెను. తిరుగబాటుదార్లకు సహాయము చేయుటకు 1898 సంవత్సరములో సంయుక్త రాష్ట్రముల ప్రభుత్వమువారు నిశ్చయించి స్పెయిన్‌పై యుద్ధమును ప్రకటించిరి. జరిగిన యుద్ధములో స్పెయిన్ పూర్తిగ నోడిపోయి సంధిని కోరెను. తమక్రింద నుండిన క్యూబా, పోర్టోరికో, గూఆం, ఫిలిప్పైన్ ద్వీపములను సంయుక్త రాష్ట్రముల కిచ్చి స్పెయిన్ వారు గాజీపడిరి. క్యూబాలో సంపూర్ణమగు ప్రజాస్వామ్యమును స్థాపించి యచట సంయుక్త రాష్ట్రములకు కొన్ని వర్తకపు హక్కు లుండునట్లును, క్యూబాను విదేశీయులనుండి సంయుక్తరాష్ట్ర ప్రభుత్వము కాపాడునట్లును యేర్పాటు గావించిరి. ఇక ఫిలిప్పైన్ ద్వీపములకు వత్తము.

**ఫిలిప్పైన్ ద్వీపములు**

ఫిలిప్పైన్ ద్వీపములు అసియాఖండములోనివి. పసిఫిక్కు మహాసముద్రములో జపానుకు దక్షిణమున నున్నవి. వీటి వైశాల్యము 27853 చదరపుమైళ్లు అనగదాదాపుగా మదరాసు రాజధాని యంత వైశాల్యము గలవిగాను జనసంఖ్య 110 లక్షలు అనగ గంజాం, విశాఖపట్టణము, గోదావరి, కృష్ణాజిల్లాలు కలిసిన జనసంఖ్యతో సమానముగా మాత్రముండును. ఈద్వీపవాసులు ఆసియాఖండవాసులయినను విశేషనాగరికులు గారు. ఈద్వీపములు చాలకాలము స్పెయిన్‌వారిక్రింద నుండెను. ప్రజలు చాలవరకు క్రైస్తవమతమును స్వీకరించిరి. కొంతవరకు స్పెయిన్ భాషను నేర్చుకొనిరి. 1898 వ సంవత్సరమున స్వతంత్రమును పొందుటకు ఫిలిప్పైన్ ప్రజలు స్పెయిన్ ప్రభుత్వముపై తిరుగబడిరి.

సంయుక్త రాష్ట్రములవారి సహాయమును కోరిరి. సంయుక్త రాష్ట్రముల ప్రభుత్వమువారు స్పైన్‌తో పోరాడి స్పైన్ నోడించి ఈద్వీపములను స్వాధీనమును పొందిరి. గాని ఈద్వీపవాసులు కోరినది స్వతంత్రముగాని సంయుక్త రాష్ట్రముల పాలనము కాదు. అందువలన అగునియనల్డో యను దేశీయనాయకుని నాయకత్వముక్రింద స్వతంత్రమునకై సంయుక్త రాష్ట్రములతో పోరాడిరి. 2 సంవత్సరములు పోరు తీవ్రముగా జరిగెను. ఆస్వతంత్రపోరాటములో ఫిలిపైన్‌ద్వీపవాసులు చాలమంది హతులైరి. వారి గ్రామములను అమెరికనులు నాశనము చేసిరి. పిల్లలను స్త్రీలనుకూడ నరికివేసిరి. అమెరికనులకు జయము కలిగెను. అమెరికా సంయుక్త రాష్ట్రములకు ఫిలిప్పైను ద్వీపములు పూర్తిగ స్వాధీనమాయినవి.

1900 సంవత్సరమువరకును ఆద్వీపములను అమెరికా వారి సైనిక ప్రభుత్వమే పాలించెను. 1900 నుండియు ఫిలిప్పైను ద్వీపములలో సైనిక ప్రభుత్వము తీసివేయబడి స్వపరిపాలనావిధానమును అమెరికావారు వృద్ధిచేయుచున్నారు. తిరుగబాటులు చల్లారినప్పటికిని ఫిలిప్పైన్ ద్వీపవాసులలో అమెరికాకుగాని మరేదేశమునకుగాని లోబడియుండకూడదను సంపూర్ణ స్వతంత్రేచ్ఛ ప్రజ్వరిల్లుచునేయున్నది. ఇపుడది శాంతియుతమగు ఆందోళనముగ మారినది. త్వరగ సంపూర్ణ స్వతంత్రము ప్రసాదించవలెనని అమెరికావారిని స్వతంత్రవాదులు కోరుచున్నారు. అమెరికాలో ఫిలిప్పైన్ ద్వీపములను స్వాధీనమును పొందుటయే అక్రమమనియు వా[illegible] వెంటనే సంపూర్ణస్వతంత్రము నిచ్చి లేచి రావలసినదనియు

ఆందోళనముచేయుశక్తియున్నది. కావున ప్రథమముననే అమెరికావారు ఫిలిప్పైన్‌ద్వీపము లను పరిపాలించుచున్నకారణము. "సంయుక్తరాష్ట్రములలాభముకొరకుకాదనియుఫిలిప్పైన్‌ద్వీపవాసుల లాభముకొరకు వారికి స్వరాజ్యమునకు అర్హులుగా తరిబీయతు చేయుటకు మాత్రమే ననియు" ప్రకటించియున్నారు. అమెరికా తనవాగ్దత్తమును కొంతవరకు చెల్లించుకొనుచున్నది. అమెరికా క్రిందికి వచ్చినప్పటినుండియు ఫిలిప్పైన్ ప్రజలలో విద్య బాగుగా వ్యాపింపజేసియున్నారు. 1912 సంవత్సరమునుండి 1913 సంవత్సరములో బ్రిటిషు హిందూదేశములో విద్యార్థులసంఖ్య నూటికి అయిదవంతున వృద్ధిచెందినది. ఫిలిప్పైన్ దీవులలో నూటికి నలుబదియొక్కటి చొప్పున వృద్ధి అయినది. పరిశ్రమలను విశేషముగ వృద్ధిచేసినారు. పారిశ్రామిక వ్యవసాయిక పాఠశాలలను విరివిగా నెలకొలిపినారు. స్థానికస్వపరిపాలనను మంచిపద్ధతులమీద స్థాపించినారు. 1900 సంవత్సరములో ఒకగవర్నరు జనరలును ఫిలిప్పినోకమీషన్ అను కార్య నిర్వాహకవర్గమును రెండు శాసనసభలను ఏర్పాటు చేసిరి. మొదటిదానిలో పూర్తిగ ప్రజలచేనెన్నుకొనబడుసభ్యులుండిరి. గవర్నరుజనరలయొక్క కార్యనిర్వాహక వర్గమే రెండవ శాసన సభగా ఏర్పడినది. వీరందరిని అమెరికా అధ్యక్షుడు నియమించెను.

క్రైస్తవులు కాపురమున్న రాష్ట్రములకన్నిటికిని శాసనసభలు శాసనములను చేయుచుండెను. క్రైస్తవులుకాని మోటజాతులవా రున్నప్రదేశములను గవర్నరు జనరలే కార్యనిర్వాహకవర్గ సహాయముచే పాలించెను. ఉత్తమ

న్యాయస్థానములో ముగ్గురు దేశీయ న్యాయాధిపతులును నలుగురు అమెరికను న్యాయాధిపతులును నియమింపబడిరి. గవర్నరు జనరలుయొక్క కార్యనిర్వాహక వర్గములో నలుగురు దేశీయులను అయిదుగురు అమెరికనులును నియమింపబడిరి. 1914 సంవత్సరములో విల్సన్ సభాపతి కార్యనిర్వాహక వర్గమునకు ఎక్కువమంది దేశీయులను నియమించెను. తిరిగి 1916 వ సంవత్సరములో స్వరాజ్యములో నెక్కువభాగమిచ్చుచు మరియొకచట్టము చేయబడినది. దానికి జోన్సు చట్టమనిపేరు. అది ఇపుడు అమలులో నున్నచట్టము. దానియుపోద్ఘాతము నందిట్లున్నది.:—సంయుక్త రాష్ట్రములు ప్రథమమున స్పెయిన్‌తో పోరాడిన యుద్దేశ్యము రాజ్యము సంపాదించవలెనను కోరికతో గానేకాదు గావునను; ఫిలిప్పైన్ ద్వీపములలో స్థిరమగు ప్రభుత్వమేర్పడగనే తమ అధికారమును వదులుకొని యాద్వీపముల స్వాతంత్రమును అంగీకరించుటయే ఎప్పుడును సంయుక్త రాష్ట్రముల యుద్దేశ్యము గనుకను; సదరుఉద్దేశ్యము నెరవేరుటకును సంపూర్ణస్వతంత్రము లభించినపుడు దానిజవాబుదారిసి హక్కులను బాగుగా అనుభవించుటకు తయారగుటకుగాను ఫిలిప్పైన్ ద్వీపవాసులకెక్కువస్వపరిపాలనమిచ్చుట ఆవశ్యకముగావునను జోన్సుచట్టప్రకారము క్రైస్తవులు కాపురమున్నను లేకున్నను దేశమంతయు శాసనసభలక్రిందికి తేబడెను. రెండు శాసనసభ లేర్పడెను. మొదటిది ప్రజా ప్రతినిధి సభ. రెండవది శిష్టసభ. రెండును ప్రజలచే పూర్తిగ నెన్నుకొనబడినవి. నాణెములు, కాగితపు ద్రవ్యము, విదేశీయులను రానిచ్చుట

ఈ మూడు విషయములలో మాత్రము శాసనసభలు చేయు చట్టములను అమెరికా అధ్యక్షుడంగీకరించవలసియున్నాడు. తక్కిన అన్ని విషయములలోను ఫిలిప్పైను శాసన సభలు చట్టములను చేసి అమలు జరుపవచ్చును. గవర్నరు జనరలు అమెరికా అధ్యక్షునిచే నియమింపబడెను. కార్యనిర్వాహక వర్గములో నెనిమిది ఫిలిప్పినో కమీషనులలో నెక్కువమంది ఫిలిప్పినోలు నియమింపబడిరి. వ్రాయను చదువను నేర్చినను సరే లేక కొంత ఆస్తియున్నను సరే ప్రతి ఇరువదియొక్క సంవత్సరము దాటిన పురుషునికిని ఓటు ఇవ్వబడెను. అమెరికా వలె ఫిలిప్పైన్ ద్వీపవాసులకును పత్రికాస్వాతంత్ర్యము వాక్స్వాతంత్ర్యము విచారణ లేకుండ ఖైదులో నుంచగూడదను హక్కు మొదలగు పౌరస్వత్వములు ప్రకటన గావింపబడెను. ఖాళీలు రాగానే పెద్ద యుద్యోగములను అమెరికనులకు బదులు దేశీయులను నియమించుచుండిరి. సివిలు సర్వీసు ఆక్టుయొక్క 6 వ సెక్షను నందిట్లు చేర్చబడినది. "ఇతర అర్హతలు సమానముగా నున్నపుడు సివిలు సర్వీసు ఉద్యోగములకు మొదటిపక్షముగా ఫిలిప్పైన్ ద్వీపవాసులను ఫిలిప్పైన్ పౌరస్వత్వములను పొందినవారిని; రెండవపక్షముగా సంయుక్తరాష్ట్రముల సైనిక నౌకాదళ కొలువునందుండి గౌరవముగా కొలువుమానిసినవారిని; మూడవపక్షముగా సంయుక్తరాష్ట్రముల కాపురస్థులను నియమింపవలెను." సివిలు సర్వీసు పరీక్షలు ఫిలిప్పైన్ రాజధానియగు మనిల్లాలోను సంయుక్తరాష్ట్రములలోను ఒకేసారి జరుగును. అందులో ఉత్తీర్ణులైన ఫిలిప్పైన్ దేశీయులు లేనపుడుమాత్రమే

అమెరికనుల నుద్యోగము లిచ్చెదరు. ఉపాధ్యాయులను ప్రత్యేక శాస్త్రజ్ఞానము గలవారినితప్ప సాధారణముగా అమెరికానుండి యుద్యోగములకు తెచ్చుట లేదు. ఉద్యోగముల నన్నిటిని త్వరగా ఫిలిప్పైన్ దేశీయులకు వశముచేయవలెనను నుత్సాహముతో అమెరికా ప్రభుత్వమువారు పని చేయుచున్నారు. ఫిలిప్పైను ద్వీపములలో సివిలు సర్వీసు ఉద్యోగస్థులను ప్రభుత్వశాఖలకు ప్రధానోద్యోగస్థులుగా వేయుపద్ధతిలేదు. గవర్నరు జనరలుయొక్క కార్యనిర్వాహకసభ్యులుగా సివిలు సర్వీసు ఉద్యోగస్థు లుండుటకు వీలులేదు.

కాని ఇంతటితో ఫిలిప్పైనోలు సంతృప్తిచెందలేదు. సంపూర్ణస్వతంత్రమును కోరుచున్నారు. తమదేశములో శాంతియుతమైన స్థిరప్రభుత్వ మేర్పడినదనియు, సంపూర్ణస్వతంత్రమునకు తాము అర్హులమనియు, ఇదే తమజాతియొక్క స్వయంనిర్ణయమనియు 1919 సంవత్సరము ఫిబ్రవరి 23 వ తేదీన నొక రాయబారమును అమెరికాకు పంపిరి. ఫిలిప్పైన్ ద్వీపములలో గవర్నరు జనరలుగ పనిచేసిన హారిసనుగారు అమెరికను కాంగ్రెసు యెదుట ఫిలిప్పైన్ ద్వీపములలో స్థిరప్రభుత్వ మేర్పడినదనియు ఫిలిప్పైనోలు స్వతంత్రమునకు తగియున్నారనియు సాక్ష్యమిచ్చిరి. 1920 సంవత్సరము డిశంబరు 7 వ తేదీన సంయుక్తరాష్ట్రముల కాంగ్రెసునకు సందేశము నొసంగుచు అధ్యక్షుడగు విల్సన్ మహాశయు డిటుల చెప్పెను:— "కాంగ్రెసువారు కావించిన క్రిందటి యేర్పాటుయొక్క యనంతరము నియమించిన షరతును

నెరవేర్చుచు స్థిర ప్రభుత్వమును పోషించుటలో ఫిలిప్పైన్ వాసులు జయశీలురైరను సంశయమును మీ దృష్టికి దెచ్చుచున్నాను. స్వాతంత్ర్య మిచ్చుటకు నియమించిన షరతును నెరవేర్చి యున్నారు. వారు వారిధర్మమును నిర్వహించిరనియు మర్యాద పూర్వకముగ విన్నవించుచు, ఆ దీవుల ప్రజలకు స్వాతంత్ర్య ప్రదానమొసంగి మన వాగ్దానమును నిలబెట్టుకొని మన ధర్మమును స్వేచ్ఛను కాపాడుకొన వలసిన సమయ మేతెంచినది. ”

కాని ఫిలిప్పైన్‌లకు స్వతంత్రమిచ్చిన జపాను వాటిని మ్రింగివేయునని అమెరికనులు కొందరు చెప్పిరి. 1921 సంవత్సరములో జపాను ప్రధాన మంత్రి ఫిలిప్పైన్ వాసులకు స్వాతంత్ర మొసగినచో ఫిలిప్పైన్ల స్వతంత్రమును కాపాడుటకు తాను పూచీపడెదనని చెప్పెను. కాని యింకను అమెరికావారు స్వతంత్రమివ్వలేదు. ఈ మధ్యను కూలిడ్జి సభాపతి ఫిలిప్పైన్ ద్వీపములకు స్వతంత్రమివ్వక తప్పదని నుడివెను. ఫిలిప్పైన్ ద్వీపములకు వెంటనే అమెరికావారి రాజ్యములో సంపూర్ణముగ స్వరాజ్యమిచ్చుచు, యిరువది సంవత్సరములలో స్వతంత్రమిచ్చు చట్టమొకటి తయారై అమెరికా శాసనసభల ఎదుట నున్నది. ఇది చట్టముగా అంగీకరించబడినచో ఫిలిప్పైనులకు అమెరికా పతాకముక్రింద సంపూర్ణమగు బాధ్యతాయుత పాలనము (స్వరాజ్యము) లభించగలదు. ఫిలిప్పైన్ ద్వీపములలో ప్రజాస్వామ్యము (Republic) స్థాపించబడును. గవర్నరుజనరలునుకూడఫిలిప్పైన్ వారే ఎన్నుకొనెదరు. ప్రజలచే ఎన్నుకొనబడిన శాసనసభలు

చట్టములన్నిటిని చేయును. అన్నివ్యవహారములును ఫిలిప్పైన్ వాసులే నిర్వర్తించు కొనెదరు. అమెరికాతరఫున నొక రెసిడెంటు ఆద్వీపములలో నుండును. నైజాంరాష్ట్రములలో బ్రిటిషువారి రెసిడెంటున్నటుల నుండును. ఫిలిప్పైన్ శాసన సభలు చేయు శాసనమునుదేనినైన అవసరమైనచో రద్దుచేయు అధికారమును క్లిష్టపరిస్థితులలో సైన్యమును పిలిపించుకొను అధికారమునుమాత్రము ఈరెసిడెంటుహస్తములలోనుండును. 1944 వ సంవత్సరమున అమెరికావారు తమ సామ్రాజ్యాధి కారమునువదలుకొని యాదీవులకు సంపూర్ణస్వాతంత్రమిత్తురు. ఈ బిల్లుకు ఫిలిప్పైన్ వాసులలో చాలమంది అంగీకరించి నట్లే కనబడుచున్నది. కాని యొకకక్షివారు మాత్రము స్వతంత్రప్రదానమునకు ఇరువదిసంవత్సరముల కాలము చాల ఎక్కువనియు నాలుగుసంవత్సరములు చాలుననియు వాదించు చున్నారు. 1919 సంవత్సరము జనేవరినెలలో ఫిలిప్పైన్ రాజధానియగు మనిల్లాలోజరిగిన ప్రాచ్యదేశముల న్యాయవా దుల సమావేశమునకు వచ్చిన జపాను ప్రతినిధి డాక్టరు మసు జీమాగారియుపన్యాసములోని ఈదిగువవాక్యములు గమనించ దగియున్నవి:-"కొంతమంది రాజకీయవేత్తలకు "స్వతంత్రము" "ప్రజాపాలనము" అనుమాటలు బాగుగా అర్థముగావు. కాని ప్రజాపాలనముయొక్క సంగతిని బాగుగా గ్రహించినవారందర కిని, ప్రజాప్రభుత్వము ఏదేశములోనైనను ఏజాతివారిలోనైనను జయప్రదముగా స్థాపించుటకువీలయిన రాజ్యాంగవిధానమనియు ప్రజాప్రభుత్వమే యేదేశ ప్రజలయొక్కగాని లాభములను ఎక్కువ బాగుగా కాపాడగలదనియు గోచరింపకమానదు.

ప్రజాప్రభుత్వముయొక్క ఉద్దేశ్యములు సుప్రసిద్ధమగు అమెరికా స్వతంత్ర ప్రకటనమునందు వ్యక్తీకరింపబడినవి. సంయుక్త రాష్ట్రప్రభుత్వమువారు ఆదస్తావేజుయొక్క ఉద్దేశ్యములను సంయుక్తరాష్ట్రప్రజల విషయముననేగాక ప్రపంచములో ప్రతిచోటను వర్తింపచేయుచున్నారు.

ఈదృష్టినుంచి చూచినచో మేము (జపానీయులము) ప్రజాపరిపాలనముయొక్క పద్ధతికై మీకై చూచుచున్నాము. ఆంగ్లేయ రాజ్యములో రాజున్నప్పటికిని ఆది ప్రజాపాలనము గల దేశమే. కొన్నివందల సంవత్సరములనుండియు ఆంగ్లేయరాజ్యముచే భరతవర్షము పాలింపబడుచున్నది. కాని ఇన్నివందల సంవత్సరముల పాలనమునందు ఆంగ్లేయప్రభుత్వమువారు భరతవర్షమునందు చేసిన మంచికార్యము అమెరికా సంయుక్త రాష్ట్రముల ప్రభుత్వమువారు ఫిలిప్పైన్ ద్వీపములలో తమ పాలనముక్రింద నున్న పదకొండు సంవత్సరములలో చేసిన మహాత్కార్యముతో ఏమాత్రము పోల్చుటకు వీలులేనిదైయున్నది. నిజమైన ప్రజాపాలనముయొక్క భావములను సంయుక్తరాష్ట్రములవారు పూర్తిగా గ్రహించి ఆచరణలో పెట్టుచున్నారని నేనుగట్టిగా చెప్పుచున్నాను."

ఓంతత్సత్.

విజ్ఞానచంద్రికా గ్రంథమాల.

## రాబోవు గ్రంథము.

34 వ కుసుమము

# డచ్చి ప్రజాస్వామిక ప్రారంభము.

## (Dutch Republic.)

గ్రంథకర్త

సుప్రసిద్ధ దేశనాయకులగు

## దేశభక్త కొండ వెంకటప్పయ్య పంతులుగారు.

స్పైన్ రాజుయొక్క నిరంకుశత్వమునుండియు దాష్ట్యమునుండియు హాలెండుదేశప్రజలు మతస్వేచ్ఛను రాచకీయ స్వతంత్రమును పొందుటకు జలిపిన మానవచరిత్రలో సుప్రసిద్ధమైన స్వతంత్రపోరాటమిందు కడుమనోహరముగా వర్ణింపబడినది. వెల రు. 2-0-0. చందాదారులకు రు. 1-8-0.

# విజ్ఞానచంద్రికా గ్రంథమాల,

## బెజవాడ.

### నియమములు

1. దేశాభివృద్ధికి ఆవశ్యకములైన గ్రంథములు ప్రచురించి భాషాభివృద్ధి చేయుటయే యీగ్రంథమాల యొక్క యుద్దేశ్యము. ఇందు సంవత్సరమునకు రమారమి 1600 పుటలు గల స్వతంత్రమైన గ్రంథములు ప్రచురింపబడును

2. కొందరు తలచునట్లు ఇది మాసపత్రిక కాదు. ఇందు దేశదేశముల చరిత్రములును, పదార్థవిజ్ఞాన, రసాయన, జీవవృక్ష మొదలగు ప్రకృతిశాస్త్రములును, లోకోపకారులగు మహనీయుల చరిత్రములును, ఇతరభాషలనుండి ఉద్గ్రంథముల భాషాంతరీకరణములును స్వతంత్రముగ ప్రచురింపబడును. చరిత్రానుసారములగు కల్పితకథలు (Historical Novels) కూడ ప్రచురింపబడును.

ఈ గ్రంథమాలలో నిదివరకు అచ్చువేయబడిన గ్రంథముల నన్నిటిని కొనుటయు ఇకముందు ప్రచురింపబడు గ్రంథములనన్నిటిని కొనుటకు ఒప్పుకొనువారు శాశ్వతపు చందాదారులు.

4. శాశ్వతపు చందాదారులకు ఈ గ్రంథమాలలోని గ్రంథములన్నియు చౌకగా అమ్మబడును.

5. శాశ్వతపు చందాదారులు సంవత్సరపు చందా మొదట నీయనక్కరలేదు ఒక్కొక పుస్తక మచ్చుపడగానే అది వాల్యూ పేయబిల్ ద్వారా పంపబడును. పోస్టేజి చందాదారులే భరింపవలయును.

6 వెనుకటిపుస్తకముల నన్నిటిని గొను చందాదారులు ప్రవేశరుసుమియ్యనక్కరలేదు. వెనుకటిపుస్తకముల నన్నిటిని ఒక్కసారి కొనలేనివారు మావద్దనిలువలో నున్న పుస్తకములలో రు ౫-0-0 ల వెలగల పుస్తకములు మొట్టమొదట కొనిన చాలును. మిగత పుస్తకములు తరువాత తెప్పించుకొనవచ్చును. ఆ మిగత పుస్తకములకొరకు వ్రాయునపుడు తమచందా రిజిష్టరుసంఖ్యను ఉదహరింపవలెను.

7. వెనుకటి పుస్తకములు అక్కరలేనివారు ప్రవేశరుసుముక్రింద రు. ౦-౮-౦ చెల్లించవలెను.

8 చందాదారులు మా ప్రచురములలోని గ్రంథములను చందాదారులు పెక్కు ఒకటికన్న నెక్కువ పొందలేరు.

9 గ్రంథమాలలోని గ్రంథములన్నియు నున్నపైన దళసరికాగితములమీద ముద్రింపబడును. శ్రేష్ఠముగ బైండు చేయబడును. సరసమైనవచనశైలిఁ గలిగియుండును. ఇట్లు సర్వాంగసుందరములై చౌకవెలకు దొరకు గ్రంథములు తెలుగుభాషలో నరుదు.

అయ్యదేవర కాళేశ్వరరావు,
మేనేజరు,
విజ్ఞాన చంద్రికా మండలి,
బెజవాడ.

# విజ్ఞానచంద్రికా గ్రంథమాల,

## బెజవాడ.

### నియమములు

1. దేశాభివృద్ధికి ఆవశ్యకములైన గ్రంథములు ప్రచురించి భాషాభివృద్ధి చేయుటయే యీగ్రంథమాల యొక్క యుద్దేశ్యము. ఇందు సంవత్సరమునకు రమారమి 1600 పుటలు గల స్వతంత్రమైన గ్రంథములు ప్రచురింపబడును

2. కొందరు తలచునట్లు ఇది మాసపత్రిక కాదు. ఇందు దేశదేశముల చరిత్రములును, పదార్థవిజ్ఞాన, రసాయన, జీవవృత్తి మొదలగు ప్రకృతిశాస్త్రములును, లోకోపకారులగు మహనీయుల చరిత్రమును, ఇతరభాషలనుండి ఉద్గ్రంథముల భాషాంతరీకరణములును మాత్రము ప్రచురింపబడును. చరిత్రాధారములగు కల్పిత కథలు (Historical Novels) గూడ ప్రచురింపబడును.

3. ఈ గ్రంథమాలలో నిదివరకు అచ్చువేయబడిన గ్రంథముల నన్నిటిని కొనుటయు నికముందు ప్రచురింపబడు గ్రంథములనన్నిటిని గొనుటకు నొప్పుకొనువారు శాశ్వతపు చందాదారులు.

4. శాశ్వతపు చందాదారులకు ఈ గ్రంథమాలలోని గ్రంథములన్నియు చౌకగా అమ్మబడును.

5. శాశ్వతపు చందాదారులు సంవత్సరపు చందా మొదట నీయనక్కరలేదు ఒక్కొక పుస్తక మచ్చుపడగానే అది వాల్యూ పేయబిల్ ద్వారా పంపబడును. పోస్టేజి చందాదారులే భరింపవలయును.

6 వెనుకటిపుస్తకముల నన్నిటిని గొను చందాదారులు ప్రవేశరుసుమియ్యనక్కరలేదు. వెనుకటిపుస్తకముల నన్నిటిని ఒక్కసారి కొనలేనివారు మావద్దనిలువలోనున్న పుస్తకములలో రు 5-0-0 ల వెలగల పుస్తకములు మొట్టమొదట కొనిన జాలును. మిగత పుస్తకములు తరువాత తెప్పించుకొనవచ్చును. ఆ మిగత పుస్తకములకొరకు వ్రాయునపుడు తమచందా రిజిష్టరుసంఖ్యను ఉదహరింపవలెను.

7. వెనుకటి పుస్తకములు అక్కరలేనివారు ప్రవేశరుసుముక్రింద రు. 0-8-0 చెల్లించవలెను.

8 చందాదారులు మా ప్రచురములలోని గ్రంథములను చందాదారుల వెలకు ఒకటికన్న నెక్కువ పొందలేరు.

9 గ్రంథమాలలోని గ్రంథములన్నియు మన పైన దళసరి కాగితములమీద ముద్రింపబడును. శ్రేష్ఠమయిన బైండు చేయబడును. పనస నునవచస్త్రైలిసి కలిగియుండును. ఇట్లు సర్వాంగసుందరములై చౌకవెలకు దొరుకు గ్రంథములు తెలుగుభాషలో నరుదు.

అయ్యదేవర కాళేశ్వరరావు,
మేనేజరు,
విజ్ఞాన చంద్రికా మండలి,
బెజవాడ.

# విజ్ఞాన చంద్రికా మండలివారిచే నింతవరకు ప్రకటితమైన గ్రంథములు.

* ఈ గుర్తుగల గ్రంథములు ప్రస్తుతము నిల్వలో లేవు.

| | చందా దారులకు | ఇతరులకు |
|---|---|---|
| 1. అబ్రాహాములింకను ( జీవితచరిత్ర )<br>శ్రీయుత గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు. | 12 0 | |
| * 2. హిందూమహాయుగము. ( దేశచరిత్ర )<br>శ్రీయుత కీ॥ శే॥ కొమర్రాజు లక్ష్మణరావుగారు. | | |
| * 3. జీవశాస్త్రము [ శాస్త్రగ్రంథము ]<br>డాక్టరు ఆ లక్ష్మీపతిగారు. | | |
| 4. రాణీసంయుక్త [ చరిత్రాత్మకనవల ]<br>శ్రీయుత వేలాల సుబ్బారావుగారు. | | |
| * 5. మహమ్మదీయ మహాయుగము ( దేశచరిత్ర )<br>శ్రీయుత కీ॥ శే॥ కొమర్రాజు లక్ష్మణరావుగారు | | |
| * 6. పదార్థ విజ్ఞానశాస్త్రము [ శాస్త్రగ్రంథము ]<br>శ్రీయుత మంత్రిప్రగడ సాంబశివరావుగారు. | | |

* 7. రసాయన శాస్త్రము [ శాస్త్రగ్రంథము ]
శ్రీయుత వేమూరి విశ్వనాధశర్మగారు.

* 8 ఆంధ్రుల చరిత్రము 1 వ భా. [ దేశచరిత్ర ]
శ్రీయుత చిలుకూరి వీరభద్రరావుగారు.

* 9. విమలాదేవి (నవల)
శ్రీయుత భోగరాజు నారాయణమూర్తిగారు.

10. కలరా ( శాస్త్రగ్రంథము) 0 6 0 | 0 8 0
శ్రీయుత అచంట లక్ష్మీపతిగారు

* 11. జంతుశాస్త్రము [ శాస్త్రగ్రంథము ]

* 12. వృక్షశాస్త్రము [ శాస్త్రగ్రంథము ]

* 13. శారీరశాస్త్రము ( శాస్త్రగ్రంథము )

* 14. భౌతికశాస్త్రప్రథమపాఠములు [ శాస్త్రగ్రంథము ]

* 15. స్వీయచరిత్రము 1 వ భాగము
శ్రీ॥ శ్రీ॥ కందుకూరి వీరేశలింగం పంతులుగారు.

* 16. భౌతిక శాస్త్రము ( శాస్త్రగ్రంథము )

* 17 ఢిల్లీదర్బారు ( దేశచరిత్ర.)

| | | |
|---|---|---|
| 18. ఆంధ్రుల చరిత్ర 2 వ భాగము (దేశచరిత్ర) శ్రీయుత చిలుకూరి వీరభద్రరావుగారు. | 1 3 0 | 1 12 0 |
| 19. చంద్రగుప్త చక్రవర్తి (జీవితచరిత్ర) | 0 7 0 | 0 10 0 |
| 20. చలిజ్వరము (శాస్త్రగ్రంధము) శ్రీయుత ఆచంట లక్ష్మీపతిగారు. | | |
| 21 అర్థశాస్త్రము 1వ సంపుటము (శాస్త్రగ్రంధము) శ్రీయుత కట్టమంచి రామలింగారెడ్డిగారు | 1 8 0 | 1 12 0 |
| 22. బెంజమిను ఫ్రాంక్లిను చరిత్రము. శ్రీయుత పసుమర్తి శ్రీనివాసరావుగారు, | 1 0 0 | 1 4 0 |
| 23 వ్యవసాయ శాస్త్రగ్రంధము 1వ భా. (శాస్త్ర గ్రంధము.) శ్రీయుత గోటేటి జోగిరాజుగారు. | 1 4 0 | 1 8 0 |
| 24. డిటో రెండవభాగము. డిటో | 1 8 0 | 1 12 0 |
| 25. రాయచూరు యుద్ధము. (నవల) శ్రీయుత కేతవరపు వెంకటశాస్త్రిగారు. | 1 4 0 | 1 8 0 |
| 26. అర్థశాస్త్రము 2వ సంపు. (శాస్త్రగ్రంధము.) శ్రీయుత కట్టమంచి రామలింగా రెడ్డిగారు. | 1 8 0 | 1 12 0 |

| | | |
|---|---|---|
| 27. విజయనగర సామ్రాజ్యము (నవల)<br>శ్రీయుత దుగ్గిరాల రాఘవచంద్రయ్య చౌదరి గారు. | 1 4 0 | 1 8 0 |
| 28 పాతాళభైరవి [నవల]<br>శ్రీయుత వే. వి. నరసింహం పంతులుగారు. | 1 4 0 | 1 8 0 |
| 29. స్వీయచరిత్ర 2వ భాగము.<br>కీ॥ శే॥ కందుకూరి వీరేశలింగం పంతులుగారు. | 1 6 0 | 1 14 0 |
| 30. వృత్తిశాస్త్రము [ మ్యాన్యుయల్ ]<br>శ్రీయుత వేమూరి శ్రీనివాసరావుగారు. | 2 0 0 | 2 4 0 |
| 31. లక్ష్మణరాయవ్యాసావళి, 1 వ సంపుటము<br>కీ॥ శే॥ కొమర్రాజు లక్ష్మణరావుగారు. | 2 0 0 | 2 8 0 |
| 32. ఫ్రెంచిస్వాతంత్ర్య విజయము 1 వ సంపుటము.<br>శ్రీయుత అయ్యదేవర కాళేశ్వరరావుగారు. | 1 4 0 | 1 8 0 |
| 33. అమెరికా సంయుక్తరాష్ట్రములు.<br>శ్రీయుత అయ్యదేవర కాళేశ్వరరావుగారు. | 1 4 0 | 1 12 0 |

# ప్రకటన నియమములు.

1. మాప్రకటనలు తమపత్రికలో నుచితముగ వేయు పత్రికాధిపతుల ప్రకటనలు మాపుస్తకముల చివర ఉచితముగా వేయగలవారము.

2. తమ ప్రకటన మాపుస్తకములో వేయగోరు పత్రికాధిపతులు తాము మాప్రకటన వేసిన సంచికను మాకు బంపుచు దమ ప్రకటన యెటుల వేయవలసినది తెలుపవలెను.

3. పైకము తీసికొని మేమితరప్రకటనలును వేయగలము. ఒకసారి ఒకపుట ప్రకటన వేయుటకు రు. 10-0 0 ఈయవలెను. అరపుటకు రు. 6-0-0 ఎక్కువపుటలు కోరువారు ప్రత్యేకముగ వెల నిర్ణయించుకొనవచ్చును.

4. మాకు చాలమంది శాశ్వతచందాదారు లున్నందునను, ప్రతిదినము క్రొత్తక్రొత్త చందాదారులు వచ్చుచున్నందునను మాగ్రంథములు ఆంధ్రభాషలో శాశ్వతముగ నుండునవిగనుకను, ఇందొకసారి ప్రకటన వచ్చినయెడల అది భాషలో శాశ్వతముగ నుండును. దినపత్రికలు వారపత్రికలు మాసపత్రికలవలె అప్పుడు మాత్రము చదివి అవతల పారవేయునట్టివి మాగ్రంథములు కావు. కనుక వీనియందు ప్రకటనలు వేయువారికి మిక్కిలి లాభముండునని చెప్పవచ్చును.

ప్రకటనలు వేయించవలసినవారీ క్రింది చిరునామాకు వ్రాసుకొనవలెను.

మేనేజరు, విజ్ఞానచంద్రిక. బెజవాడ.

# పాహియాన్ భారతవర్ష యాత్ర.

గ్రంథకర్త:- వేలూరి సత్యనారాయణగారు, బి. ఏ.,

నాల్గవ శతాబ్దాంతమున—ఇప్పటికి పదునైదువందలేండ్లక్రిందట, చీనా సామ్రాజ్యము నుండి భారతభూమిని సందర్శింపవచ్చిన "ఫాహియాన్" అను సుప్రసిద్ధబౌద్ధసన్యాసిని యాత్రావృత్తాంతమిందు వర్ణింపబడినది. చంద్రగుప్త, విక్రమార్కుఁడు రాజ్యమేలిన ప్రాచీన కాలమున భారతవర్షమెట్లుండెనో, పరిపాలనావిధాన మేగతినడచుచుండెనో, మత సాంఘికపరిస్థితు లెట్లుండెనో పూర్వకాలమున భూవలయమున సువర్ణభూమియను పేరుపొందిన భారతవర్ష సౌభాగ్య మెట్లుండెనో, యిందు కన్నులకు గట్టినట్లు చిత్రింపబడినది. ఆరు దీర్ఘవత్సరము లమితశ్రమలబడి మహాభీలమగు గాలిదుమారముల కాకరమగు యెడారులదాటి, యత్యున్నతములగు పర్వతావళుల నిర్గమించి, శరవేగమున బారు నదీప్రవాహముల తరించి, యాత్రాపర్యటనమున కీహంఘుఁడు గావించిన యాత్రావృత్తాంత [illegible], [illegible]కింపుగా నుండును. ప్రాచీనభారత నాగరికతా సౌభాగ్యముల నరయఁగోరు ప్రతి యాంధ్రుఁడును, చదివితీరవలయును. చరిత్రపరిశోధకుల కియ్యది యమూల్యమగు గ్రంథము. మృదుమధురశైలిలో వ్రాయఁబడినది. ప్రపంచములోనికెల్ల నతిప్రాచీనమగు బోధిద్రుమము, బౌద్ధమతావలంబులకు గడుపవిత్రవంతములగు స్తూపములు, యానతిప్రియము మున్నగు చిత్రపటములుగలవు.

మూల్యము 1 రూపాయి మాత్రమే.

వేయువారు:—విజ్ఞానచంద్రికా గ్రంథమండలి, బెజవాడ.

అని వ్రాయవలెను.

# నీలగిరి

## చక్కని తెలుగు వార్తాపత్రిక.

ఇది నిజాము రాష్ట్రమునుండి మొట్టమొదలు వెలువడి పండ్రెండు పుటలపై ముద్రింపబడి క్రమముగా నడుపబడుచున్నది.

## ప్రతిగురువారమున ప్రకటింపబడును

ఇందువిమర్శనలు విదేశవృత్తాంతములు, నిజాముదేశవార్తలు వింతలు, వినోదములు, వ్యవసాయాభివృద్ధి కవసరమైన వ్యాసములు, వ్యవహారికవిషయములు, శ్రీ వారిఫర్మానాలు, హైకోర్టుతీర్పులు, క్రొత్తచట్టములు, పద్యములు, ప్రహసనములు, వైద్యవిధానములు, పరిశ్రామికసంబంధములైన వ్యాసములు, పరిశోధక విషయములు, రూపపటములు, సాంఘికసంస్కరణచర్చలు, నిజాము రాష్ట్రాంధ్రోద్యమమునుగూర్చిన సంగతులు, ప్రకటనలు. వేయేల:- ప్రపంచమందు జరుగు వివిధాంశములును, మనయభివృద్ధి కవసరమైన నూతనవిషయములును ప్రకటింపబడుచున్నవి.

ప్రతిసంవత్సరమనేక రూపపటములతో సంవత్సరాది పంచాంగముతో వివిధవ్యాసములతో, పద్యములతో, మూడు రంగుల ముఖపత్రముతో గూడుకొనిన "నీలగిరి: ఉగాది సంచిక" ప్రకటింపబడుచున్నది.

సంవత్సరము చందా 4-8-0 మాత్రమే. స్థానికులకు నాలుగురూపాయలు. విడిపత్రిక రెండణాలు బ్రిటీషుప్రాంతములవారు ముందుగ మనిఆర్డరు పంపవలెను.

నీలగిరికార్యస్థానము, నల్లగొండ (నిజాం)

# పోతన వేమనల యుగము.

చెన్నపురి రాజధాని కళాశాలవారి
1922 సంవత్సరపు పవెల్ అండ్ మోర్ హెడ్
బహుమానము (రు 150 లు) పొందిన
ఆంధ్ర వ్యాసము.

గ్రంథకర్త.

## దిగవల్లి వేంకట శివరావు, బి. ఏ., బి. ఎల్.,

బెజవాడ. వెల రు. 0-8-0.

---


మాసపత్రిక. **పుష్కరిణి.** మాసపత్రిక.

కార్యస్థానము :— బెజవాడ.

సంపాదకుడు:— శతావధాని వండ్రంగి రామారావుగారు.

ఇందు సాంఘిక, వ్యాపార ఆర్థిక చారిత్రిక సారస్వత పారిశ్రామికాది వివిధవిషయములనుగూర్చి పదుగుర కొప్పునట్లు వ్యాసము లలరారుచుండును. విద్యాధికులచే ఉత్తమమని మెచ్చబడుచున్నది. ఆంధ్ర దేశాభివృద్ధిని బురస్కరించికొని వ్రాయబడు సంగతు లుప్పతిల్లును జనసామాన్యమునకుం గూడ జేరునట్లు చౌకగానుంచబడినది. చక్కని కాగితముల మీద ఇంపుగా నుండునట్లు అచ్చువేయబడుచున్నది. వలయువారు మేనేజరు, పుష్కరిణి, బెజవాడ అని వ్రాయవలెను.

సంవత్సరమునకు చందా పోస్టుఖర్చులతో సహా రు 3-4-0

విడిపత్రిక రు 0-5-0

# విజ్ఞాన చంద్రికామండలి బుక్కుడిపో, బెజవాడ.

మా కార్యస్థానమున దొరకు ఇతర గ్రంథములు

వెల

1. శివాజి చరిత్ర, శ్రీయుత కీ॥ శే॥ కొమర్రాజు లక్ష్మణరావుగారు 1 0 0
2. ఉద్యానకృషి, (ప్రథమపాఠములు) గోటేటి జోగిరాజుగారు 1 0 0
3. చంటిబిడ్డ, డాక్టరు ఆచంట లక్ష్మీపతిగారు 1 0 0
4. శ్రీయుత గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారి గ్రంథములు.
5. శ్రీయుత రాయప్రోలు సుబ్బారావుగారి గ్రంథములు.
6. భాష, చరిత్ర, శాస్త్రము, వేదాంతము మొదలగు పెక్కు విషయములగూర్చి పలువురు వ్రాసినగ్రంథములు.
7. వేదకాలనిర్ణయము, లోకమాన్య బాల గంగాధర తిలకు కృతము, శ్రీయుత మానికొండ సత్యనారాయణ శాస్త్రిగారు ఆంధ్రీకరించిరి. 1 0 0
8. ఫాహియాను హిందూదేశ సందర్శనము, గ్రంథకర్త శ్రీయుత వేలూరి సత్యనారాయణగారు. 1 0 0
9. పోతన వేమనల యుగము 0 8 0
   గ్రంథకర్త దిగవల్లి వెంకట శివరావుగారు.
10. చింతామణి, బసవరాజీయము మొదలగు అనేక వైద్యగ్రంథములు.

పరిశుద్ధమైన

# వసంతకుసుమాకరము.

(బసవరాజీయము: అశ్మరీయుగ మేహరోగములు. పుట 419)

దీనిని బహుమూత్రరోగములకుపయోగించితిమి. ఇంచుమించుగా మేము చికిత్సచేసిన సర్వరోగులకును మూత్రములో పంచదార తగ్గుట గమనింపబడెను.

క్షయ, మందాగ్ని (అజీర్ణము) మొదలగు నన్నివిధములైన మహావ్యాధులకును గొడ్డలి పెట్టువంటిది.

ఇది ఆయుర్వేదౌషధరాజములలో మిక్కిలి సుప్రసిద్ధమైన దివ్యౌషధము. మరియు నిందుజేర్చబడు అమూల్యములగు నితరవస్తుజాలముతోపాటు శతపుటాభ్రకము, బంగారము ముత్యములు, కాంతము, వంగము మొదలగునవి కలుపబడును.

20 మాత్రలుగల 1 డబ్బీ ఖరీదు రు 5-0-0 మాత్రమే. ఉపయోగించు మార్గములును పథ్యవిధానములును డబ్బీతో పంపబడును.

కలయువారు:—

## ఆంధ్రాయుర్వేదఫార్మసీ (లిమిటెడ్).

(డాక్టరు ఆచంట లక్ష్మీపతి, బి. ఏ., యం. బి., సి. యం. గారిచే స్థాపితము)

185 మౌంటు రోడ్డు, మదరాసు.

మూలధనము రు. 3,00,000.

వసూలైనధనము రు. 1,60,054.

నమ్మకమగు పరిశుద్ధాయుర్వేదౌషధములకు ప్రధానాలయము. ఇంగ్లీషు తెలుగు, అరవములో నున్న కేటలాగు ఉచితముగా పంపబడును గాన కోరి వ్రాయుడు.

**5000**
నమూనాలు
ఉచితముగా
పంచిపెట్టబడును.

పాటిలేనటువంటి, పూర్వకాలపు శాస్త్రీయ క్రమము ఔషధములు మా ఔషధశాలయందు స్వచ్ఛముగా తయారు చేయబడును, మేము తయారు చేసినది ఎక్కువ చురుకుగలదని, స్వచ్ఛమైనదని నమ్మించుటకు, ఉచితముగా నమూనాలు పంపుటకు నిర్ణయించుకొంటిమి.

---

అతి శ్రేష్ఠతరమైన

# చ్యవనప్రాశ

సుభ్రితకును, దోషరాహిత్యమునకు సాటిలేనిది. ప్రతి వారికి మంచి బలవర్ధకౌషధము, పుష్టికరమైనది. శరీర ప్రకృతిని బలపరచును. ఆకలిని వృద్ధిచేసి దేహమును పెంచును.

దుర్బలముగల ప్రతినరములను, దగ్గు, చలి ఉబ్బసపు దగ్గు, క్షయ, నపుంసకత్వము, మూలశంక, వృద్ధాప్యము మొదలగు రోగములకు అమోఘమైన గుణము నిచ్చును. నీరసము, ఋతువులేని స్త్రీలకు గొడ్డుతనము తొలగించును. కాడ్ లివర్ ఆయిల్ కన్న శ్రేష్ఠమైనది.

వెల:-10 తులాలు (20 దినములకు సరిపోయినది) రు 1/-40 తులాలు రు 3/-

## ఆంధ్ర ఆయుర్వేద ఫార్మసీ (లిమిటెడ్)

185, మౌంటు రోడ్డు, మదరాసు.

(డాక్టరు ఆచంట లక్ష్మీపతి, బి. ఏ., ఎమ్. బి. సి. ఎమ్. గారిచే
(స్థాపింపబడినది.)

అనుమతిచెందిన మూలధనము రూ. 3,000,00

వసూలైన మూలధనము రూ. 1,30,054

క్యాటలాగులు కావలసినవారు వ్రాసిన ఉచితముగా పంపబడును.

# ఆంధ్ర ఆయుర్వేద ఫార్మసీ (లిమిటెడ్).

185, మౌంటు రోడ్డు, మదరాసు

**డాక్టరు అచంట లక్ష్మీపతి, బి. ఏ, ఎమ్. బి. సి. యమ్.**
**గారిచే స్థాపింపబడినది.**

# సిద్ధమకరధ్వజ

## (భైషజ్యరత్నావళి 920 పుట)

నిర్దుష్టముగ తయారుచేయబడిన శాస్త్రీయ ఔషధములకు పుట్టినిల్లు.
ఇది ఆయుర్వేదౌషధములలో మిక్కిలి ప్రసిద్ధిచెందియున్నది.
ఇందు శుద్ధిచేసిన రసము, బంగారము, కస్తూరి, పచ్చకర్పూరము మొదలగు
విలువగల ద్రవ్యములు చేరియున్నవి. వైద్యగ్రంథములలోని యోగము
ప్రకారము నిర్దుష్టముగ మాచే తయారుచేయబడియున్నది.

శ్లో॥ స్వచ్ఛపారదవిశేషాః నానాచిత్ర్యపదిశ్యతే
మేధాయుః కాంతిజననః కామోద్దీపనకృన్మహాన్ ॥

బుద్ధిని, ఆరోగ్యాయుష్యములను వృద్ధిచేయును. శరీరమునకు కాంతి నిచ్చును.
నాడులకు ధాతుపుష్టిచేసి కామోద్రేకము కలిగించును, అతిమూత్రము,
క్షయ, సుఖరోగములు, మొదలగు ధాతుక్షయకరములగు వ్యాధు
లన్నింటికి ప్రాముఖ్యముగ నుపయోగకరము. ఉపయోగించువిధానము
మందుతో బంపబడును. వెల 15 మాత్రలు రు 5—0—0.

వసూలైన **మూలధనము** రూ 1,30,034

మోసపు మందులు కలవని, ఇతరులుకూడ ఇట్టి మోసముగా **చేయుచుండుట**
వలనను మోసపోకుడు.

# ఆంధ్రఆయుర్వేద ఫార్మసీ (లిమిటెడ్).

185, హాంటు రోడ్డు, మదరాసు.

డాక్టరు అచంట లక్ష్మీపతి, బి, ఏ, యమ్.బి. సి. యమ్. గారిచే స్థాపింపబడినది.

వసూలైన మూలధనము రు. 1,30,054

మాయొద్ద రహస్యమునునది లేదు. గొప్ప ఉత్కృష్టమైన మందులు ఇచ్చుటనే దొరకును.

సిద్ధమకరధ్వజము:— కామోద్దీపజనకము- శ్రేష్ఠమయిన రసాయనము. ధాతుపుష్టికరము. బుద్ధిని, ఆయుస్సును వృద్ధిపరచును. అతిమూత్రము, క్షయ, సుఖరోగములు వీనియందు మంచిగుణము లిచ్చును. 25 మాత్రలు రూ 5-0-0

చ్యవనప్రాశలేహ్యము:— శ్రేష్ఠమయిన రసాయనము. శ్వాసకోశవికారములను పోగొట్టును. కానుపులకు మంచిఔషధము. శరీరపుష్టిని గలుగజేయును.

1 పౌను రూ 3-0-0. 4 ఔన్సులు రూ 1-0-0

కస్తూరిమాత్రలు:— బాలురకుగలుగు దగ్గు, జ్వరము జలుబు, అజీర్ణము మొదలగు వికారములను పోగొట్టును.

ఒకబుడ్డి రూ 1-0-0

తాళీసాదివటి:—దగ్గు, గొంతునొప్పి, అజీర్ణము, కఫజ్వరములు, వాంతులు, అరోచకము మొదలగువానిని పోగొట్టును. 25 మాత్రలు రూ. 0-8-0

విరేచనవటి:—ఇది అజీర్ణము, కడుపుబ్బరము, పిత్త వికారములు, అజీర్ణముచే గలుగు కడుపుబ్బ మొదలగువాని యం దుపయోగించిన బాగుగ విరేచనము అగునట్లుజేసి సుఖమును గలిగించును.

25 మాత్రలు రు 0-3-0

శీతాంశురసము:— శీతజ్వరములను నశింపజేయును. పైపూత నుపయోగించిన తేలు మొదలగువాని విషవికారములను, గజచర్మము, కుష్ఠము మొదలగువానిని నశింపజేయును.

60 మాత్రలు రు 0-10-0

ఆనందభైరవి:— అన్నిజ్వరములకు, అతిసారము, అజీర్ణము, దగ్గు, శ్వాసలను పోగొట్టును.

50 మాత్రలు రు 0-10-0

ముస్తాకాదివటి:—రక్తవిరేచనములు, అరుచి, విషూచి (కలరా), దగ్గు, మొదలగువానిని నశింపజేయును.

25 మాత్రలు రు 0-8-0

చందనాదితైలము:— ఇది తలవెంట్రుకలను పెరుగునట్లుచేయును. సువాసననిచ్చును. మనసునకు ఆహ్లాదమును గలుగజేయును. 2 ఔన్సులు రు. 1-0 0 1 పౌను రు. 7-0-0

భృంగామలకతైలము:— స్నానమునకు శ్రేష్ఠమైనది. కండ్లమంటలను పోగొట్టి చల్లగజేయును. మెదడునకు బలమునిచ్చి జ్ఞాపకశక్తిని అధికము జేయును.

4 ఔన్సులు రు. 1-0-0. పౌను రు 3.0-0

ఇతరులు మా పేరును కొంచెము మార్చి పెట్టుకొని వ్యాపారము చేయుటను చూచి మోసపోకూడదు. "ఆంధ్ర" అనగానే అసలు మందులు. "ఆంధ్ర" లేనివి మావి కావు.

కాటలాగు తపాల ఖర్చు లేక ఉచితముగ పంపబడును.

---


# సరస్వతి.

—:o:—

ఇదియొక సారస్వత విషయిక మాసపత్రిక.

సంపాదకులు:— శ్రీ రాజా వాసిరెడ్డి దుర్గా సదాశివేశ్వర ప్రసాదరావు బహద్దరు జమీందారుగారు. జయంతిపురం

ఇందు సుప్రసిద్ధ ప్రాచీనాంధ్ర ముద్రిత గ్రంథములును చారిత్రక విమర్శక వ్యాసములును శాస్త్ర పరిశోధనలును వాఙ్మయ విషయిక సమస్యా జిజ్ఞాసలును భావపూరితములగు స్వకపోల కల్పనము గల ఖండ కావ్యములును ప్రచురింపబడుచుండును.

చందా విద్యార్థులకు స్త్రీలకు సం॥ నకు 2—0—0
ఇతరులకు 2—8—0

వలయువారు:— సంపాదకులు, ముక్త్యాల, కృష్ణాజిల్లా. అని వ్రాయవలెను.

# విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి,

## బెజవాడ.

---

తయారై అచ్చులోనున్న గ్రంథములు.

# దక్షిణాఫ్రికాచరిత్ర

గ్రంథకర్త:-

శ్రీయుత దిగవల్లి వేంకటశివరావు పంతులుగారు, బి.ఏ.బి.ఎల్.

ఇందు ప్రథమభాగమున దక్షిణాఫ్రికా పూర్వచారిత్రము, పాశ్చాత్యుల రాక, బోయరులు ఆదిమనివాసులను పారదోలి రాజ్యమాక్రమించుట, బోయరులనుండి బ్రిటిషువారు దేశమునులాగికొనుట, బ్రిటిషుబోయరు రాజనీతి, సాంఘికచరిత్ర బోయరుయుద్ధము, దక్షిణాఫ్రికా సంయుక్తరాష్ట్ర స్థాపనము రెండవభాగమున దక్షిణాఫ్రికాలోని భారతీయులు, వారిస్థితిగతులు వలసకూలి గాంధిగారిరాక సత్యాగ్రహసమరము గాంధీవిజయము ఉత్తరకథ శాస్త్రిసప్రూప్రభృతులగు రాచకీయనాయకుల యాత్రాఫలము తూర్పు ఆఫ్రికాలోని కెన్యాసమస్య, భారతీయులు జైళ్ళలోను బయటపడిన దురవస్థలు ఉదాహరణములతో వర్ణింపబడినవి. గాంధిగారి జీవితమున దక్షిణాఫ్రికాలో గడచిన కాలమును చక్కగవర్ణింపబడినది.

మేనేజరు, విజ్ఞానచంద్రికా గ్రంథమాల, బెజవాడ.

# సాహితీ పత్రిక

సంవత్సరము చందా 3-0-0.

ఇది ఆంధ్రదేశములో 5 సంవత్సరములనుండి అవిచ్ఛిన్నముగా నడపబడుచున్న భాషావిషయక మాసపత్రిక.

ఈ పత్రికలో మంచి మంచి కథలు, మనోజ్ఞమైన గీతములు ప్రకటింపబడుచుండును. ఆధునిక కవితా పద్ధతులు తెలిసికొనవలెనన్న సాహితి చదివి తీరవలసిన పత్రిక. ఈపత్రిక ననేకసార్లు భారతి, జన్మభూమి, ఆంధ్రపత్రిక మొదలగు తెలుగు పత్రికా రాజములు వేనోళ్ల పొగడియున్నవి. తెలుగుదేశములోనున్న సుహృదయులెల్లరు ఈపత్రికనుగూర్చి సదభిప్రాయములను వెల్లడించియున్నారు. ఈపత్రికల పాతసంచికలు సంవత్సరములవరుసను సంపుటములుగా బైండుచేయబడి కొంది ప్రతులుమాత్రమే విక్రయమునకు సిద్ధముగానున్నవి.

| | |
|---|---|
| 1 వ సంపుటము. (మూడుసంచికలే కలవు) చక్కని బైండు | రు. 0-12-0 |
| 2 వ సంపుటము. | 1-4-0 |
| 3 వ సంపుటం చక్కని బైండింగు (6, 7 సంచికలులేవు) | 2-8-0 |
| 4 వ సంపుటం (చక్కని బైండు పూర్తిగా వుంది). | 3-6-0 |

వలయువారు:— మేనేజరు,

సాహితీ పత్రిక, బెజవాడ అనివార్యమువలయును.

ఆంధ్రయువజన స్వరాజ్యసభవారి పక్షమున ప్రచురింపబడు
జాతీయ వారపత్రిక.

# కాంగ్రెస్.

ప్రథమ, ప్రస్తుత సంపాదకులు:- మద్దూరి అన్నపూర్ణయ్యగారు.
( 18 మాసముల కఠినశిక్ష అనుభవించియున్నారు. )

ద్వితీయ సంపాదకులు:—కాండ్రేగుల రామచంద్రరావుగారు.
( 15 మాసముల కఠినశిక్ష అనుభవించుచున్నారు ).

## ఆంధ్ర యువజన స్వరాజ్యగ్రంథమాల

ప్రథమ పుష్పము:—

"మనకీ దారిద్ర్యమేల" అను భారతవర్ష ఆర్థిక చరిత్ర.

గ్రంథకర్తలు:—

దేశరాజు సత్యసుబ్రహ్మణ్యం, రామచంద్రరావుగార్లు.

శ్రీయుత భోగరాజు పట్టాభిసీతారామయ్య గారిచే పీఠిక వ్రాయబడినది ఆంధ్రనాయకులనేకులచే కీర్తింపబడినది.

వెల 1-6-0, చందదారులకు 1-2-0

ద్వితీయ పుష్పము:— కళా వెంకట్రావుగారిచే రచింపబడిన
సామ్రాజ్యతత్త్వము.

వెల. 0-8-0, చందాదారులకు 0-6-0

వలయువారు:—

కార్యదర్శి,
ఆంధ్రయువజన స్వరాజ్య సభ,
రాజమహేంద్రవరం.

# తప్పుల సవరణ పట్టిక.

| పుట. | పంక్తి. | తప్పు. | సవరణ. |
| --- | --- | --- | --- |
| ౨ | ౧౧ | 52 | 48 |
| ౫ | ౨౧ | జనోవా | జెనోవా |
| ౨౨ | ౨౨ | భూకా మందునకును | భూఖామందునకును |
| ౨౫ | ౨౩ | " మనవాట్పను " | " మనవాట్టును " |
| ౩౨ | ౧౭ | ద్వైవభావను | ద్వైవిభావమును |
| ౩౩ | ౨౦ | జౌనురాజు | జాతిరాజు |
| ౪౨ | ౧౭ | యిండియనులును | యిండియనులను |
| ౪౩ | ౧౦ | యచట సెట్టివేసి | సెట్టివేసియచట |
| ,, | ౨౨ | శత్రువులగ | శత్రువులగు |
| ౪౪ | ౧౮ | లన్నారని | లన్నారు. |
| ౪౫ | ౪ | ఎక్కుడనైనను | ఎక్కడనైనను |
| ౪౭ | ౭ | ఆయిన | ఆయన |
| ౫౧ | ౧౭ | భంగము | అసూయను |
| ౫౫ | ౨౪ | వరికీ | వరకీ |
| ౬౪ | ౩ | వారుమీద | వారిమీద |
| ౬౫ | ౧౫ | శత్రువులై | శత్రువుంపై |
| ౬౬ | ౧౦ | పరిజా ప్రతినిధి పెట్టి | ప్రజాప్రతినిధిసభ పెట్టి- |
| ౭౫ | ౧౩ | క్వైచిరు | క్వైచిదు |
| ౭౮ | ౪ | శాస్తను | బాస్టను |
| ౮౦ | ౫ | చేరిడినది | చేరిరి. |
| ౮౧ | ౧౩ | అవలంభించినను | అవలంబించినను |
| ౮౩ | ౨ | ఈరాష్ట్రి | ఏరాష్ట్రి |
| ,, | ౧౧ | స్వప్రస్థిలోనున్న | స్వప్రస్థితిలోనున్న |
| ౯౦ | ౧౧ | యూపస్వాథ్యనమును | స్వాథ్యయమును |
| ౯౩ | ౧౦ | ప్రజల | ప్రజల |

| పుట | పంక్తి. | తప్పు | సవరణ |
|---|---|---|---|
| ౯౫ | ౧౪ | మంత్రివర్గాన్ని | మంత్రివర్గ్గో |
| ౯౬ | ౧౨ | పట్టుకొనుటకు | పట్టుకొనుటకును |
| ౧౦౪ | ౧౩ | ఆంధ్రసైనికులం | ఆంగ్లసైనికులం |
| ౧౦౫ | ౭ | మిరియొక | మరియొక |
| ౧౦౮ | ౫ | వశపరచుకొనిపోయిరి | వశపరచుకొనలేక పోయిరి. |
| ౧౨౯ | ౮ | హృదయ్న | హృద్యను |
| ౧౩౩ | ౫ | కోటను | కోటలను |
| ౧౩౮ | ౨ | ఫ్రాన్సుతో | ఫ్రాన్సులో |
| ౧౪౦ | ౧౧ | రాష్ట్రములలోని ఆంగ్లేయపార్లమెంటు వారు | రాష్ట్రములలోని ప్రజలపై ఆంగ్లేయపార్లమెంటువారు |
| ,, | ౨౦ | అమెరికాలో | అమెరికాపై |
| ౧౪౨ | ౩ | మే నెల | మే నెల ౩వ తేదిన |
| ౧౪౬ | ౨ | పట్లలిక, | సట్లవిక |
| ,, | ౨ | గ్రీకు | గ్రీకు |
| ,, | ౧౭ | ఎగ్రయించేయనేలును | ఎగరయిండేకలను |
| ౧౬౬ | | ఐర్లాండు ప్రజల | ఐర్లాండు ప్రజలు |
| ౧౭౦ | ౧౧ | యదిరించినప్పుడు | ఎదిరించినప్పుడు |
| ౧౭౪ | ౧౬ | మార్గమును | మార్గమును |
| ౧౮౦ | ౬ | మాట్లాడించెను | మాట్లాడించలేచెను. |

National Library,
Calcutta-27.